# కథా కౌముది

2008 - 2





శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య : 28



# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. మాంగల్యానికి మరో ముడి | శింగిసెట్టి సంజీవరావు | 3 |
| 2. ఒక్కడు చాలు | ఆకునూరి మురళీకృష్ణ | 7 |
| 3. జరిగిందిది | తాడికొండ శివకుమార శర్మ | 12 |
| 4. రామగీత | పి.వి.రామచంద్ర శర్మ | 22 |
| 5. నీడ-నిజం | డా.ఎం.సుగుణ రావు | 25 |
| 6. చెత్త కథ | పొత్తూరి విజయలక్ష్మి | 31 |
| 7. ఒరుతలై రాగం | ఆర్.శర్మ.దంతుర్తి | 36 |
| 8. ఎడబాటు | శారద | 43 |
| 9. ఏడుకొండల సాక్షిగా | లక్ష్మీ భారతీరెడ్డి | 46 |
| 10. గణార్చన | కేసరి | 50 |
| 11. చెదిరిన కల | గంటి భానుమతి | 56 |
| 12. రంభ-గంగ | రాధిక నోరి | 60 |
| 13. ఏనాటికి ఏ తీరున | డి.విద్యేశ్వరి | 67 |
| 14. గాజుగుండె | శైలజామిత్ర | 70 |
| 15. ఓ కావ్యకథ | లత కందికొండ | 75 |
| 16. వెండి కుంకుమ భరిణ | స్వాతి శ్రీపాద | 79 |
| 17. శ్రీవాణి గారి కథ | పొత్తూరి విజయలక్ష్మి | 82 |
| 18. అమృతవర్షిణి | పాండ్రంకి సుబ్రమణి | 87 |
| 19. రెండు శతాబ్దాల మధ్య | మంథా భానుమతి | 97 |
| 20. అన్వేషణ | శ్రీనివాస ఫణికుమార్ డొక్కా | 101 |
| 21. ఆశీర్వచనం | అరుణ నిష్ఠల | 105 |
| 22. మౌనశంఖం | ఎమ్మెస్వీ గంగరాజు | 110 |
| 23. నీలమ్మ | బి.సుజాత | 115 |
| 24. సోది తాడికొండ | కె.శివకుమార్ శర్మ | 123 |




## మాంగల్యానికి మరో అర్థం - శింగిసెట్టి సంజీవరావు

**మంగళ వాయిద్యం** వినవస్తోంది. సన్నాయి, టకోరా కలివిడిగా వినిపిస్తున్నాయి. ఇది చాలదన్నట్టు మధ్య మధ్యలో బ్యాండు మేళం అందుకుంటోంది.

ఎడమ చేతికి పసుపు దారంతో కట్టిన మామిడి ఆకు కంకణాన్ని సుబ్బాయమ్మ పదే పదే చూసుకుంది. రామస్వామి ప్రతిమలా కూర్చున్నాడు.

సంప్రదాయ కుటుంబంలో పుట్టింది సవిత. ఆధునికం అంటకపోలేదు. అయితే సుబ్బాయమ్మ పాత బంగారం వదలనంటుంది. చిట్టి బొట్టుల నోము కూడా పట్టించింది కూతురిచేత. సుమంగళి కావాలని, దీర్ఘ సుమంగళిగా కూతురు జీవితమంతా గడపాలని తల్లి ఆశ.

రామస్వామి చెప్పులరిగినట్టు తిరిగి, దగ్గరా దూరాబారంలో ఉన్న తమ బంధువుల్ని సంప్రదించి మరీ భార్య నిభంధనల మేరకి ఏరి పరిశీలించి సవిత కోసం వరుడ్ని తెచ్చాడు. కాళ్ళు కడిగి కన్యాదానం చెయ్యబోతున్నాడు. మరో క్షణంలో కాబోయే అల్లుడికి. అన్నదానం, ధనదానం, భూదానం, రక్తదానం ఇలా దానాలన్నిటిలో కన్యాదానం మిన్న అంటారు ఆర్ష దృక్పధం గలవాళ్ళు.

రోజల్లా నిలారం. కడుపులో ఏమీ పడకూడదు పురోహితుడు కంకణాలు విప్పే వరకు. భర్త ఉండలేక పోతున్నానంటే కాస్త టీ నీళ్ళకి అంగీకరించింది సుబ్బాయమ్మ.

పెళ్ళికొడుకు తలితండ్రుల కన్న పెళ్ళికూతురు తలిదండ్రులు మరీ ఎక్కువ నిష్ఠతో ఉండాలి అని అంది.

సుబ్బాయమ్మ మంచి నీళ్ళయినా ముట్టడం లేదు. కొబ్బరి నీళ్ళు, కూల్‌డ్రింక్సు యధేచ్ఛగా తాగేస్తారు ఇప్పటి పెళ్ళిళ్ళలో.

కడుపులో ఏమీ లేక పెళ్ళికూతురు మాత్రం నకనకలాడుతోంది.

సమయం ఆసన్నమయింది.

దుష్యంతుడిలాగ మర్చిపోకుండ ఉండేందుకన్నట్టు పెళ్ళి కొడుకు తాడవ మీద జీలకర్ర పిండి కొట్టి బుర్ర చల్లపర్చాడు పురోహితుడు. పెళ్ళికూతురికి సరేసరి. పెళ్ళికొడుకు పెళ్ళికూతురి చేత నాతిచరామి అనిపించాడు. పెళ్ళికి హాజరైన వీలైనంతమంది నాతిచరామిగాళ్ళ చేతుల్లో అక్షతలు జార్చి మంగళ సూత్రాన్ని తాకించాడు. మంగళ సూత్రధారణకి సిద్ధం చేశాడు పురోహితుడు. అక్షతలు కొన్ని విసిరి కొట్టి నిద్రలో ఉన్నవారిని మేల్కొలిపినట్టు బ్యాండు మేళగాళ్ళనీ, టకోరా సన్నాయిగాళ్ళనీ, పురికొల్పి మంగళవాయిద్యాలు తారాస్థాయినందుకొనేట్టు చేశాడు పురోహితుడు. ఎటువంటి అమంగళం వినబడదీ నిమిషం.

సవిత మెడలో, వణుకుతున్నాయేమో, మగచేతి వ్రేళ్ళు మూడు ముళ్ళు వేశాయి.. మంగళ సూత్రానికి, వంటింటి కుందేలుగా ఒక ముడి, పక్కలో పెట్టగా ఒక ముడి, పొత్తి కడుపు పంటకి ఒక ముడి అన్నట్టు.

ఆడకూతురు శరీరంలో విద్యుద్ఘాతమయింది.

ఎందువల్లనో మూర్ఛ వచ్చేటట్టు కనిపించిన పెళ్ళికొడుకు తన మేనమామ దోసిళ్ళ పట్టించిన తలంబ్రాలతో తేరుకున్నాడు. సవిత మేనమామ తన వంతు పూనుకున్నాడు. తలంబ్రాలతో పెళ్ళికొడుకు తలదిమ్ము పోయింది. పెళ్ళికూతురి స్నేహితురాండ్రు సవితని ఉత్సాహపర్చారు. పళ్ళాలు మిగిలిన కాస్త తలంబ్రాలతో తలలపై బోర్లించబడ్డంతో పెళ్ళి జరిగిపోయిందన్న సంతృప్తి కలిగింది సుబ్బాయమ్మకీ రామస్వామికీ.

ఏ ఒడ్డు చేరుకోవాలనో ఆనవాయితీగా పళ్ళెంలో నీళ్ళపై వెలిగించిన కర్పూరంతో తమలపాకు ఓడల్ని దంపతులచేత రవాణి చేయించాడు పురోహితుడు.

మన పూర్వీకులు సముద్రాలపై ఓడ ప్రయాణం చేసినవారే, వజ్రవైఢూర్యాల వ్యాపారం చేసినవారే, అన్నట్టు వివాహ బంధం వ్యాపార సరళిలో సాగాలా?!

దేవులాట తప్పదేమో జీవితంలో, అందులోనూ జంట కట్టిన జీవితంలో. పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ ఉంగరాలు దేవుకున్నారు. గెలుపెవరిది?!

పెళ్ళిళ్ళకి విచ్చేసినవారు ఏ కొంత మంది ఓపికతో లగ్నం సమయంలో పెళ్ళిపీను చుట్టూ చేరతారు. ఏ అర్థరాత్రి, అపరాత్రి లగ్నమయితే పెళ్ళి భోజనాలు చేసి అలక సంబరాల్లో పాల్గొని చల్లగా జారుకున్నవారే ఎక్కువ. పెళ్ళికూతురూ పెళ్ళికొడుకూ ఊరేగింపుకా? తప్పనిసరి దగ్గర బంధువులు, మిత్రబృందం ఉంటారు.

చుక్కలు కనిపించాయి ఉత్తరం వైపు. అరుంధతీ నక్షత్రాన్ని గుర్తించగలరా. పోగాలము సంభవించిననాడు దీప నిర్వాణ గంధముని, అరుంధతిని, మిత్ర వాక్యమును మూర్కొనడు, కనడు, వినడు అంటారు. పురోహితులు పగటి పూట కూడా అరుంధతీ నక్షత్రాన్ని వశిష్ఠులవారి పంచనదిగో అని చూపించేయగల దిట్టలు.

సవిత అరుంధతీ నక్షత్రాన్ని చక్కగా గుర్తించింది. తన స్నేహితురాండ్రతో సప్తమహర్షి మండలం పరికించింది ఎన్ని మార్లో సవిత. తను చదువుకున్న రోజుల్లో, సవిత కళ్ళకేం అవి అగ్గి దివిటీలు, అనేవారు.

తిరిగి పెళ్ళిపీను మీద వచ్చి కూర్చున్న సవిత భర్తని ఒకసారి చూసి కొడిగట్టిపోతున్న ఇత్తడి దండెలో దీపానికి నూనె పోసింది. పనయిపోయిందన్నట్టు తక్కినవారు చేతులు దులిపేసుకుని కూర్చున్నట్టు కనిపించారు. జరగనున్న శోభనం బుర్రలో గుసగుసలాడింది.

దిగండ్రా పీటల మీంచి, పురోహితుడి కేకకి పెళ్ళికూతురు లేచి నిలుచుంది. బిగుసుకున్న కొంగు ముడికేసి చూసింది. ఏదీ అతడు లేవడు?!

కొత్త పెళ్ళికొడుకు కళ్ళు తిరిగి ఉన్నపళంగా పీటవార పడిపోయాడు.

జాపోసి పోయాడన్నారు. పెళ్ళి ఉపవాసం వల్ల అన్నారు.

ఎంత పెళ్ళయితే మాత్రం టీనీళ్ళు ఇప్పించుకోరా? అందరి గోల.

కొబ్బరి నీళ్ళు పట్టించుకోరా?! మరి కొంతమంది వాక్రుచ్చారు.

పురోహితుడు చుక్కలు లెఖ్ఖపెడుతున్నాడులా ఉంది ఏమీ తోచక.

ఒకటి, రెండు, మూడు,.... చిత్తయి పోయినట్టుంది వివాహ ద్వంద్వంలో, శోభన ఘట్టానికి ముందే

లేవలేదు పెళ్ళికొడుకు.

అంతా గొల్లుమన్నారు.

సా విరహే సవితా.....

సుబ్బాయమ్మ తల బాదుకుంది, రామస్వామి కొయ్యబారిపోయాడు.

ఖర్మ, ఖర్మ, వాపోయారు ఆహూతులు.

ఇదేం విడ్డూరం. పందిట్లోనే అమంగళమా?

కర్మకాండ కానివ్వాలి, పెద్దలు కర్తవ్యాన్ని బోధించారు.

పెళ్ళి తర్వాత రాత్రి జామున తమలపాకు పసుపు ముద్ద దూర్వాలు విఘ్నేశ్వరుడిని ప్రతిష్ఠించి, అవిఘ్నంగా హోమం జరిపించి, ముహూర్తానికి శోభన కార్యం జరగాల్సింది పోయింది.

పెద్ద కర్మకి పెళ్ళిళ్ళ పురోహితుడు తగడు. శుభకార్యాలకే ఇతడు.

శ్రాద్ధం పంతుల్ని పిలుచుకొచ్చారు. కావలసినంత మంది స్వయం సేవకులు పూనుకున్నారు.

బ్యాండు కోసం పరుగెత్తాల్సిన అవసరం లేకపోయింది. పెళ్ళికొచ్చిన బ్యాండు మేళమే శృతి మార్చి చావు బాజా వినిపిస్తోంది. కుర్రాడి శవం ఇంటికి తీసుకుపోతారా? అని అడిగితే అంతవరకూ పలుకూ ఉలుకూ లేని పెళ్ళికొడుకు తలితండ్రులు తేరుకున్నారు. " ఇక్కడే దహనం కానిస్తాం. ఏ ముఖం పెట్టుకుని ఇంటికి తీసుకెళతాం. తిరిగి వెళ్ళిపోతాం ఉత్తి చేతులతోనే, " అన్నారు చేతులు దులుపుకుంటూ. జరిగినదంతా కేవలం ప్రేక్షకురాలిగా చూస్తున్న సుబ్బాయమ్మ తేరుకుంది.

అల్పాయుష్కుడైన అల్లుడి శవాన్ని, పాడిగట్టని కూతురి పారాణిని చూస్తున్న ఆమె మనస్సులో విచిత్రమైన ఊహ మొలకెత్తింది.

నా కూతురు సుమంగళిగానే ఉండాలి. దానికి ఎదురులేదు. ఇక దీనికి తిరుగు లేదు. చరిత్రలో నిలుపుతాను. అమ్మాయి అతనికోసమే పుట్టింది. అతనితోనే ప్రయాణం సాగిస్తుంది. ఆమె మాటలు తడబడ్డాయి.

అంటే? ఎవరో ప్రశ్నించారు.

సతి... నా సవిత సతీ సహగమనం చేస్తుంది. ఇదీ సమాధానం.

అంతవరకు పరోక్షంగా ఉన్నవారు పెళ్ళికొడుకు తలిదండ్రులు ప్రత్యక్ష రంగంలోకి దిగారు.

కుర్రాడు గుండాగి చస్తాడని పెళ్ళికొడుకు తలిదండ్రులకి ముందుగానే తెలుసు. సతీ సావిత్రిలా యముణ్ణి వెన్నంటి భర్త ప్రాణాన్ని కాలపాశం నుండీ చేజిక్కించుకుంటుందని ఊహించి ధార్మికురాలైన సుబ్బాయమ్మ కూతురుతో సంబంధం కుదిర్చి, మూడు ముళ్ళు వేయించేశారు కొంగు ముడితో సహా.

పెళ్ళికి విచ్చేసిన వారు అంతా నివ్వెర పోయి చూస్తున్నారు అబ్బురం. పురాణాల వీరనారి కథల్లో చదివినవారు విన్నవారు తప్ప చూచినవారు లేరు. ఇంగ్లీష్ వారి ధర్మాన సతీసహగమనం అంతరించి పోలేదా అనుకున్నారు. రాజస్థాన్ కుగ్రామాల్లో సతీసహగమనం ఇంకా పాటిస్తున్నట్లు. పాలనా యంత్రాంగం కళ్ళప్పగించి చూడ్డం తప్పించి మరింకేమీ చేయలేకపోతున్నట్టు కొంతమందికైతే తెలుసు. మజాగా ఉంది ఇదేదో కొంతమందికి. అమానుషం, అని ఏ ఒక్కరూ అరవలేదు.

ఏదో వింత జరగబోతోంది. జనం గుమికూడారు రెణ్ణిమిషాల్లో. మనిషి వింత శాడిస్టా? మరోసారి ఋజువు దొరుకుతోంది.

సుబ్బాయమ్మ అర్ధబలం, అంగబలం ఉన్నది. పెళ్ళికొడుకు తలిదండ్రులకి సంతోషమయిందంటే దుఃఖం లేదని కాదు. తల గొరికించుకుని తమ దౌర్భాగ్యాన్ని గుర్తు చేసే కోడలెందుకు?

రామస్వామి ప్రేక్షకుల్లో ఒకడిగానే ఉండిపోయాడు.

"నేను సుమంగళిగా, దీర్ఘసుమంగళిగా ఉండాలని కదమ్మా! నిక్షేపంలా ఉంటాను. బొట్టు చెరగనివ్వను, తలలో నూనె ఇంకదు, జడలో పూలు వాడవు, గాజులు విరగనివ్వను " సవిత నోరు తెరిచింది.

ఆమె ఏమి చెప్పబోతోందోనని, అంతా చెవులు రిక్కించుకుని వింటున్నారు.

" ఈ కట్టె బూడిద కావాలని లేదు. నేను కూడా అంతే! "

లోకం పోకడ తెలిసిన సవిత అగ్ని కణమై విరజిమ్మింది.

"ఈ నుదుట సింధూరం దిద్ది, మెడలో మూడు ముళ్ళు వేసినందుకు, అతనే నా సౌభాగ్య విధాతని అంతా తలిస్తే నేను కాదనాల, ఎందుకు? మీరు కోరుకున్నది సుమంగళమే అయితే అలానే చేస్తాను. ఇందుకు మీ అందరి ఎదుట కట్ట గట్టుకుపోయిన ఈ అల్పమానవుడితో నేను కట్టెల్లో పడికాలాలంటారా? అక్కర్లేదు. ఈ కట్టె నా బొమ్మల కొలువులో మరో బొమ్మలా కాల్చకుండా కాపాడుకుంటాను.

ఫారో చక్రవర్తులు శవాలు మమ్మీలై పిరమిడ్లలో ఉండడం లేదా? నా ముద్దుల మొగుణ్ణి ఐసు పెట్టెలో పదిలంగా కట్టిపడేసి నా కట్టు బొట్టు నిలుపుకుంటాను."

పిచ్చిగా ఆమె వేస్తున్న కేకల్లో నిజం పిచ్చివాళ్ళకి మాత్రం ఎప్పటికీ అర్ధంకాదు.



# ఒక్కడు చాలు! - ఆకునూరి మురళీకృష్ణ

ఎప్పుడూ సందడిగా ఉండే తిరుపతి వెంకటేశ్వరస్వామి కొండలాగ ఆ హాస్పిటల్ కూడా పగలూ రాత్రి అన్న తేడా లేకుండా జనంతో కిటకిటలాడుతూ ఉంటుంది. వచ్చేది రోగులూ, వాళ్ళకి సంబంధించిన మనుషులే, అయినా రోగాల తాలూకు 'సిక్‌నెస్' ఎక్కడా కనబడకుండా చూడ్డానికి ఫైవ్ స్టార్ హోటల్లా ఉంటుంది. అలా మెయిన్‌టైన్ చేయడానికి ఆ హాస్పటల్ యాజమాన్యం చాలా కృషి చేస్తుంది. 'మా హాస్పటల్లో అడుగుపెడితే చాలు... మీ జబ్బు గురించి మీరే మర్చిపోతారు' అన్న స్లోగన్స్‌తో తమ హాస్పటల్ గురించి పబ్లిసిటీ కూడా ఇచ్చుకుంటారు.

చూసుకుని నడవకపోతే జారిపడిపోయే ప్రమాదముందన్నంత నున్నగా ఉన్న మార్బుల్ ఫ్లోరింగ్ మీద చకచకా నడుస్తూ తన గదిలోకి అడుగు పెట్టాడు డాక్టర్ ప్రకాష్.

"వన్నాట్ ఫోర్‌లో పేషెంట్‌కి ఆపరేషన్ అయ్యిందా?" లోనికి అడుగుపెడుతూనే అడిగాడు అతడు అటెండర్ యాదగిరిని.

"లేదయ్యా" అన్నాడు యాదగిరి ప్రకాష్ అడిగినదానికి సమాధానంగా.

ప్రకాష్ ఒక్క క్షణం ఆశ్చర్యపోయినట్టు అతడివంక చూసాడు.

క్రితంరోజు తనకి వీక్లీ ఆఫ్ కావడంతో ప్రకాష్ హాస్పటల్‌కి రాలేదు. ఆ రోజే డ్యూటీలో జాయినయ్యాడు.

"ఎందుకు చేయలేదు?" కుర్చీలో కూర్చుని స్టెతస్కోప్ ఎదురుగా ఉన్న గ్లాస్ టేబుల్ మీద పెడుతూ అడిగాడు ఆశ్చర్యంగా.

కంజెనిటల్ హార్ట్ డిసీజ్... చాలా అరుదుగా చిన్నపిల్లల్లో వచ్చే వ్యాధి. ఆడుకుంటూ ఆడుకుంటున్న పిల్లాడు హఠాత్తుగా గుండెలో నొప్పి అని పడిపోతే రెండు రోజుల క్రితం హుటాహుటిన హాస్పటల్‌కి తీసుకు వచ్చారు తల్లిదండ్రులు. ఇక్కడ టెస్టులన్నీ చేసి డయాగ్నిసిస్ చేసారు. మర్నాడే సర్జరీ చేయాలని నిర్ణయించారు.

"తెలియదయ్యా" అన్నాడు అతడు టేబుల్ మీద కేస్‌షీటున్న ఫైళ్ళని సరిగ్గా సర్దుతూ.

అప్పటికే ఏసీ ఆన్ చేసి ఉండడం వల్ల గదంతా చల్లగా ఉంది. యాదగిరి గాజుగ్లాసులో మినరల్ వాటర్ నింపి తీసుకుని వచ్చి టేబుల్ మీద పెట్టి మూత పెట్టాడు. టేబుల్ మీద మూలగా అమర్చిన ఫ్లవర్ వాజ్‌లోని తాజా పూలు ఏసీ మిషన్‌లోంచి వచ్చే గాలికి నిశ్శబ్దంగా కదులుతున్నాయి.

"ఎందుకు చేయలేదు? బాబు కులాసాగానే ఉన్నాడు కదా?" సాలోచనగా చూస్తూ అడిగాడు. అతని స్వరంలో ధ్వనించిన ఆదుర్దాని గమనించి నవ్వాడు నలభై ఏళ్ళ ఆ అటెండర్.

"బాబు బాగానే ఉన్నాడయ్యా.... నవ్వుతూ ఆడుకుంటున్నాడు. ఆపరేషన్ ఎందుకు చేయలేదో నాకు తెలియదు. కాఫీ తీసుకురమ్మంటారా?" అని అడిగాడు.

అతడి మాటలకి ప్రకాష్‌కి కూడా నవ్వు వచ్చింది. ఆపరేషన్ చేయకపోవడానికి లక్ష కారణాలుండొచ్చు. అవన్నీ అతడికెలా తెలుస్తాయి? తన పిచ్చి కానీ. సీనియర్ సర్జన్ వేణుగోపాల్‌తో ఇంటర్‌కంలో మాట్లాడదామనుకున్నాడు. మళ్ళీ వాచీ చూసుకుని ఆ ప్రయత్నాన్ని విరమించుకుని తన ముందున్న ఫైళ్ళని చూస్తూ చెప్పాడు యాదగిరితో.

"కాఫీ వద్దు, పేషెంట్‌లని రమ్మను"

వాళ్ళు జాయినైన రోజు తనే ఉన్నాడు డ్యూటీలో. ఆ కుర్రాడి పేరు వంశీ. చామనఛాయ రంగులో బొద్దుగా ఉన్నాడు. ఒక్కడే పిల్లాడు కావడంతో ప్రాణాలన్నీ వాడిమీదే పెట్టుకుని బ్రతికేస్తున్నారు ఆ దంపతులిద్దరూ. ఆరోజు ఎందుకో వాళ్ళని చూస్తే తన తల్లి, తండ్రి గుర్తుకు వచ్చారు ప్రకాష్‌కి.

పిల్లవాడికి వచ్చిన జబ్బు గురించి తెలుసుకుని అల్లాడిపోతుంటే భయపడాల్సిందేమీ లేదని సర్జరీ చేసి నయం చేయవచ్చనీ అది కూడా ఎంతో సులభమైన సర్జరీనే అని డాక్టరుగా వాళ్ళకి చెప్పి ఓదార్చాడు.

తమ కన్నీళ్ళు పిల్లాడి కంట్లో పడకుండా వాళ్ళు చేసే ప్రయత్నాలు చూస్తుంటే బాధేసింది అతడికి. ఇంటికి వెళ్ళినా వంశీనే గుర్తుకు రాసాగాడు. అందుకే రాగానే అతడిని గురించి ఎంక్వయిరీ చేసాడు.

పన్నెండవుతుంటే సీనియర్ సర్జన్ వేణుగోపాల్ ఫోన్ చేసాడు. సాయంత్రం ట్రిపుల్ హార్ట్ వాల్వ్ సర్జరీ ఉంది, దానికి సంబంధించిన విషయాలు చెప్పడానికి చేసాడు. " ఓపీ అయిపోగానే ఒకసారి వస్తే రిపోర్టులు చూసి పొజిషన్ డిస్కస్ చేద్దాం" అన్నాడు.

"అది సరే, చిల్డ్రన్ వార్డ్‌లో వన్నాట్ ఫోర్ రూంలో జాయినైన వంశీ అన్న బాబుకి నిన్న ఓపెన్ హార్ట్ సర్జరీ అనుకున్నాం కదా ఎందుకు చేయలేదు? ఏమిటి ప్రోబ్లం? ఎనీ అదర్ కాంప్లికేషన్స్?" ఫోన్ పెట్టేసే ముందు అడిగాడు ప్రకాష.

"నో అదర్ కాంప్లికేషన్స్. ఎవ్రీ థింగ్ ఈజ్ ఓకే.. బట్..." అంటూ ఇబ్బందిగా ఆగాడు వేణుగోపాల్.

"మరి.. మరెందుకు చేయలేదు ఆపరేషన్? బ్లడ్ దొరకలేదా లేక అనస్థీషియన్ రాలేదా?"

"అదేమీ కాదు. వాళ్ళు సెక్యూరిటీ డిపాజిట్ కట్టలేదు" అన్నాడు వేణుగోపాల్.

ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటం ఒకటి వచ్చి బలంగా తన ముఖాన్ని తాకినట్లుగా అనిపించింది ప్రకాష్‌కి.

"నిన్న ఏదో ఇబ్బంది వచ్చిందట వాళ్ళకి. ఈరోజు అడ్జస్ట్ చేసేస్తామన్నారు. డిపాజిట్ కట్టేయగానే ఆపరేషన్‌కి ఏర్పాటు చేయమన్నారు చీఫ్. అంతదాకా పిల్లాడిని అబ్జర్వేషన్లో ఉంచాం అన్నాడు వేణుగోపాల్

ప్రకాష్ ముఖం కోపంతో కందగడ్డలా మారింది."అబ్జర్వేషన్‌లో ఉంచారా? ఏం నీకు తెలియదా ఆ పిల్లాడి కండిషన్? బ్లడ్ ప్రెజర్ ఇప్పటికే డేంజరస్ లెవెల్లో ఉంది. రెస్పిరేటరీ ప్రోబ్లం ఎప్పటినుంచీ ఉంది. అసలిన్నాళ్ళూ ఆ పిల్లాడెలా బ్రతికున్నాడో ఆ భగవంతుడికే తెలియాలి. అలాంటి వాడిని ఇంకా అబ్జర్వేషన్లో ఉంచి చేస్తారు? ఒకవేళ పరిస్థితి ఇంతకన్నా విషమించినా కూడా ఏమీ చేయరు. వాళ్ళు సెక్యూరిటీ డిపాజిట్ కట్టేదాకా చూ....స్తూ... ఉండడం తప్ప" అన్నాడూ వ్యంగ్యంగా.

వేణుగోపాల్ మాట్లాడలేదు. అతడి ఆవేదనని అర్థం చేసుకుంటున్నట్లు కాసేపు మౌనంగా ఉండిపోయాడు.

"అలా ఎలా వదిలేయగలిగారు? ఆ పసివాడిని చూస్తే మీకు జాలి కలగడం లేదూ?" అన్నాడు ప్రకాష్

"నువ్వన్నది నిజమే. కానీ అంతకన్నా ఏం చేయగలం? ఈ హాస్పిటల్ మనది కాదు కదా, మనం ఇక్కడ ఎంప్లాయిస్ మాత్రమే! ఇక్కడి రూల్స్ ప్రకారం పనిచేయాలి. అనుకుంటాంకానీ మన జీవితాల్లో డబ్బు చాలా ప్రధానమైన పాత్రని పోషిస్తుంది. ఒకవేళ డబ్బు సమకూరకపోతే బిల్లు కడతామని అతను పనిచేసే ఆఫీసు వాళ్ళదగ్గిరనుంచీ గ్యారంటీ సర్టిఫికెట్టేనా సరే తీసుకురమ్మని సలహా ఇచ్చాను. చూద్దాం. ఇవాళ ఏదో రకంగా సెటిలవుతుంది" అన్నాడు వేణుగోపాల్.

ఫోన్ పెట్టేసాక, అలా చేయడం ఆ కార్పోరేట్ హాస్పటల్ రూల్స్ కి వ్యతిరేకమని తెలిసినా సరే తనే చొరవ తీసుకుని అక్కౌంట్స్ సెక్షన్‌కి ఫోన్ చేసి వాళ్ళు డబ్బు కట్టారా అన్న విషయాన్ని వాకబు చేసాడు. జాయినైన రోజు కట్టిన డిపాజిట్ తప్ప మళ్ళీ ఏమీ కట్టలేదని, గ్యారంటీ లెటర్ కూడా సబ్మిట్ చేయలేదని సమాధానం చెప్పడంతో భారంగా నిట్టూర్చాడు.

"డాక్టరుకి చూపించేసుకున్నాం కదా ఇంక ఇంటికి వెళ్ళిపోదామమ్మా.. నాకిక్కడేం తోచడం లేదు" అన్నాడు వంశీ తల్లి మెడ చుట్టూ చేతులు వేస్తూ.

వాడిని ఎంగేజ్ చేయడం కోసం కామిక్ బుక్‌లోని కథలని చదివి వివరిస్తున్న కళ్యాణి తలెత్తి భావరహితంగా చూసింది వాడిని.

"డాక్టర్ అంకుల్ మనల్నిక్కడింకో రెండురోజులుండమన్నారమ్మా" అంది.

"ఎందుకు? నాకు కడుపులో నొప్పి అప్పుడే తగ్గిపోయింది కదా" అన్నాడు వంశీ.

నొప్పి కడుపులోనో గుండెలోనో కూడా చెప్పుకోలేని వాడి అమాయకత్వాన్ని చూస్తుంటే కళ్ళలోకి నీళ్ళొచ్చేసాయి కళ్యాణికి. చప్పున తల తిప్పుకుంది.

సరిగ్గా అదే సమయంలో అడుగుపెట్టాడక్కడికి ప్రకాష్. అతడికి వంశీని ఒకసారి చూడాలనిపించింది. చెకప్ కోసం వచ్చినట్టు అక్కడికి వచ్చాడు. రెండురోజుల క్రితం జాయినైన ఆ పిల్లాడిలో తననితాను ఐడింటిఫై చేసుకోవడం వల్లనో ఏమో అతనికి అతడితో ఏదో తెలియని అనుబంధం ఉన్నట్లనిపిస్తోంది. వైద్య వృత్తిలో ఉన్న వాళ్ళకి సాధారణంగా అలాంటి భావాలుండవని తన సీనియర్ కొలీగ్స్‌ని చూసి తెలుసుకున్నాడు. తన కొత్తగా వృత్తిలోకి రావడం వల్ల ఇంకా అలా అనిపిస్తోందేమో.... రాను రాను తను కూడా వాళ్ళలా తయారైపోతాడేమో అనుమానమే.

అతడిని చూడగానే ఆమె లేచి నిల్చుంది.

చేయడానికి ఏమీలేకపోయినా అతడు కేస్ షీట్‌నే మరో మారు పరిశీలించాడు. వంశీ గుండెల మీద స్టెతస్కోప్ ఉంచి చూసాడు. మందులు సరిగ్గా వేస్తున్నారా అని ఆమెని అడగాల్సిన పనిలేదు. తన హాస్పిటల్లో రోగులకి ఏ వేళకి ఏ మందులు వేయాలో నర్సులే స్వయంగా వచ్చి ఇచ్చి వెళతారు.

వంశీ తండ్రి ఉంటే ఆపరేషన్ ఎంత అత్యవసరమో మరోసారి చెప్పి సెక్యూరిటీ డిపాజిట్ గురించి హెచ్చరించి వెళదామని వచ్చాడు. కానీ అసలే దైన్యానికి మారుపేరులా కనిపిస్తున్న ఆమెతో ఆ విషయం ఎలా చెప్పగలడు?

అతడు బయటికి నడుస్తుంటే వంశీ చేతుల్లో కామిక్ బుక్ ఉంచి అతడి వెనకాలే ఆమె కూడా గబగబా బయటికి వచ్చింది. తలుపు దగ్గరగా వేసి అడిగింది ప్రకాష్‌ని. "ఎలాఉందండీ మా వాడికి?" అని.

గొంతుకేదో అడ్డుపడ్డట్టయింది ప్రకాష్‌కి.

"మీకు మొన్ననే చెప్పాను కదమ్మా... మీ బాబుకి ఆపరేషన్ ఎంత తొందరగా చేయిస్తే అంత మంచిది. మీరు సెక్యూరిటీ డిపాజిట్ కట్టనిదే ఇక్కడ ఆపరేషన్ చేయరు. కనీసం మీ వారు పని చేసే ఆఫీసు నుంచి గ్యారంటీ సర్టిఫికెట్టేనా తీసుకురమ్మని చెప్పాము"

ప్రకాష్‌కి నవ్వొచ్చింది... ఆమె ఆరోగ్యం గురించి అడిగితే తను డబ్బు గురించి మాట్లాడుతున్నాడు!

"మావారు పనిచేసేది ప్రైవేటు కంపెనీలో. వాళ్ళు అలాంటి సర్టిఫికెట్లివ్వరు. మేము తల తాకట్టు పెట్టయినా మీ బిల్లు కట్టేస్తాము. ఆలస్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం అని మీరే అంటున్నారు కదా? దయచేసి మా బాబుకి ఆపరేషన్ చేయండి. వాడి ప్రాణాలు కాపాడండి" అందామె ప్రాధేయపడుతున్నట్లుగా.

"ప్రయత్నిస్తానమ్మా... కానీ ఈ విషయంలో నేను నీకు హామీ ఇవ్వలేను. మీ పిల్లాడిని కాపాడడమన్నది నా చేతుల్లో ఏమీలేదు" అన్నాడు ప్రకాష్.

"అదేమిటండీ అలా అంటారు? మీరు డాక్టర్లు కాదా?" అందామె.

షాక్ తిన్నట్లు చూసాడు ప్రకాష్ ఆమె మాటలకి.

"మనం డాక్టర్లమన్న సంగతి. అంతకన్నా ముందు మనం మనుషులమన్న సంగతి కూడా మర్చిపోతున్నాం. ఒక మనిషి ప్రాణాలు కాపాడగలిగి ఉండి కూడా చేతులు ముడుచుకుని కూర్చుంటున్నాం. వైద్యాన్ని రోగి పరిస్థితిని బట్టికాకుండా స్థితిగతులని బట్టి చేస్తున్నాం.

సెక్యూరిటీ డిపాజిట్ కట్టలేని వారికి అవసరమైనా కూడా ఆపరేషన్ చేయం. కట్టగలిగిన వారికి అవసరం లేకపోయినా చేసేస్తాం!" ఆవేశంగా అన్నాడు ప్రకాష్ వేణుగోపాల్‌తో.

"కార్పోరేట్ హాస్పటల్లో ఉద్యోగం చేస్తూ ఇలాంటివన్నీ ఆలోచించడం గొంగట్లో తింటూ వెంట్రుకలేరుకోవడంలాంటిది. ముందీ కేసు గురించి చూడు" చిన్నగా నవ్వుతూ అన్నాడు వేణుగోపాల్ సాయంత్రం తాము సర్జరీ చేయబోయే పేషెంట్ తాలూకు యాంజియోగ్రామ్ రిపోర్టులు అతడికి చూపిస్తూ.

"నేను ఈ విషయం గురించి చీఫ్‌తో మాట్లాడతాను" అన్నాడూ ప్రకాష్.

"ఆయనేమంటాడు? అంతగా డబ్బు కట్టుకోలేకపోతే గవర్నమెంట్ హాస్పటల్లో వైద్యం చేయించుకోమంటాడు."

"డబ్బు కట్టగలడా లేదా అన్నది కాదు ప్రశ్న. ఇవాళ కాకపోతే రేపైనా సరే తలతాకట్టు పెట్టయినా డబ్బు తీసుకుని వచ్చి మనికిచ్చే తన కొడుకుని తీసుకు వెళతాడు. కానీ అత్యవసరమైన కేసులో కూడా సెక్యూరిటీ డిపాజిట్ కట్టలేదని ఆపరేషన్ వాయిదా వేయడం అమానుషం అంటాను"

వేణుగోపాల్ అతడివంక భావరహితంగా చూసాడు.

"కోట్లు పెట్టుబడి పెట్టి హాస్పటల్ కట్టి అందరికీ ఉచితంగా వైద్యం చేయమనడం లేదు నేను. కానీ పెట్టుబడి పెట్టాము కదాని కేవలం పెట్టుబడిదారుడిలానే ఆలోచించకూడదంటున్నాను. మనం ప్రాణాలు పోయిగల అద్భుతమైన శక్తి మనకే ఇచ్చాడా దేముడు. దాన్ని విస్మరించకూడదంటున్నాను. అలా విస్మరిస్తే కేవలం డబ్బిస్తేనే తమ శరీరాన్ని ఉపయోగించే మరో వృత్తిలోని వారికీ మనకీ తేడా లేదంటాను" అన్నాడు.

వింటున్న వేణుగోపాల్ ముఖం ఎర్రబడిందా మాటలకి.

ప్రకాష్ వంక వింతగా, ఒకింత అసహనంగా చూసాడు చీఫ్ మెడికల్ సూపరెండింటెంట్ సుదర్శనరావు. ఆయన వయసు యాభైకి పైనే ఉంటుంది. టేబుల్ మీద అప్పటిదాకా ఆయన చదివి పెట్టిన 'గురుచరిత్ర' పుస్తకంలోని కాగితాలు గాలికి చిన్నగా కదులుతున్నాయి.

"నువ్వు కొత్తగా ప్రాక్టీస్ మొదలు పెట్టావు కనుక నీకు తెలియదేమో కానీ, ఇలాంటి కేసులు ప్రతిరోజూ కొన్ని వందలు బయటపడుతూ ఉంటాయి. జనాభాలో కొన్ని లక్షల మంది పిల్లలు గుండెకి సంబందించిన వ్యాధులతో బాధపడుతున్నారు. వాళ్ళలో సగానికి పైగా నిరుపేదలే.

ఈ సమస్య నువ్వనుకుంటున్నంత చిన్నదేమీ కాదు. నువ్వొక్కడివే దీనిని పరిష్కరించేయలేవు." అన్నాడు సాధ్యమైనంత ప్రశాంతతని ముఖంలోకి తెచ్చుకుంటూ.

ఆయన కంఠంలో కదలాడిన వ్యంగ్యం ప్రకాష్ దృష్టిని దాటిపోలేదు.

"నేను మీరు చెబుతున్న సమస్య గురించి మాట్లాడటం లేదు. మన హాస్పటల్ లో జాయినైన వంశీ అనే పేషెంట్ గురించి మాట్లాడుతున్నాను" అన్నాడు.

ఆయన ఖంగుతిన్నట్లు చూసాడు ప్రకాష్ మాటలకి.

"ఎవరిదాకానో మనకెందుకు సార్.. మన కళ్ళముందున్న చిన్న సమస్యకి స్పందించలేని మనకి దేశ సమస్యల్ని చర్చించడానికి అర్హతలేదు. మనం దేవుళ్ళమని నమ్మి, మనం తమ బిడ్డకి ప్రాణాలు పోస్తామన్న ఆశతో అతడిని మన హాస్పటల్లో చేర్పించారు ఆ దంపతులు. తీరా ఆపరేషన్ చేసేసాక బిల్లు కట్టలేరేమోనన్న కేవలం ఒక చిన్న అనుమానంతో సెక్యూరిటీ డిపాజిట్ కడితేకానీ ఆపరేషన్ చేయమని అతడి ప్రాణాలని రిస్కులో ఉంచడం డాక్టర్లగా మనం సిగ్గుపడాల్సిన విషయం అంటున్నాను"

ప్రకాష్ మాటలకి ఆయన ముఖం జేవురించింది. ఆయన ఆ హాస్పటల్లో చేరి పదేళ్ళవుతోంది. ఆ పదేళ్ళలోనూ ఎవ్వరూ ఆయన్ని అంతగా ఎదిరించి మాట్లాడింది లేదు. అదీ ప్రకాష్ లాంటి ఒక జూనియర్ డాక్టర్ అలా మాట్లాడ్డం ఆయనకి చాలా అవమానంగా అనిపించింది.

"చూడు ప్రకాష్.. నువ్వేదో ఆవేశంలో ఉండి మాట్లాడుతున్నట్లున్నావు. అది మన హాస్పటల్ రూల్. దానిని నువ్వూ నేనూ మార్చలేం. రూల్స్‌కి వ్యతిరేకంగా ఏ పని చేసినా నేను చాలామందికి సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది" అన్నాడాయన కోపంగా.

ప్రకాష్ కుర్చీలోంచి లేచాడు.

"మెడికల్ కాలేజీలో ఉండగా ఉద్యమాలు చేసిన వేడి నీలో ఇంకా చల్లారలేదల్లే ఉంది.

మొదటిసారి కనుక క్షమించి వదిలేస్తున్నాను. ఇంకోసారిలా జరిగితే నీ ఉద్యోగానికే ప్రమాదం. అనవసరంగా పేషెంట్లని రెచ్చగొట్టి నీ కెరీర్‌ని పాడుచేసుకోకు" అంటూ హెచ్చరించాడాయన.

అవమానభారంతో బయటికి నడిచాడు ప్రకాష్. అతడికి తండ్రి గుర్తుకు వచ్చాడు. తన చిన్నతనంలో తన నాన్నమ్మ వైద్యం సరిగా అందక మరణించింది. ఆ విషయాన్ని గుర్తు చేస్తూ తనని మెడిసిన్‌లో జాయిన్ చేసినపుడు అన్నాడు " ఆ సమయంలో సరైన వైద్యుడు అందుబాటులో ఉండివుంటే మీ నాన్నమ్మ బ్రతికుండేది. అప్పుడే నేను నిశ్చయించుకున్నాను. నిన్ను డాక్టర్ని చేయాలని. నువ్వు డాక్టరయ్యి ప్రాణాపాయ స్థితిలో ఉన్న పదిమంది ప్రాణాలు కాపాడాలని నా కోరిక!" అని.

ఇప్పుడు తనతోపాటు లెక్కలేనంతమంది డాక్టర్లున్నారు. అయినా ఏం చేయగలుగుతున్నారు?

"ఈ సమస్యని నువ్వొక్కడివే పరిష్కరించెయ్యలేవు" అన్న ఛీఫ్ మాటలు గుర్తుకు వచ్చాయి.

అంతేనా? తనేమీ చేయలేడా?

"మెడికల్ కాలేజీలో ఉద్యమాలు చేసిన వేడి ఇంకా నీలో చల్లారదేమో..." మళ్ళీ ఆయనన్న మాటలే గుర్తుకు వచ్చాయి. అంతే ... ఒక్కసారిగా ఏదో ఆలోచన వచ్చినట్లు ఉత్సాహంగా కదిలాడు ప్రకాష్.

జేబులోంచి సెల్ తీసి నెంబర్ డయల్ చేసాడు.

"హలో సాగరికా.... నేను ప్రకాష్‌ని. ఒక చిన్న సహాయం కావాలి. నీ క్లినిక్ ఒకరోజుకి... అహా... క్లినిక్ అంతా కాదు కేవలం ఆపరేషన్ థియేటర్ ఒకరోజుకి అద్దెకి కావాలి. థియేటర్ అద్దె, మెడిసన్స్ ఛార్జెస్ త్వరలోనే పే చేసేస్తారు. అందుకు పూచీ నాది... అలాగే నీ సహకారం కూడా కొంచెం కావాలి" అంటూ మాట్లాడాడు.

అలా మొదలు పెట్టి చాలా ఫోన్ కాల్స్ చేస్తూనే ఉన్నాడు. మెడికల్ కాలేజ్‌లో తనతోపాటు ఉద్యమాలు చేసిన వాళ్ళలో తనకి అవసరమైన చాలా మందికి...

అనస్థిషియన్ దగ్గరనుంచీ నర్సులూ ఆయాలదాకా ఆపరేషన్‌కి అవసరమైన అందరినీ సమకూర్చుకున్నాడు. చివరి ఫోన్ కాల్ మాట్లాడి అతడు కుర్చీలోంచి లేస్తుండగా అన్నాడు అటెండర్ యాదగిరి.

"ఒకరోజు సెలవు పెట్టి రేపు నేను కూడా మీతోపాటు వస్తాను సార్"

"ఎందుకు"? ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు ప్రకాష్

"అక్కడ అటెండర్ అవసరమేమైనా ఉంటుందేమోనని... లేకపోతే ఆపరేషన్ అయిపోయాక కనీసం థియేటర్ శుభ్రం చేయడానికేనా పనికొస్తాను..."

విచలితుడై చూసాడు ప్రకాష్ అతడి వంక. అతడి కళ్ళని సన్నటి పొరలా కన్నీళ్ళు కమ్మేసాయి.

సాగరిక క్లినిక్‌లో ప్రకాష్ పిలుపందుకుని వచ్చిన డాక్టర్ల ఆధ్వర్యంలో ఆపరేషన్ దిగ్విజయంగా ముగిసింది. వంశీ కోలుకున్నాడు. ఆ ఆపరేషన్‌కి పని చేసిన వాళ్ళలో డాక్టర్ వేణుగోపాల్ కూడా ఉన్నాడు.

"అద్భుతం. అసాధ్యమనుకున్నదానిని నీ పట్టుదలతో సుసాధ్యం చేసావు. అయితే ఒక్క విషయం. జీవితాన్ని కాచి వడబోసిన అనుభవంతో మన చీఫ్ చెప్పిన మాటల్లో కూడా నిజం లేకపోలేదు. ఇప్పుడంటే ఎలాగోలా ఈ గండాన్ని గట్టెక్కించావు. కానీ ఈ సమస్య నిజంగానే ఆయన చెప్పినట్లు చిన్నదేం కాదు. అందరూ నీలా ఆలోచించరు. అలా ఆలోచించే వాళ్ళు ఎక్కడో నూటికో కోటికో ఒక్కరుంటారు." అన్నాడు వేణుగోపాల్ ప్రకాష్‌తో.

ప్రకాష్ నవ్వేడు. "ఇప్పుడే చూసావుగా... చాలు... ఆ ఒక్కడూ చాలు. మిగిలిన వాళ్ళలోని జడత్వాన్ని వదిలించి, స్పందింప చేసి, సమీకరించి ముందుకు నడిపించడానికి ఆ ఒక్కడు చాలు!" అన్నాడు సంతృప్తి నిండిన కళ్ళతో.

## జరిగిందిదీ! - తాడికొండ కె. శివకుమార శర్మ

సర్వతర్యామీ, ఆశరీరుడూ, అనిమేషుడూ అయిన శ్రీహరి, అశరీరురాలు, అనిమేషురాలు అయిన శ్రీలక్ష్మి పాల సముద్రం పైన శేషతల్పశాయి మీద విశ్రాంతి తీసుకుంటుండగా వైకుంఠద్వారం వద్ద కలకలం రేగింది - ఎప్పటిలాగే ఋషిపుంగవులూ, దేవగణాలూ ప్రతిరోజూ నిర్ణీత సమయానికి శ్రీహరి గుణగణాల్ని కొనియాడడానికి నెలకొల్పిన భజన సంప్రదాయాన్ని ఆ రోజు కూడా పాటించబోతున్నారని తెలుపుతూ.

ఆ భజనలో, నిరాకారుడంటూనే ఆయన సాకారతని వాళ్ళు పొగుడుతారు.

మత్స్యావతార రూపుణ్ణి కీర్తిస్తారు.

అమృతాన్ని దక్కించి అమరుల్ని చేసినందుకు అదితి వంశీయులు కూర్మావతార రూపుణ్ణి కొనియాడతారు. భక్తి మార్గం ద్వారా వైకుంఠానికి సశరీరులుగా విచ్చేసే ఋషిపుంగవులు కూడా తపస్సు ద్వారా ఎప్పుడో ఒకప్పుడు అమరత్వాన్ని పొందలేకపోతామా అన్న ఆశతో ఇంద్రలోక వాసులతో శృతి కలుపుతారు. (మోహినీ అవతారాన్ని కూడా మొదట్లో కీర్తించేవారేగానీ, ఆ సౌందర్యాన్నారాధిస్తూ భక్తిమార్గం నుండీ దేవగణాలూ, ఋషిపుంగవులూ కూడా త్రోవ మళ్ళడం మొదలు పెట్టేసరికి ఆ అవతార భజనకి మాత్రం దూరంగా ఉండాలని నిశ్చయించుకున్నారు.)

ఇంద్రలోకాన్ని తల్లడిల్ల చేసిన హిరణ్యాక్ష హిరణ్య కశిపులను మట్టుపెట్టినందుకు దేవేంద్రుని ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వరాహ, నరసింహావతారాలని కీర్తిస్తారు. బలిచక్రవర్తి పీడని వదిలించి, దేవేంద్రుని, దిక్పాలకుల ఆధిపత్యాన్ని పునరుద్ధరించి, అమరావతిని మళ్ళీ

శోభాయమానంగా చేసి, మానవలోకంలో లోభ, మద, మత్సర్యాలను తిరిగి ప్రవేశపెట్టి, తద్వారా మోక్షగామిత్వాన్ని మానవుల ఆలోచనల్లో నింపినందుకు వారు ప్రత్యేకంగా శ్రీహరిని ప్రశంసిస్తారు.

ఋషులంటే చేతగాని వారు కాదనీ, కావాలంటే శౌర్యంలోను,. పరాక్రమంలోనూ క్షత్రియులకు తీసిపోరనీ నిరూపించినందుకు మునిపుంగవులు పరశురామావతారాన్ని వేనోళ్ళ కొనియాడతారు.

ఆ రోజు కూడా వాళ్ళు భజన అలాగే చేశారు.

అనంతరం, ఋషిపుంగవుల్లో ఒక యువకుడు లేచి నిలబడి, "స్వామీ!" అన్నాడు.

"ఏమి?" అన్నాడు శ్రీహరి.

"హే నిరాకారా! హే నిరామయా! దుష్ట శిక్షణకూ, శిష్టరక్షణకూ నీకు ఆ పరమేశ్వరుడు కూడా సాటి రాడని నువ్వు నీ అవతారాల ద్వారా వెల్లడించావు. అయితే -" అని వాక్యాన్ని మధ్యలోనే ఆపివేశాడు.

శ్రీహరి చిరునవ్వు నవ్వి, "ఆపేశావేం?" అని అడిగాడు.

"మరేం లేదు స్వామీ. తమరు కోపగించుకోనంటే - " అని మళ్ళీ ఆగాడు.

"నిర్భయంగా చెప్పు" అన్నాడు శ్రీహరి.

"ఆ మాత్రం తెలుసుకోరేమిటి? అన్నిమార్లడగాలా?" అన్నది అనిమేషురాలు శ్రీలక్ష్మి చూపులతోనే.

"ఆ ఆలోచన అతని నోటినుంచీ వెలువడితేనే దానికి విలువ. లేకపోతే నేనే చెప్పించానని అందరూ అపోహపడతారు" అన్నాడు శ్రీహరి ఆ చూపుల తూపులను తిప్పికొడుతూ.

"మత్స్యావతారంలో తమరు ఆ దైత్య సంహరణను క్షణాల్లో గావించారు. అందువల్ల తమరి ప్రతాపం గూర్చి మానవుల్లో సరైన అవగాహన లేకుండా పోయింది. దానికి కారణం కొందరు మానవులు చేపను గాలం వేసి పట్టుకుని తినడం కావచ్చు " అన్నాడాయువయతి.

"వీడికి పోగాలము దాపురించినది. ఇంక వైకుంఠంలో ప్రవేశం లేకపోవచ్చు" అనుకున్నారు అనుభవజ్ఞులైన మునిపుంగవులు.

"కూర్మావతారం వల్ల జరిగిన మేలు ఒక్క దేవతలకేనని మాలోని కొంతమంది తుచ్ఛమానవులు నమ్ముతున్నారు కూడా మరియు, మోహినీ అవతారమెత్తి అమృతాన్ని పంచినది కూడా దేవతల లాభం కోసమే తప్ప తమకేమీ మేలు ఒనగూడలేదని కూడా వారు తలుస్తున్నారు. పైగా, ఒకే తండ్రికి పుట్టిన అదితి సంతానాన్ని దేవతలుగానూ, దితి సంతానాన్ని రాక్షసులుగానూ వర్గీకరించడంలో గల రాజకీయమేమిటని కొందరు తెలివైన మానవులు ప్రశ్నిస్తున్నారు. మోహినీ అవతారాన్నెత్తి ఒక్క దేవతలకి మాత్రమే మేలు ఒనగూర్చినందుకు ఆ అవతారానికి ప్రాముఖ్యతను కూడా ఇవ్వటం లేదు. ఎక్కడా మిమ్మల్ని మోహినీ రూపంలో కొలవడం లేదు. పైగా, గరళాన్ని గొంతులో దాచుకుని ప్రపంచాన్ని రక్షించినందుకు ఆ పరమశివునకే ఎక్కువ విలువనిస్తున్నారు." అన్నాడతను మళ్ళీ.

ఆ మాటలకు దేవేంద్రుడు ఆగ్రహోదగ్రుడై వజ్రాయుధాన్ని సర్రున వెలికి తీశాడు. దేవగురువైన బృహస్పతి అతన్ని వారించాడు - ఒక బ్రహ్మహత్యాపాతకం చాలులే అని.

"అడవిలో వేటకై వెళ్ళి చేతగానితనం వల్ల వరాహం చేతిలో హిరణ్యాక్షుడు మృతి చెందితే దాన్ని కాస్తా చిలవలూ పలవలూ చేసి తమరు వరహావతారంలో దంతాల మీద భూమిని నిలబెట్టడమేమిటని, అసలు చతుర్దశ భువనాలనేవి మేడ అంతస్తులలాగా ఉంటే వాటిలో ఒకటైన భూమి గుండ్రంగా ఎట్లా ఉంటుందనీ, పైగా భూమి మీద నీళ్ళు ప్రత్యక్షంగా కనిపిస్తుండగా ఆ భూమిని నీళ్ళ మీద పెట్టి తమరు హిరణ్యాక్షుడితో యుద్ధం చెయ్యడం బూటకమనీ, అందువల్ల ఆ వరాహానికి దైవత్వాన్ని ప్రసాదించడమేమిటని కూడా కొందరు మానవులు ప్రాశ్నిస్తున్నారు" అన్నాడతను.

"ఇక స్థంభంలోనుంచీ సగం నరరూపంలోనూ సగం సింహం రూపంలోనూ వచ్చి హిరణ్యకశిపుణ్ణి చంపడమేమిటి? ఆ అవతారాన్ని చూసింది ఒక్క ప్రహ్లాదుడే కదా! అతనే ముందస్తుగా తండ్రిని చంపేడేమో రాజయ్యేందుకు? అతని ఒక్కని కాకమ్మ కథకూ అంత విలువేమిటని మరికొందరు మానవులు ప్రశ్నిస్తున్నారు."

"బలి చక్రవర్తి రాజ్యంలో ఎవరికీ యాచన చెయ్యవలసిన అవసరం గానీ, దానమిచ్చే దాతలకు లోటుగానీ ఉండేది కాదనీ, ఎవరికీ పగవారు ఉండేవారు కారనీ, వానలు సకాలానికి కురిసేవనీ, అందువల్ల మిమ్మల్ని ఎవరూ తలవ వలసిన, కొలువ వలసిన అవసరం లేక మీ ఉనికిని కూడా స్మరణ చెయ్యకపోయేసరికి మీకు కోపమొచ్చి బలిని రాజ్యభ్రష్టుణ్ణి చేశారనీ నింద ఉంది. అందుకనే ఆ రూపంలో మీకు గుళ్ళూ, గోపురాలూ ఏవీ కట్టించడం లేదు."

"మానవ మాత్రుల్లో పరాక్రమవంతులు లేరా? ఒకడు పదిమందిని జయించగలిగితే ఇంకొకడు వందమందిని మట్టుపెట్టగలడు. అలాంటప్పుడు పరశురాముడు ఎవరో అసామాన్య మానవుడు గావచ్చుగాక! మతే గానీ, తమరి అవతారమని ఎలా నమ్ముతామని కూడా కొందరు ప్రశ్నిస్తున్నారు. అందుకే, ఆయనకూ గుళ్ళూ, గోపురాలూ ఏవీ వాళ్ళు కట్టించలేదు."

"ఈ అవతారాలన్నిటిలో ఒక్క నరసింహుడికే కొద్దిగా విలువనిస్తున్నారు. అక్కడ కూడా, హిరణ్యకశిపునికి రాక్షసుడిగా, బలవంతుడిగా పెద్ద పేరుంది కనుక నరసింహుడు కొద్దిగా బలవంతుడయ్యుంటాడంటున్నారు. కాకపోయినా, సింహం అంటే ఎలాగో వాళ్ళు భయపెడతారాయె."

"అందుకని, అందరికీ అర్థమయ్యేలా, తమరు ఒక నిర్వివాదమైన అవతారాన్నెత్తమని నా ప్రార్థన." అని ముగించాడా యువయతి.

సభలో కలవరంతో నిండి కలకలం చెలరేగింది. ఇంకో అవతారాన్నెత్తమనడం బాగానే ఉంది గానీ, ముందు అవతారాలని కొరగానివనడం ఎంత సమంజసం? స్వామికి కోపం వస్తుందేమో! పైగా, అవతార పురుషుడు కారణం లేకుండా అవతారాన్నెలా ఎత్తుతాడు? అయినా కూడా, ఆ యువయతి మాటల్లో ఏం మంత్రం ఉన్నదో, అతని ఆలోచనా సరళిలోని తర్కాన్ని కాషాయ వస్త్రధారులు గానీ స్వర్ణాలంకార భూషితులుగానీ కాదనలేకపోయారు.

✡✡✡

"ఏమిటి తండ్రీ అంత హఠాత్తుగా పిలుపునిచ్చారు?" అన్నాడు చతుర్ముఖుడు.

"దుష్టశిక్షణకు సమయమాసన్నమౌతుంది" అన్నాడు శ్రీహరి.

"దుష్టులెక్కడ?" అన్నాడు విధాత తన తాళపత్ర గ్రంథాలను ఆశ్చర్యంతో చకచకా తిరగేస్తూ, తనెక్కడైనా పొరపాటు చేశాడేమోన్న అనుమానంతో మెడను ముందుకు వంచి భూలోకాన్ని పరికిస్తూ.

"దుష్టశిక్షణ చెయ్యాలంటే ముందేం కావాలి?" అన్నాడు శ్రీహరి.

"అందుకేగా దుష్టులకోసం వెదుకుతున్నాను. భూలోకంలో చెడుగుణాలున్నవాళ్ళు పుట్టలు పుట్టలుగా కనిపిస్తున్నారు గానీ, అట్లాంటి ప్రతీ ఒక్కరి కోసం ఒక్కొక్క అవతారాన్ని ఎత్తలేరు కదా!"

"నిజమైన దుష్టుణ్ణి సృష్టించవలసిన సమయం ఆసన్నమైంది."

"ఈ సారి ఎలాంటివాడు కావాలి?"

"నా ముందరి అవతారాల్లో నాకు సమవుజ్జీయైన దుష్టుడు లేడని మానవలోకంలో కొందరు అపోహ పడుతున్నారట. ఆ అపోహ ఈ అవతారంతో తొలిగిపోవాలి. నేనంటే భయంలేక, పరాక్రమంలో నాకు సాటి వచ్చే వ్యక్తి కావాలి."

"హతవిధీ!" అని లోలోపలే నిట్టూర్చాడు విధాత. ఏదో ఒక మానవుణ్ణి సృష్టిద్దాంలే అనుకుంటూంటే - మళ్ళీ దితి వంశీయుడొకడు జనించాలన్నమాట! ఈ దాయాదుల మధ్య వైషమ్యాలకు అంతులేదా?

"మీ అంత బలవంతుణ్ణి సృష్టిస్తే - మొదటికే మోసం రావచ్చునేమో?"

"నాలుగు తలకాయలున్నాయి. ఆలోచించు." అన్నాడు శ్రీహరి. "అలాగే, ముందరి అవతారాలన్నీ త్వరగా ముగియడం మానవులకు నా విజయాల మీద, శక్తి మీద అపనమ్మకాన్ని కలిగించడానికి కారణభూతమైందట. ఈ సారి అలాంటి అపనమ్మకాలకు ఆస్కారం లేకుండా చేసే బాధ్యత నీది."

"ఇప్పటిదాకా ప్రతీ అవతారంలోనూ నన్ను ఇక్కడ వదిలేసి వెళ్ళారు స్వామీ! ఈ సారి నేను మీతో వచ్చి తీరాలి. పైగా అక్కడ ఎక్కువ కాలమే ఉంటామంటున్నారు." అన్నది శ్రీలక్ష్మి కలిపించుకుంటూ.

"విన్నావుగా కుమారా మీ తల్లిగారి కోరిక? విధాతవు. విధినెలా నిర్ణయిస్తావో!"

✡✡✡

"అనాధ రక్షకా! ఆపద్బాంధవా!! దీనజన రక్షకా!! పాహి! పాహి!!" అన్న ఆర్తనాదాలతో అనిమేషుడా శ్రీహరి, దీనంగా, చేతులు జోడించి ఉన్న ఋషి పుంగవుల, దేవగణాల సమూహం వైపు తలతిప్పాడు.

"ఆ రావణుని ఆగడాలు మితిమీరిపోతున్నాయి స్వామీ! భక్తి ప్రపత్తులతో మిమ్మల్ని కొలుచుకోనీయకుండా అడ్డం పడుతున్నాడు. అతని అండ చూసుకుని అడవుల్లో ఉండే అతని సమూహం యజ్ఞాలకూ, యాగాలకూ అంతరాయం కలిగిస్తున్నారు." అన్నారు ఋషిపుంగవులు.

"అష్టదిక్పాలకులన్నారు! పంచ భూతాలన్నారు! వాటికన్నిటికీ అధిపతినన్చెప్పి అన్నీ దేవేంద్ర సింహాసనం మీద కూర్చోబెట్టారు. రావణుడి చేతిలోనే కాకుండా ఆఖరుకు వాడి కొడుకు ఆ మేఘనాధుడి చేతిలో కూడా నేను ఓడిపోయాను. ఈ వరుణుడు, వాయువు, అగ్నీ నా చెప్పు చేతల్లో లేరు. ఆ రావణుడు నిలబడమంటే వాళ్ళు నిలబడాలి, కూర్చోమంటే కూర్చోవాలి. అందుకే రావణ రాజ్యం అతివృష్టీ, అనావృష్టీ లేకుండా సుభిక్షంగా ఉంది. అక్కడ మిమ్మల్ని తలుచుకునే నాధుడే లేడు. ఇంక నేనెందుకు, నా పదవెందుకు?" అంటూ వాపోయాడు స్వర్గలోకాధిపతి.

"కుమారా!" అన్నాడు శ్రీహరి.

"తండ్రీ!" అని ప్రత్యక్షమయ్యాడు విధాత.

"దుష్టశిక్షణకు సమయం ఆసన్నమయిందా?" ముందున్న ఆశ్రితుల వైపు తలతిప్పి చూపిస్తూ అడిగాడు శ్రీహరి.

"అవుతూ ఉంది తండ్రీ! వివరాలు మీరూ, నేనూ చర్చించాలి"

"విన్నారుగా! ఇంక మీరు నిర్భయంగా వెళ్ళండి" అన్నాడు శ్రీహరి.

వాళ్ళిద్దరూ నిష్క్రమించిన తరువాత, "ఇప్పుడు చెప్పు" అంటూ శ్రీలక్ష్మి వైపు తిరిగి, "అక్కడ కోడలు ఒంటరిగా ఉన్నట్లుంది" అన్నాడు శ్రీహరి.

"ఇక్కణ్ణుంచీ వెళ్ళమని చెప్పొచ్చుగా!" అని మూతి విరిచి మెరుపు, మేఘము కలిసి అంతర్ధానమయ్యాయి.

"తల్లిగారు మీతో భూలోకానికి వస్తారు. కానీ, ఈ అవతారంలో ఆవిడకూ, మీకూ కొంతకాలం వియోగం తప్పదు."

"అర్థమైంది. ఆవిడ నాతో వస్తానంది. కానీ నాతోనే ఉండాలనలేదు. అయినా, ఇది ఆవిడకు నచ్చే అంశం అనుకున్నావా?"

"కాదని తెలుసు తండ్రీ! కానీ, రావణుడు అంచనాకు మించి బలవంతుడయ్యాడు."

"అదేమిటి, నీ అంచనా అలా ఎలా తారుమారయ్యింది?"

"రావణుడు మానవుడయితే ఇలా అయేదే కాదు!"

"మరి... మళ్ళీ?"

"అవును తండ్రీ. అతను దితి సంతతిలోనివాడే పులస్త్యబ్రహ్మపౌత్రుడు. అందువల్ల అతని జీవితాన్ని సంపూర్ణంగా నిర్దేశించే అవకాశం నాకు కలగలేదు. అతను పరమశివుణ్ణి గూర్చి ఘోర తపస్సు చేసి, ఆయనకు ప్రీతిపాత్రుడయ్యాడు."

"ఈ శివుడింతే. నేనేదైనా చెయ్యడానికి తలబడితే ఇట్లా అడ్డం పడుతుంటాడు. అందుకే ఆ దైత్యులందరికీ ఆయనంటే ప్రాణం."

"అందుకు మోహినీ అవతారమే గదా కారణం!"

"గతం గతః అయినా మళ్ళీ ఆ పరిస్థితి గనక వస్తే నేను మళ్ళీ అదే చర్య తీసుకుంటాను."

"ఇప్పటి పరిస్థితిని గూర్చి ఆలోచించండి. రావణ్ణి సంహరించాలంటే తమరు మానవావతారాన్నెత్తాలి."

"సరే. అయితే, పరుశురామావతారంలోని ప్రత్యేకత ఇక్కడ వెయ్యింతలుండాలి!"

"అందుకు రావణుడు మీ భార్యనెత్తుకుపోవాలి."

"కుమారా, నీకు నాలుగు తలలున్నాయిగానీ, మతి మాత్రం లోపించినట్లుంది. మానవావతారాన్నెత్తి భార్యను - అందునా మీ తల్లిగారిని - ఒక దుష్టుని చేత అపహరింప జేసుకోవాలా?"

"మానవావతారాన్ని ఎత్తుతామని ఒకవేళ తమరు అనుకోకపోయినా, రావణుడు శివుని చేత పొందిన వరం వల్ల తమకది తప్పదు. ఇకపోతే, మానవుల రోషానికి, పరాక్రమానికీ ప్రతీక, స్త్రీని అవమానించిన వాణ్ణి పరాభవించడం, ఓడించడం. అందునా, భార్యను అపహరించిన వాణ్ణి సంహరించడం అన్నిటికన్నా తలమానికమైనది."

"తప్పదా?"

"తప్పదు."

"ఇదెక్కడి సృష్టి కుమారా?"

"పూర్తిగా నా సృష్టి కాదు తండ్రీ. నాకంత శక్తి సామర్థ్యాలనిచ్చారు కూడానా? నేను మిమ్మల్ని దాటిపోతానేమోనని ముందుగానే నా పరిధిని, పరిమితుల్ని నిర్ణయించేశారు కదా!"

"ఆ సంగతిప్పుడెందుకులే. సరే, తరువాత?"

"ఆ భార్యను వెతుకుతూ తమరు కొండల వెంట, కోనల వెంట, కన్నీరు మున్నీరుగా విలపిస్తూ తిరగాలి."

"మానవుడిగా ఆ విలపించడం సహజంగానే అబ్బుతుంది అంటావా? ఇక్కడేమో మరి మనకి రాగద్వేషాలేమీ ఉండవాయె!"

"అనుమానం అక్కరలేదు తండ్రీ. ఆ సంగతి నేను చూసుకుంటాగా! ఆలోచిస్తే, ఇప్పటిదాకా, తమరి అవతారాలన్నిట్లో ద్వేషమే తప్ప రాగమేమీలేదాయె. అందుకని ఈ అవతారాన్ని మానవులు ప్రత్యేకంగా అభిమానిస్తారు."

"అయినా కొండల్లోనూ, కోనల్లోనూ తిరగడం ఎందుకూ?"

"మీ పినతల్లిగారు మిమ్మల్ని అక్కడకు పంపిస్తారు గనుక."

"కోడల్ని ఎవరో ఎత్తుకెడతాడని ఆవిడకు తెలియదు."

"మరెందుకు?"

"కొడుక్కు పట్టం కట్టడానికి"

"అంటే... నేను రాజకుమారుడిగా పుడతానా?"

"అవును తండ్రీ."

"అయితే, నా పరాక్రమంతో రావణుణ్ణి క్షణంలో తుదముట్టిస్తాను."

"తమరు మానవావతారాన్నెత్తి కూడా, క్షణాల్లో రావణుణ్ణి సంహరిస్తానంటే - మళ్ళీ నరసింహావతారంలాగా తయారవదూ? ఈ అవతారానికి కూడా మానవులు అంత ప్రాముఖ్యాన్నివ్వకపోవచ్చు కదా!"

"అదీ నిజమే!"

"మీరు కొండల్లో, కోనల్లో తల్లిగారిని ఆ రావణుడు ఎత్తుకు వెళ్ళక ముందు కూడా తిరుగుతారు."

"చెప్పావుగా, పినతల్లి పంపిస్తుందని!"

"సరిగ్గా విన్నారో లేదోనని చెప్పాను. అలా తిరుగుతున్నప్పుడు రావణుడు మిమ్మల్ని మోసం చేసి సీతను - అది మానవావతారంలో తల్లిగారి పేరన్నమాట - ఎత్తుకు వెడతాడు."

"సర్వాంతర్యామినైన నన్ను ఓ తుచ్ఛ దానవుడు మోసం చెయ్యడమా? ఇది నా ఉనికినే ప్రశ్నించే సమస్య. దీనికి నేనొప్పుకోను."

"మోహినీ అవతారాన్నెత్తి దైత్యులను మోసం చేసినందుకు, ఒక దైత్యుడు మిమ్మల్ని మోసం చేశాడంటే దైత్యగణాలు కూడా చెల్లుకు చెల్లని కొంత ఉపశమించవచ్చు. రావణ సంహారానికి ముందు మీరు పరమశివునికి పూజ కూడా చేస్తారు."

"నేను శివునికి పూజ చెయ్యడమా?"

"రావణుడు శివభక్తుడు కదా. లేకపోతే శివుడికి రాముడే - అది మానవుడిగా మీ పేరు - మీరన్న సంగతి తెలియదు కనుక అనవసరంగా ఆయన ఆ రావణుడి తరపున మీతో యుద్ధం చేసే అవకాశం ఉంది. ఇద్దరూ శివభక్తులే అయితే, అప్పుడాయన ఎవరి పక్షానా ఉండడు."

"సరే కానీ"

"ఈ అవతారంలో మీకు తమరే శ్రీహరి అన్న సంగతి గుర్తుండదు."

"పరుశురామావతారంలో దేవుడినన్న సంగతి నాకే తెలియకపోతే పోయె. ఈ అవతారంలో అదేగాక నేను మోసం చెయ్యబడడం కూడానా?"

"మానవుడిగా మీరు పడే ఇక్కట్లకు కోట్లాది సంవత్సరాలపాటు మీకు గుర్తింపు ఉంటుంది. ఈ అవతారాన్ని కొనియాడుతూ వీధి వీధికి ఒక గుడిని కడతారు."

"పోనీ అంతగా సీతను ఆ రావణుడు ఎత్తుకెళ్ళాలంటే ఏ అపరాత్రో రాజభవనంలోకి ప్రవేశించి ఆ పని చెయ్యొచ్చుగా? ఈ కొండల కోనల వెంట తిరగడం ఎందుకు?"

"ఎవరూ లేని చోట మోసం చెయ్యబడడం వల్ల భార్యను దుష్టులెత్తుకుపోతే ఆ పురుషునికి ప్రజల సానుభూతి ఉంటుందిగానీ, రాజప్రసాదంలోకి నిర్భయంగా అడుగుపెట్టి రాణిని ఎత్తుకు పోతే అది ఆ రాజు మగతనానికీ, పౌరుషానికీ పెద్ద వేటు. అలా జరిగితే మిమ్మల్ని పూజించడం మానేసి చేతగానివాడన్న పేరునంటగడతారు."

"సరే. మానవుల గూర్చి నీకు తెలిసినంతగా నాకు తెలియదనే చెప్పుకోవాలి. ఈ అవతారంలో అవన్నీ తెలుసుకుంటా."

"ఇందులో ఇంద్రాది దేవతల సహాయంకూడా కావాలి - రావణుడు పొందిన వరాలకు భంగం రాకుండానే అతన్ని సంహరించడానికి."

"వాళ్ళని పిలు. శాసిద్దాం!"

✡✡✡

"పరంధామా, పిలిచారుట?"

"ఇందాక మానవుల, మీ ఆర్తనాదాలు, ఆక్రోశాలు విన్నమీదట విధాత దుష్టశిక్షణకు సమయం ఆసన్నమవుతున్నదని చెప్పాడు కదా! దానిలో మీకు కూడా పాత్ర ఉందని విధాత చెప్పమన్నాడు."

"లోక కళ్యాణం కోసం మీకు సహాయపడటం మాకెంతో ఆనందంగా ఉన్నది. సత్వరం సెలవివ్వండి. మీ ఆజ్ఞను తప్పక పాటిస్తాను" అన్నారు దేవగణాలు ముకుళిత హస్తులై.

"మీకు వానర వనితల వల్ల జనించే సంతానం నా సైన్యమవుతుంది."

ఇంద్రాది దేవతల మొహాల మీద దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. వాళ్ళు ఒకళ్ళు ముఖాలు ఒకళ్ళు చూసుకున్నారు. ముందుగా తేరుకున్నది దేవేంద్రుడే ధైర్యం తెచ్చుకుని, సూర్యుడు, వాయువు, అశ్వినీ దేవతల ముఖాలు పరికిస్తూ ఇలా అన్నాడు. "అనుక్షణమూ దేవలోకపు అప్సరసలతో ఆనందపుటంచులని చవిచూసే నేను అహల్య వంటి మానవ వనితకోసం దేవలోకాన్ని వదిలి వెళ్ళమన్నా వెడతాను. కానీ - వానర వనితలతో విహారం - తల్చుకోవాలంటేనే వళ్ళు గగుర్పొడుస్తోంది. పోనీ మేమేమైనా తప్పులు చెయ్యడం వల్ల మమ్మల్ని శిక్షించాలనుకుంటే, అప్సరల మాటే తలపెట్టకుండా మమ్మల్ని మా భార్యలతోనే సమయాన్నంతా గడపమనండి. అంతే కానీ ఇలా-" గొంతు గద్గదం కాగా మధ్యలోనే ఆపేశాడు.

రాగద్వేషాలకు అతీతులు కాబట్టి సరిపోయింది గానీ, లేకపోతే అక్కడ స్వర్ణాలంకార భూషితుల అశ్రువులు పాల కడలికి రంగునే మార్చేసేవి.

"తప్పదు దేవేంద్రా" అన్నాడా అనిమేషుడు చిరునవ్వుతో.

"పోనీ, మేము వానరులుగా మారి ఆ కార్యక్రమాన్ని నిర్వర్తించడానికి వీలవుతుందా?" జాలిగా అడిగాడు దేవేంద్రుడు మినుకు మినుకుమంటున్న ఆశతో.

"నేను మానవావతారాన్నెత్తి పడబోయే ఇక్కట్లతో పోలిస్తే ఇదేమంత కష్టం కాదని విధాత సెలవిచ్చాడు. వానర స్త్రీ పురుషుల మధ్య జరిగే సృష్టి కార్యక్రమం సాధారణ విషయం. అసాధారణ విషయాల వల్ల కానీ రావణ సంహారం జరిగిందని రావణునికి వరంట!"

"ఇట్లాంటి వరాన్ని ఆ పరమశివుడే ఇచ్చి ఉంటాడు. భక్తి చూపిస్తే చాలు - ఒక భస్మాసురుణ్ణి, ఒక హిరణ్యాక్షుణ్ణి, ఒక హిరణ్యకశిపుణ్ణి, ఇప్పుడీ రావణ్ణి తయారుచెయ్యడానికి కారకుడవుతాడు" గొణుక్కున్నారు ఇంద్రాది దేవతలు.

రావణుడికి శివుడు ప్రత్యక్షమైనప్పుడు అతడు ఎక్కడ అమరత్వాన్ని వరంగా కోరుతాడోనని భయపడి తను హడావుడిగా అడ్డం పడడం వల్ల ఆలోచనా శక్తి కొద్దిగా వికటించి రావణుడి మెదడులో ఇలాంటి ఆలోచననే తనే ప్రవేశపెట్టడం జరిగిందని చెప్పడానికి విధాతకు గొంతు పెగల్లేదు.

"పోనీ, అప్సరసలతో మేము వానర రూపాలతో విహరిస్తే?" ఇంద్రుడు గొంతు సవరించుకుని దీనంగా ప్రశ్నించాడు దేవేంద్రుడు.

"వానరులతో విహరించడానికి మాకెందుకు అభ్యంతరముండదు?" అని ప్రశ్నించడానికి అక్కడ అప్సరలు లేరు. శ్రీహరిని కొలవడానికి వచ్చే దేవగణాల్లో పురుషులే తప్ప స్త్రీలెవరూ ఉండరు - అక్కడికొచ్చే ఋషిపుంగవులు దేవతా స్త్రీలను చూసి పొరపాటునైన వశం తప్పుతారేమోనని వారికి ఆ ఇబ్బందులేవీ కలగకుండా ఉండటానికి ఇంద్రాది దేవతలు వారి భార్యలను, అప్సరసలనూ దేవేంద్రలోకంలో వదిలి వస్తారు.

"సరే. అలాగే కానిండు" అన్నాడు శ్రీహరి.

"ధన్యోస్మి" అన్నారు అక్కడున్న ఇంద్రాది దేవతా పురుషులు.

"నా తండ్రికి మమకారం లేకపోవచ్చు గాక! కానీ, దైత్యులంతా నా పౌత్రులు, ప్రపౌత్రులే. కశ్యప ప్రజాపతి వంశం వారే. అదితి వంశం వారి బాగే కాక వీరి బాగును కూడా నేను కోరడంలో తప్పేముంది? ఈ అదితి వంశపు వారసులైన దేవగణాలు దీన్ని అవమానంగా భావిస్తే నాకింకా ఆనందం" అనుకున్నాడు విధాత. అలా అనుకున్న తరువాత గుర్తొచ్చింది - తను రాగద్వేషాలకు అతీతుడినన్న సంగతి.

✡✡✡

దిగంతాలవరకూ వ్యాపించిన విజయాలను కీర్తిస్తూ, నృత్య, గీత, తాళ వాద్యాదులతో సభనలరిస్తూ ఇంద్రలోకం నుండీ తెచ్చిన మణులతో అలంకరించబడి ధగధగా మెరిసే రావణ సభ నిశ్శబ్దంగా, నిర్జీవంగా, నిర్జీవంగా ఉంది.

తన అంతఃపురంలో, దాదాపు గాఢాంధకారంలో, శూన్యంలోకి చూస్తూ, అంతర్ముఖుడై ఉన్నాడు పులస్త్యబ్రహ్మ పౌత్రుడు, రావణ బ్రహ్మ.

ఎంత మెల్లగా వచ్చినా, గజ్జెల చిరుసవ్వడిని విని, ఆ వచ్చినది మండోదరి అని గ్రహించాడు.

"స్వామీ!" అన్నదామె మెల్లగా.

అతనా పిలుపుకు స్పందించకపోయినా, అతను వింటున్నాడన్న నమ్మకంతో కొనసాగిందామె - "సీతను అప్పగించి "

"అసంభవం!" అన్నాడు నిర్ద్వంద్వంగా, నిశ్చలమైన గొంతుతో, పుత్రశోకంతో నిండివున్న ఆమెను ఇంకా బాధించడం ఇష్టం లేదతనికి.

"ఇంద్రజిత్తు రామలక్ష్మణులను నాగాస్త్రంతో బంధిస్తే తెప్పరిల్లి మేఘనాధుణ్ణి మనకు దూరం చేశాడంటే - అతను దేవేంద్రునికంటే బలవంతుడని తెలుస్తోంది.. యముడు ఇంద్రజిత్తుని దరికి ధైర్యంగా చేరాడంటే - లక్ష్మణుడి అన్న ఇంకెంత బలవంతుడైయ్యుండాలి? మీ ప్రతాపం మీద నమ్మకంలేక కాదు. ప్రతిద్వంది శక్తియుక్తుల్ని గుర్తించమని నా విన్నపం." అన్నదామె ధైర్యంగా, దీనంగా.

"అవతలి వ్యక్తి గురించి నాకు బాగా తెలుసు దేవీ! ఇది తరతరాలుగా మాకు జరుగుతున్న మోసానికీ, అన్యాయానికీ కొనసాగింపు. అంతే. నేను కూడా ఇందులో సమిధనవుతానేమోనన్న భయం కాదు నా మనసులో ఉన్నది. ఈ మోసాన్ని నేను కూడా అడ్డుకోలేకపోతున్నానన్న బాధ."

ఆ చీకట్లోనే, ఆమె కళ్ళు శోకంతో కెంపులయి వెదజల్లే కాంతిలోకి చూస్తూ కొనసాగించాడు.

"అర్ధం కాలేదా? చెబుతాను విను. కశ్యపప్రజాపతికి ఇద్దరు భార్యలు - దితి, అదితి. దితి సంతానాన్ని దైత్యులన్నారు. అంటే మా పూర్వీకులు. అదితి సంతానం స్వర్గలోకంలో ఉంటుంది. ఆనాడు శ్రీహరి మోహినీ అవతారాన్నెత్తి దైత్యులకు అమృతం లేకుండా చేశాడు - వాళ్ళు చెడ్డవాళ్ళన్చెప్పి. అందుకనే అదితి సంతానం మాత్రమే అమరులు. యముడు కూడా వాళ్ళవాడే కానీ, అమరులు భోగలాలసత్వంలో మునిగివున్న నిర్వీర్యులు. ఆలోకంలో ఒక్క పరాక్రమవంతుడు ఎంత వెదికినా కనిపించడు. పైగా, ఆ ఇంద్రుడికి ఏ మానవుడైనా తపస్సు మొదలుపెట్టాడంటే భయం పట్టుకుంటుంది - తన పదవికెక్కడ ముప్పొస్తుందేమోనని! అందుకే, భూలోక వాసుల్ని చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి అతివృష్టినీ అనావృష్టినీ కలిపిస్తుంటాడు. అదే, మన రాజ్యంలో ఎప్పుడైనా వాడు తొంగిచూడానికి ప్రయత్నించాడా?"

"మరి బలవంతులు మా వంశంలో పుట్టారన్నప్పుడు ఆ శ్రీహరి కల్పించుకుంటుంటాడు మమ్మల్ని నిర్మూలించడానికి. హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు చేసిన నేరాలేమిటి? ముల్లోకాలనూ జయించడం - అదీ వాళ్ళు చేసిన నేరం. రాజు అన్న తరువాత పరాక్రమాన్ని ప్రదర్శించుకోవడంలో తప్పేమిటి? ఏ యుద్ధంలోనైనా ఓడితే అదే అతని అంతం. గెలిచిన వాడు ఓడిన వాళ్ళు ఎలా ప్రవర్తించాలో నిర్దేశిస్తాడు. అందుకే మా రాజ్యంలో ఆ మోసగాడు శ్రీహరి ప్రస్తావన రానివ్వకూడదన్నాం. అలా అనడానికి విజేతలుగా మాకు అధికారం ఉన్నది. అలాగని దేవుడే లేడనలేదే! పరమశివుడికి గుళ్ళున్నాయి కదా మన రాజ్యంలో!"

"హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు, నేను కూడా బ్రహ్మ గూర్చి, శివుని గూర్చి తపస్సు చేసి వరాలను పొందినవాళ్ళమే. శౌర్యానికీ, పరాక్రమానికే కాక భక్తి ప్రపత్తులకు, దానగుణానికీ కూడా మే పెట్టింది పేరు. పరమశివుడి భక్తుడిగా నాకు యుగయుగాలకీ తరిగిపోని ఖ్యాతి ఉంటుంది. దేవగణాల్లో భక్తి ప్రపత్తులకు గానీ శౌర్య పరాక్రమాలకు గానీ పేరు పొందిన ఒక్క వ్యక్తి పేరు చెప్పు! వాళ్ళల్లో దానగుణంలో బలిచక్రవర్తి కాలిగోటికి సరిపడే వారెవ్వరు? వాళ్ళు భోగలాలసులు. పని చెయ్యక్కర్లేదు. మదిర, మగువలతో కాలం గడపడం వారి దినచర్య. ఆ శ్రీహరికి కూడా కావలసిందదే. ఇంద్రలోకపు వాసులు నిర్వీర్యులు కనుక, ఏ చిన్న ఆపద వచ్చినా 'పాహి! పాహి!' అంటూ అతని వద్దకు పరుగెడుతుంటారు గనుక వాళ్ళ ఆపదలను తీర్చే ఖ్యాతిని అతనొక్కడే స్వంతం చేసుకుంటాడు."

"మాకు మోసగాళ్ళని, మాయావులనీ ముద్రవేశాడు గానీ, ఆ శ్రీహరికి సరితూగే మోసగాడు మాలో ఎవడూ లేడు. హిరణ్యాక్షుడు వైకుంఠాన్ని ముట్టడిస్తే ఎదురుపడే ధైర్యంలేక అతడి ముక్కులో దాక్కుని ఆ శ్రీహరి బయటపడ్డాడు మూడడుగుల నేల కావాలంటూనే ముల్లోకాలు ఆక్రమించాడు. ఇదంతా ఎందుకు? మమ్మల్ని హతమార్చి ఆ దేవేంద్రుడికి ఇంద్రపదవిని కట్టబెట్టడానికి. ఒకసారి విఫలుడైన తర్వాత విశ్వజిద్యాగాన్ని చేసి అపార శక్తుల్ని పొంది ఇంద్రలోకాన్ని బలిచక్రవర్తి ముట్టడిస్తే ఆయనని ఎదుర్కోలేక దేవేంద్రుడు తనవారినందరినీ తీసుకుని అక్కడినుంచీ పారిపోయాడు. కానీ వాడి తల్లి అదితి ఆ శ్రీహరిని ప్రార్థించింది - ఏమని? తన సవతి సంతతి అయిన దైత్యుల్ని పరాజితుల్ని చేసి తన సంతానాన్ని అడవులనుంచీ వెలికి తెచ్చి మళ్ళీ అమర లోకానికి చేర్చమని! అంతే తప్ప బలి చక్రవర్తి ఇంకెవరినీ బాధిస్తున్నాడని గానీ ఆయన రాజ్యంలో అధరం నాలుగుపాదాలా తిరుగాడుతోందనీ కాదు! దానికి ఈ శ్రీహరి ఏం చేశాడు? ఎనిమిదేళ్ళ వటువు రూపంలో వచ్చి ఆయనను మోసం చేశాడు. ఈ అదితి సంతానానికున్న గొప్ప విలువలేవో చూడు! కుబేరుడు వాడి అన్న ఉచ్యథుడి భార్యను బలత్కరించాడు. చంద్రుడు బృహస్పతి భార్య తారను లేపుకు పోయాడు. వీళ్ళు మాకు సాటిలేని మేటి దాయాదులు!"

ఆ మోసగాడి ప్రభావం మానవులమీద చాలా ఉంది. ఎప్పుడూ 'నారాయణ' అనుకుంటూ తన్మయత్వంలో మునిగిపోతే ఆ శ్రీహరి కరుణించి, పనీపాటల్లేని స్వర్గలోకానికి వాళ్ళని చేరుస్తాడని అపోహపడుతూంటారు. విధాత కల్పించుకోబట్టి కొందరు మాత్రమే ఈ జాడ్యానికి గురయ్యారు గానీ, లేకపోతే ఎవరి జీవనం గూర్చి వాళ్ళు పట్టించుకోకుండా సింహం మీదబడితే నరసింహుడికి ఆహారమవుతున్నామని, అడవి పంది అటకాయిస్తే వరాహావతారుడే మీదబడుతున్నాడని ఆనందంగా అందరూ క్రూరమృగాల పాలై మానవజాతి ఎప్పుడో అంతమయ్యుండేది."

"తపస్సు చెయ్యడానికి కావలసిన ఏకాగ్రత జనవాసాల్లో లభించదని అడవులకెడతారు కొందరు. అప్పటికి అక్కడే స్థిరవాసాన్నేర్పరచుకున్న ఆదిమవాసులు వీళ్ళ ఆక్రమణని ప్రతిఘటిస్తే వాళ్ళకి ఆటవికులనీ, అనాగరికులనీ - ఇంకా ఒక అడుగు ముందుకు వేసి - రాక్షసులనీ పేర్లు పెట్టి, శ్రీహరి కోసం తపస్సు చెయ్యడానికి అడ్డుపడ్డ వీళ్ళ నిర్మూలనకి రాజుల సహాయాన్ని కోరతారు. ఆదిమవాసులను నిర్వాసితులను చెయ్యడాన్ని సహించలేని నేను ఆ అన్యాయాలను ఎదుర్కొన్నాను. అందుకని కూడా శ్రీహరి శత్రువుగా నాకు ప్రగాఢ ముద్రపడ్డది."

"త్రిమూర్తులలో ఒకరు మాకు ముత్తాత. ఇంకొకళ్ళకి మేము ప్రియభక్తులం. అతనికి మాత్రం తలవంచమనీ, మా దాయాదుల మధ్య తలదూర్చి వైషమ్యాలను రగిలించింది చాలక మమ్మల్ని కాలరాయాలని ప్రయత్నిస్తూనే ఉంటాడు."

"ఇవన్నీ ఒక ఎత్తు. నన్ను నయవంచనతో మట్టుపెట్టాలనుకోవడం మరో ఎత్తు. 'సీతను అప్పగిస్తే?' అనికదా నువ్వన్నావు? శూర్పణఖకి - ఒక స్త్రీకి - ముక్కు, చెవులు కొయ్యడం అమానుషమే కాదు, దైత్యులు కూడా సహించలేని రాక్షత్వం కూడా. ఒక స్త్రీకి తనకి నచ్చిన పురుషునికి చేరువవడానికి ఎందుకు చొరవ చూపకూడదు? రాయబారానికి వచ్చినప్పుడు హనుమంతునికి నేనేమని చెప్పాను? 'నీ రాజుకు లాగానే నేను సీత ముక్కు, చెవులు కోసేసి వెనక్కి వచ్చివుంటే లోకంలో అందరూ దెబ్బకు దెబ్బ అనేవాళ్ళు! కానీ నేనలా చెయ్యలేదే! తను కోరుకుంటే ఆమెను నా రాణిగా చేసుకుంటానని చెప్పానే గానీ ఇన్నాళ్ళు నా నిర్భంధంలో ఉన్నాగానీ ఆమె శీలానికి ఏ మాత్రం హాని కల్గనివ్వనీకుండా ప్రవర్తించాను. నీ రాజుకు లేని మానవత్వాన్ని నేను చూపించాను. నేను సీతను ఎత్తుకు వచ్చింది తద్వారా ఆ రాముని దురహంకారాన్ని లోకానికి వెల్లడించడంకోసం. నీరాముణ్ణి, నా చెల్లెలుకు చేసిన పనికీ, అవమానానికీ క్షమాపణ చెప్పుకోమను. అప్పుడు సీతను పువ్వుల్లో పెట్టి అప్పచెబుతాను."

"దానికా హనుమంతుడు, నేను చెప్పినవన్నీ కల్పితాలన్నాడు. శ్రీరాముడు చీమక్కూడా హాని చెయ్యనివాడన్నాడు. సీతను ఎత్తుకొచ్చింది చాలక నా నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి అబద్దాలు చెబుతున్నానన్నాడు. 'పోనీ నీ రాముణ్ణి, నా చెల్లెలు ముక్కు చెవులు కొయ్యడం గూర్చి అడుగు, ఏం చెబుతాడో విను' అన్నాను. తనకవసరం లేదన్నాడు. తనకు ఆ రామునిమీద అపారమైన నమ్మకం

ఉన్నదన్నాడు. రాయబారిగా వచ్చినవాడు చెయ్యవలసిన పని నీతులు బోధించడం కాదు. సందేశాన్ని అందించడం. ఆ మూర్ఖత్వం మీద కోపంతోనే అతని తోకకి నిప్పంటించమన్నాను. ఆ తరువాత అంగద రాయబారమూ అంతే."

"ఇదంతా ఆ శ్రీహరి మాయే. ఆ శ్రీహరే ఈ రాముడు. మా దితి వంశాన్ని అంతం చెయ్యడానికి ఎదుటపడి యుద్ధం చెయ్యలేక జంతువుల రూపంలోనూ, బలిచక్రవర్తిని అంతం చెయ్యడానికి చిన్న వటువు రూపంలోనూ వచ్చింది చాలక నన్నెదుర్కోవడానికి ఇప్పుడే మానవావతారంలో వచ్చాడు."

"రామలక్ష్మణులను మేఘనాధుడు నాగాస్త్రంతో బంధిస్తే, గరుత్మంతుడే స్వయంగా వచ్చి వాళ్ళను దాన్నుంచి బంధవిముక్తుల్ని చేశాడు గనుక వాళ్ళీనాడు నాతో యుద్ధం చేస్తున్నారు. కాకుంటే, జయం నాదే. పరమేశ్వరుడిని నరులు, వానరులచేత సంహరించపబడకూడదని వరం అడగని మాట వాస్తవమే. కానీ, గరుత్మంతుడే వచ్చి వాళ్ళకు సహాయం చేస్తే అది ఆ దితి సంతతి వాళ్ళే వచ్చి సహాయం చేసినట్టుకదా! ఇది వరభంగం కాదా? మరి ఈ విషయం గూర్చి నేను ఎవరిని ప్రశ్నించాలి?"

"నాకు నా జీవితం మీద ఆశలేదు మండోదరీ! యుద్ధంలో గెలిచినవాడు ఓడినవాడి చరిత్ర వ్రాస్తాడు కనుక శూర్పణఖకి చేసిన అన్యాయానికీ, జరిపిన అమానుషానికీ రాముడు క్షమాపణ చెపితే ఈ యుద్ధం తప్పేదని ఎవరూ చరిత్రలో వ్రాయరు. ఇంద్రజిత్తు నాగాస్త్రంతో రామలక్ష్మణులను బంధిస్తే, వాళ్ళను శరీరంలో అంగుళం కూడా ఖాళీ లేకుండా రక్తసిక్తుల్ని చేస్తే, దాన్ని మాయా యుద్ధమని వ్రాస్తారు. అదే నీలుడు నాతో యుద్ధం చెయ్యలేక తన మహాస్వరూపాన్ని రెప్పపాటు కాలంలో కుంచించుకుని నా రథధ్వజం మీదకు దూకితే దాన్ని మాయ అని అనరు - పరాక్రమమని వ్రాస్తారు. రాముడికి కావలసింది సీతని నేను తిరిగి అప్పగించడం కాదు. యుద్ధం! ఆ యుద్ధంలో దితి వంశీయుడైన నన్ను అంతమొందించడం!! ఆ త్రిమూర్తుల్లో ఇద్దరు మౌనంగా ఉంటారు. విధాత ఆ శ్రీహరి కుమారుడే కదా! అందుకని విధిని శ్రీ హరికి కావలసినట్లుగానే నిర్దేశిస్తాడు."

✡✡✡

రామావతారాన్ని చాలించి వైకుంఠంలో అడుగుపెట్టిన శ్రీహరికి స్వర్గలోకవాసులు జయజయధ్వానాలు పలుకుతూ స్వాగతాన్నిచ్చారు. ఇంద్రుడి ముఖంలో కళ తప్పడం చూసి కారణమేమిటని శ్రీహరి ప్రశ్నించాడు.

"ప్రభూ! తమరి కార్యాచరణకై వానరుణ్ణై సంగమించాను. నా పుత్రుడు వాలి రావణుడితో యుద్ధంలో మరణించితే అంత బాధ పడేవాణ్ణికాదు. కానీ, తమరు అలా వెనకనుంచీ బాణం వేసి -" అని ఇంక చెప్పలేక ఆగిపోయాడు.

"దీనికేం సమాధానం చెబుతా"నన్నట్లు విధాతవైపు చూశాడు శ్రీహరి.

"రాముడు మానవుడు. వెనకనుంచీ దెబ్బతియ్యటం మానవ సహజమైన లక్షణం అంతే" అన్నాడు తేలిగ్గా విధాత.

"తల్లినని కూడా చూడకుండా నాకెన్ని ఇక్కట్లు కల్పించావు?" అని మండిపడ్డది భూలోకపు రాగద్వేషాలను ఇంకా పూర్తిగా వదలని శ్రీలక్ష్మి. ఆ సెగకు అగ్నిదేవుడు అదిరిపడ్డాడు.

"క్షమించు తల్లీ. కానీ, మానవులలో పురుషుల వైషమ్యాలకు స్త్రీలను పావులుగా వాడుకోవడం పరిపాటి. అందుకే ఈ అవతారంలో సహజత్వం పాలెక్కువ. అందుకనే ఈ అవతార స్వరూపునికి వున్నన్ని గుళ్ళూ, గోపురాలు ఇంకే అవతారానికీ ఉండవు. అంతేకాక, ఈ ఒక్క అవతారానికి కట్టించిన గుళ్ళల్లోనే తమరు తండ్రిగారి పక్కనే ఎల్లప్పుడూ ఉంటారు. లక్ష్మి పక్కన లేకుండా నారాయణుడు మాత్రమే ఉండే గుళ్ళుంటాయి, కానీ సీత పక్కన లేకుండా రాముడికి గుళ్ళెక్కడా ఉండవు."

"ఏమైనా సరే! తరువాతి అవతారంలో నాకు ఒక్క కష్టం కూడా కలగడానికి వీల్లేదు."

'అలాగే తల్లీ!"

"మానవావతారాన్నెత్తినా నేను శ్రీహరినేనన్న సత్యం నాకు తెలియడంలో తప్పేం లేదు. అలా అయితే ఎక్కువమందికి నా అవతార మహిమలను ప్రత్యక్షంగా చూసే అవకాశముంటుంది. రామావతారంలో లాగా కాకుండా తరువాతి అవతారంలోని ప్రతి అంశాన్నీ నేనే నిర్దేశిస్తాను. ఆ పనిని నీకు వదిలేస్తే ఏమవుతుందో ప్రత్యక్షంగా అనుభవించానుగదా!"

"అలాగే తండ్రీ!"

అశరీరుడూ, అనిమేషుడూ, సర్వాంతర్యామీ అయిన శ్రీహరి పాలసముద్రంపైన శేషతల్పశాయి మీద పవళించడానికి ఆయుత్తమవగా అశరీరురాలు, అనిమేషురాలు అయిన శ్రీలక్ష్మి ఆయన పాదాల చెంత తనచోటువైపు నడిచింది.

✡✡✡

## రామగీత - పి.వి.రామచంద్రశర్మ

**భగవద్గీత 4 వ అధ్యాయం, 34 వ శ్లోకంలో, శ్రీ శ్రీ భగవాన్ ఇలా శెలవిచ్చారు.**

శ్లో: తద్విద్ధి ప్రణి పాతేన పరి ప్రశ్నేన సేవయా!

ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్వదర్శినః!!

దాని తాత్పర్యం ఏమిటంటే

"నీవు తత్వం దర్శించిన జ్ఞానులకడకేగి, ఆ జ్ఞానమును గ్రహించుము. వారికి దండప్రణామములాచరించుట వలనను, సేవలొనరించుటవలనను, కపటము లేకుండా భక్తిశ్రద్ధలతో, సముచిత రీతిలో ప్రశ్నించుట వలనను పరమాత్మ తత్వమును, చక్కగా నెఱింగిన జ్ఞానులు సంప్రీతులై, నీకు ఆ పరమాత్మ తత్వజ్ఞానమును ఉపదేశించెదరు.

అక్కడవరకు చెప్పి, ఆగి ఓ దమ్ము పూర్తిగా పీల్చుకుని, రింగులు రింగులుగా పొగని గాలిలోకి వదిలారు శ్రీదశరథరామయ్యగారు.

అది రాజమండ్రిలోని గోదావరి నదీ తీరంలో చల్లగాగాలి వీచే పార్కు. సాయంత్రం ఐదు గంటలనుంచీ రాత్రి పదకొండు గంటలవరకూ, ఆ పార్కు అనేక మందికి కాలక్షేపానికీ, కోరికలు తీర్చుకోవడానికి, ఆశ్రయమిస్తుంది. రిటైరైన వాళ్ళు, ప్రేమికులు, బిచ్చగాళ్ళు, ఏ పనీలేనివాళ్ళు, తినుబండారాలు, సిగరెట్లు, బీడీలు అమ్ముకునేవాళ్ళూ, కాముకులను వలలో వేసుకొనే వ్యభిచారిణులు, వాళ్ళని కంట్రోలు చేసే బ్రోకర్లు, రాజకీయనాయకులు, ఇలా పార్కులో సేద తీర్చుకునే వాళ్ళు కోకొల్లలు.

పార్కులో మన్మథరావుగారు, మోహనరావుగారు, దశరథరామయ్యగారూ, రోజూ కలుసుకుంటారు సాయంత్రంవేళ. రోజుకొక్కరు చొప్పున వాళ్ళనుభవాలు వివరించడము, కిమ్మనకుండా మిగతావాళ్ళు వినడము వారి సాయంకాల సమావేశపు నీతి.

. తల - మచ్చుకైన జుత్తు లేనిది,

. నుదురు - వెడల్పైనది

. దేహఛాయ - పసిడిది

. కట్టిన పంచె ప్రీమియర్ మిల్సుది

. లాల్చీ - ఖాదీది

. మెదడు - అమెరికన్ డాలరంత బలమైనది, పదునైనది.

అతనే మన కథానాయకుడు దశరథరామయ్యగారు.

. మన్మథరావు గారు, శ్రీకాకుళం జిల్లాలో పుట్టి, కోస్తా ఆంధ్రాలో రెవెన్యూ డిపార్టుమెంట్లో, తనదైన శైలిలో మూడు దశాబ్దాలు ఏకచ్ఛత్రాధిపత్యంగా ఓ వెలుగు వెలిగి రిటైరైన తాసిల్దారు గారు. మన్మథరావులో కోటికి ఒక వంతైన మన్మథ లక్షణాలు ఉన్నాయని ఏ స్త్రీ ఒప్పుకోనంత అందగాడు ఆయన.

. మోహనరావుగారు నిజంగా సమ్మోహనరావే. మూడు వందల ఎకరాల మాగాణికి అధిపతి. మూడు జిల్లాల పంటల పోటీలో వరుసగా మూడు సంవత్సరాలు అధికవరి దిగుబడి సాధించిన మేటి కృషీవలుడు ఆయన.

మాట నాస్తి.

కృషి జాస్తి

అతని కప్పగించిన పని కలిగిస్తుంది తృప్తి.

బాధ్యతలన్నింటిని నిర్వర్తించుకున్న అదృష్టవంతులా ముగ్గురూ. ఏ కొరతా లేని వాళ్ళు. సరదాగా సాయంత్రాలు గడిపే అవకాశంగల త్రిమూర్తులే వాళ్ళు.

దశరథరామయ్యగారు (ఇకనుంచీ ద.రా అంటాను) ఓ బహుళజాతీయ కంపెనీలో సీనియరు వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసి పదవీ విరమణ చేసారు.

ఆయనకి రాజమండ్రి, విశాఖపట్నం, హైదరాబాదు, బొంబాయిలలో, చెప్పుకునే స్థాయిలో ఇళ్ళు ఉన్నాయి. ఒక అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలు వారి సంతానము. వాళ్ళందరికీ పెళ్ళిళ్ళై తలో దేశంలో పెద్ద పెద్ద ఉద్యోగాలలో ఉన్నారు. అంతటి అదృష్టవంతుడు ఎవరూ ఉండరు.

ద.రా మెట్రిక్‌తో చదువు ఆపేశాడు. చిన్నతనంలోనే తండ్రి చనిపోవడం వలన. అతని అన్నగారు మాత్రము బాగా చదివి బొంబాయిలో పెద్ద ఉద్యోగం చేసేవాడప్పటికే.

అన్నకి మన ద.రా.కి మధ్యలో నాలుగు కాన్పులు వాళ్ళమ్మగారికి పోయేయి. తండ్రి మరణానంతరం చదువు చెప్పించే నాథుడు కరువయ్యారు ద.రా.కి.

"డబ్బులు పంపితే అమ్మని నీకు అప్పగించి నా తిప్పలు నేను పడతాను" అని, అన్నయ్యకి ఉత్తరం వ్రాసాడు ద.రా.

"అమ్మ నాకే కాదు. నీకూ అమ్మే. డబ్బులెలా సంపాదిస్తావో నా కనవసరము. అప్పుడే అమ్మని బొంబాయి పంపించేలా అఘోరించు." అది అన్ననుంచీ వచ్చిన జవాబు.

స్నేహితుడు నరసింహారావు కోమటి. పుష్కలంగా డబ్బు ఉన్నవాడు. అతని దగ్గర ఓ పాతిక రూపాయలు అప్పు తీసుకుని పదిహేను కిలోల డబ్బా బిస్కట్టులు కొని దాన్ని వందగ్రాముల ప్యాకెట్టులు చేసి అవి అమ్మి ఖాళీ డబ్బా కూడా అమ్మి, మళ్ళా అలాగే అమ్మి మొత్తానికి సైకిలు మీద రిటైలు వ్యాపారం చేసాడు. అలా సంపాదించిన ఆ సొమ్ముతో అమ్మని బొంబాయి వెళ్ళి అన్నకి అప్పగించేడు.

ఆ మధ్యాహ్నం బొంబాయిలోని ఓ వీధిలో వెళుతూ మెడికల్ రిప్రెంజింటేటివ్ వాకిన్ ఇంటర్వ్యూ బోర్డు చూసి దూలోనికి వెళ్ళాడు ద.రా. అంతే ద.రా. సెలెక్టు అయ్యాడు. గోదావరి నీరు తాగి పెరిగిన మెదడు కదా. దంచేసేడు ఇంటర్వ్యూలో. అనుభవముందా అని అడిగిన ప్రశ్నకి బిస్కట్టుల కథ చెప్పేడు.

తెల్లవారే సరికల్లా ద.రా.రిప్రెజింటేటివుగా మారిపోయేడు.

ఏ శుభముహూర్తములో ప్రవేశించాడో ఉద్యోగంలో తెలియదు కానీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అదే కంపెనీలో రిటైరయ్యాడు.

"మీ విజయ రహస్యం ఏమిటి?" అన్న మోహన రావుగారి ప్రశ్నకి బదులుగా, భగవద్గీతలో శ్లోకం, తాత్పర్యం చెప్పేరు ద.రా.

"మెట్రిక్ చదివిన నేను ఎలా అంచలంచలుగా ఎదిగానుఅంటే జ్ఞానం సంపాదించడము వలన.

శ్రీ భగవాన్ "జ్ఞానం సంపాయించిన వాళ్ళని పైన చెప్పినట్లు తృప్తి పరచి పొందండి జ్ఞానం" అన్నారు.

నిజజీవితంలో స్వార్థం చేత, పెరుగుతున్న పోటీ తత్వం చేత, ఎవరైనా తమ జ్ఞానం తమకన్నా తెలివి తక్కువ వాళ్ళకి అందచేస్తారా చెప్పండి? ఎంత కాకా పట్టినా, ఎంత బాకా ఊదినా?

దీనికి నేనో ఉపాయం కనిపెట్టేను.

ఉద్యోగంలో స్థాయి పెరుగుతున్నంత సేపు నిర్ణయాలు తీసుకోవడము చాలా క్లిష్టమైన పని.

అందరినీ సంప్రదించాలి. ఏకపక్షంగా నిర్ణయించకూడదు. సంప్రదించినంత మాత్రాన ఎవ్వరూ సలహాలివ్వరు. ఎందుకంటే ఎవరి స్వార్థం వాళ్ళది.

ఇక పుస్తకాలు చదివితే వాటిలో ఒక నిర్దేశించిన సూత్రం ప్రకారంగా థియరెటికల్‌గా ఉంటుంది జ్ఞానం.

"మనపైవాడూ చెప్పడు మనకి, నిర్ణయాలెలా తీసుకోవాలో" క్రిందివాళ్ళని అడగడం నామోషీగా ఉంటుంది.

సిగరెట్టుమీద సిగరెట్టు తాగుతూ ఓ రాత్రి అంతా నిద్రలేకుండా ఆలోచించిన తరువాత ఐడియా వచ్చింది.

ప్రతీ నిర్ణయం తీసుకునే ముందు, నేనో వాకిన్ ఇంటర్వ్యూ ఏదో ఒక చిన్న పోస్ట్‌కి పెట్టేవాణ్ణి.

ఉద్యోగం ప్రయత్నంలో ఉన్నవాళ్ళ మెదడు పాదరసంలా చురుగ్గా పనిచేస్తుంది. సమస్యలకు సమాధానం ఎప్పుడూ ఏ సమస్యాలేనివాళ్ళతో చర్చిస్తే దొరుకుతుంది. సమస్యతో సతమత మయ్యే వాళ్ళ మెదడు ఫ్రేము దాటి ఆలోచించే స్థితిని కోల్పోతుంది. మెదడు పని చేయదు.

ఉదాహరణకి "దక్షిణ కొరియా ప్రజలు దగ్గు వస్తే ఏం చేస్తారు?" అని టి.బి. ఆస్పత్రిలోని రోగులని అడగండి. బుఱ్ఱంతా వేస్టు చేసుకుంటారే కానీ జవాబియ్యలేరు. అదే ప్రశ్నని అప్పుడే మాటలు నేర్చిన ఓ బుడుగుని పిలిచి అడగండి. "దగ్గుతారు" అని బులెట్‌లా వస్తుంది జవాబు.

వాకిన్ ఇంటర్వ్యూలో భాగంగా నా సమస్యని ప్రశ్నగా ఇస్తే అనేక సందర్భాలలో జవాబు దొరికింది. అఫ్కోర్స్ నిజంగా నిపుణలైన వాళ్ళకి నేను టెంపరరి ఉద్యోగాలిచ్చేనుకూడా.

"దశరథరాముడుగా ఉన్న ప్రతీవాడు కొన్నాళ్ళకి సీతారాముడు" అవుతాడు.

తెలివి, అనుభవము ఉన్న తండ్రి చాటు బిడ్డగా ఉన్నప్పుడు ఎరగని తెలివితేటలు, చదువు, సంధ్యలేని భార్య వచ్చాక ఆవిడ ద్వారా సంపాదిస్తాడు.

జ్ఞానం రావాలంటే అజ్ఞానుల వలననే వస్తుంది అని నా అభిప్రాయం. ఏ స్వార్థం, ఏ సమస్యా లేని అజ్ఞానులు ఓపెన్ మైండ్ తో ఆలోచించి సమస్యకి సమాధానం కాకతాళీయంగా ఇస్తారని నా నమ్మకము.

శంకర భగవత్పాదులు వారికి చండాలుడు జ్ఞానోపదేశం కలిగించలేదా?

కౌంట్ ఆఫ్ ఆబట్స్‌బరిలో షెఫర్డ్ (కౌ బోయ్), ఇలా అనేక అజ్ఞానులు చరిత్రలో, పురాణాల్లో జ్ఞానాన్ని ఇచ్చినట్లు ఉదాహరణలు ఉన్నాయి.

వాళ్ళకి నమస్కరించక్కర్లేదు. సేవలు చేయక్కర్లేదు. "ప్రత్యుపకారం చేస్తే చాలు." ఏ చదువూ లేని మన నాయనమ్మలు, అమ్మమ్మలు జీవితానుభవం అనే విశ్వ విద్యాలయాలిచ్చిన పట్టాల జన్యుపరంపర వలననే, ఈనాడు విదేశాల్లో కూడా మన బావుటా ఎగరవేస్తున్నాము అనే విషయం మనం మరువకూడదు.

"ఇదే నా విజయ రహస్యం" ముగించారు మన ద.రా..

ఆయన మిత్రులకు "కృష్ణ గీత" కాకుండా "రామగీత" వినిపించారు.

## నీడ - నిజం

-డాక్టర్.ఎం.సుగుణరావు

"వస్తాడంటావా?" అన్నాడు భగీరథ సిగరెట్ వెలిగిస్తూ.

"వచ్చేస్తాడు..." అన్నాడు సూర్యనారాయణ కిటికీ లోంచి పడుతున్న వర్షాన్ని చూస్తూ.

"అనవసరంగా మనం కారుని పంపించేసాం, ఈ వర్షంలో తిరిగి వెళ్ళాలంటే కష్టమే!" అన్నాడు గాంధీ కేండిల్ వెలిగిస్తూ.

వాతావరణం చలిచలిగా ఉంది. ఆ ఫామ్ హౌస్ ఊరికి దూరంగా విసిరేసినట్టుగా ఉంది. ఆ ముగ్గురూ రావలసిన వ్యక్తికోసం ఎదురుచూస్తున్నన్నారు క్షణాలు గడుస్తున్నా అవి నిమిషాలుగా మారి గంట కావస్తున్నా తాము ఎదురుచూస్తున్న వ్యక్తి రావడంలేదు - అరగంట తర్వాత. "ఈ వెంకట్రావ్ మహాశయుడు ఈ వర్షంలో ఎక్కడ చిక్కుకు పోయాడో!" అన్నాడు భగీరథ విసుగ్గా.

"బాబూ భగీరథా నువు సిటీకి దూరంగా ఈ గెస్ట్ హౌస్ కట్టించనేల? కట్టించావే అనుకో కేసుల్ని వదులుకుని, కాస్త గొంతు తడుపు కుందామని వచ్చిన మనం ఇలా ఈ తుఫానులో ఇరుక్కుపోవడమేమిటి?" అన్నాడు సూర్యనారాయణ తన అసహనాన్ని ప్రకటిస్తూ.

"బాబూ, ఈ రోజు పార్టీ ఇచ్చేది వెంకట్రావే, మెడికల్ కంపెనీ వారి సౌజన్యంతో పారిస్ వెళ్ళొచ్చాడు, అక్కడ నించీ తెచ్చిన షాంపెయినుతో మనకు పార్టీ ఇవ్వబోతున్నాడు, మీరు బయలుదేరండి, ఒక కేసు చూసుకుని వచ్చేస్తాను. అన్నాడు, ఇంతవరకూ అతడి ఎడ్రస్ లేదు" అన్నాడు భగీరథ.

"వరుసగా నైట్‌డ్యూటీలే! నాకు నిద్దరొస్తుంది" అంటూ ఆ గదిలోని సోఫా మీద నడుం వాల్చాడు సూర్యనారాయణ.

"నేనూ ఆగలేను" అంటూ తను కూర్చున్న పడకకుర్చీలోనే పడుకుని కళ్ళు మూసుకున్నాడు గాంధీ.

- ఆ ఇద్దరూ పడుకున్న పావుగంటవరకూ భగీరథలో ఏవేవో ఆలోచనలు. అలా ఆలోచిస్తూనే తనూ నిద్రకు ఉపక్రమించాడు భగీరథ.

✡✡✡

తలుపు మీద టక్ టక్ మని బాదిన చప్పుడు. "వచ్చేసినట్టున్నాడు" అన్నాడు సూర్యనారాయణ ఆనందంగా.

గాంధీ తలుపు తీసాడు. ఎదురుగా ఒక ఆగంతకుడు.

ఆ ఆగంతుకుడి వంటి మీద నుంచీ వచ్చిన ఫారిన్ సెంటు పరిమళం ఒక్కసారిగా ఆ గదిలో వ్యాపించింది. నల్ల రెయిన్ కోటు, నెత్తిమీద టోపీ, జీన్ ఫాంటు, టీ షర్టు. చేతిలో లెదర్ బేగ్గు, వయసు నలభైలోపే.

"సారీ, వైజాగ్ వెళుతుంటే కారు ట్రబులిచ్చింది, మీ దగ్గర టూల్ కిట్ ఉందా!" అన్నాడు ఆ వ్యక్తి ముగ్గురినీ పరిశీలనగా చూస్తూ.

"లేదండీ... లేదు..." అన్నాడు భగీరథ.

"సరే డ్రైవర్‌ని పంపేసి వస్తాను. ఈ బేగు ఇక్కడుంచి వెళతాను..." అంటూ గబగబా బైటకు వెళ్ళిపోయాడు.

- అతడు వదిలి వెళ్ళిన లెదరు బేగ్ తెరిచే ఉంది. ఆ బేగ్‌లోని వస్తువులు ఆ ముగ్గురునీ ఆకర్షించాయి. వాతావరణం చల్లగా ఉంది. వర్షపు చినుకులు లయబద్ధంగా పడుతున్నాయి ఆ ముగ్గురికీ ఒక్కసారి నాలుక తడారినట్టయింది, ఆ సంచీ చూసేసరికి.

"ఛీ మనకు బుద్ధిలేదు, పార్టీ చేసుకుందామని వచ్చినవాళ్ళం, అసలు సరంజామా లేకుండా వచ్చి ఈ వర్షంలో ఇరుక్కుపోయాం" అన్నాడు గాంధీ చిరాగ్గా ముఖం పెట్టి.

భగీరథ అతడి ముఖంలోకి చూసి ఏదో చెప్పబోయాడు. ఇంతలో బూట్ల చప్పుడు వినిపించడంతో మాటలు ఆపుచేసాడు. ఆ ఆగంతకుడు లోపలికొచ్చాడు "డ్రైవర్‌ని మెకానిక్‌ని తీసుకురమ్మని పంపాను అతడొచ్చేవరకూ, మీకు అభ్యంతరం లేకపోతే ఇక్కడ కాసేపు ఉండొచ్చా...!" అన్నాడు.

"ఉండండి, బైట వర్షం వస్తోంది కదా!, ముందు ఆ రెయిన్ కోటు తీసి ఈ టవల్‌తో తుడుచుకోండి", అంటూ టవల్ అందించాడు గాంధీ. - అతను రెయిన్ కోటు విప్పి తల తుడుచుకుంటూ సిగరెట్ పాకెట్ బైటకు తీసాడు మామూలు సైజు కన్నా పొడుగ్గా ఉన్న సిగరెట్లు. అందరికీ ఒక్కో సిగరెట్ ఇచ్చాడు. అంతా వెలిగించారు. భగీరథ కిటికీలోంచి చూస్తూ "ఇక రాడేమో!" అన్నాడు.

"మీరు ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్టున్నారు..." అన్నాడు ఆ వ్యక్తి.

"ఔను పార్టీ చేసుకుందామని వచ్చాం, అయితే పార్టీ ఇచ్చే వ్యక్తి రాలేదు." అన్నాడు భగీరథ.

"అయితే నా దగ్గర మంచి సరుకుంది. సరదాగా సెలబ్రేట్ చేసుకుందాం." అంటూ ఆ వ్యక్తి ఆ లెదర్ బేగులోంచి సీసాలు బయటకు తీసాడు. ఆ ముగ్గురి కళ్ళు ఒక్కసారిగా మెరిసాయి. అవి ఇండియాలో దొరకవని వాళ్ళకి అర్థమయింది. గాంధీ, సీసా మీది

లేబుల్ చూసి "అమ్మో ఇండియా కరెన్సీలో దీని ఖరీదు పదివేలు మీరు ఎవరికోసమో వీటిని వృథా చేయకండి." అన్నాడు మొహమాటపడుతూ.

"ఫరవాలేదు, అర్థరాత్రి వచ్చిన ఈ అపరిచితుడికి ఆశ్రయం ఇచ్చారు. అందుకు కృతజ్ఞతగా ఈ పార్టీ" అంటూ ఆ సీసా సీలు విప్పాడు.

సూర్యనారాయణ జీడిపప్పు, పకోడీలు ప్లేట్లల్లో సర్దాడు.

- ఆ ఆగంతకుడు నాలుగు గ్లాసుల్లోకి ఆ సీసాలోని ద్రవాన్ని వంపాడు. భగీరథ తను తెచ్చిన సీసాలోని నీటితో గ్లాసులు నింపాడు. ఆ నలుగురి గ్లాసులు 'ఛీర్స్' అంటూ పైకి లేచాయి.

"అన్నట్టు మీ పేరు!" అన్నాడు గాంధీ

"పేరుదేముంది లెండి, అర్ధరాత్రి ఒంటరి బాటసారి అనుకోండి..." అన్నాడు.

ఆ ముగ్గురూ షాక్ తిన్నట్టు చూసారు.

"కంగారు పడకండి, నా పేరు గౌతమ్, పూర్తిపేరు సిద్దార్థ గౌతమ్, న్యూజెర్సీలోని ఒక రీసెర్చి ఇనిస్టిట్యూట్‌లోని కేన్సర్ విభాగంలో పనిచేస్తున్నాను" అన్నాడు.

"మైగాడ్, మా ముగ్గురిలాగే మీరూ డాక్టరన్నమాట,?" అన్నాడు భగీరథ ఆనందంగా .

అతడు నవ్వుతూ, "మీ వివరాలు చెప్పండి" అన్నాడు.

భగీరథ గ్లాసులోని ద్రవాన్ని చప్పరిస్తూ, నా పేరు డాక్టర్ భగీరథ, సర్జన్‌ని, నా పక్కన కూర్చున్న ఈయన గాంధీ, ఎనస్థటిస్ట్, ఆ కిటికీ దగ్గరకెళ్ళి సిగరెట్ కాలుస్తున్న వ్యక్తి సూర్యనారాయణ ఫిజిషియన్, మేం ఎదురు చూస్తున్న వ్యక్తి డాక్టర్ వెంకట్రావ్, మాలాగానే గవర్నమెంట్ ఆస్పత్రిలోనే పనిచేస్తున్నాడు. మేం నలుగురం నా గెస్ట్ హౌస్‌లో నెలకోసారి పార్టీ చేసుకుంటాము. ఈ రోజు పార్టీ ఈవెంట్ మేనేజర్ డాక్టర్ వెంకట్రావ్ మిస్సింగ్.... ఆ భర్తీని మీరు పూడ్చేసారు" అన్నాడు భగీరథ.

"బావుంది... మీతో పరిచయం చాలా సంతోషం కలిగిస్తోంది." అన్నాడు.

గ్లాసులు ఖాళీ అయ్యాయి. గౌతమ్ సీసాలోని ద్రవాన్ని మళ్ళీ గ్లాసుల్లోకి నింపాడు. ఆ ముగ్గురి వంకా చూస్తూ "అంతా మౌనంగా ఉన్నరు. ఏదైనా మాట్లాడండి?! అన్నాడు గౌతమ్.

"మీరే చెప్పండి, ఫారిన్‌లో మన డాక్టర్ల కబుర్లు" అన్నాడు గాంధీ.

"ఈ మధ్య కాలంలో బాగా ప్రాముఖ్యంలోకి వచ్చిన మెర్సీకిల్లింగ్, దాన్ని చట్టపరిధిలోకి తీసుకురావడం కోసం ఉద్యమాలు మొదలయ్యాయి" అన్నాడు గౌతమ్.

"ఔను, ఈ మధ్య స్వచ్ఛందంగా మరణాన్ని ఆహ్వానించే కేసులూ వస్తున్నాయి. అయితే అలా ఐచ్ఛిక మరణాన్ని కోరుకోవడానికి నైతికబలం కావాలి" అన్నాడు భగీరథ గ్లాసులోని ద్రవాన్ని చప్పరిస్తూ.

"ఔను ఈ మధ్య పేపర్లో ఒక వార్త చదివాను, కేరళ లో ఒకాయన స్వచ్చంద మృత్యువైద్యాలయాలు ఏర్పాటు చేయాలంటాడు. అది ఆత్మహత్య క్రిందకు రాదట, ఇండియన్ పీనల్ కోడ్ 306, 309 సెక్షన్ల క్రింద మరణం క్రిందే లెక్కట." అన్నాడు గాంధీ తాగేసిన గ్లాసుక్రింద పెట్టి.

గౌతమ్ క్షణం సేపు మౌనంగా ఉన్నాడు. ఆ ముగ్గురి వంకా పరిశీలనగా చూస్తూ "కొంతమంది జీవితంలో విసిగివేసారో, ఆరోగ్యపరిస్థితులు బాగోలేకో స్వచ్ఛందంగా మరణం కోరుకుంటారు.... ప్రాణాలు పోసే డాక్టర్లమయిన మనం ఏ పేషెంటయినా చనిపోవాలని కోరుకుంటామా.." అన్నాడు.

"అంటే...?" ఎదురు ప్రశ్న వేసాడు గాంధీ.

"మీలో ఎవరైనా, ఎప్పుడైనా మీ పేషెంటు చనిపోతే బావుంటుంది... అని కోరుకున్నారా?" అన్నాడు.

అతడి ప్రశ్నలోని భావం అర్ధమయిన ఆ ముగ్గురూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఆ ప్రశ్న ఆ నిశ్శబ్ద వాతావరణంలో వారికి ఆశ్చర్యంతోపాటూ భయాన్ని కలిగించింది.

ఉరుములు మెరుపులతో ఆ చీకటి రాత్రి. ఊరికి దూరంగా ఉన్న ఆ గెస్టు హౌసులో కరెంటు లేకపోవడం ఇవేమీ ఆ ముగ్గురినీ కదిలించలేదు. తమ మధ్యలోకి అర్ధరాత్రి వచ్చి వేసిన ఆ ఆగంతకుడి ప్రశ్న వారిని ఆలోచింపచేసింది.

"ప్రశ్న వేసింది మీరే కాబట్టి మీరే ముందుగా మీ అనుభవం చెపితే బావుంటుంది." అన్నాడు గాంధీ, క్షణం గౌతమ్ వంక చూస్తూ.

"తప్పని సరిగా చెబుతాను..ఐతే మీరు ఆతిథ్యం ఇస్తున్నారు కాబట్టి ముందుగా మీరు చెప్పడం సమంజసం.." గౌతమ్ నేర్పుగా తన వంతుని వాయిదా వేసాడు.

ఆ మాటలకు గాంధీ క్షణం సేపు ఆలోచించి "నేను రెండు సంవత్సరాలక్రితం ఒక ప్రాధమిక వైద్యకేంద్రంలో పనిచేసాను ఒక కేసు వచ్చింది. లారీ ప్రమాదంలో కాలు, చెయ్యి పోయింది వెన్నుపూస దెబ్బతింది, ఆ రోగి బతుకుతాడు కానీ జీవితాంతం మంచం మీదే జీవచ్చవంలా బతుకుతాడు, ఆ పరిస్థితుల్లో బ్రతకడం కన్నా ఆ వ్యక్తి చనిపోవడమే మేలని కోరుకున్నాను." అన్నాడు తన గ్లాసులోని ద్రవాన్ని త్రాగడం ఆపి.

అందుకు గౌతమ్ వెంటనే, "ఔను, మీరు చెప్పింది నిజమే, మానవత్వంతో ఆలోచిస్తే ఆ రోగి చనిపోవాలని కోరుకోవడంలో తప్పులేదు, అయితే ఇంతకీ ఆ రోగి చనిపోయాడా!" అన్నాడు గౌతమ్ ఆసక్తిగా.

"నా ట్రీట్‌మెంటుకు పూర్తిగా కోలుకున్నాడు, డిస్చార్జయి ఇంటికి వెళ్ళిన నెల తర్వాత ఆత్మ హత్య చేసుకున్నాడు..." అన్నాడు గాంధీ బాధగా.

"మైగాడ్ చాలా విషాదకరమైన ఘటన..." అన్నాడు గౌతమ్

ఆ గదిలో మళ్ళీ నిశ్శబ్ధం. గాంధీ చెప్పిన సంఘటన వాళ్ళను కదిలించింది. అంతా మౌనంగా ఉండిపోయారు.

గౌతమ్ సూర్యనారాయణ వైపు చూసాడు.

"నాకూ అలాంటి అనుభవమే ఎదురయ్యింది," అంటూ సూర్యనారాయణ చెప్పడం మొదలు పెట్టాడు. "ఒకసారి బాంబు దాడిలో బాగా గాయపడిన ఒక ఫాక్షన్ లీడర్‌కు ఆపరేషన్ చెయ్యాల్సివచ్చింది. థియేటర్‌లో ఆపరేషన్‌కు ఏర్పాట్లు జరిగాయి. నలుగురున్న టీమ్‌లో నేను ఫిజిషియన్‌ను, నా సలహాతో ఆపరేషన్ మొదలయ్యింది. ఆ వ్యక్తి మూలంగా అప్పటికే యాభైకి పైగా వ్యక్తులు చనిపోయారు. వారి కుటుంబాలు వీధిన పడ్డాయి... బతికి బయటకొస్తే ఆయన మూలంగా కొంతమంది ఆడపడుచుల పుస్తెలు తెగిపోతాయి. డాక్టరుగా ఆ ఫాక్షను లీడరు బతకడం కోసం రాత్రంతా నిద్రలేకుండా పని చేసాను. అయితే నాలోని మానవుడు మాత్రం ఆ వ్యక్తి చనిపోతే బాగుండును అనికోరుకున్నాడు ఆ రాత్రి."

సూర్యనారాయణ చెప్పడం ఆపి సిగరెట్ వెలిగించాడు.

"ఇంతకీ ఆయన చనిపోయాడా!" గౌతమ్ సూర్యనారాయణ ముఖంలోకి సూటిగా చూస్తూ అన్నాడు.

"లేదు ఆపరేషన్ విజయవంతం అయింది. పోస్టు ఆపరేటివ్ కేర్‌లో వారంరోజులుంచి పూర్తి ఆరోగ్యవంతుడిగా బయటకు పంపాము, అయితే! "చెప్పడం ఆపి సూర్యనారాయణ అందరివంకా తిరిగాడు. సీసాలోని ద్రవాన్ని గ్లాసులో వంచుకుని తాగి, ఒక్కసారి ఊపిరి పీల్చి వదిలి, "ఆస్పత్రి నించీ ఇంటికి వెళుతున్న అతడిని బాంబులతో చంపేసారు అభ్యర్థులు" - ఆ గదిలో మళ్ళీ మంచుగడ్డకట్టినట్టుగా నిశ్శబ్ధం సూర్యనారాయణ చెప్పిన ముగింపుతో అంతా ఉలిక్కిపడ్డారు.

భగీరథ గబగబా లేచి కిటికీ దగ్గరకెళ్ళాడు. గౌతమ్ అతడినే గమనిస్తున్నాడు.

"డాక్టర్ మీ అనుభవమే మిగిలిపోయింది" అన్నాడు గౌతమ్ భగీరథ కళ్ళల్లోకి చూస్తూ.

"అబ్బే నాకు అలాంటి అనుభవాలు లేవు" అన్నాడు భగీరథ తలొంచుకునే.

"అయితే నా అనుభవం చెపుతాను వినండి "అంటూ భగీరథ వైపే చూసి చెప్పడం ప్రారంభించాడు గౌతమ్.

"సరిగ్గా వారంరోజుల క్రితం. ఇలాంటి రాత్రే. వర్షం, గాలితో తుఫానులాంటి భీభత్సం... హైవే రోడ్డు మీద ఒక స్కూటర్‌లో వెళుతున్న ఒక వ్యక్తిని ఒక టాటాసుమో గుద్దుకుంటూ వెళ్ళిపోయింది. రెప్పపాటులో హైవే మీద రక్తపు మడుగులో ఆ వ్యక్తి... ఆయనను గుద్దిన వాహనం ఆగలేదు." చెప్పడం ఆపి మళ్ళీ భగీరథ కళ్ళల్లోకి చూసాడు గౌతమ్. భగీరథ తలొంచుకున్నాడు. "అలా చావుకు చేరువులో ఉన్న ఆ వ్యక్తిని ఆ హైవే చీకటి రోడ్డు మీద వెళుతున్న ఏ వాహనమూ పట్టించుకోలేదు. ఆఖరికి పోలీస్ పెట్రోలింగ్‌వారు గుర్తించి ఆస్పత్రిలో చేర్చారు." గౌతమ్ క్షణం సేపు చెప్పడం ఆపి భగీరథ కళ్ళల్లోకి చూసి, "ఆస్పత్రిలో ఇంటెన్సివ్ కేర్‌లో ఆపరేషన్ చెయ్యాల్సిన డాక్టరు ఆ సమయానికి అందుబాటులో లేడు, ఒక పిజి విధ్యార్థి ఆ పేషెంటుకు వైద్యం చేసాడు. ఆ ప్రభుత్వాసుపత్రిలో సమయానికి ఇవ్వవలసిన ట్రీట్‌మెంట్ ఆ డాక్టరు ఇస్తే, పేషెంటు బ్రతికే వాడేమో! అయితే!"

"ఇంతకీ రోడ్డుమీద ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చనిపోయిన ఆ వ్యక్తి ఎవరు?" గాంధీ, గౌతమ్ చెపుతున్న మాట్లకు అడ్డొస్తూ అన్నాడు.

"ఆ విషయం తర్వాత చెపుతాను, ముందు నేను చెప్పేది వినండి, ఆ హైవే రోడ్డు మీద ప్రమాదం జరిపిన వ్యక్తి, ఆస్పత్రిలో ప్రమాదబాధితుడికి చికిత్స జరపని వ్యక్తి ఇద్దరూ ఒకరే!"

గౌతమ్ చెప్పిన మాటలకు భగీరథ తలొంచుకున్నాడు. మిగతా ఇద్దరూ మౌనంగా వింటున్నారు. గౌతమ్ మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

"రోడ్డు మీద ప్రమాదం జరిపినపుడు ఆ క్షతగాత్రుడిని ఆస్పత్రికి తీసుకు వెళ్ళడం కనీస ధర్మం. అలాగే డ్యూటీలో ఉండి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి వైద్యం చేయడం వారి వృత్తిధర్మం. ఈ రెండు ధర్మాలను అతిక్రమించడంతోపాటూ ఆ డాక్టరు ఇంకో తప్పు చేసాడు." గౌతమ్ చెప్పడం ఆపి లేచి నుంచున్నాడు. భగీరథ కుర్చీలో కూర్చుని రెండు చేతులతోనూ ముఖం కప్పుకున్నాడు.

గౌతమ్ భగీరథ వంక చూడకుండా "కారుతో ప్రమాదం చేసి తనకు బదులుగా తన కారు డ్రైవర్‌ని రికార్డుల్లోకి ఎక్కించాడు శిక్షపడుతుందని. అయినా నిజం చచ్చిపోదు, అది జీవితాంతం వెంటాడుతుంది, మనం ఇంతవరకూ మెర్సీకిల్లింగ్ గురించి మాట్లాడుకున్నాం, పూర్తి అంగవైకల్యంతో జీవచ్ఛవంలా బతకడం కంటే చావడం మంచిదని ఒక డాక్టరుగారు ఇందాక తన అనుభవంగా చెప్పారు. అయితే నేనూ అదే కోరుకుంటున్నాను. నేను చెప్పిన రెండు తప్పులు చేసిన డాక్టరుకూ అంగవైకల్యం ఉంది అది కనిపించనిది, ఆయనలోని వైకల్యం చావాలని కోరుకుంటున్నాను."

చెప్పడం పూర్తి చేసి గబగబా గౌతమ్ ఆ రూముదాటి బైటకొస్తూ, "ఇంతకూ చనిపోయిన వ్యక్తి ఎవరో తెలుసా! " అన్నాడు ఆ ముగ్గురి వైపు చూస్తూ అందరూ అతడివంక ప్రశ్నార్థకంగా చూసారు.

"రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి ఓడిపోయిన క్షతగాత్రుడిని నేనే! ఔను నేను చనిపోయాను..." అంటూ ఆ వ్యక్తి గట్టిగా నవ్వుతూ అక్కడనుంచే అదృశ్యమయ్యాడు - ఆ సమాధానం ఆ గదిలో బాంబులా పేలింది. చేతుల్లో ఉన్న ఆ ముగ్గురి గ్లాసులు క్రింద పడి భళ్ళున పగిలాయి. జరిగిన సంఘటన కలిగించిన షాక్‌తో ముగ్గురికీ స్పృహ తప్పింది.

✡✡✡

తలుపు మీద టకటకమని చప్పుడు... భగీరథ కళ్ళు తెరవలేక పోతున్నాడు. అతికష్టం మీద తెరిచాడు. చుట్టూ చూసాడు. సూర్యనారాయణ సోఫాలోనూ, గాంధీ పడక కుర్చీలోనూ నిద్రపోతూ కనిపించారు. క్షణ క్రితం ఆ గదిలో గ్లాసులు పగిలిన గుర్తులు

లేవు. తాము రాత్రి తాగిన ఆనవాళ్ళూ కనిపించలేదు. అతడికి ఆశ్చర్యంగా ఉంది. తలుపు మీద దబదబమని చప్పుడు. తలుపు తీసాడు ఎదురుగా డాక్టర్ వెంకట్రావ్. రాత్రంతా తాము ఎదురు చూసిన వ్యక్తి.

"ఏంటీ తెల్లారినా నిద్రపోతూనే ఉన్నారు." అన్నాడు వెంకట్రావ్.

"నిద్రపోవడం కాదు, డాక్టర్ గౌతమ్ అనే ఒక ఎన్నారై డాక్టరు మాకు పార్టీ ఇచ్చాడు..." అన్నాడుభగీరథ మెల్లిగా.

"నీకేమయినా మతిపోయిందా వారం క్రితం ఏక్సిడెంట్ జరిగి మన ఆస్పత్రిలోనే అపస్మారక స్థితిలో చేరాడు..... నిన్న సాయంత్రం చనిపోయాడు. సమయానికి సర్జన్ వైన నువ్వు అందుబాటులో లేవు, చిన్న గొడవ జరిగింది. మేనేజ్ చేసేసాం.... ఈ వ్యవహారం వల్ల లేటయ్యింది, మీకు వాహనం లేదని నేను రావలసివచ్చింది. చనిపోయిన వ్యక్తి వచ్చి మీకు పార్టీ ఇచ్చాడా... జోకులాపు..." అన్నాడు వెంకట్రావ్ సీరియస్‌గా ముఖం పెట్టి.

వెంకట్రావ్ మాటలకు భగీరథ శరీరంలోని రక్తం అంతా తోడేసినట్టయ్యింది. శరీరంలో ఒక గగుర్పాటు కలకు, వాస్తవానికి మధ్య రేకను గుర్తించలేని భ్రమకు లోనయ్యాడు. ఇంకా అనుమానంగానే ఉంది. అప్పటికే నిద్రలేచిన గాంధీ, సూర్యనారాయణ "ఏంటీ హడావుడి!" అన్నారు సంయుక్తంగా "రాత్రి మనకు ఆ ఎన్నారై డాక్టరు పార్టీ ఇచ్చాడుగా, మెర్సీకిల్లింగ్ గురించి మీ అనుభవాలు చెప్పారు కదా" అన్నాడు ఇద్దరివంక చూసి, గాంధీ ఆశ్చర్యంగా భగీరథ వంక చూసి, "కలగన్నావా?... మెర్సీకిల్లింగ్ గురించి మనం నెలరోజుల క్రితం, ఇదే గెస్ట్‌హౌస్‌లో పార్టీ చేసుకున్నపుడు చెప్పుకున్నాం... రాత్రి మాత్రం హాయిగా నిద్రపోయాం." అన్నాడు.

వారి మాటలకు తనలోని అలజడి పైకి కనబడనీయకుండా కుర్చీలో వెనక్కి వాలి కళ్ళుమూసుకున్నాడు భగీరథ "ఇక బయలుదేరదాం!" అనుకుంటూ వెంకట్రావ్, సూర్యనారాయణ, గాంధీలు ఆ గది దాటి బయటికొచ్చారు - దూరంగా ఎక్కడినుంచో ఎవరో పిల్లవాడు ఏడుస్తున్న శబ్దం లీలగా వినిపిస్తోంది. హైవే రోడ్డుమీద తిరుగుతున్న వాహనాల శబ్దం. దానికి శృతిగా టపా టపామని వర్షపు చినుకులు పడుతూ వాహనాల రణగొణధ్వనులకు తాళం వేస్తున్నాయి... పూర్తిగా తెల్లవారింది. బాగా పరుచుకున్న పల్చటి వెలుగు తెరలు. మబ్బుల్లో దాగిన సూర్యుడు మెల్లగా బైటకొస్తున్నాడు. బైటకొచ్చిన ఆ ముగ్గురూ కారెక్కి భగీరథ కోసం ఎదురు చూస్తున్నారు.

ఐదు నిమిషాల తర్వాత వచ్చిన భగీరథ వారితో మాట్లాడకుండా కారెక్కి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు - కారెక్కుతూ ముందు చక్రంపైన ఎర్రగా గడ్డకట్టినట్టున్న రక్తపు మరకను చూసి ఉలిక్కిపడ్డాడు భగీరథ. దాన్ని వారం రోజులుగా చూస్తూ ఉన్నా, ఈసారి చూసినపుడు మాత్రం ఒంట్లోని నరాలన్నీ జివ్వుమని లాగినట్లనిపించింది అతడికి.

వణుకుతున్న చేతుల్తోనే కారుస్టార్ట్ చేసాడు భగీరథ.

హైవేరోడ్డు మీద కారు మెల్లగా వెళుతోంది. రోడ్డుకు ఆనుకునే ఉన్న చెట్లు వర్షానికి తడిసి ఆప్రాంతమంతా ఏదో తెలియని పరిమళంలో గుభాళిస్తోంది. వాతావరణం చల్లగా ఉంది. గాలివానకు చెదిరి పోయిన పక్షులన్నీ మెలమెల్లగా చేరుకుంటూ కిచకిచ శబ్దాలతో సూర్యోదయాన్ని స్వాగతిస్తున్నాయి. కారు స్టీరియోలోంచీ మంద్రస్థాయిలో వస్తున్న సంగీతం, ఆ వాతావరణంలో మరింత ఆహ్లాదం కలిగిస్తోంది - ఇవేమీ భగీరథలోని అలజడిని తగ్గించలేకపోతున్నాయి.

- కారు ముందుకు వెళుతోంది. గెస్ట్‌హౌసులో రాత్రి కలలో కనిపించిన నీడ, అది వినిపించిన ఆ భయంకరమైన నిజం మాత్రం భగీరథ వెన్నంటే వస్తోంది.

✡✡✡

# చెత్తకథ

- పొత్తూరి విజయలక్ష్మి

బండాడియా దేశం చాలా సస్యశ్యామలమైనదట.

అదేమిటీ? అటువంటి దేశం ఒకటి ఉందా? మాకు తెలియదే అని ఆశ్చర్యపోతారందరూ. మనకు తెలియని దేశాలు బోలెడన్ని ఉన్నాయి, ప్రపంచ పఠంలో. ఒలింపిక్స్ ప్రత్యక్షప్రసారం చూస్తూ మనం ఏనాడూ పేరుకూడా వినని దేశాలెన్నో పతకాలు గెల్చుకుని కేరింతలు కొడుతూ ఉంటే చూసి ఆశ్చర్యపోవడం లేదూ! ఇదీ అంతే.

బండాడియా దేశం ప్రపంచపటంలో ఓ మూల చిన్న చుక్కంత ఉంది కానీ ఉంది. ఈ మధ్యన అదేదో దేశంలో పర్యావరణ మహాసభలు జరిగాయట. ఆ సభలకి మనం వెళ్ళాంట. వాళ్ళూ వచ్చారంట.

పచ్చదనానికి పరిశుభ్రతకీ ఆ బండాడియా దేశం అగ్రస్థానంలో నిలిచిందట. ఆ దేశప్రతినిధులు సభ చివరోజున కృతజ్ఞతలు తెలియజేసుకుని అక్కడికొచ్చిన వారినందరినీ తమ దేశానికి ఆహ్వానించారట.

మనని పిలవని వాళ్ళే పాపకర్ములు. వెంటనే బయలుదేరి బండాడియా వెళ్ళారుట మన మంత్రిగారు. విమానం దిగ్గానే మొహం తిరిగి పడిపోయారుట.

ఇంద్రలోకంలా ఉందట బండాడియా. నడిరోడ్డుమీద కూడా పాలుపోసి ఎత్తుకోవచ్చుట. కనుచూపుమేరా పళ్ళతోటలా పూలతోటలూనట. మిగిలిన నేలంతా పచ్చిక బయళ్ళుట. అద్దంలా ఉందట ఆ దేశం.

వాళ్ళు వ్యర్థ పదార్థలను ఎరువుగ మార్చి చెట్లకు వేస్తారట. చెత్తను రీ సైకిల్ చేసి వాడుకుంటారట. అందుకని అక్కడ దుర్భిణీ వేసి వెతికినా చెత్త చెత్త కనిపించదట.

తిరిగొచ్చి ఆ విషయం చెప్పగానే వాళ్ళ సహకారంతో మనమూ మన దేశాన్ని అద్దంలా చేద్దాం. ముందుగా మన రాష్ట్రంతోనే ఆరంభిద్దాం. అనుకున్నారట మనవాళ్ళు.

అవునలాగే చేద్దాం. ముందోసారి చూసొస్తే బావుంటుంది అనుకున్నారు. ఫ్రీగా విదేశీయానం కాబట్టి అయినవారూ, వాళ్ళకు అయినవారూ గుంపులు గుంపులుగా ప్రభుత్వం ఖర్చుతో బండాడియా వెళ్ళి విహరించి వచ్చారట.

అటేడుతరాలూ ఇటేడు తరాలూ అయిపోయారు. ఇంకెవ్వరూ లేరు అనుకున్నాక అప్పుడు ఓ నలుగురు నిపుణులని పంపించారుట.

వాళ్ళు వెళ్ళి అక్కడంతా చూసి సర్వే చేశారుట. వాళ్ళకు చెత్తని రీసైకిల్ చెయ్యడానికి కర్మాగారాలున్నాయుట. దాన్లో రీసైకిల్ చేస్తారుట.

'మీరు మా దేశం వచ్చి మాకు చెత్త కర్మాగారం కట్టించి పెట్టండి' అన్నారట మనవాళ్ళు.

'అలాగే దానికేం భాగ్యం' అన్నారట బండాడియా వాళ్ళు.

వాళ్ళుత్త పిచ్చిసన్నాసులు కాబట్టి రావడమే నలుగురు నిపుణులు వచ్చారట. వాళ్ళకి మనవాళ్ళు రాచమర్యాదలు చేశారట.

కృతజ్ఞతగా వాళ్ళు పాపం చిత్తశుద్ధితో పనిచేశారుట.

'అవడానికి మాదీ దేశమే అయినా మీ రాష్ట్రంలో అయిదోవంతు ఉంది. కాబట్టి మీ రాష్ట్రానికి కనీసం అయిదు చెత్తకర్మాగారాలు కావాలి' అని అంచనా వేశారట.

అయిదు కర్మాగారాలు ఒక్కసారే అంటే మాకు తలకు మించిన భారం అవుతుంది. కాబట్టి ముందుగా మీరొకటి కట్టించి పెట్టండి. మా వెసులుబాటు చూసుకుని మిగిలిన నాలుగూ కట్టించుకుంటాం' అన్నారట మనవాళ్ళు.

'సరే అయితే' అని మళ్ళీ ప్లానువేశారట వాళ్ళు. 'ఎనభై కోట్లు ఖర్చవుతుంది.. కొసరు మరో రెండుకోట్లు అనుకున్నా ఎనభై రెండు కోట్లు శాంక్షన్ చేయించుకోండి.' అన్నారట వాళ్ళు.

రుసరుసలాడారట వీళ్ళు. 'ఎంత ఖర్చవుతుందో చెప్పండి చాలు. ఎంత శాంక్షన్ చేయించుకోవాలో మేము చూసుకుంటాం.' అన్నారట మనవాళ్ళు.

'సరే అయితే స్థలం డబ్బూ సిద్ధం చేసుకుని మమ్మల్ని పిలవండి. వచ్చి పనిమొదలు పెడదాం!' అన్నారట వాళ్ళు.

మరో సమస్య వచ్చింది. భాష.! వాళ్ళేదో వచ్చీరాని ఇంగ్లీష్ మాట్లాడ్డం తప్పించి మనకు పొట్ట పొడిచినా బండాడియా భాషరాదు. కాబట్టి వెంటనే ఓ నలుగురిని పంపిస్తే భాష నేర్చుకుంటారు. అప్పుడు అవగాహన బావుంటుందని అనుకున్నారట అందరూ.

వెంటనే నలుగురు పెద్దమనుషులు బండాడియా వెళ్ళారు, భాష నేర్చుకోడానికి. మనకున్న సమస్యలన్నీ చెత్తకే.. అందులోనూ చెత్త సమస్య మరీ చెత్తది. రోజురోజుకూ పాపంలా పెరిగిపోతుంది చెత్త. ఇంకొన్నాళ్ళు ఆగితే చెత్తకే తప్ప మనుషులకి చాటుండదు. కాబట్టి చెత్త సమస్య నివారణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిధులు మంజూరు చేయించుకున్నారట.

రెండొందల ఎనభై అయిదు కోట్లు.

నగరానికి అంతదూరాన స్థలం ఏర్పాటు చేసుకున్నారు.

ఎనభై అయిదుకోట్లు పక్కన పెట్టి మిగిలిన రెండొందల కోట్లు తలాకాస్తా పంచుకున్నారు పేరుకి రెండొందల కోట్లేగానీ ఇంత మంది మీద ఏమూలకి? మరి పదవి కోసం ఖర్చు పెట్టరా? ఎన్నికలప్పుడు పంచడం! పదవిలోకి వచ్చాక పంచుకోవడం! అంతా తలాకాస్తా పంచామృతాలు పంచుకున్నట్లు పంచుకున్నారు అసంతృప్తిగానే.

మిగిలిన ఎనభై అయిదుకోట్లు అధికార్లకు అప్పగించారు.

ఇక వాళ్ళ ప్రహసనం మొదలైంది. ఓ ముప్పై కోట్లు వాళ్ళు పంచుకుని యాభై కోట్లు చెత్త ఫ్యాక్టరీకి వదిలేశారు.

ఏమాటకామాటే చెప్పుకోవాలి పంచుకున్నా చిత్తశుద్ధితోనే వ్యవహరించారు. బండాడియా వాళ్ళ ప్లానుకి అనవసరం అనుకున్న వాటాని పక్కన పెట్టారు.

వాళ్ళు చెప్పిన ప్రకారం చెత్త ఇరవై నాలుగ్గంటలూ తయారవుతూనే ఉంటుంది. కాబట్టి ప్లాంటు కూడా ఇరవైనాలుగ్గంటలూ పనిచెయ్యాలి. కాబట్టి అందులో పనిచేసే ఉద్యోగులు అందుబాటులో ఉండాలి. కాబట్టి వారికి ఫ్యాక్టరీ దగ్గరే నివాసాలు ఏర్పాటు చెయ్యమన్నారు.

'ఆ! సింగినాదం జీలకర్ర. అరవైకిలో మీటర్లైనా అవలీలగా ప్రయాణించి వర్క్‌ప్లేస్‌కి వెళ్ళడం మన వాళ్ళకి వెన్నతో పెట్టిన విద్య. అంతగా అయితే మూడు షిఫ్టులు ఏర్పాటు చేద్దాం' అనుకున్నారు.

'చెత్త కర్మాగారం కాబట్టి చుట్టుపక్కల చాలా ఖాళీస్థలం వదిలేసి చెట్లు పెంచాలి' అని సూచించారు బండాడియా వాళ్ళు.

'ఫర్వాలేదు గోడప్రక్కనే చెత్తకుండీతో బ్రతకడం మాకలవాటే. ' అంటూ స్థలానికి అంటకత్తెరలు వేసేశారు. ప్లాంటు మాత్రం యధాతథంగా ఉంచారు.

మంచి రోజు చూసి శంఖుస్థాపన జరిపారు. బండాడియావాళ్ళు, అనువాదకులు వచ్చేశారు.

ఎక్కువ ఆర్భాటం లేకుండా ఆ కార్యక్రమం జరిగింది.

అదుగో ఇప్పుడు ఖాళీగా ఉన్న స్థలంలో మరికొద్ది రోజుల్లో వెలుస్తుంది చెత్త కర్మాగారం.

పరిశుభ్రమైన నగరానికి ఇదవుతుంది శ్రీకారం.

కావాలి అందరి సహకారం.

అంటూ ప్రసారం చేశారు టీ.వీఛానెల్స్‌వాళ్ళు.

మొదలైనపని ఎక్కడా ఆగనివ్వకుండా యుద్ధప్రాతిపదిక మీద పూర్తిచేశారు అనూహ్యంగా అనుకున్న సమయానికి రెండునెలలు ముందుగానే చెత్త కర్మాగారం పూర్తయింది

ఆర్భాటంగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు.

ఆ చెత్తకర్మాగారం గంటకు ఇరవై లారీల చెత్తని ఎరువుగా మారుస్తుంది.

ప్రారంభోత్సవం నాడు ఓ గంట ప్లాంట్ నడిస్తే ఫోటోలూ అన్నీ అయ్యేదాకా సరిపోతుంది. మర్నాటినుంచీ మామూలుగా వేళలూ అవీ అమలు పరచవచ్చు. అనుకున్నారు.

పాతిక పాత చెత్త లారీలకు రంగులు వేసి సిద్దం చేశారు. అనుకున్న శుభదినం రానేవచ్చింది. బడాడియా దేశం నుండీ పదిమంది పెద్దవాళ్ళు వచ్చారు.

పేపర్లనిండా పేజీల నిండుగా ప్రకటనలు ఇచ్చారు.

ముహూర్తం పొద్దున తొమ్మిదిన్నరకి, అంతా సందడిగా ఉంది.

'చూస్తున్నారుగా ఇక్కడంతా పెళ్ళిసందడి. లారీలు చూడండి. కళ్యాణ మండపం మీదకి నడిచివెళ్ళే పెళ్ళికూతుళ్ళలాగా కళకళలాడిపోతున్నాయి. మరికొద్దిసేపట్లోనే ముఖ్య అతిధిగారు వేంచేస్తారు. ' అంటూ టీ.వీ.ఛానెల్స్ ప్రత్యక్షప్రసారం చేస్తున్నాయి.

పోలీసులు, ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులు. అటూ ఇటూ హడావిడిగా తిరుగుతున్నారు.

బండాడియా బృందం కారుల్లోంచి దిగి వేదిక వద్దకు వచ్చారు. వారికి మంగళ వాయిద్యాలతో స్వాగతం చెప్పారు. సాంప్రదాయ దుస్తులు ధరించిన అమ్మాయిలు వాళ్ళకి బొట్లు పెట్టి పూలదండలు వేశారు. వాళ్ళని వేదిక మీద కుర్చోబెట్టారు.

మరి కాసేపటికి ముఖ్య అతిధిగారు వేంచేశారు. ఆయనకి కొంతమంది పాదాభివందనాలు చేశారు. కండువాలు మెళ్ళో వేశారు. సభ ప్రారంభమయింది. అందరూ ముఖ్య అతిధిగారిని పొగిడారు.

ముఖ్య అతిధిగారు మైకు ముందుకి వచ్చారు. గతంలో ఉన్న ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల నగరం చెత్తగా తయారైందన్నారు. తమ ప్రభుత్వం నడుం కట్టుకుని ప్రక్షాళనకు పూనుకుందన్నారు. ఇది అంతంకాదు ఆరంభం అన్నారు. వాళ్ళు చేసిన తప్పులన్నీ సరిదిద్దుతాం అన్నారు. ఇంకా చాలా చాలా అన్నారు.

శుభముహూర్తం ఆసన్నం అయింది. వేదపండితులు మంత్రోచ్చారణ చేస్తూ ఉండగా ఒక చెత్తలారీ వచ్చి చెత్తను ఒక కంటెయినర్లో దిమ్మరించింది.

ముఖ్య అతిధిగారు తను చేత్తో ఒక స్విచ్ నొక్కారు.

చిన్నగా శబ్దం చేస్తూ ప్లాంట్ ప్రారంభం అయింది. లారీ గుమ్మరించిన చెత్త ఉన్న కంటెయినర్ పైకి లేచి మరో కంటెయినర్లోకి చెత్తను దిమ్మరించింది.

కరతాళధ్వనులు మారుమోగాయి. మిషన్లు పనిప్రారంభించాయి.

హఠాత్తుగా ఎర్రలైటు వెలిగింది. బండాడియా ఇంజినీర్లు మన ఇంజినీర్లు ఉలిక్కిపడ్డారు. ఏదో పొరపాటు జరిగిందననికి గుర్తుగా అలారం మోగింది.

మెల్లిగా మిషన్లు ఆగిపోయాయి. అంతటా కంగారు ఆదుర్దా.

అందర్నీ తప్పించుకుని నిచ్చెన మీదుగా పైకి ఎక్కారు ఇరువైపుల ఇంజినీర్లు - వారి వెంట పరిగెట్టారు అనువాదకులు.

కంటెయినర్లో ఉన్న చెత్తను చూసి నోరావలించారు బండాడియా ఇంజినీర్లు.

'ఇదేమిటి?' అన్నారు ఆశ్చర్యంగా దుబాసీలు పని మొదలుపెట్టారు.

'చెత్త!' చెప్పారు మనవాళ్ళు

'చెత్తా???? ఇంత చెత్తగా ఉందేం?'

'చెత్త చెత్తగా ఉండక ఇంకెలా ఉంటుంది?'

'చెత్తకి మాత్రం ఓ పద్దతీ పాడూ ఉండద్దూ?' వాళ్ళ సందేహం.

వీళ్ళిలా మాట్లాడుడుకుంటూ ఉండగానే ఏదో పొరపాటు జరిగింది. అర్జెంటుగా మీటింగు ఏర్పాటు చేసి హడావిడిగా కారెక్కారు.

ఈగల్లా ముసురుతున్న మీడియా వాళ్ళను తప్పించుకుంటూ వాళ్ళ మొహాల మీద తలుపులు వేసుకుంటూ అందరూ కార్లెక్కి వెళ్ళిపోయారు. కాసేపట్లో అక్కడంతా ఖాళీ.

ఏం జరిగిందో అర్థంకావడం లేదు. ముందు ఏం జరుగుతుందో అసలే అంతుపట్టటం లేదు. అడిగినా చెప్పే నాథుడు లేడు. అధికార పక్షం వారంతా మొహం చాటేస్తున్నారు. అంతా అయోమయంగా ఉంది.

'అదుగో అటుచూడండి అభం శుభం తెలియని ఆ చెత్తలారీలు, సౌభాగ్యం కోల్పోయిన స్త్రీలవలే ఎంత దీనంగా నిలబడిఉన్నాయో!

కోట్లాది ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఈ చెత్తకర్మాగారానికి ఈ విధంగా పురి ట్లోనే ఎందుకు సంధికొట్టిందో చెప్పవలసిన బాధ్యత ప్రభుత్వానిదే చెత్తకర్మాగారం ప్రారంభోత్సవ స్థలం నుండి కెమేరామేన్ వరప్రసాదురావుతో వసంతలక్ష్మి.' అంటూ ప్రసారం చేస్తున్నాయి టీ.వీ ఛానెల్స్

అక్కడ మీటింగ్ హాలు దద్దరిల్లిపోతుంది.

సంబంధిత అధికారులు అందర్నీ వరసనే పిలిచి మొహం వాచేలా చివాట్లు పెడుతున్నారు శ్రీవారు.

మరోప్రక్క ఆ దేశం ఇంజినీర్లు ఈ దేశం ఇంజినీర్లు వాదించుకుంటున్నారు. అందరినీ నిలదీశారు శ్రీవారు.

'మేము బానే చేశాం అయినా ప్లాంట్‌కి ఏదోషం లేదు. తిరకాసు అంతా చెత్తలోనే ఉంది. మా దేశంలో ఇలా ఉండదు చెత్త. డీకంపోజ్ అయే చెత్తని రీసైకిల్ చేసి ఎరువుగా మారుస్తాం. ప్లాస్టిక్ వగైరాలని కరిగించి రిపేర్లకు వాడతాం.

మరి ఇక్కడ అరిటి తొక్కలు మొదలుకుని గాజుపెంకుల వరకూ, ప్లాస్టిక్ కవర్లు మొదలుకుని విరగ్గొట్టిన కట్టడం అవశేషాల వరకూ అంతా ఒక్కటిగానే ఉంది.' అన్నారు బండాడియా వాళ్ళు.

'మరా ముక్క ముందే ఎందుకు చెప్పలేదు మాతో?' అన్నారు మనవాళ్ళు.

'మీరు మాకు ఏం చెప్పారు. అప్పుడే చెత్త చూపిస్తే మా వల్లకాదని ముందే చెప్పేవాళ్ళం' అన్నారు వాళ్ళు

'ఏం చెయ్యాలి? కింకర్తవ్యం?' అందరూ బుర్రలు పట్టుకున్నారు.

'పోనీ ఓ పని చేస్తే.. చెత్తని విడివిడిగా వెయ్యాలి లేకపోతే పోలీసులకి పట్టిస్తాం అని ప్రజలని బెదిరిస్తే ఎలా ఉంటుంది?' ఒకావిడకి ఆలోచన వచ్చింది.

'ఏం లాభం లేదు. అలా చేస్తే పోలీసులు బాగుపడతారు తప్పించి సమస్య సమస్యగానే ఉంటుంది.' నీళ్ళు కార్చేశాడు ఒకాయన.

'నాకు మంచి ఆలోచన వచ్చింది. చెత్తంతా ఏరించి ఎరువుకి పనికొచ్చేవన్నీ ప్లాంటుకి వేయించి పనికిరానివాటిని మళ్ళీ చెత్తలో పడేస్తే సమస్య పరిష్కారం అవుతుందేమో.' అన్నాడో మేధావి. 'ఏడిసినట్లుంది. చెత్త యధాతథంగా పారబోయడానికి చోటు చాలక ఛస్తుంటే చెత్తని ఏరించాలంటే ఎంత స్థలం కావాలి? స్థలం మాట అటుంచి ఎంతమంది మనుషులు కావాలి? బాలకార్మికులు పనికిరారు!

పెద్దవాళ్ళని పెట్టుకుంటే యూనియన్లంటారు ఉద్యోగాలివ్వమంటారు. ఇళ్ళ పట్టాలు కావాలంటారు. ఇదంతా అదనపు తలనొప్పి. ' అన్నాడు మరో మేధావి.

అంతా తలలు పట్టుకుని కూర్చున్నారు.

అంతలో ఫోను మోగింది. అధిష్టానం నుండీ ఫోను శ్రీవారికి. 'ఏమిటయ్యా ఈ చెత్త గొడవ. మీ అపొజిషన్ వాళ్ళు ఫోన్ చేసి గొడవచేస్తున్నారు. అయినా చేతగాని పనులెందుకు చేస్తారండీ? నోరు మూసుకుని కూర్చుంటే భేషుగ్గా ఉంటుంది కదా!

ఇప్పుడీ సమస్యని ఎలా పరిష్కరిస్తారో నాకు గంటలో చెప్పండి.' అని మందలించారు.

శ్రీవారు కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యారు. అందరూ తలలు పట్టుకుని కూర్చున్నారు.

బండాడియా వాళ్ళకి జాలేసింది. పక్కకెళ్ళి బండాడియా భాషలో మాట్లాడుకున్నారు. బండాడియాకి ఫోన్ చేసి మాట్లాడారు. మన వాళ్ళ దగ్గరకి వచ్చారు.

'చూడండి జరిగినదానిలో మా పొరపాటు ఏమీ లేకపోయినా మాకూ బాధగానే ఉంది. చాలా దేశాల్లో మేము వెళ్ళి చెత్తకర్మాగారాలు కట్టించాం. ఇక్కడ ఇలా జరగలేదు. మేం ఒక ఉపాయం ఆలోచించాం.

ఈ కర్మాగారానికి మీ చెత్త పనికిరాదు. కట్టిన ఫేక్టరీని కదిలించలేం కాబట్టి మా దేశంలోని చెత్తని మీరు దిగుమతి చేసుకోండి. రవాణా ఖర్చులు మీవే. తయారైన ఎరువు చెరిసగం పంచుకుందాం. మీకు మా ఆలోచన నచ్చితే మాకు తెలియజేస్తే ఆ విధంగా ఒప్పందం కుదుర్చుకుందాం.' అని చెప్పి వాళ్ళ దేశానికి వెళ్ళిపోయారు.

మర్నాటికి భగ్గుమంది ఈ వ్యవహారం. అపోజిషన్ వాళ్ళు దుమ్మెత్తిపోస్తూ తూర్పార పడుతున్నారు. అధిష్టానం వారు మొట్టికాయలు వేస్తున్నారు.

మళ్ళీ అత్యవసర సమాచారం ఏర్పాటు అయింది.

పోనీ ఆ బండాడియా వాళ్ళు సూచించిన మార్గం అనుసరిద్దామా అని చర్చించుకున్నారు.

బండాడియా దేశానికి వెళ్ళాలంటే విమానం లోనే ఇరవైగంటల ప్రయాణం దూరాభారం.

వాయుమార్గాన చెత్తని తీసుకురావడం చాలా ఖర్చుతో కూడుకున్న పని కాబట్టి సముద్రమార్గాన ఓడల్లో చెత్త తెచ్చుకోవాలి. మన నగరానికి సముద్రానికి చాలా దూరం ఉంది. అతిదగ్గరలో ఉన్న పోర్ట్ దాకా ఓడల్లో తెచ్చి అక్కడినుంచీ లారీల్లో మన ప్లాంటుకి తెచ్చుకుని రీ సైకిల్ చేసుకోవాలి.

వచ్చిన ఎరువులో సగం వాళ్ళకి పంపించాలి. ఆ పంపించడానికి కూడా లారీలు ఓడలు కావాలి.

ఖర్చు అవుతుంది కానీ అంత ఖర్చు పెట్టి కట్టించిన చెత్త కర్మాగారం పనికి రాకుండా పాడుపెట్టారనే అపకీర్తి తప్పుతుంది.

ఈ ప్లాను మీద చర్చలు జరపడానికి ముగ్గురు సభ్యులున్న ఒక బృందాన్ని బండాడియా పంపించాలని నిర్ణయించి సభ ముగించారు.



# ఒరు తలై రాగం

ఆర్. శర్మ. దంతుర్తి




**ఎప్పటిలాగానే ఆ రోజు కంప్యూటర్ లాబ్‌లో** కూర్చుని రికార్డులు దిద్దుతూ ఒక్కొక్క టీమ్‌నీ పిలిచి వాళ్ళు చేసే ప్రాక్టికల్ గురించి అడుగుతున్నాడు ప్రొఫెసర్ రాయుడు. ఉన్న ఎనిమిది టీముల్లో అయిదు టీములయ్యేసరికి రాయుడికి విసుగొచ్చింది. ఎంత చెప్పినా ఈ స్టూడెంట్స్ ఇంతే. అయ్యా, అమ్మా, అర్థమాటిక్ అంతా ఎక్యూములేటర్లోనే తప్ప ఇతర రిజిస్టర్లలో కుదరదనీ చెప్పాడా తాను. ఈ మైక్రోప్రోసెసర్లు ఎంత ఈజీ అర్థం చేసుకోవడం.. కానీ ఈ స్టూడెంట్స్‌కి ఎంత చెప్పినా తలకెక్కినట్టులేదు. ఇలా విసుక్కుంటూ ఆరో టీమ్‌ని పిలిచాడు రాయుడు. అన్యమనస్కంగా ఏవో ప్రశ్నలు వేస్తూ యధాలాపంగా 'రెండు నంబర్లు ఏడ్ చెయ్యాలంటే ఏ రిజిష్టర్‌లో కుదురుతుందీ' అనడిగాడు.

సైలెన్స్..

"బి రిజిస్టర్‌లో కుదురుతుందా?"

"నో"

"హెచ్ రిజిష్టరులో కుదురుతుందా?"

"నో"

"నో అనడమేనా లేకపోతే ఏమైనా ఆన్సర్ చెప్పగలరా?"

సైలెన్స్..

ఒక్కసారిగా మొహం కందగడ్డలాగయ్యి అరవడానికన్నట్లు కోపంగా నోరు విప్పబోయేసరికి పక్కనుంచీ ఇలా వినిపించిందో కోకిల కంఠం - "ఎక్యూములేటర్లో?" కొంచెం ప్రశ్నార్థకం జోడించి, సరైన ఆన్సరు రావడంతో ఒక్కసారి చల్లబడి, "కరెక్ట్, కానీ మీకు ఆన్సర్ తెలుసా ఉత్తినే గెస్ చేసారా?" అన్నాడు రాయుడ్ ఆన్సర్ చేసినమ్మాయికేసి తిరుగుతూ.

కిసుక్కుమన్న నవ్వు తరంగాలుగా వ్యాపించి మొదట టీములో అందరూ నవ్వితే, తర్వాత మొత్తం లాబ్ అంతా నవ్వడం మొదలుపెట్టారు. అప్పుడు చూసాడు రాయుడు ఆ సమాధానం కరెక్ట్‌గా చెప్పినమ్మాయికేసి. నోటికి కొంగు అడ్డం పెట్టుకుని రాయుడుకేసి చూసి నవ్వుతోంది. ఆ చూట్టంలో ఆవిడ కళ్ళు జిగేల్‌మని రాయుడ్ని కట్టి పడేసాయి. రాయుడు సడన్‌గా సర్దుకుని మొహంలోకి నవ్వు తెచ్చుకుంటూ తరువాత టీంని పిలిచాడు. కాలేజీ క్లోజ్ చేసాక, రూముకొచ్చాడన్నమాటే గానీ, ఆ కళ్ళు రాయుడిని వదల్లేదు. చెంపకు చారెడేసి కళ్ళున్న ఈ అమ్మాయినెప్పుడూ అంతకు ముందు చూసినట్లు లేదే క్లాసులో... అనుకున్నాడు రాయుడు.

అప్పటినుంచే ఈ అమ్మాయిని స్పెషల్‌గా చూట్టం మొదలుపెట్టేడు... రోజూ క్లాసుకొస్తోందా, చెప్పే నోట్స్‌రాసుకుంటుందా అనే వన్నీ కీన్‌గా అబ్జర్వ్‌చేస్తూ. ఉత్తరోత్తరా ఈ భాగోతంలో రాయుడికి కొన్ని విషయాలు తెలిసాయి. అటెండెన్సు తీసుకుంటున్నప్పుడూ, పేపర్లు దిద్దుతున్నప్పుడూ తనకి తెలియకుండా రాయుడే సంపాదించాడు ఈ విశేషాలన్నీ. పేరు జ్యోత్స్న జోషి, క్లాసుకి రావడానికీ, నోట్స్ రాసుకోవడానికి చాలా శ్రద్ధ చూపిస్తుంది. ఏవరేజ్ స్టూడెంటే కానీ చాలా సిన్సియర్ అమ్మాయి. థర్డ్ ఇయర్ కనుక ఓ ఇరవై ఏళ్ళుంటాయేమో. అందరి మరాఠీవాళ్ళ లాగానే మొహం మీద బొట్టు మాత్రం తప్పకుండా పెట్టుకుంటుంది. కానీ రాయుడికన్నిపించేవి ఆ రెండు కళ్ళు. చాలా స్వచ్ఛంగా తన మనస్సు కళ్ళలో ప్రతిబింబిస్తున్నట్లు ఉండే ఆ కళ్ళని చూడ్డానికి మొదట రాయుడు

భయపడేవాడు. జోత్స్న చాలా రిజర్వ్‌డ్ పర్సనాలిటి. తానేదైనా అడిగితే, ఆవిడ నోరు విప్పేలోపల ఒక మహా యుగం గడిచిపోతుందనేది రాయుడి నమ్మకం. ఎప్పుడూ జ్యోత్స్నని ఒంటరిగా చూడలేదు రాయుడు. పక్కనొక కల్పనో, ఒక మాధవో ఉండి తీరాల్సిందే బొంబాయిలాంటి మహానగరంలో కూడా ఇలాంటి ఛాదస్తులున్నారన్నమాట అనుకునేవాడు రాయుడు.

ఓసారి ఆఫీస్‌లో కూర్చుని క్లాసుకి ప్రిపేర్ అవుతున్నాడు తాను. అప్పుడు గుమ్మం దగ్గర అలికిడైతే తలతిప్పి చూసాడు రాయుడు. "సార్, పేపర్లు దిద్దేశారాండీ? నాకెన్ని మార్కులొచ్చాయ్?" అనడుగుతోంది మాధవి.

ఎప్పటిలాగానే వెనక షాడో లాగా జ్యోత్స్న. జ్యోత్స్న నోరు విప్పుతుందేమో అని రాయుడు ఎంతగానో అనుకున్నాడు "లేదండి, ఇంకా అన్నీ పూర్తిగా దిద్దలేదు, దిద్దాక చెపుతాను కదా" అన్నాడు రాయుడు. ఆ వారంలో ఖాళీచూసుకుని మళ్ళీ పేపర్లు దిద్దడం మొదలు పెట్టాడు. ఓ పది పేపర్లు దిద్దాడో లేదో పెన్నులో ఎర్ర రంగు రీఫిల్ అయిపోయింది. ఉసూరుమంటూ ఇంకో ఫ్లోర్‌లో ఉన్న రిజిస్ట్రార్ ఆఫీసుకెళ్ళి రీఫిల్ తెచ్చుకోవడానికి మెట్లు ఎక్కుతూంటే, మళ్ళీ ఈ జంట కనిపించింది. మాధవితో అన్నాడు రాయుడు. "మీకు పద్దెనిమిది వచ్చాయండి ఇరవై అయిదుకి." రీఫిల్ తీసుకుని వచ్చేస్తుంటే, నడక వేగం తగ్గించి చెవులు రిక్కించాడు - జ్యోత్స్న తన మార్కులు అడుగుతుందేమోనని కానీ ఆవిడ నోరు విప్పితేనా!

****************

ఆ ఏడు వేసవి సెలవలకి రాయుడు సొంత ఊరు అమలాపురం వెళ్ళాడు. రాజమండ్రిలో దిగి బస్సెక్కి వెళితే మధ్యాహ్నం రెండు దాటిపోయింది. ఓ వారం రెస్ట్ తీసుకున్నాక వచ్చే సెమిస్టర్‌లో చెప్పబోయే కోర్స్ పుస్తకాలు తీసి నోట్స్ రాసుకోవడం మొదలు పెట్టాడు రాయుడు. ఎంత ట్రై చేసినా రాయుడికి మాత్రం జ్యోత్స్న గురించి ఆలోచనలు వదల్లేదు. ప్రేమో, దోమో తెలియదు గానీ, ఈ మెంటల్ టార్చర్ తర్వాత ఒక్కటి మాత్రం క్లియర్‌గా అర్థం అయ్యింది రాయుడికి - జ్యోత్స్న అంటే తనకి తెలియకుండా ఒకరకమైన ఇష్టం మొదలైయ్యింది. ఓ వారం పోయాక అక్క వచ్చింది, పిల్లల్తో, కాకినాడ నుంచీ తనని చూడ్డానికి. మాటల్లో ఎవరో 'జ్యోత్స్న' అన్నారు, ఏదో పుస్తకం చదువుతూ. ఒక్కసారి సంభ్రమంగా చుట్టూ చూసాడు రాయుడు. "ఏంరోయ్! అలా చూస్తున్నావ్" అనడిగింది అక్క. "అబ్బే, జ్యోత్స్న అని వింటేనూ, దానర్థం ఏమిటా అని ఆలోచిస్తున్నా" అన్నాడు రాయుడు తొట్రుపడుతూ. "జ్యోత్స్న అంటే వెన్నెల.."చెప్పింది అక్క. దాంతో రాయుడి మనస్సులో ఇంకో సమ్మెట దెబ్బ పడింది. ఆ కళ్ళూ, ఆ పేరూ, ఆ పేరుకున్న అర్థం, అన్నీ సరిపోయేలా ఎలాగ కుదిరాయి ఈ అమ్మాయికి?

రోజులు, వారాలు గడిపేసి సెలవలయ్యాక మళ్ళీ బొంబాయి బయలుదేరాడు రాయుడు. ట్రైన్ ఎక్కినప్పటినుంచీ దిగేదాకా ఒకటే ఆలోచన రాయుడికి - ఎప్పుడు జ్యోత్స్నని చూస్తానా అనే. రూమ్‌కి వచ్చాక స్నానం అదీ కానిచ్చి కాలేజీకి బయలు దేరాడు రాయుడు. ఎంత మంది కాంపస్‌లో ఉన్నా రాయుడి కళ్ళు జ్యోత్స్ననే వెతుకుతున్నాయి. రిజిస్ట్రార్ ఆఫీస్‌లో కెళ్ళి తనకొచ్చిన ఉత్తరాలు కలెక్ట్ చేసుకుని లాబ్‌లోకి వెళ్ళగానే అవి ఓపెన్ చేసి చదవటం మొదలు పెట్టాడు. మీ పేపర్ బెంగుళూర్ కాన్ఫరెన్స్‌కి ఏక్సప్ట్ చేసాము కానీ దారి ఖర్చులు మీరే పెట్టుకోవాలి... ఇలా సుత్తి ఉత్తరాల్లోంచీ ఆఖరి ఉత్తరం తీసేసరికి "హల్లో, ఎప్పుడొచ్చారు ఊర్నుంచి?" అని వినిపించింది పక్కనుంచీ, తలతిప్పి చూసేసరికి నవ్వుతూ కనిపించిందో ఫైనల్ ఇయర్ అమ్మాయి అనామిక. చాలా ఆశ్చర్యంగా, ఆమె వెనకనే నిల్చునుంది జ్యోత్స్నకూడా. "ఆ, ఈ ... ఈరోజు ఉదయమే దిగాను. రేపటిదాకా క్లాసులు స్టార్టవ్వవు కదా, ఇంతకీ మీరు ఎగ్జామ్స్ అన్నీ బాగా రాసారా, రిజల్ట్స్ ఎప్పుడొస్తాయో తెలుసా?" అనడిగాడు రాయుడు తడబడుతూ. "ఊరుకోండి సార్ ఎంతసేపూ పరీక్షలూ, లేబ్‌లూ తప్ప ఇంకేమీ పట్టవా మీకు? మీ ఊరి గురించి, మీ ట్రిప్పు గురించి చెప్పండి. మీ ఫామిలీ అందరూ బాగున్నారా" అంది అనామిక నవ్వుతూ. కిసుక్కున పక్కనుంచీ జ్యోత్స్న నవ్విన నవ్వు రాయుడి గుండెల్లోంచీ దూసుకుపోయింది. వాళ్ళని కూర్చోమని చెప్పి ఉత్తరాలు పక్కన పడేసి తన ట్రావెల్ గురించి, ఊరు గురించీ ఓ గంట సేపు వివరాలన్నీ చెప్పాడు. ఈ గంటలో ఎన్నిసార్లు రాయుడు జ్యోత్స్న కళ్ళల్లోకి తనివితీరా చూసేడో! వాళ్ళు వెళ్ళిపోయాక లేబ్‌లో కూర్చుని మళ్ళీ ఉత్తరాలు చూడ్డం మొదలుపెట్టాడు. ఎప్పుడో ఆర్నెల్ల

క్రితం తను అమెరికన్ యూనివర్శిటీకి అప్లికేషన్ పంపడం నిజమేగానీ దాని సంగతి ఎప్పుడో మర్చిపోయాడు. ఇప్పుడొచ్చింది వాళ్ళ దగ్గరనుంచీ సమాధానం. ఎడ్మిషన్ ప్లస్ మంత్లీ అసిస్టెన్స్ ఇస్తున్నట్లు. రూముకొచ్చిన రాయుడికి ఆ రాత్రి పూర్తిగా నిద్ర కరువైంది.

ఆ తరువాత నాలుగు వారాలు రాయుడు యమయాతన పడ్డాడు. ఈ ఉద్యోగం వదిలేసి అమెరికా వెళ్ళడం ఖాయం. అదికాదు అసలు సమస్య. జ్యోత్స్నని చూడకుండా తాను ఉండగలడా? ఇందులో ఇంకో డైవర్షను. ఎవరీ జ్యోత్స్న? తనకేమౌతుంది? మొన్న మొన్నటి దాకా ఈ అమ్మాయి ఎవరో తనకి తెలియదే ఏదైనా ఈ విషయం అంత తేలికగా తెమిలేది కాదని అర్థం అయిపోయింది రాయుడికి. ఆ రోజు బస్సులో రూముకొస్తుంటే ఏదో పుస్తకం ఇలా చదివాడు రాయుడు - "ఎంతో మంది కుర్రవాళ్ళు అమ్మాయి ఒప్పుకోదేమో అనే సందేహంతో అసలు అమ్మాయిని అడగనే అడగరు. నిజానికి ఆ అమ్మాయికి ఇష్టమై ఒప్పుకుంటే వంద శాతం అవకాశముంటుంది.. అడక్కపోతే అవకాశం మాత్రం సున్నా. పోనీ ఒప్పుకోకపోయినా, అడగడం వల్ల కనీసం అటో ఇటో తేలిపోతుంది కదా! జీవితాంతం అడక్కుండా ఏడవడం కంటే ఓసారి అడిగేసి అటో ఇటో తేల్చుకోవడం మంచిది." ఇది చదివాక రాయుడికి కాస్త ధైర్యం వచ్చింది. ఈలోపు వీసా రావడంతోపాటు అమెరికా వెళ్ళడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఇంకో రెండూ వారాల్లో వెళ్ళిపోతాననగా రాయుడు ఉద్యోగానికి రిజైన్ చేసాడు. ఆ మర్నాడు రాయుడు కాలేజీకి వస్తుంటే అందరూ వింతగా చూట్టం మొదలు పెట్టారు. ఆరోజు క్లాసులో తాను రిజైన్ చేసినట్లూ, అమెరికాకి పి.హెచ్.డికి వెళ్ళిపోతున్నట్టు ఎనౌన్స్ చేసాడు రాయుడు అందరికి. గోలగోలగా స్టూడెంట్స్ వెళ్ళకండి, ఈ కాలేజీలో ఇంకెవరూ బాగా చెప్పరు. మీరు వెళ్ళిపోతే అన్నారు. "బాగుంది, నా సంగతి కూడా ఆలోచించండి మరి, ఎంతకాలం నన్ను ఇలా పాఠాలు చెప్పమంటారు? నేను కూడా స్థిరపడాలి కదా? ఈ బాంబే మహానగరంలో ఇల్లు దొరకడం ఎంత కష్టమో మీకు తెలియంది కాదు. అదీకాక నేను వెళ్ళేది ఉద్యోగం కోసం కాదు. ఇలాంటి అవకాశం వస్తే మీరేం చేస్తారు?" అంటూ అందరితో చెప్పాడు రాయుడు. తన క్లాసులన్నీ అయాక లాబ్‌లో కూర్చుని ప్యూన్‌ని పిలిచి 'ప్రొఫెసర్‌గారు పిలుస్తున్నారని చెప్పి ఓ సారి జ్యోత్స్న అనే అమ్మాయిని పిలు" అన్నాడు.

**********

తాను ముందు అనుకున్నదే అయినా ఇది తనకి కొత్త. అన్నీ ఆలోచించి వచ్చి ఎదురుగా కూర్చున్న జ్యోత్స్నతో ఇలా అన్నాడు రాయుడు. "మీ నాన్నగారు ఏం చేస్తుంటారండీ?" సడన్‌గా వచ్చిన ఈ ప్రశ్నతో ఒక్కసారి ఉలిక్కిపడి, "మా నాన్నగారా? ఎందుకూ?" అంది జ్యోత్స్న తత్తరపడుతూ.

"మీ నాన్నగారు బాంబే యూనివర్శిటీలో ప్రొఫెసర్ అని నాకు ఎవరో చెప్పారు. నాకు యూనివర్శిటీలో చిన్న పని ఉంది." ఈజీగా అబద్దం ఆడేసాడు రాయుడు.

"ఔనండి. నాన్నగారు హిస్టరీ డిపార్టుమెంటులో పనిచేస్తారు."

"ఈ రోజు యూనివర్శిటీకి వెళుతున్నాను. ఓసారి కలిస్తే ఏమీ అనుకోరు కదా?"

"అనుకోరు" అంది జ్యోత్స్న ఇంకా అదోలా చూస్తూ.

"సరే థాంక్స్!" అని రాయుడు యూనివర్శిటీకి బయలుదేరాడు.

యూనివర్శిటీలో జోషీగారిని కలుసుకోవడం అంత కష్టం కాలేదు.. కానీ రాయుడు వెళ్ళేసరికి ఆయన క్లాసులో పాఠం చెబుతున్నారు. అది అయ్యేదాకా ఆగి అయన రూములోకి నడిచాడు రాయుడు.

"నమస్తే. నా పేరు రాయుడు. నేను ఫలానా కాలేజీలో పనిచేస్తున్నాను."

పనిచేసే కాలేజీ పేరు వినగానే "నువ్వేనా నాయనా రోజూ మా అమ్మాయిని చంపుకుతింటున్నావుటా!" అన్నట్లు మొహం పెట్టి "మీ పేరు మా అమ్మాయి దగ్గర విన్నట్లు గుర్తు. చెప్పండి, ఏం కావాలి మీకు" అన్నారు జోషీగారు.

"నాకు అమెరికాలో పి.హెచ్.డీలో సీటు వచ్చింది. నేను ఇంకో రెండు వారాలలో వెళ్ళిపోతున్నాను. ప్రస్తుతం చేసే ఉద్యోగానికి అప్పుడే రిజైన్ చేసాను."

"అయితే ఏమిటంటారు?"

"జోషీగారు, మీతో కాస్త వివరంగా చెప్పాలండి."

ఈసారి కాస్త చిరాగ్గా జోషీ గారన్నారు "నేను ఇక్కడ్నుంచీ ఇంటికి వెళ్ళాలంటే ఈ లోకల్ ట్రైనులో రెండు గంటలు పడుతుంది. ఇప్పుడు బయలుదేరితే రాత్రి ఆరున్నరా, ఏడింటికి చేరగలను. ఏమీ అనుకోకపోతే కాస్త తొందరగా చెప్పు నాయనా"

"అయ్యా నేను మీ అమ్మాయి జ్యోత్స్నని చాలా సైలెంటుగా రెండేళ్ళనుంచీ ప్రేమిస్తున్నాను. చెప్పే ధైర్యం లేక, నాకున్న ఉద్యోగం అంత మంచిది కాదు కనక చెప్పలేదు. ఇప్పుడు అమెరికా వెళ్ళిపోతున్నాను కనక నా అదృష్టం పరిక్షించుకుందామని మీ దగ్గరికి వచ్చాను."

"ఏమిటీ. నువ్వా, మా జ్యోత్స్ననా, ప్రేమిస్తున్నావా?" సడన్‌గా ఏకవచనంలోకి దిగుతూ.

"అవునండి." అన్నాడు రాయుడు గుండె దడదడలాడుతుంటే, ఎక్కడ ఈయన 'నో' అనేస్తాడేమో అని బెదురుతూ.

ఓ ఐదు నిమిషాలు కన్నార్పకుండా రాయుడు కేసి చూసి, జోషీగారు ఇలా అన్నారు. "చూడు నాయనా మేము బ్రాహ్మలం. మమ్మల్ని చిత్‌ఫవన్ బ్రాహ్మలంటారు. అంటే, చిత్తం పరిశుభ్రమైన బ్రాహ్మలం. మరి నువ్వో? చూడబోతే నువ్వు మద్రాసీలాగా ఉన్నావు. నువ్వు మా అమ్మాయికి ఎప్పుడైనా నీ ప్రేమా, దోమా గురించి చెప్పావా?"

"నేను కూడా బ్రాహ్మణ్ణేనండి. మమ్మల్ని వైదికులంటారు. మీకన్నా మాకు మడీ, ఆచారం ఎక్కువే మాది అగ్రహారంలో నిప్పులు కడిగే వంశం. మీ అమ్మాయితో మాట్లాడ్డానికి ముందు మిమ్మల్ని అడుగుదామని వచ్చాను."

"నువ్వు మా అమ్మాయికి ప్రొఫెసర్ అయిపోయావుగానీ లేకపోతే ఈ పాటికి నీ గూబ పగులగొట్టి ఉండేవాడిని."

"అలా అంటారేంటి సార్! నేనంత వెధవనైతే మీకు చెప్పడానికి ఇంతదూరం వస్తానా? మీకంతగా నమ్మకం లేకపోతే మా కాలేజీలో కనుక్కోండి నా గురించి. నేను ఇక్కడే ఐ.ఐ.టి.లో ఎం.టెక్ చేసాను. అక్కడ్నుంచీ అలా అమెరికా వెళ్ళిపోవాల్సిందే కానీ కొన్ని కారణాల వల్ల ఇలా ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. ఇలా చేరడం మంచికే అనుకోండీ. జ్యోత్స్న నాకు కనిపించింది కదా!"

"ఈ విషయం అంత ఈజీగా తేలిపోయేది కాదు. మా ఆవిడతోటి, అమ్మాయితోటి మాట్లాడనివ్వు. ఈలోపల ఉత్తినే ఆశలేమీ పెంచేసుకోకు, మా ఆవిడ అంత ఈజీగా ఒప్పుకోదు. అసలే నువ్వు మద్రాసీవి. మేమా, చూడబోతే బొంబాయిలో సెటిలైపోయిన మరాఠీలం."

"అలాగేనండి. జ్యోత్స్న కోసం నేను ఏం చెయ్యడానికైనా సిద్ధమే"

"కొత్తలో అలాగే ఉంటుందిలే. అలాంటి భీకర ప్రతిజ్ఞలెందుక్కానీ, రేపోసారి ఫోన్ చేయ్!"

********

ఇంటికొచ్చిన జోషీగారు కుర్చీలో కూర్చుంటూ, "అమ్మా కాసిని మంచినీళ్ళు తే" అన్నారు.

ఇంట్లో ముగ్గురే, పెద్దమ్మాయి పెళ్ళయ్యాక. ఇదిగో ఈ జ్యోత్స్నకి కూడా చేసేస్తే, తన డ్యూటీ అయిపోయినట్లే. కానీ ఈ రోజు ఈ రాయుడేమిటి జ్యోత్స్నని చేసుకుంటాననడమేమిటి?ఇది కానీ ఆవిడ చెవిన పడిందా, నానాగోలా చేస్తుంది. గొడవలేకుండా ఎలాగ ఈ విషయం కదపడం? పరమేశ్వరా, ఎంత కష్టం తెచ్చావయ్యా!

మంచినీళ్ళ గ్లాసుతో వచ్చిన సంధ్యగారితో "అమ్మాయ్ ఇంకా రాలేదా కాలేజీ నుంచి"? అన్నారు.

"వచ్చింది హోమ్‌వర్కు చేసుకుంటోంది."

"ఓ సారి దాన్ని ఇలా రమ్మను. నువ్వు కూడా ఇలా వచ్చి కూర్చో."

ఇద్దరూ వచ్చి కూర్చుని "చెప్పండి. ఏమిటి సంగతీ" అన్నారు.

"ఈ రోజు జ్యోత్స్న ప్రొఫెసర్ రాయుడు యూనివర్శిటీలో నా ఆఫీసుకొచ్చాడు."

"ఆ.. వెళ్ళేటప్పుడు, నన్ను అడిగారు. ఏదో పని ఉంది. మిమ్మల్ని కలిస్తే పర్వాలేదా అనడిగారు" చెప్పింది జ్యోత్స్న.

"జ్యోత్స్నా, నీతో ఏదైనా చెప్పాడా!"

"లేదే"

"వచ్చింది నీ గురించి మాట్లాడ్డానికే"

"ఏమిటేవిటీ" అన్నారు సంధ్యగారు ఆశ్చర్యంగా.

జోత్స్న కూడా ఆశ్చర్యపోయి, "నా గురించా?" అంది.

"రెండు వారాల్లో అమెరికా వెళ్ళిపోతున్నాట్ట. ఇప్పటిదాకా బాంబేలో సరైన ఉద్యోగం లేదనీ, ఇల్లు దొరకడం కూడా కష్టం అనీ చెప్పలేదట. ఎలాగూ అమెరికా వెళ్ళిపోతున్నాడు కదాని ఇప్పుడు చెప్పాడు. జ్యోత్స్నని రెండేళ్ళనుండీ ప్రేమిస్తున్నాడంట. ఒప్పుకుంటే, వెంటనే పెళ్ళిచేసుకుంటాడట. వీసా రావటానికి ఎలాగా టైమ్ పడుతుంది. ఈ లోపున జ్యోత్స్న డిగ్రీ పూర్తి చెయ్యొచ్చు అన్నాడు."

"వెంటనే గూబ పగలకొట్టక మీరెందుకొప్పుకున్నారూ?" అన్నారు సంధ్యగారు కోపంగా.

"నేనొప్పుకున్నానని ఎవరు చెప్పారు? నాకైతే షాక్‌లోంచి తేరుకోవడానికి టైమ్ పట్టింది. అదీగాక మర్యాదగా వచ్చి అడిగాడు ఎలా చేయి చేసుకుంటాం?"

సంధ్యగారు అమ్మాయ్ వైపు తిరిగి "జ్యోత్స్నా, ఏమిటీ సంగతీ, ఎంతకాలం నుంచీ సాగుతోందిదీ?"

"అమ్మా, నాకేం తెలియదు, నేనెప్పుడూ ఆయన్ని ఒంటరిగా కూడా కలవను. ఇంతకాలం అసలు నాకేమీ చెప్పలేదు. కావలిస్తే మా క్లాస్ మేట్ మాధవికి ఫోన్ చేసి కనుక్కో. నా గురించి నీకు తెలియదా?"

జోషీగారు కలుగజేసుకుని "దాన్నేమీ అనకు. రాయుడే చెప్పాడు. ఇప్పటివరకు అమ్మాయిక్కూడా చెప్పలేదని."

"మరింకేం, ఎలాగూ అమెరికా పోతున్నాడు. పోనివ్వండి. మద్రాసీలతో మనకెందుకు. రేపొద్దున్న అమెరికా తీసుకెళ్ళాక దీన్ని ఎవరికైనా అమ్మేస్తే చూడ్డానికి దిక్కూ మొక్కూ ఉండదు. అయినా మనం బ్రాహ్మలం. వాడో?"

"ఆయన కూడా ఆచారవంతులైన బ్రాహ్మలే అని నాతో చెప్పాడు."

"చెప్పడానికేం. మనం మద్రాసెళ్ళి చూసేదా, తీర్చేదా"

"సరే ఐతే, అమ్మా జ్యోత్స్నా నువ్వేమంటావ్? రేపు ఫోన్ చేస్తానన్నాడు. ఏదో చెప్పాలి కదా. ఉత్తినే ఆశలు పెంచుకోకూ అని చెప్పాననుకో"

"మీ ఇష్టం నాన్నగారూ, కానీ పుల్ల విరుపుగా చెప్పేస్తే, కాలేజీలో నా రికార్డ్స్ పాడుచేస్తారేమో? అసలే అమెరికా వెళుతున్నారు కదా, కొంచెం నెమ్మదిగా చెప్పటం మంచిదేమో?"

"ఏంటీ వాడు పాడు చేసేది" అని సంధ్యగారంటే,

"రికార్డ్సు పాడు చేయడానికి ఛాన్సు ఉంది కానీ అలా చేస్తాడని నేననుకోను. అయినా మన జాగ్రత్తలో మనం ఉండటం మంచిదే" అన్నారు జోషీగారు.

మర్నాడు రాయుడు గుండెలదురుతూంటే కాలేజీలో అడుగు పెట్టాడు. జ్యోత్స్న కనిపిస్తే మొహం చూపించాలి కదా! సాయంకాలానికి మళ్ళీ జోషీగారికి ఫోన్ చేసాడు.

"నమస్తే, నేను రాయుడ్ని మాట్లాడుతున్నాను. మీ ఫామిలీతో మాట్లాడారా?"

"ఆ మాటాడాను. మాకిదంతా చాలా కన్ఫ్యూజింగా ఉంది. ఒక్క రోజులో చెప్పడం కష్టం. ఎలాగూ రెండు వారాల్లో నువ్వు అమెరికా వెళ్ళిపోతున్నావు. ఈ రెండు వారాలు ఆలోచించుకుని నువ్వెళ్ళేలోపు చెపుతాము. ఏమంటావు?"

"తప్పకుండా. కానీ నన్ను నిరాశ పరచనని చేయనని ప్రామిస్ చేయండి." అన్నాడు రాయుడు నవ్వుతూ.

"నేను చేయలేను అలాంటి ప్రామిస్‌లు. అయినా నువు ప్రపోజ్ చేసేది నాకా, మా అమ్మాయికా?" అన్నాడాయన తాను కూడా నవ్వుతూ.

ఫోన్ పెట్టేసి రాయుడు ఆలోచన్లో పడ్డాడు, తాను తప్పు చేసాడా? జ్యోత్స్న తనని రిజక్ట్ చేస్తే తాను అమెరికా వెళ్ళి మామూలుగా బతగ్గలడా?

ఆ తరువాత రోజుల్లో రాయుడు కాలేజీకెళ్ళాడు. కానీ చిత్రంగా జ్యోత్స్న ఒక్కసారి కూడా కనిపించలేదు రాయుడికి. షాపింగ్ గొడవలతో, రూము ఖాళీ చేయడంలో, సామాను సర్దడంతో రాయుడికి తిండి, నిద్రా లేకుండా రెండు వారాలు గడిచిపోయి, వెళ్ళవలసిన రోజు దగ్గరకొచ్చింది. ఏరోజుకారోజు చూస్తున్నాడే కానీ జోషీగారి దగ్గర్నుంచి ఏమీ సమాధానం రాలేదు. మనస్సుండబట్టక వెళ్ళిపోయే ముందు రోజు జోషీగారికి మళ్ళీ ఫోన్ చేసాడు రాయుడు వణుకుతున్న చేతుల్తో.

"ఇంకా ఓ రోజుంది కదా" అన్నాడాయన తేలిగ్గా. "అమ్మాయ్ తప్పకుండా చెపుతుందిలే"

ఆ రోజు రాత్రి రెండింటికి తన ఫ్లైట్. సాయంకాలం మళ్ళీ ఇంకోసారి జోషీగారికి ఫోన్ చేసాడు.

"ఆ, నేనే చెపుదామనుకున్నాను. కానీ అమ్మాయ్ ఎయిర్‌పోర్ట్‌కి వస్తానంది. నిన్ను అక్కడ కలుస్తాం రాత్రి." అన్నారు జోషీగారు.

"సరే సర్!" అని ఫోన్ పెట్టేశాడు రాయుడు. ఇది నమ్మ బుద్ధి కావట్లేదు. ఎప్పుడూ తనతో మాట్లాడని జ్యోత్స్న ఈ రోజు ఎయిర్ పోర్ట్‌కొస్తుందా? వచ్చి ఏం చెబుతుంది? నోరు విప్పుతుందా అసలు లేకపోతే అందరి ముందు ఈ జోషీగారు తనని చెప్పు తీసుక్కొడతాడా? ఏదైనా, తాను చేసిన పెద్ద తప్పేమిటి? మర్యాదగా వెళ్ళి అడిగాడు. చూద్దాం ఏమవుతుందో, అనుకుంటూ ఎయిర్‌పోర్ట్‌కి బయలుదేరాడు రాయుడు. లగేజ్ చెకింగులో ఇచ్చాక బయటికొచ్చి విజిటర్ లాంజ్‌లో చూస్తూ కూర్చున్నాడు రాయుడు. తొమ్మిది, పది అవుతున్నా జోషీగారు గానీ, జ్యోత్స్న గానీ వచ్చే జాడలు కనపడలేదు. ఆఖరి బోర్డింగ్ ఎనౌన్స్‌మెట్ వచ్చేదాకా చూసి, లోపలకి నడిచాడు రాయుడు. పాస్‌పోర్ట్ మీద స్టాంప్ వేయించుకుని లోపలికెళుతుంటే, "మీకు జోషీగారు బాగా తెలుసా?" అన్నాడు పాస్‌పోర్ట్ మీద స్టాంప్ వేసిన క్లర్క్ రాయుడితో.

ఒక్కసారి గతుక్కుమని "లేదే జోషీగారమ్మాయ్ నా స్టూడెంట్" అన్నాడు రాయుడు.

"ఈ ఉత్తరం మీరు అమెరికా వెళుతున్నందుకు మీకిమ్మంది జ్యోత్స్న. నేను దాదర్‌లో జోషీ గారి ఇంటికెదురుగా ఉంటాను. మేము దాపు ఇరవై ఏళ్ళ నుండీ స్నేహితులం. బోన్ వాయేజ్ అండ్ గుడ్ లక్!"

"ఓ మేనీ థాంక్స్!" అన్నాడు రాయుడు ఆ కవర్ అందుకుని ప్లేన్ ఎక్కడానికి ముందుకి నడుస్తూ.

లైన్లో నుంచున్నాడన్నమాటే గానీ రాయుడి దృష్టంతా చేతిలో కవర్ మీదే ఉంది. తన పేరు జ్యోత్స్న రాసిందేనని తెలుస్తోంది. ఈ మూడేళ్ళ కాలంలో తాను ఎన్నిసార్లు జ్యోత్స్న హాండ్ రైటింగ్ చూశాడో. కానీ చేతిలో కవర్ మాత్రం ఓపెన్ చేయడం కుదిరింది కాదు - ముందూ వెనకా జనం ఉన్నారు. ఓపెన్ చేస్తే లైనులో నించున్న అందరికీ కనపడే ఛాన్స్ ఉంది.

ఇంకో అరగంటకి కూర్చుని సీట్ బెల్ట్ పెట్టుకున్నాక, రాయుడు ఆత్రంగా కవర్ ఓపెన్ చేసాడు. అందమైన కార్డులో "బెస్ట్ విషెస్ ఫర్ యువర్ అమెరికన్ ట్రిప్" అనే దానికింద "జ్యోత్స్న" అనే సంతకం. అందులోని ఒక ఉత్తరం రాయుడి ఒళ్ళో పడింది. ఓపెన్ చేసి మెల్లిగా చదవటం మెదలుపెట్టాడు.

"నమస్తే, మీరు అమెరికా వెళ్ళిపోతున్నారని అన్ని క్లాసుల్లో చెప్పుకున్నారు. కాలేజీలో అందరికీ చెప్పుకున్నారు. మా నాన్నగారి దగ్గరికి వెళ్ళి మరీ చెప్పుకున్నారు. నన్ను ప్రేమించారని నాన్నగారితో చెప్పారు కదా. కానీ నాతో ఏమీ చెప్పలేదే? సిగ్గా? మరి మీ లాబ్‌లోకి రాగానే ఎంత సేపూ నా కళ్ళల్లోకి చూడ్డమే తప్ప ఇంకేం చెయ్యరే? నేను మాట్లాడాలని రెండు మూడు సార్లు ప్రయతం చేస్తే మీ దగ్గరికి రాగానే మీరు సుత్తి కొట్టేసారు. నన్ను నోరు విప్పనివ్వరే! ఎంత ప్రొఫెసర్ అయితే మాత్రం మరీ ఇంత వాగుడు పనికిరాదు కదా! ఓ సారి నేను,

అనామిక కలిసి లాబ్‌కి వచ్చాము మీరు వేసవి శెలవుల నుంచీ రాగానే. ఆ రోజు అసలు మీ దగ్గరకు వచ్చింది కొంచెం మీ గురించి తెలుసుకుని, మా ఫామిలీ గురించి చెబుదామనే. నా బెరుకు చూసి అనామికే మొదలు పెట్టింది మాట్లాడ్డం. కానీ మేం అడగ్గానే మీరు సుత్తి మొదలుపెట్టారు. నాన్నగారి దగ్గరకు వెళ్ళేటప్పుడు ఎందుకో నాకెందుకు చెప్పలేదు? పైగా యూనివర్శిటీలో పని అని అబద్దం ఆడేసారు నాతో. నేను కూడా అంత పెద్దగా అందరితో కలవలేనని ఒప్పుకుంటాను. మీరు మొదటిసారి స్టేక్ గురించీ, రికర్షన్ గురించీ క్లాసులో చెప్పినప్పటినుండీ మిమ్మల్ని చూస్తున్నాను. ఇంకో ప్రొఫెసర్ కూడా చెప్పారు రికర్షన్ గురించి వేరే క్లాసులో. ఏమీ అర్థం కాలేదు; మళ్ళీ మీరు చెప్పేదాకా. భలే ఈజీగా చెప్పారే అనిపించింది. అప్పటినుంచే మీరంటే ఇష్టపడడం మొదలైందనుకుంటా. మీరు వెళ్ళిపోయే ఈ రెండు వారాల్లో నేనెంత బాధపడ్డానో మీకేం తెలుసు? కాలేజీకి రావడం కూడా మానేసాను. నేనీ రెండు వారాల్లో పడ్డ యాతన మీకర్థం అవ్వాలనే, చివరి వరకు ఏమీ చెప్పకుండా, ఆఖరికి ఎయిర్‌పోర్ట్‌కి కూడా రాకుండా ఇలా ఉత్తరం పంపిస్తున్నాను.

మీరు నాన్నగారి దగ్గర మాట్లాడిన విషయం విని అమ్మకూడా మనిద్దరి మధ్యా ఏదైనా కథ నడుస్తుందనుకుంటోంది. వెంటనే వద్దు అని చెప్పేయమంది. కానీ నేను 'వద్దని చెపితే నా కాలేజీ రికార్డ్స్ మీరు పాడు చేస్తారేమో' అని చెప్పి వారించాను. నాతో మాట్లాడితే, వెంటనే నా కూడా మా ఇంటికి తీసుకెళ్ళి అందర్నీ పరిచయం చేసి ఉండేదాన్ని కదా! గోటితో పోయేదానికి గొడ్డలి దాకా తెచ్చారు. ఈ ఉత్తరం మా అంకుల్ ద్వారా పంపిస్తున్నాను. ఇందులో ఫ్రెండ్ ఎడ్రస్ ఇస్తున్నాను. మీరు అమెరికా నుండి ఈ ఎడ్రస్‌కి ఉత్తరం రాస్తూ యూనివర్శిటీ నుండి ఓ అప్లికేషన్ పంపించండి నాకు. నేను కూడా ఎగ్జామ్స్ రాసి అక్కడికి రావడానికి ప్రయత్నం చేస్తాను. మీరు కొంచెం వాగుడు తగ్గించి అవతల వాళ్ళు చెప్పేది వినడం నేర్చుకోండి. మీరడిగిన ప్రశ్నకి స్టూడెంట్స్ ఆన్సరు వెంటనే చెప్పకపోతే అంత గబుక్కున వచ్చేస్తుందే మీకు కోపం? మీలాగా మేము ఐ.ఐ.టిలో చదువుకున్నామా ఏమిటి? నేను అమెరికా వచ్చేలోపున మీరు ఇవన్నీ ఇంప్రూవ్ చేసుకుంటారని ఆశించొచ్చా? నాన్నగారు 'అమ్మా నువ్వేమంటావు' అని అడిగారు. నా ఉద్దేశ్యం మీకు డైరెక్టుగా చెపుతానని నాన్నగారు చెప్పారు కదా. ఇంకేం ఉంది చెప్పడానికి? నా క్లాస్మేట్ మాధవి గుర్తుందా మీకు? దాని ఇంటి పేరు 'నటరాజన్'. చాలాకాలం క్రితం మద్రాస్ నుంచీ బాంబే వచ్చి సెటిల్ అయ్యారు. మాధవి మనిద్దరికీ పెట్టిన నిక్‌నేమ్ - 'ఒరు తలై రాగం.' నన్ను ఏడిపించి చంపుకు తినేది మీరు కాలేజీలో కనిపించగానే. ఇద్దరికీ ఒకే నిక్‌నేమ్ ఎలాగ కుదురుతుందో ఎప్పుడూ అర్థం కాలేదు నాకు. ఇప్పటిదాకా ఎంత అడిగినా 'ఒరు తలై రాగం' అంటే అర్థం చెప్పలేదు. నాకా తమిళం రాదాయె! ఈ ఉత్తరం రాస్తుంటే ఇప్పుడే వచ్చింది. 'ఒరు తలై రాగం' అంటే అర్థం చెప్పి పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతోంది. మనిద్దరం కూడా ఈ రెండు మూడేళ్ళు నోరు మెదపకుండా ఈ నిక్‌నేమ్‌కి తగినవాళ్ళమే అని నిరూపించాం. ఈ ఉత్తరం రాయడం అవ్వగానే దాని నెత్తి మీద మొట్టికాయలు వేసి నోరు మూయించాలి. వెళ్ళాక ఉత్తరం రాస్తారు కదూ?.... జ్యోత్స్న."

ఉత్తరం చదవడం పూర్తవగానే, రాయుడు రెండు చేతులు ఒక్కసారి గాల్లోకి విసిరి కంచుకంఠంతో బిగ్గరగా "యా...హూ!" అని అరిచాడు. రాయుడి పక్కనే కూర్చున్న జర్మన్ దేశస్తుడు మాత్రం ఒక్కసారి బిత్తరపోయి "ఓ, ఆర్యూ ఓ.కే" అనడిగాడు.

రాయుడు బిగ్గరగా నవ్వుతూ "యా, యా, అయాం డబల్ ఓ.కే" అన్నాడు.

(ఒరు తలై రాగం - ఒక తమిళ సినిమా పేరు - అర్థం - "వన్ సైడెడ్ లవ్." ముక్కస్య ముక్కార్థం చెప్పుకుంటే ''ఒకే తలకాయ పాట' అనొచ్చేమో)

పరిత్యాగం (డిస్-క్లైమర్):- ఇది కథ మా..త్ర...మే. పేర్లు కానీ, సిటీలు కానీ, ఉద్యోగాలు కానీ మేచ్ అయితే - మీకు కానీ, మీ బంధుమిత్రులకు కానీ, మీకు తెలుసున్నవాళ్ళకు కానీ - అది పూ..ర్తి...గా.. 'కోఇన్సిడెన్స్.' గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకోనవసరం లేదు.



# ఎడబాటు

- శారద

"నాన్నా! టిఫిన్ రెడీయా?" గావుకేక పెట్టాడు రమేష్.

"అయిందిరా! నువు డ్రస్ చేసుకొచ్చేయి" హడావిడిగా అన్నాడు గోపాలరావు.

"ఏమిటి నాన్నా ఇవి? దోసెలా? అలుగ్గుడ్డల్లా ఉన్నాయి. ఈ కిందిదయితే నల్లగా మాడి బొగ్గులాగుంది. ఈ దోసెలు నేనేం తింటాను కానీ, ఆ బ్రెడ్డు కొంచెం కాల్చి ఇవ్వు."

"ఒక్క పదినిమిషాలుండరా నాన్నా! మళ్ళీ రెండు దోసెలేసి ఇస్తాను."

"అమ్మో! నీతో పెట్టుకుంటే నాకు బస్సందినట్టే!" బ్రెడ్డు చేతిలో పట్టుకుని షూ లేసులు కట్టుకుంటున్నాడు రమేష్.

"రమేష్, కొంచె ఆ సైకిలు సంగతి" కొంచెం జంకుగా అని ఆగిపోయాడు గోపాలరావు.

"అబ్బా నాన్నా! ఇప్పుడా సైకిలుకి తొందరేం వచ్చింది? సాయంత్రం వచ్చినప్పుడు చూస్తాలే" బాగ్ తగిలించుకుని పరిగెత్తాడు రమేష్.

తలుపేసుకుని లోపలికొచ్చి కుర్చీలో కూర్చున్నాడు గోపాలరావు. ప్లేటులో వదిలేసిన దోసెలు చూడగానే తండ్రి హృదయం తరుక్కుపోయింది.

"పిచ్చి నాన్న! అసలే వాడికి బ్రెడ్డంటే పరమ అప్యాం. రేపణ్ణించీ ఎలాగైనా ఇంకొంచెం ముందుగా లేచి మంచి టిఫిన్ చేసి పెట్టాలి," అనుకున్నాడు బాధగా.

వంటింట్లోకి వెళ్ళి చూడగానే గుండె గుభిల్లుమంది. ఎక్కడి సామానులక్కడే పడి, చెత్తా చెదారంతో రణ రంగంలా గుంది. ఇదంతా శుభ్రం చేయడానికి కనీసం రెండు గంటలైనా పడుతుంది. "పార్వతీ, నువ్వే ఉండి ఉంటే ఇలా జరిగేదా," అనుకున్నాడు బాధగా. ముందు కొంచెం కాఫీ తాగి ఓపిక తెచ్చుకుని ఈ పనంతా తీర్చుకోవాలి, అనుకున్నాడు. కాఫీ తాగేసరికి సత్తువ వచ్చినట్టనిపించింది. అనుకున్నట్టుగానే వంటిల్లంతా సర్ది, అంట్లు తోమి తనకొరకు కొంచెం వంట చేసుకునే సరికి పదకొండవ్వనే అయింది. స్నానం, పూజా కానిచ్చుకుని రెండు మెతుకులు కొరికి అలసటతో పక్కమీదికి చేరాడు. అతనికి పార్వతిని తలచుకుంటే దిగులుగానూ, గిల్టీగానూ ఉంటోంది. ఇంటెడు చాకిరీ, ఒక్కతే ఎవరికీ ఏ లోపమూ రాకుండా ఎలా చేసుకునేదో, పాపం. తనేనాడూ ఒక చేయందించిన పాపాన పోలేదు. అందుకే దేవుడీ విధంగా శిక్షిస్తున్నాడు. అంత చాకిరీలో కూడా మొహం మీద చిరునవ్వు చెదిరేది కాదు. "నన్ను ఒంటరిని చేసి, చెప్పాపెట్టకుండా ఎందుకెళ్ళావు పార్వతీ!?" లెక్కలేనన్నిసార్లు ఆ ప్రశ్న వేసుకుని ఉంటాడు.

సన్నగా నిద్రపడుతూ ఉండగా ఫోన్ మోగింది.

"నాన్నా, నా గదిలో టేబుల్ మీద ఒక కేలిక్యులేటరూ, ఒక ఎర్ర ఫోల్డరూ మర్చిపోయాను. కొచెం తెచ్చిపెట్టు, ప్లీజ్!" రమేష్ సెల్ ఫోన్ నుంచీ మాట్లాడుతున్నాడు.

"అది కాదురా, నాన్నా, ఇంకా బట్టలుతకలేదు, ఎండ బాగా ఉంది" చెప్పబోయాడు గోపాలరావు.

"అబ్బా! నాన్నా! చిన్న పనికే ఇంత హైరానా అవుతావెందుకు? రానూ పోనూ ఆటో మాట్లాడుకో! నాకు టైమవుతుంది." ఫోన్ పెట్టేసాడు రమేష్. ఉసూరుమంటూ లేచాడు గోపాలరావు. కళ్ళు తిరుగుతున్నట్టనిపించింది. ఎలాగో సర్దుకుని లేచి రమేష్ గదిలోంచి కేలిక్యులేటరూ, ఫోల్డరూ తీసుకుని బయటికొచ్చాడు.

ఆటోలోనే అయినా వెళ్ళి ఇచ్చి మళ్ళీ వచ్చేసరికి రెండు దాటనే దాటింది. గబగబా బట్టలుతికి ఇల్లు శుభ్రం చేసి రాత్రి వంటలో పడ్డాడు. వంట పూర్తి చేసి కాసేపలా చల్లగాలికి తిరిగొద్దామని పార్కుకి బయలుదేరాడు. మామూలుగానే పార్కులో అందరూ కొడుకుల స్వార్థం, కోడళ్ళ నీచత్వం గురించి మాట్లాడుకున్నారు. వాళ్ళందరి మాటలకి మనసు బరువెక్కింది.

"ఏమిటో ఈ జీవితాలు! ఈ బాధంతా పంచుకుందామంటే పార్వతి..." ఆలోచనలని బలవంతంగా పార్వతి మీదనుంచీ మళ్ళించాడు.

రాత్రి తనూ కొడుకూ, మౌనంగా, మాట్లాడుకోవటానికేమీలేనట్టు భోజనం ముగించారు. ఇద్దరి మధ్యా ఏదో దూరం, ఇదీ అని చెప్పలేని కమ్యూనికేషన్ గేప్. టేబులూ, వంటిల్లూ శుభ్రం చేసి పక్క మీద వాలాడు గోపాలరావు.

ఇవాళ మరీ ఒంటరిగా అనిపిస్తుంది. రమేష్ అయినా కాసేపు పలకరించి మాట్లాడితే బాగుండు. తనగదిలో ఏదో పనిచేసుకుంటున్నట్టున్నాడు. తను వెళ్ళి పలకరిస్తే గయ్యిమని లేస్తాడు.

తల్లికీ, తనకీ లేని ఈ కోపం ఎక్కణ్ణుంచీ వచ్చిందో వాడికి. పార్వతి తండ్రి పోలికై ఉండాలి. ఆ కోపిష్టి మనిషిని ఒప్పించి పార్వతిని పెళ్ళాడేసరికి తనకి తాతలు దిగొచ్చినంత పనైంది. వీడు అచ్చంగా తాత నోట్లోంచి ఊడిపడ్డాడు. ఇప్పుడే ఇంత కసిరి కొడతాడు, రేపు కోడలు వచ్చాక ఇంకెంత మొరటుగా ప్రవర్తిస్తాడో! తనకీ ఇన్ని కాఫీ నీళ్ళైనా దక్కుతాయో, దక్కవో! పార్కులో స్నేహితులందరి మాటలూ గుర్తొచ్చి గాభరాగా లేచి కూర్చున్నాడు.

కొడుకూ కోడలూ తనని నిరాదరించినట్టూ, తనని చూసి విసుక్కున్నట్టూ కళ్ళ ముందు సినిమాలా కనిపించి చెమటలు పట్టినట్టైంది. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కొడుకు, భార్య రాగానే మారిపోతాడా! కాదు, తను వాళ్ళకా అవకాశమే ఇవ్వడు. కోడలు రాగానే ఏదైనా ఓల్డ్ ఏజ్ హోంలో చేరిపోతాడు.

నిజమే! ఇప్పుడే ఆ సైకిలు గురించి ఎన్నిసార్లడిగినా కసిరి కొడతాడేకానీ, పట్టించుకోడు. రేపు వీడేదో తనని ఉద్ధరిస్తాడనుకోవటం తన బుద్ధితక్కువతనం. స్నేహితులందరిలా వాళ్ళ చేతిలో అవమానాలూ, మనస్తాపాలూ పొందే కంటే ముందే తను సిద్ధంగా ఉండటం మంచిది.

లేచి కూర్చుని లైటు వేసుకుని, డైరీ, టెలిఫోన్ డైరెక్టరీ తెచ్చుకున్నాడు. డైరెక్టరీలోంచి తన డైరీలోకి కొన్ని వృద్ధాశ్రమాల అడ్రసులు రాసుకోవటం మొదలుపెట్టాడు. తలుపు దగ్గర అలికిడైంది. తలెత్తి చూస్తే రమేష్.

"ఏం రాసుకుంటున్నావు నాన్నా?" సౌమ్యంగా అడిగాడు.

"అబ్బే! ఏం లేదురా, అదీ, ఊరికే తోచక." మొహమాటంగా నవ్వి డైరీ మూసే ప్రయత్నం చేసాడు.

ఎన్నడూ లేనిది తండ్రి ఏం రాస్తున్నాడో చూద్దామని కుతూహలంగా డైరీలోకి తొంగి చూసాడు రమేష్.

"ఇదేమిటి? ఎందుకీ ఓల్డ్ఏజ్ హోం అడ్రసులన్నీ రాస్తున్నావు?" వింతగా అడిగాడు. ఒక్కసారి తడబడ్డాడు గోపాలావు.

"మరీ, ఎప్పుడైనా భవిష్యత్తులో అవసరం వస్తే ఉంటాయని...." నీళ్ళు నమిలాడు.

"గ్యారంటీగా నీకు పిచ్చెక్కింది. లేకపోతే నీకు ఓల్డ్ఏజ్ హోంలతో పనేమిటి? అసలు నీకు..." తలుపు చప్పుడవడంతో మాట్లాడడం ఆపి తలుపు తెరవటాని వెళ్ళాడు.

ఊపిరి పీల్చుకున్నాడు గోపాలరావు. ఇంత రాత్రప్పుడు ఎవరూ? ఎవరైతే ఏం, రమేష్ తిట్లనుంచీ తప్పించారు. తనూ హాల్లోకి నడిచాడు.

"ఏమిటి, అప్పుడే నిద్రపోయారా? ఏరా రమేష్, రేపు నీకు లెక్కల పరీక్ష కదా? చదువుతున్నావా?"

చెప్పులన్నా విప్పకుండానే పార్వతి దండకం మొదలు పెట్టింది.

"పార్వతీ, నువ్వేనా! ఇన్ని రోజులూ ఎక్కడికెళ్ళావు? అసలు నువ్వు లేకుండా నేనెలా ఉంటాననుకున్నావు?" గోపాలరావు మొహంలో కన్నీళ్ళొక్కటే తక్కువ.

"మీకేమైనా మతి పోయిందా ఏమిటీ? మా అన్నయ్య రమ్మన్నాడని అర్జంటుగా వెళుతూ ఉత్తరం కూడా పెట్టానే! అయినా నాలుగురోజుల్లో ఇలా డీలా పడ్డారేమిటండీ? పైగా సెలవు కూడా పెట్టారు, ఇంతోటి ఇల్లు సవరించుకోవటం కోసం," మూతి మూడు వంకరలు తిప్పింది పార్వతి.

"అసలు నీ కొడుకు నన్నెన్ని చిత్రహింసలు పెట్టాడో తెలుసా?"

ఉక్రోషంగా అన్నాడు.

"చాల్లెండి, ఎవరైనా వింటే నవ్వుతారు. ఇంటర్మీడియట్ చదువుతున్న వెధవ మిమ్మల్ని హింస పెట్టడం ఏమిటి?"

"అమ్మో! వాడా! వంటకి సవాలక్ష వంకలు పెట్టాడు. అది మరచిపోయాననీ, ఇది తెమ్మనీ కాలేజీ చుట్టూ తిప్పాడు. మాట్లాడితే మీదపడి అరిచాడు. అది సరే గానీ, వాడికి మీ నాన్న పోలిక ఇంతగా వచ్చిందేమిటే! మా ఇంటా వంటా లేదు ఇంత కోపం."

"సరేలెండి! అనుకుంటూనే ఉన్నాను, ఇంట్లో కాలు పెట్టి పదినిముషాలు పైనే అయింది, ఇంకా మా వాళ్ళని ఆడిపోసుకోవటం మొదలు పెట్టలేదేమిటా అని."

"అదికాదమ్మా! నాన్న వంట ఇంత ఛండాలంగా ఉంటుందని ఇప్పుడే తెలిసింది. నాలుగు రోజులుగా తిండే సరిగ్గా లేదు. దానికి తోడు ఇప్పుడీయన గారు ఓల్డ్ఏజ్ హోం అడ్రసులు రాస్తున్నారు. అసలాయన వయసెంతమ్మా?"

"ఓల్డ్ ఏజ్ హోంలేమిట్రా?"

"ఏమో మరి! ఇదిగో ఈ డైరీ చూడు." డైరీ తెచ్చాడు రమేష్.

"ఏమిటండీ ఇదంతా?" అయోమయంగా అడిగింది.

"సాయంత్రం పార్కులో అందరూ వాళ్ళ కోడళ్ళూ కొడులూ ఎంత బాధ పెడుతున్నారో చెప్పి బాధపడ్డారు. మనల్నీ కోడలు వచ్చాక వీడు చూస్తాడో లేదోనని, ఇప్పణ్ణించే మనం సిద్ధంగా ఉందామనుకున్నాను."

"నా బొంద! పద్దెనిమిదేళ్ళైనా లేవు వాడికి, కోడలు రావటమేమిటండీ! మండినట్టే ఉంది మీ ముందు చూపు."

"నువ్వలాగే కలలు కంటూ ఉండు! సైకిలు సంగతేమైందో కనుక్కో ముందు చూద్దాం!"

"అప్పుడే చెప్పానుగా, ఆదివారం శ్రీధర్ దగ్గర్నించీ తీసుకొస్తానని. తీసుకురాగానే రిపేర్లేమైనా ఉంటే చేయించి సతీష్ కిచ్చేద్దాం." ఎంతో సౌమ్యంగా చెపుతున్న కొడుకుని చూసి ఆశ్చర్యపోయాడు గోపాలరావు.

అమ్మదొంగా! తనడిగితే కస్సుబుస్సుమని లేచి, తల్లి రాగానే పిల్లిలా మాట్లాడుతున్నాడు. చెల్లెలి కొడుకు సతీష్ కిద్దామని రెండు నెలలుగా బతిమలాడితే ఇవాళ్టికి తేలాడు. ఎంతైనా తల్లి తల్లే! ఆమె మాట వింటాడు. తన గతి అధోగతే! ఉక్రోషంగా కూర్చున్న గోపాలరావునిచూసి తల్లీ కొడుకులు నవ్వాపుకున్నారు.

"ఏమిటండీ చిన్నపిల్లాడిలా! పరీక్షల హడావిడిలో వాడు కొంచెం విసుక్కున్నాడేమో. పదండి పడుకుందాం. రేపు కూడా సెలవు పెట్టా(రా?"

"రేపు పొద్దున్నే ఆఫీసుకెళతాను. ఇంకెప్పుడూ వీడితో నన్నొక్కణ్ణీ వదిలేసి వెళ్ళకు పార్వతీ!"

"మరి మీరు నన్నొదిలి ఆఫీసు టూర్లకి వెళ్ళినప్పుడు నేనెలా సంబాళించుకున్నానో", నవ్వు బిగపట్టి అడిగింది పార్వతి.

"నువ్వు నాకంటే తెలివైనదానివీ, చురుకైనదానివీ అని ఒప్పుకున్నాను, సరేనా! ఈసారి ఎక్కడికి వెళ్ళినా నన్నూ తీసికెళ్ళాలంతే!" తేల్చి చెప్పాడు గోపాలరావు.

✡✡✡



*శారద గారు సౌత్ ఆస్ట్రేలియా లోని అడిలాయిడ్ నివాసి. తెలుగు, ఇంగ్లీషు రెండు భాషల్లోనూ రచనలు చేస్తుంటారు..*

## ఏడుకొండల సాక్షిగా! - లక్ష్మీ భారతీరెడ్డి

కాలానికి ఉన్న వేగానికి సాక్ష్యంగా, రేపటితో నడియార్ పిళ్ళై కాలం చేసి ఏడాదవుతోంది. అతని ఆత్మశాంతి కోసం అంటే తప్పేమో.. ముఖ్యంగా నా అంతరాత్మ సంతృప్తి కోసం, సంవత్సరం నుండీ వేధిస్తోన్న మనస్సుకి సమాధానంగా పదిమందికీ అన్నదానం చేసి కొంతైనా పాప ప్రక్షాళన చేసుకోవాలనే నిర్ణయించుకున్నాను. ఈ విషయమే నా భార్యతో చెప్పాను.

ఇప్పుడు అన్నదానం చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? కూరలు తరుగుతూ ప్రశ్నించింది తను.

ఏమని చెప్పను... ఏం చెప్పి చేసిన తప్పుకు నీతి దొంగ ముసుగు ఎలా కప్పను.

"ఏం లేదే పదిమందికి అన్నం పెడ్తే పుణ్యం వస్తుందని, అందులో తప్పేముందట? "

"సరే మీ ఇష్టం" తరిగిన కూరలు ఓ గిన్నెలో వేస్తూ ఆమె సమాధానం!

వెంటనే ఉడిపి హోటల్‌కెళ్ళి మరునాటి మధ్యాహ్నం ఓ యాభైమందికి క్యాటరింగ్ ఆర్డరు చేసి, ఓ నలుగురు బాయ్స్‌ని కూడా పంపమని చెప్పాను.

మరుసటి రోజు మధ్యాహ్నం!

మా ఇంటి ముదున్న ఖాళీ స్థలంలో షామియాన వేయించి అంతా సిద్ధం చేసాను.

వచ్చిన వాళ్ళంతా భోంచేస్తున్నారు.

ఎందుకో తెలీని బాధ, గుండె భరించలేనంత భారం నా మది జ్ఞాపకాల గదిలోనుంచీ గతం తాలూకు నీలినీడల సాక్షిగా అస్పష్టంగా ఓ ప్రకటన వినిపిస్తోంది.

యాత్రికులకు విజ్ఞప్తి

యాభై రూపాయల సుదర్శనం కంకణ, ధరించిన శ్రీవారి దర్శనం కోసం పదవ నెంబరు క్యూ కంపార్ట్‌మెంట్లో వేచి ఉన్న భక్తుడు శ్రీ నడియార్ పిళ్ళై గుండెపోటుతో మరణించారు. మృతదేహం అశ్వనీ హాస్పటల్ మార్చురీలో ఉంచడమైంది. అతని సంబంధీకులు ఎవరైనా ఉంటే శ్రీవారి ఆలయం దగ్గరలో ఉన్న ఎంక్వయిరీ సెక్షన్లో సంప్రదించవలసిందిగా కోరుతున్నాం. మృతి చెందిన భక్తుని జేబులో లభించిన ప్యాకెట్ డైరీ ఆధారంగా అతని వివరాలు పేరు నడియార్ పిళ్ళై. పుట్టిన తేదీ. 12.10.65. ఎత్తు 5.9 అడుగులు. రంగు, ఛామనఛాయ, చిరునామా నడియార్ పిళ్ళై, పిళ్ళై నిలయం, కాసర గౌడ గ్రామం, ఉప్పల గేట్ దగ్గర, కేరళ రాష్ట్రం. వివరాలు మరోసారి ఆ ప్రకటన మళ్ళీ, మళ్ళీ నా చెవిలో మారుమ్రోగుతోంది!

ఎదలో సముద్రఘోష మొదలైంది!

ఆటుపోట్ల ఘోష లేనిదే అది సముద్రం కాదు!

జ్ఞాపకాల ఘోష లేనిదే అది జీవితం కాదు!

చేసిన పొరపాటుకు పశ్చాత్తాప పడకపోతే, ప్రాయశ్చిత్తం చేసుకోకపోతే వాడు మనిషే కాదు. నేను చేసింది తప్పే అది నూటికి నూరు పాళ్ళ నిజం కూడా.

కానీ నేనున్న ఆ పరిస్థితుల్లో

అప్పటి తప్పనిసరి పరిస్థితిలో చేయగలిగింది ఏమీలేదు తప్పో ఒప్పో... నాకసలు క్షమాపణ ఉందో లేదో... అసలు నేను క్షంతవ్యుడిని అవునో కాదో... కాలమే చెప్పాలి. ఆదరంగా కన్నీళ్ళు తుడవాలి.. గ్రుక్కెడు ఓదార్పు నీళ్ళు తాగించాలి.

గతం కన్నీళ్ళ మధ్య అప్పటి దృశ్యం అస్పష్టంగా గుర్తుకొస్తోంది.

✡✡✡

హిందీ భాషా ఉపాధ్యాయుడిగా గవర్నమెట్ గిరి చేసి కొన్ని నెలల క్రితమే రిటైర్డ్ అయ్యాను. నేను ముగ్గురు ఆడపిల్ల తండ్రిని. సగటు తండ్రి పడే ఇబ్బందులూ, కష్టాలూ పడక తప్పింది కాదు. స్తోమతకు తగ్గ సంబంధాలతో ఇద్దరమ్మాయిల పెళ్ళిళ్ళు చేసే సరికి"పెళ్ళి చేసి  చూడు" అన్న సామెత నాకు సరిగా సరిపోయింది.

అప్పుల తిప్పలు కౌగలించుకున్నాయి, నా మధ్యతరగతి స్థాయిని ప్రశ్నిస్తూ. పై పెచ్చు రిటైర్డ్ అవడంతో అప్పుల ఆరళ్ళు ఎక్కువయ్యాయి.

ఫి.ఎఫ్. ఇతరత్రా కలిపి ఓ మూడు లక్షలవరకూ వచ్చాయి. దాంతో అప్పుల తాలూకు గొంతు పూర్తిగా నొక్కలేకపోయినా కొంత వరకు అణగదొక్కగలిగాను.

అప్పులు... చేసేటప్పుడు ఆలోచన రానివ్వదు... తీర్చాల్సినప్పుడు ఇబ్బందుల డప్పులతో నానా తంటాలు పడాల్సినంత ఆవేదన మిగులుతుంది, మర్మగర్భంగా!

ఇక మిగిలిందంతా చిన్నమ్మాయి పెళ్ళి!

కలక్టరేట్‌లో ఎల్.డి.సి.గా పనిచేస్తున్న అబ్బాయితో సంబంధం కుదిరింది చేతుల్లో అప్పులు తప్ప చెప్పుకో తగ్గ మొత్తం లేదు.

ఇక మిగిలింది ఇల్లు!

అమ్మేస్తే ఓ నాలుగు లక్షలు వరకూ రావచ్చు.

చిన్నమ్మాయిని సాగనంపి, నేను నా భార్య ఏదైనా అద్దె ఇల్లు తీసుకుని వచ్చే పెన్షన్‌తో కాలం గడపాలని నిర్ణయించుకున్నాం.

ఇల్లు బేరానికి పెట్టాం. కొద్ది రోజుల్లో ఆ పనీ పూర్తికావచ్చు.

అందుకేనా ఆఖరి కుమార్తె పెళ్ళి నిర్విఘ్నంగా జరగాలని ఆ ఆపదమొక్కులవాడిని వేడుకుందామని తిరుమల వెళ్ళాను.

తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంది!

ముందుగానే 50.రూ ప్రత్యేక దర్శనం కంకణం ధరించి ఉండటం వల్ల మధ్యాహ్నం రెండు గంటలకు దర్శన సమయం కేటాయించారు. అయినా పన్నెండు గంటలకే కంపార్ట్‌మెంట్లోనికి వదిలారు. గోవిందా... గోవిందా.. గోవిందా అంటూ భక్తులందరూ ముక్తకంఠంతో అంటూ ముందుకు కదిలారు. కంపార్ట్‌మెంట్‌లో అందరూ కూర్చున్నారు. నా ప్రక్కనే ఓ నడివయస్కుడు, అతని ప్రక్కనే పసుపురాసి, కుంకుమ బొట్లు పెట్టున్న ఓ మూట!

బహుశా హుండీలో వేయడానికి మొక్కుబడి మూట కాబోలు!

ఎందుకో అతని ముఖంలో ఆందోళనతో పాటు అలసట కనిపించింది.

ఎక్కడికైనా వెళ్ళినప్పుడు ప్రక్కవాళ్ళతో పరిచయాలు మామూలే!

ఆప్‌కిదర్‌సే ఆయా హై? ప్రశ్నించానతన్ని హిందీలో

కేరళాసే!

అతని సమాధానం

ఆప్‌కా నామ్,

నడియార్ పిళ్ళై

మేరానాం జయరామయ్య!

ఇలా సాగాయి మా సంభాషణలు,

గంట నిరీక్షణం తరువాత కంపార్ట్‌మెంట్ గేట్లు తెరిచారు

ఏడుకొండలవాడా... వెంకటరమణా... గోవిందా.. గోవిందా.. అంటూ వడివడిగా అందరూ ముందుకు కదిలారు.

దాదాపుగా లైను సగం కదిలాక నా చేతిలో ఏదో బరువైన వస్తువు ఉన్నట్లు అనిపించడంతో చేతిని సరిచూసుకున్నాను.

ఇంతకు ముదు నా ప్రక్కన కంపార్ట్‌మెంట్లో కూర్చున్న ఆ నడివయస్కులు నడియార్ పిళ్ళై మొక్కుబడి తాలూకు మూట అది!

ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు? పోనీ తిరిగి వెనక్కి వెళదామంటే క్యూలో విపరీతమైన రద్దీ! అయినా వదిలేసిన కంపార్ట్‌మెంట్లో ఇంకా ఎవరుంటారని? అతను నాతో పాటు ఈ లైన్లోలోనే ఉండవచ్చు... కానీ ఈ జనంలో ఎక్కడున్నాడని వెతకను?

అందుకే దైవదర్శనం తర్వాత అతని తరపున మొక్కుబడే మూటను హుండీలో వెద్దామని నిర్ణయానికొచ్చాను.

దర్శనానంతరం హుండీవైపు అడుగులేస్తుంటే... ఆ మూటలో ఏముందో చూడాలన్న కుతూహలం కలిగింది.

విమాన వెంకటేశ్వరుడి కెదురుగా ఉన్న నాలుగుకాళ్ళ మండపంలో ఓ మూలన కూర్చుని మూట విప్పి అదిరిపడ్డాను.

అన్నీ వెయ్యిరూపాయల సీల్డ్ నోట్ల కట్టలు ఓ పదివరకూ ఉన్నాయి... అంటే పదిలక్షలు!

గుండెదడ పెరిగింది, శరీరంలో సన్నటి ప్రకంపనలు మొదలయ్యాయి, దీనికి తోడు ఇప్పుడున్న ముందున్న సమస్యలు రెండు. ఒకటి నిజాయితీతో ఆ డబ్బులు హిండీలో వేయడమా?

రెండోది ఈ డబ్బుతో చిన్నమ్మాయి పెళ్ళి చేసి అప్పులు తీర్చేయడమా? కూతురి పెళ్ళికి అట్టే టైం లేదు! మరో నెలలో పెళ్ళీ! ఏం చెయ్యాలి? ఎటు మొగ్గాలి? నిజాయితీకా... లేక స్వీయ అవసరాలకా? భగవంతుడా.... ఇది తప్పో, ఒప్పో నిర్ణయించుకోలేకపోతున్నాను నన్ను క్షమించి! మూటను మళ్ళీ కట్టేసి గుడినుంచీ బయటపడ్డాను. గుడి ముందున్న దుకాణంలో ఓ బ్యాగ్ కొని అందులో ఆ మూటను వేసి భుజానికి తగిలించుకుని వెనుతిరుగుతున్నంతలో టి.టి.డి వారి ప్రకటన వినిపిస్తోంది.

యాత్రికులకు విజ్ఞప్తి

ప్రత్యేక దర్శనార్ధ 50 రూ. కంకణాలు ధరించిన శ్రీవారి దర్శనం కోసం పదవ నెంబరు క్యూ కంపార్ట్‌మెంటులో వేచి ఉన్న భక్తుడు నడియార్ పిళ్ళైగారు గుండెపోటుతో మరణించారు. అతని మృతదేహం అశ్వనీ హాస్పటల్ మార్చురీలో ఉంది దయచేసి అతని

సంబంధీకులు ఎవరైనా ఉంటే స్వామి వారి గుడి ఎదురుగా ఉన్న ఎంక్వయిరీ విభాగానికి రావలసిందిగా కోరుతున్నాం! మరణించిన భక్తుని వివరాలు అతని జేబులో ప్యాకెట్ డైరీ ఆధారంగా లభించాయి.

పేరు - నడియార్ పిళ్ళై

ఎత్తు - 5.9 అడుగులు

రంగు - ఛామన ఛాయ

చిరునామా - నడియార్ పైళ్ళై

కాసర్‌గౌడ్ గ్రామం

ఉప్పల్ గేట్

కేరళ రాష్ట్రం

టపాల్న చేతిలో ఉన్న బ్యాగును చూసుకున్నాను. ఆపై అనౌన్స్‌మెంట్ వినిపిస్తున్న వైపుగా చూసాను. చివరిగా గుడివైపూ చూసాను. ఎటు వెళ్ళాలో అర్థం కాని పరిస్థితి! తప్పో ఒప్పో ఆలోచించకు చేసేది చేసెయ్... కానిచ్చేది కానిచ్చేసేయ్.. డోంట్ స్టాప్ అంటిల్ రీచ్‌టాప్ అని మనసంటోంది.

జీవితమనే రన్నింగ్ రేసులో పరిగెట్టగలిగినంత వేగంగా పరిగెట్టెయ్ మనేది ఆశ!! కానీ ఆశ పేరాశగా మారితేనే ప్రమాదం అంటోంది నా ఆత్మ సాక్షి!

నాలోని లోపలి మనిషి మాత్రం ఏం నువ్వేం దొంగతనం చెయ్యలేదు కదా? ఎవర్నీ మోసం చెయ్యలేదు కదా.. అందుకే రైట్ ... రైట్.. అంటున్నాడు! అందుకే క్షమించు తండ్రీ అనుకుంటూ బస్టాండ్ వైపు కదిలాను. ఆ డబ్బుతో ఆఖరమ్మాయి పెళ్ళి జరిపించాను. అప్పులు తీర్చాను.

✡✡✡

ఉన్నఫళంగా అంత డబ్బు ఎక్కడినుంచీ వచ్చిందండి? అని ఎవరూ అడగలేదు ఒక్క నా భార్య తప్ప! ఎంతైనా సహధర్మచారిణి కదా! కౌగిళ్ళనే కాదు, కన్నీళ్ళనూ సమానంగా పంచుకున్న ఆమెకు ఆమాత్రం హక్కుంది! నిజం చెపితే అసహ్యించుకుంటుందేమో? పోనీ ఒక అబద్ధం చెపితే? మొదటిసారి అబద్ధం చెప్పడం చాలా సులువే.. గ్లాసుడు మంచినీళ్ళు గతగటా తాగినంత, కానీ ఆ అబద్ధాన్ని నిజం చేయడం కోసం వేలకొద్దీ మళ్ళీ అబద్ధాలు ఆడాలి. కుండల కొద్దీ పశ్చాత్తాప కన్నీటిని అంతరాత్మకు తాగించాల్సిందే! అందుకే అవసరం వచ్చినప్పుడు అంతా చెపుతాన్లే. అయితే ఒకటి మాత్రం నిజం. ఈ డబ్బు నేనెవర్నో మోసం చేసో, అన్యాయంగానో, దొంగతనంగానో తెచ్చింది కాదు మొఖం చాటేస్తూ అన్నాను.

"మరెక్కడిది?"

"ఆ అపదమొక్కులవాడే ఆదుకున్నాడనుకో" అటునుంచీ కదులుతూ అన్నాను. అయితే కూతుళ్ళు, అల్లుళ్ళు మాత్రం, చూసారా ఎప్పుడు ఏం కోరినా డబ్బుల్లేవని సణిగేవారు. మరి ఉన్నట్టుండి ఏ మదరి లాటరీ తగిలిందో అంటూ గుసగుసలు పోవడం గుట్టుగా విన్నాను.

ఆ లాటరీ పేరు నడియార్ పిళ్ళై అని ఎవరికి ఎలా చెప్పుకోను?

కూతుళ్ళు, అల్లుళ్ళు అలకల రథం ఎక్కి తమకు ఏమీ ఇవ్వలేదన్న కోపం గుర్రాల్ని కట్టి..స్వార్ధం కొరడా విసురుతూ వెళ్ళిపొయ్యారు.

బాధ్యతల బరువును దింపుకోగలిగినా, మనసు మాత్రం కుదుటపడలేదు. ఇక ఎప్పటికీ కుదుటపడదేమో?

అంతా భోజనం చేసి వెళ్ళిపోయారండి, మీరేలోకంలో ఉన్నారూ? అంటూ నా భార్య నన్ను కదిలిస్తూ అనటంతో ఉలిక్కిపడి ఆమెవేపు చూసాను. అయినా చెవిలో ఇంకా యాత్రికులకు విజ్ఞప్తి! నడియార్ పిళ్ళై.... ఆ అనౌన్స్‌మెంట్ నా చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంది. ఈ కాయాన్ని ఊపిరి ఖాళీ చేసేదాకా అలా సాగుతూనే ఉంటుందేమో?

భాధవేరు...భారంవేరు.... బాధతో చెలిమి చేసిన బతుకు భారం వేరు.

✡✡✡

## గణార్చన - కేసరి

అప్పుడే పథ్యం కానిచ్చి సోఫాలో వాలాడు - నారాయణ. కరెంటు లేదు. పదకొండింటికే ఎండ మండిపోతోంది. అతని అవస్థ చూసి -

"అలా దొడ్లో యేపసెట్టు కింద మడత కురిసీలో కూకో! నిదరోకుమీ! జొరం తిరగబెడుతుంది!" అంది ఎరకయ్య తల్లి దాలమ్మ.

చేతికందిన పత్రికల బొత్తి అందుకుని దాలమ్మ వేసిన కుర్చీలో చేరి, పేపర్లు తిరగేస్తున్నాడు నారాయణ.

ఆకలి చావులూ - హరాయించుకోలేని విందు వినోదాలూ, గూడులేని జీవాలూ - అవనీతి పునాదుల మీద ఆకాశ హర్మ్యాలు, నిరుద్యోగులకు ఆశల పల్లకీలూ - ఉద్యోగుల జీత భత్యాలకై సమ్మెలూ, రిజర్వేషన్లూ మెరిట్ వాదోపవాదాలూ, ఋణమేళాలూ - మాఫీలూ, నిర్వచనానికి అందని ప్రజా ప్రభుత్వాలూ - ప్రజల్ని భిన్న భిన్న వర్గాలుగా విభజించి పాలిస్తున్న పాలకులు - భస్మాసుర హస్తాలూ, సమస్యలను పరిష్కరించలేక పనికిరాని సమస్యలు సృష్టించి దేశపు పుట్టి ఏదో మునిగి పోతోందన్న భ్రమలకు ప్రజల్ని గురి చేస్తున్న నాయకులూ, ఏలికలూ, ఓటుకోసం తాయిలాలూ, సీటుకోసం తాపత్రయాలూ....

ఆ పైన పేపర్లు చదవ వెగటు పుట్టి, దేశం అంతా ఛండాలంగా ఉందనుకుని కళ్ళు మూసుకున్న నారాయణ - కొంతసేపటికి - ఎవరో తన దగ్గరలో తచ్చాడుతున్న అలికిడి విని, కళ్ళు తెరిచి.

"నిద్దరోటం లే!... కళ్ళు పీకి..." సంజాయిషీగా దాలమ్మతో అన్నాడు అతను.

"అది సరే! రావటమే... ఖాయిలా పడి వస్తివి... మనూరి ఇసేసాలేటి!?" అంటూ ఆత్రంగా ప్రశ్నల వర్షం కురిపించసాగింది - ఆమె. జవాబులు చెబుతూ కూర్చున్నాడు అతను.

అడిగిన ప్రశ్నలే అటు తిప్పి ఇటు తిప్పి అడుగుతోంది - ఆమె. ఆమెను పరిశీలనగా చూసి -

'బేగి.. ఓపాలిరా!! నారాయణా!' అంటూ కబురంపిన దాలమ్మ కనిపించింది ఆమెలో.

"తలకు మించిన అప్పులు చేసాడా!!" అంటూ కొప్పులో వేలెట్టి గోక్కోసాగింది ఆమె. ఫరవాలేదు చెప్పు - అన్నట్లు అతడు చూసిన మీదట -

"అమ్మ... వైద్యం సదువు ఇసయమై.. ఈడూ, కోడలు పిల్లా గొడవొడ్డారు!... అది అలిగి పుట్టింటికి పాయె!" అని గుసగుసగా చెప్పి, "ఏటో! గోల.. నువ్వోపాలి.. నువ్వు నారాయుడివి'... ఆడు నరుడు!" అంది ఆశగా చూస్తూ.

విషయం అర్థమైనట్టుంది నారాయణకి.

"నేను కబురంపేనని ఆడితో అనేవు సుమీ!" కొంపలంటుకుంటాయి అన్నట్టు చూసి, "ఏటి సేస్తవో!.. ఏటి సెబుతావో?... అంతా నీదే బారం. ఆళ్ళు కలిసి సల్లగా కాపరం సేసేలా సూడు. ఆడొచ్చే ఏలయ్యింది. కసిన్ని టీ నీళ్ళు కలిపివ్వనా!" అంటూ లోపలికి వెళ్ళిపోయింది దాలమ్మ.

✡✡✡

ఎరకయ్య నారాయణ కన్నా పదిహేనేళ్ళు చిన్నవాడు. వాళ్ళిద్దరిదీ ఒకే పల్లి. తండ్రి సిఫార్సు మీద, పట్నంలో ఎరకయ్య చదువూ, తన సంస్థలోనే అతగాడికో ఉద్యోగం - రిజర్వేషను కోటాలో - వేయించటమూ, పెళ్ళి లాంటి బాధ్యతలు నారాయణ తలకెత్తుకున్నాడు.

అంచేత నారాయణ మాట ఎరకయ్య తలాయించడని దాలమ్మకో నమ్మకం. నూటికి తొంభైపాళ్ళు ఆ విషయం నిజమే.

గడియారం రెండు గంటలు కొట్టింది. గాలి ఆడటం లేదు. కాలింగ్ బెల్ వినిపించింది 'ఎరకయ్య వచ్చినట్లుంది. కరంటు వచ్చినట్లుంది. ఫేను క్రింద కూర్చోవచ్చు' అనుకుంటూ ఇంట్లోకి వచ్చాడు - నారాయణ.

వచ్చింది ఎరకయ్యకాదు. అతని కూతురు అమ్మి ఉరఫ్ సుధారాణి - అల్లం మసాలా టీ వాసనా, ఆ వెనకాల టీ కప్పుతో - అమ్మి. కప్పు అందిస్తూ - తననే పరిశీలనగా చూస్తున్న నారాయణ రెండు చెవులూ చూస్తూ - "మీరెండు చెవులు బాగేనే ఉన్నాయే!" అంది నవ్వుతూ

పెదాల మీద చూపుడు వేలు నిలువునా పెట్టి, గుడ్లురిమి, కూర్చో అన్నట్లు తన ప్రక్క జాగా చూపాడు - నారాయణ. 'భోంచేసి వస్తా!' అన్నట్లు సైగ చేసి తుర్రుమంది - ఆమె.

టీపాయ్ మీద టీ అందుకుని కొద్దిగా చప్పరించాడు. ఏదో సత్తువ వచ్చినట్టయ్యింది. టీపాయ్ క్రింద అరలోని ఫైలూ, డైరీలు చదువరాదు అని తనంటే -

'చాల్లెండి, గురువుగారూ! ఇందులోవి నా స్వవిషయాలు కావు - 'మెరుపులు' - అంటూ బలవంతాన చదివించి, ప్రశ్నార్థకాలు ఉంచిన చోటు - అతనికి అర్థం కానివి - తన చేత వివరించుకోవటం నారాయణకి గుర్తొచ్చింది. డైరీలో.. మొదటి పేజీలో...

'అన్యాయం వల్ల లాభాలు పొందేవాళ్ళు వాళ్ళని అణిచి పారేయటానికి ప్రయత్నం చేస్తారు. అన్యాయాన్ని ఎదిరించేవారు చిట్టచివరికి అన్యాయాల వల్ల బాధపడేవాళ్ళే అవుతారు కానీ మరొకరు అవరు' - రావిశాస్త్రి అర్థం చేసుకున్న విషయం

మెడలోని రుద్రాక్షమాల చెమటకు చిరాకు పెడుతుంటే నారాయణ వాటిని తీసి టీపాయ్ మీద పెడుతుండగా, అటుగా వచిన 'అమ్మి' ఏదో మరచిన దానిలాగా వెనుదిరిగి.... తిరిగి తన పరుసుతో వచ్చి, అందులోంచి ఒక కాగితం తీసి నారాయణకు ఇచ్చింది, 'మీకు పనికొస్తుందేమో చూడండి' అన్నట్లు చూస్తూ. అది -

'శ్రీశ్రీ శ్రీ నూకల సుధాకరానంద స్వామిగారి మంగళా శాసనములతో - చీమల సంతర్పణ -గ్రహచారణ బాధ తొలుగుటకు, జాతకములో గ్రహస్థితులు బాగాలేనప్పుడు ఈదిగువ వ్రాయబడిన విధముగా సంకల్పము చెప్పుకుని చీమలకు సంతర్పణ చేయుచుండిన ఎడల దోషములు తొలిగిపోయి శుభఫలములు కలుగుచుండును.... పుత్ర సంతానము లేని వారూ, భార్య (లేక) భర్త అనుకూలము లేని వారూ పాపము చేసిన వారూ, పలుమార్లు కార్యభంగము నొందుచున్నవారూ - వారివారి ఇష్టానుసారముగా వారి వారి కష్టములను పోగొట్టుకొనుటకై... మమ ఇష్టపడే దేవతా / పార్వతీ పరమేశ్వరానుగ్రహ ప్రాప్యర్థం - ఏ రకమైన అభాగ్యులైతే ఆ అభాగ్య నివారణా, ఆ పైన 'అదృష్ట సిద్ధర్థ్యం, పిపీలకా గణార్చన మహిం కరిష్యే!' - అని సంకల్పము చెప్పుకొనుచు చక్కర గానీ నూకలను గానీ పుట్ట యందలి నల్ల చీమలకు సంతర్పణ చేయుచున్న పక్షమున వారి వారి ఇష్టార్థములు తప్పక సిద్ధించును మరియు చీమలకు సంతర్పణ చేయుచు శివాలయ మందును విష్ణాలయమందును దీపారాధనలను ప్రదక్షణ నమస్కారాదులను, ఆర్ద్రానక్షత్రము నందు రుద్రాభిషేకములు చేసిన ఎడల మిక్కిలి శీఘ్రముతో తప్పక కార్య సిద్ధి అగునని తెలియదగినది...'

"నీ చేతికెలా వచ్చింది!?" అడిగేడు నారాయణ.

"ఎలాగో ఓలాగ! మంత్రాలకు చింతకాయలు రాలుతాయటండీ!? కృషే ఫలి - అన్నారు మీలాంటి పెద్దలు" అంది నవ్వుతూ 'అమ్మి'

"సుధా!" కేక వినిపించింది. ఆ పైన ఎప్పుడొచ్చేడో ఉగ్రావతారంతో ముందు కొచ్చాడు - వీధి గుమ్మంలోంచి - ఎరకయ్య. బిత్తరపోయి కన్నీళ్ళ పర్యంతం అయ్యింది 'అమ్మి'.

"ఆగవయ్యా!... తాతనుకాబోతున్నాను కదా!... ఆటలు పట్టించుకోవటం నేర్పుతోంది. అవునా! అమ్మీ!" అన్నాడు నారాయణ - వాతావరణం తేలిక పరుస్తూ

"నిబ్బగా!? ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు.. నీ నోట తీపి బోయా!" అంటూ ఎంత వేగిరంగా హాల్లోకి వచ్చిందో అంత వేగంగానూ వంట ఇంట్లోకి దూరిపోయింది దాలమ్మ.

"భోంచేసి అర్జంటుగా ఆఫీసుకెళ్ళాలి. విశ్రాంతి తీసుకోండి. సాయంత్రం వేగంగా రావడానికి ప్రయత్నిస్తా!" అంటూ వంట ఇంట్లోకి దూరేడు - ఎరకయ్య. నారాయణ వేపు కృతజ్ఞతగా చూస్తూ వంట ఇంట్లోకి దూరింది - 'అమ్మి'.

వంటింట్లోంచి గద్దింపులూ.. క్షమాపణలూ వినవచ్చాయి. నారాయణ చిన్నగా నవ్వుకుంటూ, పేపరు కత్తిరింపులు అందుకున్నాడు.

ప్రస్తుతం రిజర్వేషన్ల మీద జరుగుతున్న దుమారం తాలూకా వార్తల, వాఖ్యానాల... సంపాదకులకు పాఠకుల లేఖల కత్తిరింపులున్నాయి. కొన్ని చోట్ల టిక్కు మార్కులూ, ఇంకొన్ని చోట్ల ఇంటూ మార్కులూ ఉన్నాయి. టిక్కులు ఎరకయ్యకు నచ్చిన అభిప్రాయాలు... ఇంటూలు అతను విభేదిస్తున్నవి.

వాటి క్రింద చీమల గూర్చిన వ్యాసం. వాటిలో కొన్ని పేరాలూ, వాక్యాలూ ఎర్ర పెన్నుతో అండర్ లైన్ చేసి ఉన్నాయి. ఎక్కడా ప్రశ్న గుర్తులు లేవు. 'శిష్యోత్సాహం' కలిగింది నారాయణకి. వాటిక్రింద ఇంకా ఏవేవో కత్తిరింపులు.

"వస్తానండీ!" అంటూ ఎరకయ్యా, "కోచింగ్ సెంటరు" కంటూ 'అమ్మి' బయటకు వెళ్ళిపోయేరు.

"బేపి!... బేపులు!! ... వాసన పసిగట్టేసాయి" అంటూ నిట్టూర్చింది. దాలమ్మ, వీధి తలుపు వేస్తూ.

✡✡✡

నారాయణ కళ్ళు మూతలు పడుతున్నాయి. మగత నిద్రలో అలలు అలలుగాఏవేవో దృశ్యాలు -

దేశంలో జనం ఎక్కడికక్కడ కురుపాండవ పక్షాల్లా రెండుగా చీలిపోతున్నారు - కాకపోతే వరప్రసాదితులూ... శాపగ్రస్తులులా...

....వాళ్ళల్లో ఒక చీలిక వారు ప్రాబల్యాన్ని పెంచుకుంటున్నారు. వారు ఏదో అదృశ్య హస్తం ప్రాపకంలో ఉంటున్నారు.

...రెండో తెగవారు నిరాదరణకు గురి అవుతున్నారు. వీరి తీక్షణ దృష్టి మొదటి వారి మీదే వీరిలో కొందరు నిరాదరణ గూర్చి -

'ఈ వివక్షత ఎంత కాలం!?' అని ఎలుగెత్తి అరుస్తున్నారు.

'పదవీ వ్యామోహాలు ఉన్నంత కాలం' ఎక్కడినుంచో నిర్లిప్తమైన ఓ జవాబు.

'అలాంటి వాళ్ళు కలకాలం ఉంటూనే ఉంటారు' మరో ఆక్రోశం.

'చూద్దాం!.. చూద్దాం... పాపం పండేకాలం రాకమానదు' అనునయింపు

'అరె! ఎప్పుడు?... ఎన్నేళ్ళకు!?' విసుగుతో కూడిన మూల్గులు.

"నాయనా!" అన్న దాలమ్మ పిలుపుతో కళ్ళు విప్పాడు నారాయణ.

'అమ్మ వచ్చింది" గుసగుసగా చెప్పి పారిపోయింది. ఆమె టైము నాలుగయ్యింది.

"ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా!" అని రాగం తీస్తూ, ఒక చేతిలో మాత్ర, ఇంకో చేతిలో నీళ్ళ గ్లాసుతో వచ్చింది - 'అమ్మి'.

"రా! రా!... కాబోయే డాక్టరమ్మా! రా...రా..." అన్నాడు కుర్చీలో సర్దుకుంటూ నారాయణ.

నీరసంగా నవ్వింది. 'అమ్మి', 'విషయాలు మీ చెవిని పడకపోయుంటాయా! అన్నట్లు చూస్తూ.

"కొంత అర్థమయ్యిందనుకో! కొంత అర్థం కాలేదు" అన్నాడు అతను.

"మీ కర్థం కాకపోవడమేమిటి!? మా నోట చెప్పించాలని కాకపోతే!" చిలిపిగా నవ్వుతూ

"అలాగని కాదు అమ్మ గూర్చి.. మామ్మ బేజారు...' అర్థోక్తిలో ఆగిపోయాడు అతను.

"ఫైలూ, డైరీలు చూసారు కదా! అమ్మకి నా మీద నమ్మకం లేదు" అంది 'అమ్మి'

"అలా అలా తిరగేసేను. అంతే!... పూర్తిగా చదవలేదు. అంచేత విషయం తెలియ రాలేదు. చెప్పురాదా!' అన్నాడు అతను. ఆమె నుంచీ ఉలుకూ పలుకూ లేదు.

"సరేలే! చెప్పకు. కానీ, ఈ విషయం చెప్పు. నాన్న అభిప్రాయం... నీ అభిప్రాయం ఏదో... ఒకటిలే. అది నీ మీద బలవంతంగా రుద్దలేదు కదా!!" అన్నాడు ఆమెను గుచ్చి గుచ్చి చూస్తూ. "లేదు"... నిజంగా!!"... "గాడ్ ప్రామిస్!" అంటూ కంఠముడి పట్టుకుంది అమ్మి. ఆ పైన -

"బయట పనుంది, వెళ్ళిరానా!" అంది అమ్మి. "ఊ!" అన్నాడు నారాయణ. తలుపుచాటున దీర్ఘంగా విశ్వశించింది దాలమ్మ.

✡✡✡

ఫైలు తిరగేయ సాగేడు - నారాయణ. టిక్కులూ, ఇంటూలూ, అండర్‌లైను చేసిన లైన్లూ, పేరాలు చదువుకుంటూ పోతున్నాడు. అతని కళ్ళు మూతలు పడిపోతున్నా చదవ సాగేడు - అతను. కళ్ళు పీకసాగాయి. చదవడం ఆపి -

'పిపీలకాది బ్రహ్మ పర్యంతం',... అంటే!? ... చీమల నుంచి దేవుడి వరకు చీమల నుంచి దేవుడి వరకు. చీమ... దేవుడు. చిన్నప్పుడు తన అమ్మమ్మ చెప్పిన పిట్ట కథ జ్ఞాపకం వచ్చింది. అతనికి.

పాము దేవుని దగ్గరకు వెళ్ళి, నేను ఏ జీవినైతే కుట్టుతానో... ఆ జీవి చనిపోవాలని వరం కోరిందట. తథాస్తు అన్నాడు దేవుడు.

విషయం తెలిసిన చీమ కూడా వెళ్ళిందట. నేను కుట్టిన వెంటనే చనిపోవాలందిట. దేవుడు నవ్వుకుంటూ తథాస్తు అన్నాడు.

చాలా తెలివిగా వరం కోరుకుంది పాము. (అందుకే కాబోసు జ్ఞానికి ప్రతీకగా పాముని గురించారు ఆర్యులు. ఆవేశపు చీమ కుట్టగానే తనే చస్తుంది. దీన్ని శ్రమ జీవిగా గుర్తించినట్లు జ్ఞాపకం)

బద్దెన కవి ఏమన్నాడు!? - తన పద్యంలో... 'చీమలు పెట్టిన పుట్టలు పాముల కిరువైనయట్లు'.... మరి వీటి రెండింటి మధ్య ఈ వ్యత్యాసం చూసేనేమో -

'బలవంతమైన సర్పము చలిచీమల చేత చావదె సుమతీ' అంటూ చీమలకు ఒక రకమైన న్యాయం చేకూర్చాడు, సుమతీ శతక కారుడు మరో పద్యంలో.

'బలవంతమైన న్యాయం చేకూర్చేడు. సుమతీ శతక కారుడు మరో పద్యంలో అలా అలా' ఏవో ఊహలు చేసుకుంటూ నిద్రలోకి జారిపోయేడు నారాయణ.

✡✡✡

చీమల లోకంలోకి వెళ్ళిపోయేడు నారాయణ. అక్కడ కన్నవీ.. విన్నవీ -

అక్కడ ఉపన్యాసకులూ, పంతుళ్ళూ, పాలకులూ, పాలితులూ లేరు. మార్గదర్శకులూ మతప్రవక్తలూ కనిపించలేదు. వ్యాపారులు లేరు. న్యాయస్థానాలు లేవు. సహజీవనమే వాటి గమ్యం. ఇలా... చీమలు కోట్లాది సంవత్సరాలై అవిచ్ఛిన్నంగా జీవిస్తున్నాయట...

చీమలకు వ్యక్తిగత బాధ్యత సమిష్టి బాధ్యత ఒకరు నేర్పినవి కావట. క్రమశిక్షణ, సంఘశ్రేయస్సు కొరకు ఆత్మార్పణ అనేవి పుట్టుకతో వచ్చిన మంచి లక్షణాలట. వేటి పని అవి ఐచ్ఛికంగా, యాంత్రికంగా చేసుకుపోతాయట... మానవుల్లో లాగే చీమల్లో కూడా కొన్ని పని దొంగలుంటాయట. ఇవి వీలు దొరికినప్పుడల్లా మోస్తున్న ఆహారాన్ని గుటకాయ స్వాహా అని దిగమింగుతాయట.

చీమల దూర దృష్టి అద్భుతమైనది. బారులుగా బయలుదేరి ఆహారయాత్రలు చేస్తాయి. అనుకూల ఋతువులలో ఆహారాన్ని నిల్వచేసుకుని కష్టకాలంలో దానిని వాడుకుంటాయిట. పుట్టలలో వాటికి ఆహారపు గాదెలు ఉంటాయి.

మానవుల్లాగే చీమలు కూడా యుద్ధాలు చేస్తుంటాయి. ఈ యుద్ధాలు కూడా ఆహారపు నిల్వల కోసమో, బానిసల కోసమో చేస్తుంటాయట.

ఒక జాతి నిల్వల కోసం మరో జాతి చీమలు దాడి చేసి యుద్ధం చేస్తాయిట నిల్వలు కొల్లగొడతాయట.

మానవుల్లాగే చీమల సంఘంలో కూడా బానిస విధానం దాపురించిందట. అమెరికాలోని ఒకరకమైన చీమలు సోమరివట. వీటికి పని చేయించుకోవటం తప్ప చెయ్యడం తెలియదు. ఇవి ఒక రకమైన కీటకాలు గూళ్ళపై దాడి చేసి వాటి గుడ్లనూ, కళ్ళు తెరవని పసి బిడ్డలనూ తస్కరిస్తాయి. అవి పుట్టగానే వాటిని బానిసలుగా మార్చుకుంటాయట. వాటి పాలు పిండుకుని తాగుతాయట. ఇతర పనులు చేయిస్తాయట. ఈ బానిసల కోసం కూడా యుద్ధాలు చేస్తాయిట.

"నాయనా!...టీ" అన్న దాలమ్మ పిలుపుతో బలవంతంగా బాహ్య ప్రపంచంలోకి వచ్చాడు - నారాయణ.

✡✡✡

చీకటి పడుతోంది - ఎరకయ్యా, అమ్మ వీధిలోంచి గబగబా వచ్చారు.

"గురువుగారూ! మీరు అర్జంటుగ బయలుదేరాలి. అమ్మగారికి బాగోలేదట. ఆఫీసుకి ఫోనొచ్చింది. గాభరా పడవలసిన పనేమీ లేదు. మిమ్మల్ని దిగవిడిచి, ఈ రాత్రికే నేను వెనక్కి వచ్చేయాలి" అన్నాడు హడావుడిగా.

"ఫరవాలేదు ఒక్కడ్నే వెళ్ళిపోగలన"ని ఇంటిల్లిపాదినీ ఒప్పించేసరికి తల ప్రాణం తోక కొచ్చేసింది - నారాయణకి. అతని సామాన్లు తానూ కూతురు సర్దుతూ -

"మీరెందుకు వచ్చేరో నాకు తెలుసు. అమ్మి... కోడలు పిల్లల విషయమై అమ్మి దాని అభిప్రాయం చెప్పే ఉంటుంది. ఇహ కోడలు - మెరిట్‌లో సీటు కాకపోతే, కోటాలో వస్తే ఒక ఏడాది కలిసొచ్చినా కలిసొస్తుంది కదా - అని ఆవిడ ప్రలోభం. అంతే.. ఆమెకు విషయాలు అంత వేగంగా ఇంకవు. మీకు తెలియందేముంది!" అంటూ నారాయణ బయల్దేర దీసేడు ఎరకయ్య.

అతగాడిని బిగికౌగిలిలో బంధించి వదిలేసేడు. నారాయణ అమ్మిని పిలిచి 'కీప్ ఇట్ అప్' అంటూ అమ్మి నుదుటున ముద్దు అద్దేడు. 'వస్తానమ్మా! నేనొచ్చి వెళ్ళేనని కోడలికి కబురంపు' అన్నాడు దాలమ్మను ఉద్దేశిస్తూ - అన్నీ సర్దుకుపోతాయిలే అన్న భరోసానిస్తూ.

ఎక్కడినుంచో ఘంటసాల భగవద్గీత వినవస్తోంది. అది ఆగి -

"శ్రీ శ్రీ శ్రీ నూకల సుధాకరానంద స్వామివారి ఉపన్యాసం ఇంకొద్ది నిముషములలో ప్రారంభం కానున్నది. కావున భక్తకోటికిదే మా ఆహ్వానం" వినవస్తోంది.

వీధి చివర ఆటో ఎక్కేడు - నారాయణ మిగిలిన వాళ్ళు అతనికి వీడ్కోలు చెప్పారు. గణార్చన గురించి ప్రసంగిస్తారు. కావున... " ఉదయం అమ్మి ఇచ్చిన కాగితం తీసి చూసేడు. మళ్ళీ చదివాడు. నవ్వుకుంటూ రోడ్డు మీద జారవిడిచాడు.

గతుకుల రోడ్డుమీద ఆటో ఊగిసలాడుతూ పోతోంది. అరగంట ప్రయాణం కళ్ళు మూసుకున్నాడు. కునుకు పట్టసాగింది - నారాయణకు.

✡✡✡

మగత నిద్రలో.. ఓ గుట్ట... గుట్ట మీద ఓ గుడి... గుడి చుట్టూ స్త్రీలు.. స్త్రీల చేతుల్లో రకరకాల పాత్రల్లో వారి వారి శక్త్యానుసారం నూకలో, చక్కరో,

ఊర్లోంచి గుట్ట మీదకి స్త్రీలు వరస కట్టుకున్నారు. పురుషులు అక్కడొకరూ ఇక్కడొకరూ. గుట్ట మీదకి భక్తులను బేచ్‌బేచ్‌లుగా పంపుతున్నారు కార్యకర్తలు.

కష్టాలన్నీ అబలలుకే!... గణార్చన చేస్తున్నది వారే! వారు స్త్రీలేనా!? కొన్ని చీరల మరుగున దాగినవి.. అవేంటి!? తెల్లగా ఉన్నాయి - ఖద్దరు వస్త్రాలులాగా ఉన్నాయి... మేలి ముసుగు క్రింద గాంధీ టోపీలున్నాయి... ముఖాలు గుబురు మీసాలతో భయంకరంగా ఉన్నాయి. ఎర్రెర్రని కళ్ళు.. మత్తెక్కిన కళ్ళు... కాంక్షల కళ్ళు...

చీమల పుట్టల్లో ఆహారపు నిల్వలు పొంగి పొర్లుతున్నాయి. చీమలు ఆహార యాత్రలు చేయటం లేదు - సునాయాశ లబ్ధి. అవి కష్టపడటం లేదు. సోమరులవుతున్నాయి.

స్వామివారు, ఇంకో ఊరికి తరలి పోయారు. సంతర్పణాలు ఆగిపోయాయి. నిల్వలు తరగసాగాయి. పరిస్థితి చేజారుతుందన్నప్పుడు చూసుకుందామన్న అలసత్వం పెరిగిపోతోంది. అయాచిత లబ్ధి చీమలకు.

గుట్టక్రిందా, ఊరిలోనూ చీమలకు ఆహారం లేదు. అవి ఈ పుట్టలమీద దాడి జరపసాగాయి. సోమరి చీమలు పరాజయం పాలయ్యాయి. వాటి నిల్వలు కొల్లగొట్టబడ్డాయి.

క్షతగాత్ర చీమలు... చెట్లు పట్టి, కొన్నాళ్ళకు.. బుద్ధి కలిగి, తిరిగి తమ తమ పుట్టలు చేరి సరికొత్త జీవితం ప్రారంభించసాగాయి.

స్వామివారు మళ్ళా వేంచేసారు. భక్తులు మళ్ళా పుట్టలు చేరారు.

సోమరి తనం పూర్తిగా వదలని చీమలు ఆశపడబోయి.... ఒకసారి తగిలిన చావుదెబ్బ గుర్తుకొచ్చి సంతర్పణలు అందుకోవటం లేదు.. పుట్టల్లోకి ఆత్రంగా చూస్తున్న భక్తుల కాళ్ళ క్రిందకు చేరాయి.. ఆపైన కసిగా కుట్టసాగాయి.

అమ్మీ, మీకంతే కావాలి... మీకంతే కావాలి - అన్నట్లు కేరింతలు వేస్తూ చీమల్ని ప్రోత్సహిస్తోంది.

అమ్మో! అంటూ సంతర్పణ కర్తలు పరుగులు పెట్టసాగారు.

నల్లచీమలు... చిన్ని చీమలు అర్భక చీమలు కుట్టటమేమిటి? అనుకున్న నారాయణకు తెలివొచ్చింది.

తమ స్వలాభాపేక్షతో గర్జన చేస్తూ, తమ మనుగడికే ముప్పు తెచ్చేవారిపై అవి ఎందుకు యుద్ధం ప్రకటించకూడదూ!? అవి ఎంత సాధు జీవులైనా!

'ఆడ చీమలొస్తున్నాయ్! కుడతాయి జాగ్రత్త!' అన్నాడు అప్రయత్నంగా నారాయణ

'అవి కుట్టాలి! లేకపోతే వాటికి భవితవ్యం లేదు' అని గొణుక్కున్నాడు అతను .

✡✡

# చెదిరిన కల - గంటి భానుమతి

కుటుంబాన్ని, చిన్నపిల్లల భారాన్ని అవలీలగా భుజానికెత్తుకుని, బాధ్యత అనే విలువను శిలువగా మోసిన రోజుల్లో కూడా నేను కుంగిపోలేదు.

కానీ శాంత ఈ ఇంట్లో కోడలి హోదాలో అడుగు పెట్టినప్పటినుంచీ ఏదో అలజడి. ఆమె మాటలు, చేతలు..తల్లిదండ్రుల గొప్పలు పదే పదే ఆమె నోట్లోంచి వస్తూంటే, మనసు కుంగి పోడం మొదలుపెట్టింది.

ఈ మానసిక సంఘర్షణకి ఫుల్ స్టాప్ పెట్టేయాలి. లేకపోతే ఈ సంఘర్షణకి నేనే బలి అయిపోయేలా ఉన్నాను.

యుద్ధం పక్కదేశంతోనో, శత్రువులతోనో అయితే చెయ్యచ్చు. కానీ యుద్ధం అనుక్షణం ఇంట్లో వాళ్ళతో అయితే..ఎలా జీవితం కొనసాగించగలను? ఇంకా పాకం ముదరకముందే, గాలివానా పెద్దదవకుండానే జాగ్రత్త పడాలి.

నా కూతురు శ్రావ్య పెళ్ళయ్యాక అత్తారింటికి వెళ్తూంటే ఇంట్లో ఎలా మసలుకోవాలో చెప్పాను.

ఇప్పుడు శాంత కి కూడా అలాగే చెప్పాల్సివస్తోంది. శాంత కోడలే..అయితేనేం, కూతురిగానే నేను భావించాను. కానీ ఆమె మాత్రం నాలో వాళ్ళ అమ్మని చూసుకోలేకపోతోంది..అది వేరే సంగతి.

ఈ ప్రపంచం, సమాజం, ఇంత ఆధునికతను చూపిస్తూ..అన్నివిధాలా అభివృద్ధి చెందుతూంటే, పాత కాలం అత్తాకోడళ్ళల్లాగా, పరోక్షంగా, ప్రత్యక్షంగా సూటిపోటీ మాటలనుకుంటూ కాలం గడిపేయడం నాకిష్టం లేదు.

అత్తా కోడళ్ళు అంటే స్నేహితుల్లా ఉండాలి. అన్నీ చర్చించుకుంటూ, మాట్లాడుకుంటూ, కలిసి బైటికి వెళుతూ హాయిగా నవ్వుతూ, తుళ్ళుతూ ఉండాలి. ఇది కలే కావచ్చు కానీ నిజం చెయ్యాలన్నదే నా తాపత్రయం.

మేం చదువుకున్న వాళ్ళం. ఇగోల కోణాల్లో ఇరుక్కుపోయి, అహంకారాల్ల ఉచ్చుల్లో ఊపిరిడకుండా బ్రతకాల్సిన ఖర్మ ఏం పట్టింది?

కోడలు ఈ ఇంట్లో ఎలా ఉండాలో చెప్పడానికి తాపత్రయ పడుతున్నానంటే, అది అత్త అనే పదం లోంచి వచ్చిన అహంకారం కాదు. చేజారిపోతున్న అభిమానాన్ని కాపాడుకోడానికి నేను పడుతున్న ఓ చిన్న తాపత్రయం మాత్రమే.

ఈ ఇంటి పెద్దగా, నా బాధ్యతగా కొన్ని శాంతితో చెప్పాల్సినవి ఉన్నాయి. ఆ తర్వాత తరానికి ట్రాన్స్ఫర్ చెయ్యాల్సిన కొన్ని అప్పగింతలూ ఉన్నాయి. కానీ ఇంతవరకూ అవకాశమే రాలేదు. ఎప్పటికప్పుడు నా మాటల్ని నా పెదవి దాటనియ్యని పరిస్థితులే ఎదురవుతున్నాయి.

కానీ ఇవాళ అనుకున్న సమయం వచ్చినట్లనిపించింది. ఇంట్లో శాంతి నేనే ఉన్నాం. సమయం జారిపోకముందే తొందరపడాలి.

శాంతి ని పిలిచాను.

"పిలిచారా అత్తయ్యా?" అంటూ వెంటనే వచ్చింది. సంతోషంతో ఉబ్బిపోయాను. అయినా గంభీరంగా చూసి, ఆమెను కూర్చోమన్నాను. కూర్చుంది.

పెద్ద ఉపోద్ఘాతం లేకుండానే, డైరెక్ట్ గా టాపిక్ లోకి వచ్చాను.

"చూడు శాంతీ, మనం అందరం ఈ ఇంటికి చెందినవాళ్ళం. ఈ కప్పు కింద ఉండవలసిన వాళ్ళం.

నేనొప్పుకుంటాను, మనది సమానస్థాయి వియ్యం కాదని. మన బేసిక్ కల్చర్ లోనే చాలా వ్యత్యాసం ఉందని. నువ్వూ, నా కొడుకు రాజేశ్ ప్రేమించుకున్నప్పుడు ఇవన్నీ నీకు అడ్డురాలేదు. కానీ మీ పెళ్ళయ్యాక ఇవన్నీ నీ నా సంబంధాల మధ్య అడ్డొస్తున్నాయి.

ఇంతవరకూ ఫరవాలేదు. చిన్న చిన్న ఫ్రిక్షన్స్ ని మాత్రమే చూశాను..తట్టుకున్నాను.

కానీ ఇంక మీదట అది పెద్దగా రాజుకుని మనల్ని మండించేంతటి పరిస్థితి రాకూడదు. నువ్వూ నేనూ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ అవతలి వాళ్ళ కోణం లోంచి కూడా ఆలోచిస్తూ, పరస్పరం గౌరవించుకుంటూ జీవిద్దాం.

నిన్ను ఇలా కూర్చోపెట్టి క్లాస్ తీసుకోవాల్సిన అవసరం ఏముందని నువు అనుకోవచ్చు. పెళ్ళిలో, పెళ్ళయ్యాక ఈ ఏడాదిలో నీవి, మీ పేరెంట్స్ మాటలు, బిహేవియర్ నన్ను, నా కూతురు శ్రావ్యని కష్టపెట్టాయి. వెనక్కి తీసుకురాలేని సంధించిన బాణాల్లాటి మాటలు అవన్నీ.

మేం కూడా అలా అనలేమా? అలా అనడం ఎదురుతిరగడం ఎంతసేపు? కానీ తర్వాత ఏం జరుగుతుందో ఊహించడం పెద్ద కష్టం కాదు. మాటల యుద్ధం మొదలవుతుంది. ఒకసారి మొదలయ్యిందంటే మాటల వాడకంలో పొదుపుండదు.

భాష కున్న పరిమితి చాలా తక్కువ. అయినాకూడా ఆ పరిమితిలోనే, అందులోనే ఆ మాటల్ని, మన సంబంధాల్ని,బాంధవ్యాల్ని, బంధుత్వాన్ని, కాపాడుకునే ఓ ఆయుధంలా వాడుకోవాలి.

లేకపోతే మాటమీద మాట పెరిగి ఎన్నో వస్తాయి. ఒక్కసారిగా మనసుకు కప్పుకున్న సంస్కారపు వలువలు, విలువలు జారిపోతాయి. అప్పుడు మనసు యొక్క నగ్నత్వం, అసలు స్వరూపం బైట పడిపోతుంది. నైతిక విలువలు పడిపోతాయి.

తెల్లారి లేస్తే మొహామొహాలు చూసుకోవలసినవాళ్ళం. మాటల విషయంలో పరిధి దాటకుండా ఉంటేనే మనకి మంచిది. లేకపోతే తప్పులు జరిగిపోతాయి.

మనం సంపాదించుకున్న జ్ఞానంలో తప్పులుంటే దాన్ని మనం సవరించుకోవచ్చు. జీవితంలో అతి ముఖ్యమైన పాత్ర వహించే నీతిలో అతిక్రమణలుంటే సరిదిద్దుకోగలవా? దానికి కాన్షస్ ఉండాలి.

బయట నుంచీ చూస్తే, ఈ ఇల్లు, కుటుంబం, మనుషులు ఎంతో బాగున్నట్లు కనిపిస్తున్నా, అది అద్దంలో మనం చూస్తున్న బింబం మాత్రమే అవుతోంది. ఇప్పుడిప్పుడే కుటుంబం అడుగునుంచి మెల్లి మెల్లిగా కుళ్ళడం మొదలవుతోంది.

ఎందుకంటే, శ్రావ్య వచ్చిన ప్రతీసారీ కళ్ళనీళ్ళతో వెళుతోంది. అసలు ఈ పరిస్థితి ఎందుకు రావాలి? మనలో మనకి ఎందుకింత అసమానతలు?

నువ్వూ, నేనూ, శ్రావ్యా అందరం ఒక జాతి వాళ్ళమే కదా! మనలోని రక్తం, మాంసం, కండ, చర్మం అన్నీ ఒకటే కదా! అలాంటప్పుడు మనం ఫ్రెండ్స్ లా ఉండాలికానీ ఈ హెచ్చు తగ్గులు ఎందుకు? కానీ నువ్వు మా మీద అధికారం చెలాయిస్తావు.

ఇక్కడే.ఇక్కడే నువ్వు నీ పరిధి దాటుతున్నావనిపిస్తుంది. నిజానికి నన్నూ, శ్రావ్యనీ అనే అధికారం నీకు లేదు. కానీ నిస్సహాయులం. ఇంతవరకూ జరిగిన దానికి నిన్ను క్షమించేసి ఓ అత్తగారిలా నా పెద్దరికం నిలబెట్టుకుంటాను.

జీవితాంతం కలిసి ఉండాల్సిన వాళ్ళం కాబట్టి మనం అడ్జస్ట్ అవాలి. లేకపోతే చాలా కష్టం.

పైగా నీదంతా టేకిట్ ఈజీ పాలసీ. కమిట్‌మెంట్ తక్కువ. నేనలా ఉండలేను. ఈ టేకిట్ ఈజీ పాలసీ వెనుక భరించలేనంత ఇన్‌సెక్యూరిటీ కొందరి కయితే, అహంకారం కొందరికి. దీని ఫలితం అనుభవించాల్సింది రేపో ఎప్పుడో కాదు, ఈ రోజే.

అందుకే, నువ్వు నేనూ మన సంబంధాల విషయంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుందాం. మధ్య మధ్యలో మన తప్పుల్ని, సరిదిద్దుకుంటు, జీవిస్తుంటే మనం మన అస్థిత్వాన్ని కాపాడుకోగలం. కుటుంబంలో కలతలు కూడా ఉండవు.

మన మనసులు ఇంకా కలుషితం కాకముందే, మనలో మనకి అంతర్యుద్ధం ఇంకా పెరగకముందే మేల్కోవాల్సిన సమయం

వచ్చింది.

ఇప్పుడు కనుక మేల్కొనకపోతే, ఈ విషయాల్ని దాటేస్తూ తాత్సారం చేస్తూ, రోజులు గడిపేస్తే, మనకి వ్యక్తిగత బద్ధకం వచ్చేస్తుంది. తర్వాత దానివల్ల కలిగే ఫలితాలకి విషాదం అని ఓ పేరు పెట్టుకుని ఆత్మవంచన చేసుకుంటూ బతకాల్సిన పరిస్థితి, దుస్థితి వచ్చేస్తుంది.

ఇవన్నీ ఈ ఇంట్లో జరగకుండా ఉండాలి.

మనం ఈ ఆధునిక యుగంలో ఉంటున్నాం. విశాలంగా ఆలోచించి ప్రతీదానికీ పెద్ద మార్జిన్ ఇవ్వాలి.

శాంతీ! నేను చెప్పింది పూర్తిగా అర్థం అయిందనుకుంటాను. నువ్వు ఈ ఇంటి కోడలువి కాదు. నా కూతురివి. నాతో ప్రతీ విషయం మీ అమ్మ తో ఎలా చర్చిస్తావో అలాగే చర్చించే స్వేచ్ఛ నీ కుంది."

శాంతి ఒక్కసారిగా లేచి నా చేతులు పట్టుకుంది.

"నిజం అత్తయ్యా, నేను చాల అజ్ఞానంగా ప్రవర్తించాను. ఈ క్షణం నించీ మనం అత్తా కోడళ్ళం కాదు..తల్లీ కూతుళ్ళం. ఆ బంధం నిలపడానికే ప్రయత్నిస్తాను."

నా కళ్ళు తడి అయ్యాయి. ఆనందంగా చూశాను. ఇదే.ఇదే నేను కోరుకున్నది. ఈ మార్పే ఓ తల్లిగా నాక్కావల్సింది. సంతృప్తిగా తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

"థాంక్యూ శాంతీ..థాంక్యూ..నన్ను, నా మనసునీ చాలా తొందరగానే గ్రహించావు...ఇప్పటినుంచీ ఈ ఇంటిని ఆనందనిలయం గా మార్చేద్దాం." అన్నాను విచలిత స్వరంతో.

"హలో.." అంటుంటే ఉలిక్కి పడ్డాను. ఎదురుగా శాంతి.

"ఏంటీ? మీలో మీరే మాట్లాడుకుంటున్నారు..." ఏదో లోకంలోంచి అప్పుడే ఊడిపడ్డట్టుగా అనిపించింది. అదే ఫీలింగ్ తో శాంతిని చూశాను. అయోమయంలో పడ్డాను.

శాంతి వింతగా నన్నే చూస్తోంది.

"మా మమ్మీ ఫోన్ చేసింది. డాడీ సింగపూర్ నుంచీ డైమండ్ నెక్లెస్, గాజులు తెచ్చారుట. వచ్చి తీసుకెళ్ళమంది. రాజేశ్ కి చెప్పాను మా ఇంటికి వచ్చేయమని. మేము రాత్రికి అక్కడే ఉంటాం. మీ వంట మీరు చేసుకోండి...." నా సమాధానం కోసం చూడకుండా, ఎత్తు చెప్పులు టకటక లాడించుకుంటూ వెళ్ళిపోయింది.

అంత పెద్ద హాల్లో ఒక్కదాన్ని అయిపోయాను.

శాంతి కి నేనేం చెప్పలేదా? మరి ఇంతవరకూ ఎవరితో మాట్లాడాను? నాలో నేనే మాట్లాడుకున్నానా? మరీ ఇంత డిప్రెషన్‌లోకి వెళ్ళిపోతున్నానా?

నేను పిలిస్తే శాంతి రాలేదా? శాంతి వచ్చిందని నేనెలా అనుకున్నాను? అయినా నేను చెప్పాలనుకున్నది పెదవి దాటకపోవడం ఇది మొదటి సారి కాదుకదా!

ఇవాళిది కాకతాళీయంగా జరిగింది కాదుకదా! తెలిసిందే జరిగింది. ఇందులో నిరాశ పడ్డానికేముంది? గెలవడం తెలుసు అన్న భ్రమలో ఉన్నాను. ఓడిపోయే ధైర్యం కూడా అందులోంచే వచ్చింది.మరో అవకాశం కోసం చూస్తాను.

శాంతి, వాళ్ళ మమ్మీ ఇంటినించి వచ్చాకా, దగ్గర కూర్చోపెట్టుకుని, అత్తా, కోడలు, ఆడపడుచు సఖ్యతతో ఫ్రెండ్స్ లా ఎలా ఉండాలో చెప్పాను.

ఇది కల ఐనా ఊహ ఐనా ఓ అందమైనది.

అలా అనుకుంటుంటుఉంటే, మళ్ళా మనసు కుంగిపోయింది, అది నిజం కాదేమోనని. నిరాశ చుట్టేసింది ఒక్క సారిగా.

రాలుతున్న కన్నీటికి అంకుశం వేయదల్చుకోలేదు.

దానికి స్వేచ్ఛ నిచ్చేశాను. ఇంక దానిష్టం.



# రంభ ... గంగ

- రాధిక నోరి

"అయితే ఇంక ఈ సంబంధం కూడా పోయినట్లే అన్నమాట' అనుకుంటూ నిరుత్సాహంగా సోఫాలో కూలబడింది పావని.

ఆఫీసు నుండి ఇంటికి వచ్చిన ప్రసాదరావుకి హాల్లో వంటరిగా టీవీ చూస్తూ పావని, స్టడీ రూంలో కంప్యూటర్ దగ్గర ఏదో పని చేసుకుంటూ సితార కనిపించారు. 'ఇవాళ ఈ సమయంలో తార ఇంట్లో ఉందే! ఇవాళ ఏమీ డేటింగ్ షెడ్యూల్స్ లేదా ఏమిటి' అన్నాడు హాస్యంగా పావనితో. ఈ మధ్య చాలా వారాలుగా శుక్రవారం సాయంత్రం అయ్యేసరికి సితార ఇంట్లో ఉండటం లేదు. అవాళ రొటిన్ తప్పటం అతని ఆశ్చర్యంగా ఉంది.

"ఇంక నేను రాఘవ్‌ని కలవను నాన్నా! అతనికీ, నాకూ కుదిరేట్లుగా లేదు' హాల్లోకి వస్తూ అంది సితార.

'అదేం? సడన్‌గా ఏమైంది?' ఆశ్చర్యంగా ప్రశ్నించాడు ప్రసాదరావు.

"ఏమైందా? మీ గారాల పట్టికి ఉన్నట్లుండి ఏదో బ్రైన్ వేవ్ వచ్చి 'ఒకవేళ మీవాళ్ళు వద్దన్నా కూడా నన్నే చేసుకుంటావా?' అని అడిగిందట. దానికేమో అతను దానికేమో అతను 'ఈ ప్రపంచం అంతా వద్దన్నా కూడా అందరికీ ఎదురు తిరిగన్నా సరే నిన్నే చేసుకుంటాను. నువ్వే నాకు సర్వస్వమూనూ' అంటూ ఉత్సాహం ఉరకలు వేస్తూ ఏమీ అనలేదట. మౌనంగా ఊరుకున్నాడట. అది మీ అమ్మాయికి నచ్చలేదు' సితార ప్రసాదరావుకి సమాధానం చెప్పేలోపే కోపంగా అనేసింది పావని. ఇలాంటి అర్థం పర్థం లేని కారణాలు చెప్పి మంచి సంబంధాలన్నిటినీ చేజేతులా పోగొట్టుకుంటున్నందుకు సితార మీద ఆమెకి గొంతుదాకా కోపంగా ఉంది. ప్రసాదరావుకి ఒక్క క్షణం పాటు ఇదంతా నిజమా లేక పావని తమాషాకి అంటోందో తెలియక తికమకగా అనిపించింది. ప్రశ్నార్థకంగా కూతురివైపు చూసాడు. 'అమ్మ అనవసరంగా నిరాశపడుతోంది. పిరికివాళ్ళని, మొహమాటస్తులనీ చేసుకుని తర్వాత బాధ పడేకంటే ఇప్పుడే తెంపేసుకోవటం అన్నివిధాలా అందరికీ మంచిది' అంది సితార.

'దీంట్లో అమ్మ ఇంతగా బాధ పడటానికి ఏముంది? మేజర్ ఇష్యూస్ వచ్చినపుడు మరి ఎలా సరిపెట్టుకుంటాం?' అనుకుంది మనసులో.

'ఏమిటే పిరికితనం? నీ తలతిక్క ప్రశ్నలన్నిటికీ ఇంక జవాబులు చెప్పటమేనా అతని పని? అడగటానికి నీకు బుర్ర లేకపోయినా మర్యాదస్తుడు కాబట్టి నీ అతితెలివి ప్రశ్నలని వదిలేసి ఊరుకున్నాడు. సహనవంతుడు కాబట్టి కోపాన్ని చికాకుని పైకి వ్యక్తం చేయకుండా మౌనం వహించాడు. ఇది నీకు పిరికితనంలా అనిపిస్తోందా? అసలు నువ్వేం ఆశిస్తున్నావు అతని దగ్గరనుంచి? నాకు తల్లితండ్రులు లేకపోయినా ఫరవాలేదు. నువ్వొక్కదానివి ఉంటే మాత్రం ఉంటే చాలు అని ఎగిరి గంతేసి చెప్పాలా? తారా! నీకు తెలుసో లేదో మంచి కొడుకు కాలేని మగవాడు మంచి మొగుడు కూడా కాలేడు. తల్లితండ్రులనీ, తోడబుట్టినవారినీ ప్రేమించలేని మగవాడు రేపు పెళ్ళయిన తర్వాత భార్యాబిడ్డలని మాత్రం ఏమాత్రం ప్రేమించగలడు? కుటుంబవిలువలు మొదటగా ఇంట్లోంచే, తల్లితండ్రుల దగ్గరనుండే మొదలవుతాయి. అది గుర్తుపెట్టుకో.. అయినా అత్తమామలు లేకపోయినా ఫర్వాలేదు. మొగుడొక్కడూ నావాడయితే చాలు అవి ఇంతగా అనుకునేదానివి. మరి అందరూ ఉన్న సంబంధం కావాలి ఒక్కడే సంతానమైతే వద్దు. తోడబుట్టినవారు కూడా ఉండాలి అని అడిగావు ఎందుకు? పొట్లపాదుకి పొరుగు గిట్టదు అన్నట్లుగా అమ్మ, నాన్న, అన్న, చెల్లి ఎవరూ లేని బికారిని చూడమని ధైర్యంగా

అడిగేయచ్చుగా?‘ కోపంగా, ఆవేశంగా అంది పావని. కక్షగా సితారని ఇంకా ఏదేదో అని తిట్టేయాలన్నంత ఉక్రోషంగా ఉంది. బలవంతాన తనని తాను అదుపులో పెట్టుకోవటానికి ప్రయత్నిస్తోంది.

పావని ఇలా ఆవేశపడటానికి కారణం ఉంది. ఏమయిందంటే ఆ మధ్య ఎవరో ఒక సంబంధం చెప్పారు. కుర్రవాడు మంచివాడు, బాగా చదువుకున్నవాడు, రూపసి, ఏదో కంపెనీకి డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. మంచి కుటుంబం, అన్నీ బాగున్నాయి కదా అనుకుంటే, అతను ఒక్కడే కొడుకు, తోడబుట్టినవాళ్ళు ఎవరూ లేని ఏకైక కుమారుడు నాకు వద్దు అంది సితార. అన్నీ మనం కోరుకున్నట్లు దొరకవు. ఇది మరీ అంత సరిపెట్టుకోలేని లోపం ఏమీ కాదు అని ఎంత నచ్చ చెప్పినా సితార వద్దంటే వద్దు అని మొండిపట్టు పట్టడంతో పావని, ప్రసాదరావులు ఏమీ చెప్పలేకపోయారు. ‘పోనీలే, అందరూ ఉన్న కుటుంబంలోకి వెళ్ళాలని అనుకుంటోంది, అలా కోరుకోవటం కూడా మంచిదే కదా! అదీగాక అందరూ ఉంటే దానికి అండదండగా కూడా ఉంటుంది‘ అనుకుని సరిపెట్టుకున్నారు.

కానీ అలా అనటంలో సితార ఉద్దేశం పూర్తిగా వేరుగా ఉంది. ఒక్కడే కొడుకైతే ఆ తల్లితండ్రుల ఆశలన్ని వాళ్ళమీదే ఉంటాయనీ. భవిష్యత్తులో వారి మంచి చెడ్డల బాధ్యతలన్నీ  అనివార్యంగా మారే అవకాశం ఉందని ఆమె భయం. ఆమెకేమాత్రము ఇలాంటి కుటుంబ ఒత్తిళ్ళలో ఇరుక్కోవటం ఇష్టం లేదు. అందుకే అలా అంది. అలా ఆ సంబంధం పోయింది. ఇప్పుడేమో ఇంకేదో వింత కారణం చెప్పి ఈ సంబంధం వద్దంటోంది. ఆలోచిస్తుంటే చాలా నిస్పృహగా ఉంది పావనికి. ఆమెకి ఇదివరకు సితార వద్దన్న సంబంధాల వివరాలన్నీ ఒక్కొటొక్కటిగా గుర్తుకొస్తున్నాయి. ఒకసారి తెలిసినవారెవరో వాళ్ళ కజిన్ ఒక అబ్బాయి హార్వర్డ్‌లో పి.హెచ్.డి చేస్తున్నాడు. మంచి కుర్రవాడు. మంచి కుటుంబం అని చెప్పారు. వివరాలు అన్నీ బాగున్నాయికదా అని అనుకుంటే ఆ అబ్బాయి పిహెచ్‌డి ఆస్ట్రానమిలో చేస్తున్నాడని తెలిసి సితార వద్దు అంది. పైగా ‘నాన్నా! Astronomy లో పిహెచ్‌డి అట. ఇంక రేపటినుండీ ఆ చుక్కల్లోనే ఇల్లు అంటాడేమో!‘ అంటూ వాళ్ళ నాన్నతో హాస్యమాడుతూ పగలబడి నవ్వింది. సితార అన్న తీరుకి ప్రసాదరావుకి కూడా నవ్వు ఆగలేదు. పావనికి వాళ్ళిద్దరి నవ్వు వేళాకోళం చూస్తుంటే కోపం ముంచు కొచ్చింది. ” Astronomy అంటే మీ ఇద్దరికీ ఏదో అల్లాటప్పా చదువులాగా అనిపిస్తోంది కాబోలు. చాలా  గణితశాస్త్రంతో ముడిపడి ఉంటుంది తెలుసా? తెలిసీ తెలియని మిడిమిడి తెలివితో ఎదుటివారిని చూసి అలా వేళాకోళం చేయటం గొప్పేమీ కాదు. ఏమండీ! దానికేదో తెలియదు అనుకుంటే మీరు కూడా దానితో సమానంగా ఆ నవ్వేమిటండి? దానికి బుద్ధి చెప్పాల్సినది పోయి మీరు కూడా దానితో చేతులు కలుపుతారా?‘ అంటూ కోపంగా అరిచింది మొగుడి మీద. ప్రసాదరావు పావని కోపాన్నీ, చికాకునీ గ్రహించాడు.

”ఓకే ఓకే తారా! Let us get serious. Astronomy అంటే…” అంటూ ఇంకొ ఏదో అనేలోనే ‘నాకు తెలుసులే నాన్నా! నాకేమీ ఇంట్రెస్ట్ లేదు ఆ సబ్జెక్ట్‌లో, ఆ కెరీర్‌లో. ఇలా మొదట్లోనే ఇంట్రెస్ట్‌లలో తేడాలు వచ్చినప్పుడు ఇంక ముందుకి వెళ్ళటంలో అర్థం ఏముంటుంది?‘ అంటూ అక్కడి నుండీ లేచి వెళ్ళిపోయింది సితార. ప్రసాదరావు,పావనిలు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు ఏం చెయ్యాలో తెలియక. ఒకసారి ఎవరింట్లోనో ఏదో పార్టీలో ఒకబ్బాయిని చూపించారు సితారకి. వాల్ స్ట్రీట్‌లో ఏదో కంపెనీకి వైస్ ప్రెసిడెంట్ గా పని చేస్తున్నాడు అతను. దర్జాగా బాగా బారుగా, చూడటానికి చాలా బాగున్నాడు. అయినా నాకు నచ్చలేదంది సితార. ఎందుకని అడిగితే ముందు కారణం చెప్పలేదు. తర్వాత ‘వాళ్ళ ఫాదర్ బ్రదర్‌ని చూసాను. వాళ్ళకి బాగా బట్టతల. ఈ అబ్బాయికి కూడా నుదిటి మీద జుట్టు ఇప్పుడే వెనక్కి వెళ్ళిపోతోంది.. ఇంకో రెండేళ్ళలో ఇతనికి కూడా ఖచ్చితంగా బట్టతల వచ్చేస్తుంది. జుట్టులేనివాడు నాకొద్దు‘ అని మెల్లిగా అంది. వింటున్న పావనికి కోపం ముంచుకొచ్చేసింది. ‘తారా! ఇంత అతి తెలివి పనికిరాదు. భవిష్యత్తులో అతనికి బట్టతలే వస్తుందో, ఇంక వేరే ఏదన్నా వస్తుందో నీకు తెలియదు. తెలియనివాటిని ఊహించుకుని ఇప్పుడు ఉన్నవాటిని వద్దనుకునే అవివేకిని నిన్నే చూస్తున్నాను‘ అంది కోపంగా. ‘బంగారంలాంటి పిల్లాడు, ఇది వంక పెట్టనివాళ్ళు అసలు ఈ భూప్రపంచంలో ఎవరైనా ఉంటారా ‘ అనుకుని చికాకుపడింది. బెంగ కూడా పడింది.

'అమ్మా!!!!ఆ జుట్టు తెల్లబడితే రంగు వేసుకోవచ్చు. కానీ అసలు జుట్టే లేకపోతే ఎలాగ? ఇంత చిన్న వయసు నుండీ విగ్గుల మీద ఆధారపడాలా?' అంటూ పావని కంటే ఎక్కువ చికాకు ప్రదర్శించింది సితార. అలా ఆ సంబంధం పోయింది.'

ఇంకోసారి ఇంకో సంబంధం గురించి ఎవరో చెప్పారు. అబ్బాయి ఇంజినీరింగ్‌లో పి.హెచ్.డి చేసి ఆస్టిన్, టెక్సస్‌లో యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. కానీ సితార న్యూయార్క్ లో తన ఉద్యోగం వదిలేసి టెక్సాస్ కి మారనంది. 'తారా! ఇంక ఇలా నగర పరిమితులు కూడా పెట్టుకుంటే ఇంక నీకు పెళ్ళేలా అవుతుందనుకుంటున్నావు?' అని పావని విసుక్కుంటే 'అమ్మా! ఎప్పటినుండో పనిచేస్తున్న ఇంత మంచి కంపెనీ, ఇంత పెద్ద పొజిషన్ వదులుకుని ఇంకో స్టేట్‌కి వెళ్ళమంటావా? పోనీ అది కూడా ఏ లాస్‌ఏంజిల్స్‌లాంటి పెద్ద పెద్ద సిటీ కూడా కాదు. ఆస్టిన్ లాంటి ఒక మారుమూల చిన్న ఊళ్ళో నా ఫాషన్ డిజైనింగ్‌కి ఏం ఫ్యూచర్ ఉంటుంది? ఇన్నేళ్ళు చదువుకుని, జాబ్ చేస్తూ మంచి కెరీర్‌ని తయారుచేసుకున్న తర్వాత ఏదో పల్లెటూరుకి అదంతా వదిలేసి మారిపోతే ఇంక ఆ కెరీర్ అంతా పోయినట్లే కదా! ఇన్నేళ్ళ చదువు, కష్టం వ్యర్థం అయినట్లే కదా!' అంటూ ఎదురు ప్రశ్న వేసింది సితార.

'తారా! పెద్ద చదువులు చదివిన వాళ్ళు అనేక రకాలైన హద్దులు పెట్టుకుంటే ఇంక నీకు పెళ్ళి కావటం చాలా కష్టం. బాగా ఆలోచించుకో. నీ చాయిస్ చాలా రిస్ట్రిక్టెడ్ అయిపోతోంది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకుని ఏమీ లాభం లేదు' విసుగ్గా అంది పావని. తను ఎంత వద్దు అంటున్నా వినకుండా దానికి దేంట్లో ఇంట్రెస్ట్ ఉంటే అదే చదవనీ అప్పుడే రాణించడానికి అవకాశం ఉంటుంది' అంటూ భర్త సితారని ఫాషన్ డిజైనింగ్ లో చేరటానికి సరే అనడం గుర్తొచ్చి మొగుడి మీద తెగ కోపం వచ్చింది పావనికి. 'అంతా అయిపోయిన తర్వాత ఇంక ఇప్పుడు ఏమనుకుని ఏమి లాభం' అనుకుంటూ నిట్టూర్చింది. ఇంకోసారి అయితే ఒక అబ్బాయితో మాట్లాడటం మొదలు పెట్టిన మూడో రోజే వద్దనేసింది సితార. ఎందుకు అని అడిగితే 'తిక్క ప్రశ్నలన్నీ వేస్తున్నాడమ్మా! నీ ఫాషన్ డిజైనింగ్ టీమ్ లో ఎంతమంది మగవాళ్ళు ఉన్నారు? మీరందరూ తరచుగా బయటవాళ్ళలో మీటింగులకీ వాటికీ వెళుతూ ఉంటారా? ఇప్పుడు మేల్ మోడల్స్ చాలా పాపులర్ అవుతున్నారు. నీకు అలాంటివారు ఎంతమంది తెలుసు? అంటూ డబ్బా వాగుడంతా వాగాడు. ఇలాంటి అనుమానం పక్షి నాకస్సలు వద్దు' అంటూ సితార తెగ చికాకు పడింది'. నిజంగా అనుమానం నైజమే అయితే వద్దులే. కానీ అతని ఉద్దేశం ఏమిటో పూర్తిగా తెలియకుండా, నువ్వే ఏదో ఊహించుకుని అతన్ని పొరపాటుగా అపార్థం చేసుకుంటున్నావేమో! కొంచెం నిదానంగా....' అంటూ పావని ఏదో అనబోతే సితార తల్లి చెప్పేదో పూర్తి చేయనీయకుండా మధ్యలోనే ఆపేసింది. 'పొరపాటు, అపార్థం ఏమిటమ్మా అతని అనుమాన బుద్ధి అంత స్పష్టంగా తెలుస్తూంటే? పెళ్ళన్నా మానేస్తాను కానీ ఇలాంటి సిక్ మనిషిని మాత్రం చచ్చినా చేసుకోను' అంటూ అక్కడినుండీ లేచి వెళ్ళిపోయింది సితార.

ఇంకొక సంబంధం ఏమో అంతా బాగుందని అనుకున్నారు. ఆ అబ్బాయి, సితార చాలా రోజులు చనువుగా తిరిగారు.. చివరికి ఒకరోజు ఆ అబ్బాయితో నాకు కుదరదని చెప్పేసింది సితార. ఎందుకంటే పెళ్ళయిన తర్వాత కూడా ఇంకా డాన్స్ చేస్తావా? అని ఆశ్చర్యంగా అడిగాడట. అంటే పెళ్ళయిన తర్వాత డాన్స్ కంటిన్యూ చేయటం అతనికిష్టం లేదన్నమాట. ఇది సితారకి నచ్చలేదు. డాన్స్ కంటిన్యూ చేయటం, మానటం తన ఇష్టం కానీ, వద్దు అనీ, చేయరాదని ఆంక్షలు పెట్టే మొగుడు నాకు వద్దంది. తనెంతో ఇష్టంగా ఇన్నేళ్ళు నేర్చుకుని, అనేక శ్రమ ప్రయాసలకోర్చి, ప్రాక్టీస్ చేసి ప్రదర్శనలిస్తున్న తన నాట్యాన్ని కేవలం వివాహం కోసం వదులుకోలేను. అసలు అయినా నా ఇష్టాఇష్టాలను గౌరవించలేని వ్యక్తి నాకొద్దు అంది. పావని ప్రసాదరావులకి ఏమనాలో తోచలేదు.

'ప్రతిదానికీ ఏదో ఒక వంక పెడతావు. ప్రతీ వంకా ఒక పెద్ద సమస్యే అంటావు. ఇలా వచ్చిన సంబంధాలన్నిటినీ వంకలు వెదికి వద్దు అంటూంటే ఇంక అసలు నీకు ఎవరు నచ్చుతారు? ఈ జన్మలో నీకు పెళ్ళవుతుందా?' అని పావని దిగులుగా అంటే, 'అవకపోయినా ఫరవాలేదు. పూర్తిగా నచ్చనివాడిని మాత్రం చచ్చినా చేసుకోను' నిర్లక్ష్యంగా అనేది సితార.

'అదే, అలా పూర్తిగా నచ్చినవాడంటూ అసలు ఎవరైనా ఉంటారా అని అనుమానం వస్తోంది. పోనీ ఇండియాలో బోలెడు మంచి సంబంధాలు ఉంటాయి అంటే నువ్వేమో వద్దంటావు. అక్కడివారితో అన్ని విషయాలలోనూ తేడాలే, సర్దుకోవడం ఇద్దరికీ కష్టమే. వద్దు

అంటావు. తారా! ఒక్క విషయం గుర్తుపెట్టుకో. ఈ ప్రపంచంలో పరిపూర్ణమైన మనిషంటూ ఎవరూ ఉండరు. ప్రతీవారిలోనూ ఏదో ఒక లోపం ఉంటుంది. ఆమాటకొస్తే నీలో లేవా లోపాలు? ఏదో ఒక ఉందని అందరినీ ఇలా వద్దంటే చివరికింక నీకు ఎవ్వరూ మిగలరు. ఏదో ఒక విషయంలో సరిపెట్టుకోకుండా ఏ సంబంధమూ కుదరదు. నువ్వు ఇలా అర్ధం పర్ధం లేని కారణాలకి ఆలస్యం చేసినకొద్దీ ఆ తర్వాత నువ్వు ఇప్పుడు గాఢంగా వద్దు అనుకున్నవాటినే చాలా బాధాకరంగా సరిపెట్టుకుని ఒప్పుకోవాల్సిన అవకాశం చాలా ఉంటుంది. అప్పుడు నువ్వు సరిపెట్టుకున్నా అవతలివాళ్ళు నిన్ను వద్దనే ప్రమాదం రావచ్చు. అందుకని పెద్దవాళ్ళం చెపుతున్నాం. మా మాట విను‘ అని పావని లేని సహనాన్ని తెచ్చి పెట్టుకుని నచ్చచెప్పటానికి ప్రయత్నించేది.

‘అసలు ఇంత హిరణ్యాక్ష వరాలు కోరేవారు. ఇన్ని నిర్దిష్టమైన షరతులు ఉన్నవారు వారికి వారే చూసుకోవాలి అబ్బాయిలను. అమ్మా నాన్న చెప్పినవాళ్ళు నచ్చనప్పుడు వాళ్ళ స్వంత సెలక్షన్ లో ఇష్టమైనవారు దొరకవచ్చేమో కదా!‘ అంటూ పావని విసుక్కుంటూ ఉంటే సితార ఏమీ అనకుండా అక్కడినుండీ లేచి వెళ్ళిపోయేది. ఆమెకి కూడా మొదట్లో తనకి నచ్చినవాడిని తనే వెతుక్కోవాలని ఉండేది. కానీ ఇలా వారికి వారే ఎన్నిక చేసుకుని, court ship చేసి పెళ్ళి చేసుకున్నవారు ఆ తర్వాత కలతలు, కొట్లాటలతో విడిపోయిన తన స్నేహితులని చూసి భయపడింది. కొంతమంది అమ్మాయిలు అమెరికన్ అబ్బాయిలను కూడా చేసుకున్నారు. మొదట్లో ఆ అబ్బాయిలు ఇండియన్ కల్చర్ అంటే చాలా ఇష్టం. ఫాసినేషన్ చూపించేవారు. కానీ రానురాను అన్ని విషయాలలోనూ తేడాలు మరీ ఎక్కువై ఇద్దరికీ ఏ విషయంలోనూ పొసగక, పోట్లాటలు మరీ ఎక్కువై విడిపోయిన స్నేహితులు చాలామంది ఉన్నారు. ఇవన్నీ చూసి సితార నిజంగా చాలా భయపడింది. కానీ అమ్మా నాన్న పరిచయం చేసిన అబ్బాయిలకు చదువు, ఉద్యోగం, సంపాదన, ఫ్యామిలీ బాక్‌గ్రౌండ్ అన్నీ బాగానే ఉంటున్నాయి కానీ, ఏమిటో, వారి స్వభావాలే తనకి నచ్చటం లేదు అనుకుని బాధపడుతోంది సితార. పావని కూడా చాలా దిగులు పడుతోంది కూతురి పెళ్ళి గురించి. ఆలస్యం అయిన కొద్దీ ఆందోళన కూడా ఎక్కువ అవుతోంది ఆమెకి.

అంబర్ ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. పార్వతి భోజనం వడ్డిస్తూ ‘ఇవాళ ఇంత ఆలస్యం అయిందేమిరా? ఇందాకటినుండీ నిద్ర ఆపుకుంటున్నాను అంది.

‘స్వీటీతో బయటికి వెళ్ళానమ్మా! తనని వాళ్ళింటి దగ్గర దింపి వచ్చేసరికి కొంచెం ఆలస్యం అయింది‘ అన్నాడు మెల్లగా అంబర్. ఈ మధ్య అంబర్‌కి ఈ డైలాగు పరిపాటి అవటంతో పార్వతికేమీ కొత్తగా అనిపించలేదు.

‘అంబర్! మీ ఇద్దరూ ఒక నిర్ణయానికి రావటానికి ఇంకా ఎన్నిరోజులు కావాలి? ఇంకా ఎన్నాళ్ళు ఇలా తిరిగితే ఒకరికొకరు బాగా తెలుస్తారని అనుకుంటున్నారు?‘కొంచెం అసహనంగా ప్రశ్నించింది పార్వతి. ఇప్పటి పిల్లలు తమలాగా పెద్దలు చూపించినవారిని మౌనంగా చేసేసుకోరు. వారంతట వారు మాట్లాడి పరిచయం పెంచుకుని ఎన్నిక చేసుకోవాలి. ఈ సంగతి ఆమెకు తెలుసు. కానీ అలా అని ఇన్ని నెలలపాటు అడ్డు, అదుపు లేకుండా తిరిగి తీరా నాకు నచ్చలేదు అంటే అమర్యాదగా ఉండదు కద అని ఆమె బాధపడుతోంది.

‘ఇవాళ ఆ విషయమే మాట్లాడుకున్నాం అమ్మా!‘ అన్నాడు అంబర్.

‘అవునా? మరి ఏమని నిర్ణయించుకున్నారు?‘ ఆతురతగా అడిగింది పార్వతి. కొడుకు నోటి వెంట ఆ శుభవార్త ఎప్పుడెప్పుడు వింటానా అని ఆమెకు చాలా ఆతృతగా ఉంది.

‘ఏమీ లేదు, స్వీటీకి ఇష్టమే అనుకుంటాను. కానీ నాకే పూర్తిగా సమ్మతిగా లేదు‘ నెమ్మదిగా అన్నాడు అంబర్.

‘లేదా? సరే, నీకు నచ్చలేదు అంటే ఇంక మేము ఏం అంటాం? కానీ కొంచెం ప్రాక్టికల్‌గా ఆలోచించి ఎందుకు వద్దని అంటున్నావో సరిగ్గా తేల్చుకో. రూపం నచ్చలేదా?‘ తన నిరుత్సాహాన్ని పైకి కనిపించనీయకుండా నెమ్మదిగా అడిగింది పార్వతి. పొంగే పాలమీద నీళ్ళు చల్లినట్లుగా ఉంది ఆమె పరిస్థితి.

‘లేదమ్మా! స్వీటీ చాలా అందంగా ఉంది‘.

'మరి గుణం నచ్చలేదా? మీ ఇద్దరి ఇంట్రెస్ట్‌లు కలవలేదా?'

'గుణం, ఇంట్రెస్ట్‌ల ప్రసక్తి కాదమ్మా. అవన్నీ బాగానే ఉన్నాయి.'

'మరింకేం కారణం అంబర్?' ఆశ్చర్యంగా ప్రశించింది పార్వతి.

'ఎందుకో ఆ అమ్మాయితో నాకు క్లిక్ కాలేదమ్మా!' నెమ్మదిగా అన్నాడు అంబర్.

'క్లిక్కా? అంటే ఏమిటి? రూపం బాగుంది గుణం కూడా బాగుంది అంటున్నావు చదువు ఫ్యామిలీ ముందే బాగున్నాయని మనందరికీ తెలిసిన విషయమే! ఇంకా ఈ క్లిక్ కాకపోవటం ఏమిటిరా?'అయోమయంగా అడిగింది పార్వతి. అంబర్ మాటలు అర్థం కాక ఆమెకి నిజంగానే మతిపోతోంది. అది ఏమిటో విడమరచి చెప్పటానికి అంబర్‌కే అసలు స్పష్టత లేదు. అన్నీ బాగానే ఉన్నా స్వీటీని చూసినా, కలిసినా, మాట్లాడినా, ఈ అమ్మాయే తనకి కావాలని, ఈ అమ్మాయి కోసమే తను ఇన్నేళ్ళూ ఎదురు చూసిందని తన మనసుకు అనిపించటం లేదు. అది ఎలా చెప్పాలో తెలియటం లేదు అతనికి. ఒకవేళ కష్టపడి చెప్పినా తల్లితండ్రులకి అర్థం అవుతుందన్న నమ్మకం అతనికి లేదు. ఈ కన్‌ఫ్యూజన్ ఎలా తీర్చాలో అతనికి తెలియటం లేదు. ఎందుకంటే అతనికే అసలు పెద్ద అయోమయంగా ఉంది.

పార్వతికి ఇలాంటి సంఘటనే ఇంకోటి, ఆ మధ్య జరిగింది గుర్తుకు వచ్చింది. ఏదో పెళ్ళి సంబంధం ఉంది అమ్మాయి బాంక్‌లో పనిచేస్తోంది చూడటానికి చాలా బాగుంటుంది అని ఎవరో చెపితే అంబర్ తండ్రితో కలిసి బాంక్‌కి వెళ్ళాడు ఆ అమ్మాయిని చూడటానికి. తీరా ఇంటికి వచ్చిన తర్వాత ఆతురతగా ఇంట్లో ఎదురు చూస్తున్న పార్వతితో నచ్చలేదని చెప్పాడు అంబర్. ఆ తర్వాత 'సన్నగా లేదు' అన్నాడు నిరుత్సాహంగా. 'సన్నమా? సన్నంగానే ఉందిగా? ఇంకా ఏం సన్నం? రేపు ఇంట్లో పనిపాటలు చేసుకోవటానికి ఏమన్నా ఓపిక ఉండాలా? లేక గట్టిగా గాలి వీస్తే పడిపోయేంత పుల్లలాగా ఉండాలా? కొంచెం రియలిస్టిక్‌గా ఆలోచించు' అంటూ తండ్రి విసుక్కున్నాడు అంబర్ మీద.

'అంబర్! పోనీ గోవర్ధనం అంకుల్ సంగతి ఇంకోసారి ఆలోచించు. మీ నాన్న చాలా సంతోషిస్తారు' అంది పార్వతి భోజనం ముగించి కుర్చీలో కూర్చుంటున్న కొడుకుతో గోవర్ధనం గారు, రావుగారు చిన్నప్పటినుండీ స్నేహితులు. పిల్లలు పెద్దవారైన తర్వాత వియ్యమంది ఆ స్నేహాన్ని ఇంకా గట్టిపరచుకోవాలని వారిద్దరికీ పెళ్ళికాకముందు నుండీ ఎప్పుడూ అనుకునేవారు. కానీ కాలేజీ చదువైన తర్వాత గోవర్ధనంగారు అమెరికా వెళ్ళిపోయారు. అయినా చాలామంది లాగా సంపద, అతిశయం ఆయన స్నేహాన్ని భంగపరచలేదు. చేసిన వాగ్దానాలను మరిచిపోయేలాగా చేయలేదు. అమెరికా నుండీ ఇన్నేళ్ళబట్టీ ఎప్పటికప్పుడు ఫోన్లు చేస్తూ ఉత్తరాలు రాస్తూ స్నేహితునితో టచ్‌లోనే ఉన్నారు. కానీ వారిద్దరూ ముచ్చటపడి చేసుకున్న వాగ్దానాన్ని అమలులో పెట్టడానికి మాత్రం అసలు మనిషి అంబర్ అడ్డు వచ్చాడు. 'అమెరికా సంబంధం నాకు వద్దు నాన్నా! నా స్వశక్తితో నేను విదేశాలు వెళ్ళాలి కానీ పెళ్ళాం ద్వారా వెళ్ళటం నాకిష్టం లేదు' అన్నాడు పైకి చెప్పలేదు కానీ అలా వెళితే ఆ అమ్మాయి వారి కుటుంబ సభ్యుల దృష్టిలో తనెక్కడ చులకన అయిపోతానేమోనని అతని భయం. అంతేకాక అమెరికాలో పుట్టి పెరిగిన పిల్ల అణిగిమణిగి ఉంటుందో లేదోనని కూడా అతని సందేహం. 'ఈ అర్థం పర్థంలేని స్వాతిశయం పెట్టుకోకు. మా గోవర్ధనం నీకు తెలుసు. ఎంత సింపుల్ మనిషో, ఎంత మంచివాడో నువ్వే అనేకసార్లు కలిసావు. వాడి కూతురుని కూడా ఇన్నేళ్ళ బట్టీ చూస్తూనే ఉన్నావు. మాట్లాడుతూనే ఉన్నావు. ఎంత మంచిగా, మర్యాదగా ఉంది ఆ అమ్మాయి? గర్వం పొగరూ ఉన్నట్లుగా ఎప్పుడైనాఅనిపించిందా నీకు? నీ సందేహాలన్నీ కేవలం నిరాధారాలు మాత్రమే!' అన్నాడు తండ్రి. ఆయన ప్రశ్నలకి అంబర్ ఏమీ సమాధానం చెప్పలేదు. 'నా స్వశక్తి వల్ల తప్ప పెళ్ళాం ద్వారా మాత్రం నేను చచ్చినా అమెరికా వెళ్ళను' అని మాత్రం గట్టిగా మనస్సులో నిర్ణయించుకున్నాడు. పైకి మాత్రం 'అమ్మా! ఛార్టెడ్ ఎకౌంటెంట్‌గా బాగా పేరు తెచ్చుకుంటున్నాను. ఇంత చిన్న వయసులోనే బాగా సంపాదించి సెటిల్ అవుతున్నాను ఇప్పుడు ఇవన్నీ వదిలేసి అమెరికా వెళ్ళి మళ్ళీ ఓనమాలతో జీవితం మొదలెట్టమంటావా?' విసుక్కుంటున్నట్లు అన్నాడు తల్లితో. పార్వతి ఏమీ మాట్లాడలేదు. ప్రతిదానికీ ఏదో ఒకటి

చెపుతున్నాడు. వీడికి ఇంకొక సంబంధం వచ్చింది. అమ్మాయి న్యూట్రిషన్‌లో పిహెచ్‌డి చేస్తోంది. కానీ పిహెచ్‌డీ చదివిన అమ్మాయి తనకి వద్దన్నాడు అంబర్. 'నాకంటే నా భార్య ఎక్కువ చదివినా, నాకంటే ఎక్కువ సంపాదించినా నాకేమీ సమస్య లేదు. నా మీద నాకు ఆ మాత్రం ఆత్మవిశ్వాసం లేకపోలేదు. కానీ ఆ అమ్మాయి స్వభావం ఏమిటో? ఇప్పుడు ఏవో కారణాల వల్ల, ఒప్పుకున్నా భవిష్యత్తులో తెలియని పరిస్థితుల ప్రభావం వల్ల సరిపెట్టుకోలేక పోవచ్చు. నాలాగా పిహెడి లేనివాడిని ఎందుకు ఒప్పుకున్నానా అని అప్పుడు బాధపడచ్చు. అందుకని వద్దు ఇంకొక సంబంధం. వివరాలన్నీ బాగున్నాయి. ఆ అమ్మాయితో ఒక నెలరోజులు పాటు మాట్లాడాడు కూడాను. ఇదేదో అవుతుందేమోనని ఆశపడుతున్న తరుణంలో వద్దనేసాడు అంబర్. 'ఆ అమ్మాయి యాటిట్యూడ్ నాకు నచ్చలేదు. చాలా ఇండిపెండెంట్‌గా ఉంది. ప్రతీదానికీ పారాసైట్‌లాగా ఇతరులమీద ఆధారపడాలని నేను అనను కానీ మరీ ఇంత ఇండిపెండెంట్ గా కూడా ఉండకూడదు. పైగా ఇంక పెళ్ళైన మరునాటి నుండీ నేను, నా మొగుడు ఒకటి, తక్కినవారంతా పరాయివారు అనుకునే స్వభావంలాగా ఉంది. నాతో పాటు నావారు కూడా తనవారే అనుకునే అమ్మాయి కావాలి. కుటుంబంలో కలిసిపోయే అమ్మాయికావాలి కానీ ఇలా కుటుంబ విలువలని గౌరవించలేని అమ్మాయి నాకు వద్దు' అన్నాడు అంబర్. తల్లితండ్రులు ఇంకేమటారు? ఏమీ అనలేకపోయారు. 'అయ్యో' అనుకుని నిట్టూర్చారు.

ఇంకొకసారి ఇంకొక అమ్మాయితో మాట్లాడటం మొదలు పెట్టాడు అంబర్. వారానికి ఒకసారి కలవటంతో మొదలయి రెండు రోజులకి ఒకసారి కలవటం దాకా పరిచయం పెరిగింది. వారాలు, నెలలు గడుస్తున్నాయి కానీ అంబర్ మాత్రం అస్తమానూ 'ఇంకా ఏదీ నిర్ణయించుకోలేదు' అనేవాడు. చూసి చూసి ఇంక విసుగొచ్చి ఒకరోజు రావుగారు అన్నారు 'అంబర్! ఒక మనిషితో ఎంత ఎక్కువ సమయం గడిపితే వారి గురించి అంత ఎక్కువ తెలుస్తుంది అని అనుకుంటున్నావు కాబోలు. ప్రతిసారీ అది నిజం అవ్వాలని లేదు. ఎంత తెలిసినా ఒక మనిషి గురించి మనకి తెలియని విషయాలు ఎప్పుడూ ఉండనే ఉంటాయి. అమెరికా లాంటి దేశాలలో పెళ్ళికి ముందే కొంతమంది కలిసి జీవిస్తారు. అయినా పెళ్ళైన మరునాడే డైవర్స్ లంటారు. దాన్నేమంటావు? ముందు మనకి ఏం కావాలీ అన్నది స్పష్టంగా ఆలోచించుకోవాలి. ఆ కోరికల లిస్టు ఎంత సింపుల్ గా ప్రాక్టికల్‌గా ఉంటే అంత తేలికగా, తొందరగా అన్వేషణ ముగిసే అవకాశం ఉంది. లేటు అయిన కొద్దీ ఒక్కొక్కసారి పరిస్థితులు ఇంకా కాంప్లికేటెడ్‌గా అవుతాయి. అసలు ఎంత జాగ్రత్తగా ఉన్నా పెళ్ళి అన్నది చీకట్లోకి బాణం వేయటం వంటిది. ఎంత ఏకాగ్రత చూపించినా అదృష్టం ఉంటే గురి తగులుతుంది లేకపోతే లేదు' ఎంతో అనుభవంతో సహనంగా చెప్పారు.

అంబర్ ఏమీ అనలేదు. ఒక వారం రోజుల తర్వాత మాత్రం 'ఆ అమ్మాయికి నో అని చెప్పేసాను' అన్నాడు. కారణం ఎందుకో మాత్రం చెప్పలేదు. అడిగితే ఏమనుకుంటాడో అని తల్లితండ్రులు కూడా ఏమీ ఇఅడగలేదు. ఆ టైం రాలేదు. మనదేం ఉంది అని ఎంత సరిపెట్టుకోవాలనుకున్నా మరి అయినవరికి, కనీసం అప్పుడప్పుడన్నా బాధగా ఉంటుంది కదా! ఏవన్నా లోపాలు ఉండటం వలన పెళ్ళిళ్ళు కుదరటంలేదు అంటే అర్థం ఉంది కానీ అన్నీ ఉండి కూడా ఏదీ కుదరటం లేదేమిటి? ఇంకా ఆ ఘడియ ఎప్పుడు వస్తుందో? అని వాళ్ళు ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ ఆ టైంలో వాళ్ళు మరిచిపోయినదేమిటంటే కొన్ని కొన్నిసార్లు అన్నీ ఉండటమే అన్నిటినీ మించిన లోపం. ఎందుకంటే అన్నీ ఉన్నవారి ఎక్స్‌పెక్టేషన్స్ కూడా చాలా ఎక్కువగా ఉంటాయి. మరి ఏదో ఒకదానికన్నా సరిపెట్టుకోవటానికి సిద్ధంగా లేకపోతే ఇదిగో ఇలాగే పెళ్ళిళ్ళు కుదరటం ఆలస్యం అవుతుంది. అసలు ఈ రోజుల్లో పిల్లల్లో సరిపెట్టూకోవటం అన్నది చాలా తక్కువైపోతోంది. 'మాకేం తక్కువ? మేం ఎందుకు సరిపెట్టుకోవాలి? అన్నీ ఉన్నవారు వచ్చేదాకా మేం వేచివుండగలం, కానీ ఏ విధమైన అసంతృప్తితో మాత్రం పెళ్ళికి సిద్దపడం' అని అంటారే తప్ప అసలు ఈ ప్రపంచంలో ఏ బంధం అయినా కాంప్రమైజ్ మీదే ఆధారపడి ఉందన్న సత్యాన్ని వారు గ్రహించరు. వారు ఊహించుకుని, కలలు గని, ఆశపడ్డ మిష్టర్.ఫర్‌ఫెక్ట్, మిసెస్.ఫర్‌ఫెక్ట్ ఈ ధరణిలో ఎవ్వరూ ఉండరన్న చేదు నిజాన్ని నగ్న సత్యాన్ని వారు ఒప్పుకోరు. మనిషన్న ప్రతీవారికీ ఏదో ఒక లోపం ఉంటుంది. ఈ చేదు నిజాలను నిజాలుగా ఒప్పుకోవటానికి వారికి వారి అహం అడ్డు వస్తుంది.

పెళ్ళి పందిరి కళకళలాడుతోంది. సన్నాయి మేళం వీనుల విందుగా మార్మ్రోగుతోంది. అందరూ హడావిడిగా తిరుగుతున్నారు. అందరి ముఖాల్లోనూ ఎగ్జైట్‌మెంట్, సంతోష సరదా ఉట్టిపడుతున్నాయి. పెళ్ళి పీటల మీద వధూవరులిద్దరూ కూర్చుని పురోహితుడు చెపుతున్నట్లు ఏవో పూజలు చేస్తున్నారు. ఆహ్వానితులలో కొంతమంది కబుర్లలో మునిగిపోయారు.

'వధూవరులిద్దరూ కొంచెం వయసు ముదిరినవాడిలాగా కనిపిస్తున్నారు కదూ!' అంటోంది ఒకావిడ.

'అవును, చాలా ఏళ్ళ బట్టీ చూస్తున్నారట సంబంధాలు బహుశా అన్నిటికీ ఏవో వంకలు పెట్టి ఆలస్యం చేసుకుని ఉంటారు. ఈ రోజుల్లో పిల్లల తీరు చూస్తూనే ఉన్నాంగా!' అంటూ ఇంకొకావిడ ఊహించేసింది.

'అమ్మాయి కొంచెంలావుగా ఉంది కూడాను' అసంతృప్తిగా అంది ఒకావిడ.

'అమ్మాయి డాన్స్ చేసి ప్రదర్శన లిచ్చేదట అది మానేయగానే ఒళ్ళు వచ్చేసిందట పాపం అందుకే ఏ సంబంధమూ కుదరక వాళ్ళు అమెరికాలో ఉంటున్నా చివరికి ఇండియా సంబంధం ఒప్పుకున్నారట' ఇంకొకావిడ తనకి తెలిసినదంతా చెప్పేసింది.

'అబ్బాయికి వెనకాల జుట్టంతా ఊడిపోయి పూర్తిగా బట్టతల అయిపోయింది' ఒకావిడ చాలా అసంతృప్తిగా అంది.

'పోనీలెండి బట్టతల అని ముందు నుచీ ఏమీ తెలియటం లేదుగా! ముఖం బాగానే అనిపిస్తోందిగా! వెనకాల కాస్త జుట్టు ఊడితే మాత్రం ఏం నష్టం ఉంది?' ఆమాత్రమన్నా సరిపెట్టుకోలేకపోతే ఎలాగ అన్నట్లు ఇంకొకావిడ వెంటనే సమాధానం చెప్పేసింది.

'అబ్బాయి ఒక్కడే కొడుకనుకుంటాను. మరి ఈ వయసులో ఉన్న తలితండ్రులని ఇక్కడే వదిలేసి అమెరికా వెళ్ళిపోతే వాళ్ళను ఎవెవరు చూస్తారు?' అడిగింది ఒకావిడ.

'ఏమో! అసలు ఎవరో ఒకరు చూడాలని ఏముంది? ఇంక అలా అనుకుంటే పెళ్ళిళ్ళు ఎలా అవుతాయి? అమెరికా వెళ్ళే అవకాశం వదులుకుంటారా ఎవరైనా?' అని తిరుగు ప్రశ్న వేసింది ఇంకొకావిడ.

'అమ్మాయేమో అమెరికాలో అబ్బాయేమో ఇండియాలో అసలు ఎలా కలిసిఈ రోజుల్లో పిల్లలు మాట్లాడాలంటారు. కనీసం కొన్నిరోజులపాటన్నా కలిసి తిరగాలంటారు. మరి వీళ్ళిద్దరికీ అదెలా సాధ్యమైంది?'వీళ్ళిద్దరికీ? ఆశ్చర్యంగా ఆరాతీసింది ఇంకొకావిడ.

'అమ్మాయివాళ్ళ వివరాలన్నీ ఇంటర్‌నెట్‌లో చూసి అబ్బాయి కాంటాక్ట్ చేసాడట. చాలా రోజులు కరస్పాండెన్స్ చేసుకుని చివరకు అమ్మాయివాళ్ళు ఇండియా వచ్చినప్పుడు చూసి, ఇష్టపడి చేసుకుంటున్నారు. ఈ రోజుల్లో ఇంటర్ నెట్ ద్వారా అవని పనులంటూ ఏమీలేవు. చివరికి పెళ్ళిళ్ళు కూడా ఇట్టే కుదిరిపోతున్నాయి' అని తనకి తెలిసినదంతా చెప్పేసింది ఇంకొకావిడ.

'చాలా రోజులు అమ్మాయి ఇండియా సంబంధం వద్దని, అబ్బాయేమో అమెరికా వెళ్ళనని చాలా సంబంధాలు వద్దనుకున్నారంట. తీరా బాగా ఆలస్యం అయి, వయసు ఎక్కువైపోతుందని సరిపెట్టుకుని ఇంక సరే అనుకున్నారనుకుంటాను. ఇంతకీ రాసిపెట్టి ఉంది. ఆ టైం వస్తే తావలచింది రంభ, తామునిగింది గంగ అన్నట్లుగా ముందు వద్దు అనుకున్నవారే ఇట్టే అన్నిటికీ ఒప్పుకుంటారు. ఇదే ప్రాప్తం అంటే!' అని తీర్మానించింది ఇంకొకావిడ.

ఇంతలో మంగళ సూత్రధారణ సమయం వచ్చింది. అందరూ సంతోషంగా వదూవరుల వైపు చూస్తున్నారు.
వారిపై వేయటానికి అందరి చేతుల్లోనూ అక్షింతలు ఉన్నాయి.

అంబర్ సితార మెడలో మూడు ముళ్ళూ వేస్తున్నాడు.

# "ఏనాటికి - ఏ తీరున "

- డి.విశ్వేశ్వరి

**ఇలా గోదావరి** ఒడ్డున నిలబడి ప్రపంచాన్ని చూడటం నాకలవాటైపోయింది. అలవాటే కాదు - ఇదే నా జీవితం - ఎన్నాళ్ళ నించి చూస్తున్నానో, ఎన్ని మార్పులను గమనిస్తున్నానో లెక్కపెట్టటానికి నాకేకాదు. ఆ బ్రహ్మకైనా సాధ్యంకాదేమో, ఆనందాలు, అల్లర్లు, విషాదాలు - ఎన్నెన్నో నాకళ్ళముందే జరిగిపోతుంటే నేను సాక్షిగా ఉంటున్నాను.

గోదావరిలో ఈతకొట్టే పిల్లలు, గట్లమీద పొదలలో పరాచికాలు, సరసాలు ఆడుకునే యువతీయువకులు, వ్యవహారాలు, కష్టసుఖాలు చర్చించుకునే పెద్దలు, ఎందర్నో చూశాను. ఆ పిల్లలు పెద్దలు కొందరు ఇక్కడే అప్పుడప్పుడు కనిపిస్తుంటారు. సరసాల జంటలు కొందరు ఇల్లు నిలుపుకుంటే, మరికొందరు ఈ గోదావరిలోనే కలిసిపోయారు. ఏడిచే పెద్దవాళ్ళను మోసం చేసి ప్రియురాల్ని గోదాట్లో ముంచిన ప్రియుడ్ని నిశ్శబ్దంగా గమనిస్తుంటాను.

గూటిపడవలో అత్తారిళ్ళకు వెళ్ళే కొత్త పెళ్ళికూతుళ్ళ సిగ్గులు. నిగ్గులు పోల్చేందుకు ఈ ప్రపంచంలో మరొక వస్తువు ఉండదేమో! బావమరదుల పరాచికాలలో మునుగుతూ, తన జీవితంలోకి కొత్తగా వచ్చి, మనసంతా ఆక్రమించుకున్న పడతి పాదాల పారాణినైనా చూడాలని తహ తహలాడే పెళ్ళికొడుకుల మొహాలు నాకు గుర్తున్నాయి. తమకేదో సామ్రాజ్యం లభించినట్టు పొంగిపోయి, తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో అర్ధాంగిని పలకరించాలనే ఆ కుర్రదొరల తహ తహ నాకుగాక ఇంకెవరికి తెలుస్తుంది? ఆ రోజులు, ఆ ఆనందం, ఆ మురిపెం ఇప్పుడెక్కడున్నాయి?

గూటిపడవలు పోయాయి, మోటారులాంచీలు వచ్చాయి. ఆ తరువాత కర్రవంతెన కొన్నేళ్ళు, ఆ పైన సిమెంటు వంతెన వచ్చాయి. బస్సులు, కార్లు వచ్చాయి. వేగం పెరిగింది. జీవితంలో వేడుక తగ్గింది. ఊరు, ఊళ్ళో జనం - అన్నింటా మార్పు వచ్చేసింది. పెద్దలు కాలగర్భంలో కలిసిపోతున్నారు. యువకులు పొట్టచేతబట్టుకుని చదువులని. ఉద్యోగాలని ఊరొదలిపోతున్నారు. వాళ్ళలో చాలా మందిని నేను మళ్ళీ చూడలేను. జీవితం, కాలం పరుగెడుతూనే ఉన్నాయి.

ఎదురుగా వస్తున్న రాయుడుగారు, నారాయణగారు ఎందుకబ్బా గంభీరంగా ఉన్నారు. కాస్త సాగితే పోలా! ఏం మాట్లాడుకుంటున్నారో తెలుస్తుంది.

"బావా! కొడుకు దగ్గరకు వెళ్ళటం వరకు బాగానే ఉంది ఇల్లెందుకు ఇప్పుడే అమ్మటం? ఎప్పుడైనా నువ్వొస్తావనే ఆశ మాకుంటుంది. ఇల్లు ఇప్పుడు అమ్మకు."

"లేదు నారాయణా! మీ అక్క బతికున్నన్నాళ్ళూ కొడుకు దగ్గరుండాలని ఆశపడేది. పొలం అనీ, పుట్టిన గడ్డ అనీ నేనే వెనక్కితీస్తూ వచ్చాను. దానికా కోరికతీరనే లేదు. నాకూ ఊరొదిలిపోవాలంటే బాధగానే ఉంది కాని ఏం చెయ్యను? మొన్న పొలం గట్టుమీద జారిపడ్డప్పటినుంచి ఇంకా ఈ శరీరం మీద నమ్మకం పెట్టుకోకూడదనిపించింది. ఒంటరిగా ఉండేందుకు ధైర్యంలేదు. అబ్బాయి కూడా ఒప్పుకోవటంలేదు. రోజూ ఫోను చేస్తూనే ఉన్నాడు. ఇల్లు కూడా అమ్మి వచ్చెయ్యమని గొడవ చేస్తున్నాడు"

"నిజమే బావా! కానీ అన్నీ అమ్మేస్తే..."

"నీ అనుమానం నా కర్థమైందిరా. పొలం డబ్బంతా నా పేరు మీదే ఉంది. డబ్బు విషయంలో భయం అవసరంలేదు. అక్కడ నా రోజులు ఎలాగడుపుకోవాలా అనేదే నా ఆలోచన. కానీ ఏం చేస్తాం పరిస్థితులకి ఒంగక తప్పదు."

ఇద్దరూ వెళ్ళిపోతున్నారే! దగ్గరగా వస్తున్నారనుకున్నాను పాపం! ఆ రోజు రాయుడుగారిని మంచం మీద మోసుకుని తీసుకువెళ్ళటం చూశాక, మళ్ళీ లేచి నడుస్తాడనుకోలేదు. మరొక పెద్దమనిషి ఊరొదిలి వెళ్ళిపోతున్నాడన్నమాట.

అదెవరు? నా వైపు, నా దగ్గరకే వస్తున్నారు? బస్‌షెల్టర్‌లు, లాంచీరేవులో బల్లలున్న పాకలు వచ్చాక నా దగ్గరకెవరూ రావటం లేదు.

వీళ్ళెవరు? ఇటేవస్తున్నారు. అమ్మయ్య దగ్గరకు వచ్చేస్తున్నారు మొహాలు ఎక్కడో చూసినట్టుంది. ఇద్దరూ వయసు మళ్ళిన వాళ్ళలాగే ఉన్నారు. ఆయన ఏదో చెపుతూ నా వైపే చెయ్యి చూపిస్తున్నాడు. ఆఁ వచ్చేశారు.

"ఇక్కడ కూచుందామంటావా సత్యా! కిందకూచుంటే లేవగలవా? మోకాళ్ళు పట్టెయ్యవూ!"

"ఫరవాలేదు. మీరు సాయం చేద్దురుగాని. ఈ గోదావరిగలగల, ఈ వేపచెట్టునీడ - ఎంత హాయిగా ఉన్నాయో చూడండి. ఎన్నేళ్ళయింది మనం ఇటువేపు వచ్చి?"

"నేను మన పెద్దవాడు పుట్టాక ఏ రెండు సార్లు వచ్చిఉంటాను. నువ్వు మీ తమ్ముడు ఇల్లు అమ్మేసే దాకా వస్తూనే ఉన్నావు గదా!"

"ఆఁ! అదీ పదిహేనేళ్ళయింది. ఊళ్ళో పాతకాలంవాళ్ళ ఆప్యాయతలు చూస్తుంటే ప్రాణానికి ఎంత హాయిగా ఉందో!"

అరె! ఇద్దరూ ఇక్కడే, నా మొదట్లోనే కూర్చున్నారు. ఆవిడపేరు సత్యా? ఎవరు చెప్మా. ఈ ఊరి అమ్మాయిననే అంటోంది.

ఆఁ గుర్తొచ్చింది అతను బస్తీ పెళ్ళికొడుకు. వాళ్ళిద్దరూ కొత్త దంపతులుగా ఈ గట్టుదగ్గరే, నా ముందే గూటిపడవ ఎక్కారు. ఎంతముచ్చటైన జంట. అప్పటికి నేనింకా బాగా చిన్నదాన్ని. గాలేస్తే ఊగిపోయేదాన్ని. నా రెండుపక్కలా పసుపుకుంకాలు రాలుస్తున్నట్టు ఎర్రపూలు, పచ్చపూలు రాలుస్తూ రెండు పెద్దచెట్లుండేవి. అంతే వాటి నీడలోనే నిలబడేవారని వాటికెంత గర్వమో! దారంతా పూలు రాలుస్తూ అందరినీ ఆకర్షించేవి. పీలగా ఉన్న నన్ను చూసి ఎగతాళిగా తలలూపేవి. పాపం! ముసలివైపోయాయి. ఒక్క వరద దెబ్బకే కూకటి వేళ్ళతో సహా కూలిపోయాయి.

ఆ రోజుల్లో రోజుకి రెండు మూడు జంటలైనా గోదావరి దాటి వెళ్ళేవి. కొత్త దంపతులు సిగ్గుతో ఒకరివైపు ఒకరు దొంగ చూపులు చూసుకునేవారు. ఈ బస్తీ పెళ్ళికొడుక్కి ఎంత ధైర్యం! అది చూస్తేనే నాకు ఆశ్చర్యం వేసింది. పడవ ఎక్కుతూ కొత్త భార్యకి చెయ్యి అందిస్తాడా? అప్పుడా అమ్మాయి ఎంత సిగ్గుపడిపోయింది. ఎంత బస్తీవాడవయితే మాత్రం - "సత్యా! రా! ఇక్కడ కూచుందాం అంటాడా! 'ఇదికావాలా' అని అడుగుతాడా!"

పాపం! ఆ పిల్ల ఎంత కంగారు పడిపోయింది. ఇవన్నీనాకు కనిపిస్తూనే ఉన్నాయి పెళ్ళికొడుకు కదా! ఆమె పుట్టింటివాళ్ళు ముసిముసి నవ్వులు నవ్వుకోటం నేను చూస్తూనే ఉన్నాను. మళ్ళీ సంక్రాంతి పండగకి వచ్చారు. ఆ అమ్మాయి తొలిబిడ్డను ఎత్తుకుని వెళ్ళటమూ నాకు గుర్తే!

ఎంత భద్రంగా బిడ్డను పొత్తిళ్ళలో పట్టుకుని, అటూ ఇటూ ఇద్దరు మనుషులు సాయంచేస్తే లాంచీ ఎక్కిందో నాకింకా గుర్తే.

ఆ తరువాతెప్పుడో కర్రవంతెన వచ్చి కార్లు, బస్సులు తిరగటం మొదలైంది. లాంచీలకోసం వచ్చే వాళ్ళు తగ్గిపోయారు.

వీళ్ళేదో ఇంకా చర్చించుకుంటున్నారు.

"నీకిలా ఊరిమీద ధ్యాస మళ్ళి నన్ను లాక్కొచ్చావు. నువ్వు చూడాలనుకున్నవి ఏవీలేవు. తోటలు, దొడ్లు, పాడి, పశువులు అన్నింటిలోనూ మార్పువచ్చేసింది. మనుషులు కూడా మారిపోతున్నారు. ఇదంతా నీకు బాధగా ఉందా సత్యా!"

"కొన్ని మార్పులు చూస్తుంటే కొంచెం బాధగానే ఉంది అయినా ఊరు మనదే అనిపిస్తోంది. ఏవండి! మనం ఇక్కడొక ఇల్లుకొనుక్కుని తోట వేసుకుందామా! ఒక ఆవుని కూడా పెట్టుకుందాం. నవ్వుతారెందుకూ?"

"పిచ్చి సత్యా! ఇవన్నీ కలలుగా, ఊహలుగా బావుంటాయి. ఈ వయసులో ఆ పనులన్నీ నువ్వు చెయ్యగలవా? ఆఁ ఆగు! మనుషులను పెట్టుకుందాం అంటావా? ఎవరు నమ్మకంగా నిలబడి చేస్తారీరోజుల్లో. ఎంతోకాలంగా అవన్నీ ఉన్నవాళ్ళే అన్నీ అమ్ముకుని వెళ్ళిపోతుంటే, మనం మళ్ళీ వెనక్కిరావడమా? "

"అది కాదండీ, అబ్బాయితో ఒకసారి మాట్లాడితే ఏవంటాడో?"

"సత్యా! వాడిప్పటికే మనకోసం ఎంతోచేశాడు. అమెరికా నుంచి వచ్చి మనకోసమే హైదరాబాదులో బిజినెస్ చెయ్యాలని ఏర్పాట్లు చేసుకుంటూన్నాడు. ఇల్లుకొన్నాడు.. మనకోసం వాడింత త్యాగం చేస్తున్నాడనుకుంటే అప్పుడప్పుడు నాకు బాధగా అనిపిస్తోంది వాళ్ళని మనం ఇంకా ఇబ్బంది పెట్టటం భావ్యంకాదు."

"ఇబ్బంది ఏముంది? ఈ వయసులో ఇంక మనం అమెరికా ప్రయాణాలు చెయ్యటం కష్టమని, అందుకే తను, కోడలు ఇక్కడికే వచ్చెయ్యాలని నిశ్చయించుకున్నామని వాడే చెప్పాడుగా! ఉద్యోగం వదిలేసి ఇండియా వచ్చెయ్యమని మనమేమీ అడగలేదు, బలవంతపెట్టలేదు."

"అడగకముందే మన అవసరం తెలుసుకున్నాడు. అది వాడి మంచితనం, కోడలు ప్రోత్సాహం, మనలాగే వాళ్ళకీ వాళ్ళ పిల్లలకి దగ్గరగా ఉండాలని అనిపిస్తుంది కదా! "

"అనిపించదని నేను అన్నానా! పిల్లల మీద ప్రేమన్నది మనకైనా వాళ్ళకైనా సమానమే. చదువు అని, ఉద్యోగం అని ఇద్దరు పిల్లలూ వెళ్ళిపోయారు, సెలవల్లో అమెరికా వచ్చేబదులు పిల్లలు ఇండియాకే వస్తారని వాళ్ళే అన్నారు కదా! అబ్బాయి హైదరాబాదులోనే ఉంటాడు, మనం ఇక్కడుంటాం అంతేకదా! ఈ గోదావరి మీద పడవలో, లాంచిల్లో చేసిన ప్రయాణాలు మర్చిపోగలమా! ఆరోజులు గుర్తుకొస్తుంటే ఎంత హాయిగా ఉందో!"

"మర్చిపోలేం, అందుకే వాటిని మధురస్మృతులంటారు. వాటిని అలాగే తలపుల్లో దాచుకోవాలి. మళ్ళీ అలాగే జీవించాలంటే వయసు, పరిస్థితులు ఒప్పుకోవు. అబ్బాయి మనకు అన్నీ అనుకూలంగా అమర్చిపెడుతుంటే ఇక్కడ పనివాళ్ళ మీద ఆధారపడి ఉంటామంటే వాడు ఒప్పుకుంటాడా? కోడలేమనుకుంటుంది? మన జ్ఞాపకాలన్నీ వెన్నెలలా మన గుండెల్లో నిండి ఉంటాయి. అలాగే అవి మధురంగా, అందంగా ఉంటాయి."

"అంతేనంటారా?"

"అలా నిరాశపడిపోకు సత్యా! ఎప్పుడైనా మనం పిల్లలతో కలిసి వచ్చి ఈ గోదావరినీ, అందమైన ప్రకృతినీ చూద్దాం. అంతేగానీ ఇక్కడే ఉండిపోవటం సాధ్యంకాని పని."

అయ్యో! అప్పుడే లేచి వెళ్ళిపోతున్నారే! పాపం, ఆవిడకోరిక తీరదన్నమాట. ఆయన చెప్పింది నిజమే. జ్ఞాపకాలే మిగిలేవి ఎప్పటికేని, ఆ తలుపులే వెన్నలలా పరుచుకుని హాయినిస్తాయి. జీవితాల్లో మార్పులు తప్పవు.

నాకూ మార్పువస్తుందో ఏమిటో! ఇన్నేళ్ళై ఇక్కడే ఉన్నాను సిమెంటు వంతెన మీద రద్దీ పెరిగిందని వంతెనని, దానితో పాటు ఈ రోడ్డును వెడల్పు చేస్తారట. అందరూ చెప్పుకుంటున్నారు నిన్న, మొన్న ఎవరో వచ్చి కొలతలు వేశారు. నా వరకూ కూడా రోడ్డుని కొలిచారు. నా కొమ్మలే కొట్టేస్తారో, మొదలుకే మోసం తెస్తారో, ఏం జరుగుతుందో?




మంచు కమ్మిన ఆకాశం... ఎంతగా రగ్గులు కప్పుకుంటున్నా వీడని చలి... గడగడలాడుతున్న గుండె, ఒక చేతిలో సెగలు కక్కుతున్న కాఫీ... మరో చేతిలో అన్నయ్య ఖాళీ చేసిన కాఫీ కప్పు, ఎదురుగా తోడబుట్టిన అక్క చెల్లెళ్ళు... ఆ పక్కనే విషయమేమిటో అర్థంకాని పసిపిల్లలుతో వాతావరణం బయట చల్లగా ఉన్నా, లోలోపల మాత్రం వేడిగానే ఉంది. మనుషులకు నీ, నా భేదాలున్నాయేమో కానీ, వాతావరణానికి లేదు. గాలి వీచినా, ఎండకాసినా, వర్షం పడినా ఏదయినా అందరికీ సమానంగా పంచుతుంది. ఇందుకు కుల మత భేదాలుండవు. ధనిక, పేద, తారతమ్యాలుండవు. అందుకేనేమో తెరచిన కిటికీ గుండా చలిగాలి రివ్వున ఇల్లంతా విస్తరిస్తోంది.

ఎదురుగా అందరూ ఉన్నా, ఎవరికీ అర్థంకాని నిశ్శబ్దం అక్కడ తాండవిస్తోంది. అందరూ వంటినిండా ఏదో ఒకటి కప్పుకుని చలిని చాలా వరకు తమకు దూరంగా ఉంచాలని ప్రయత్నిస్తున్నారు. దూరంగా అలాంటి ప్రయోగం ఏమీ చేయకుండా ఎంతటి చలి అయినా తాను ఇప్పుడున్న పరిస్థితుల్ని మించి కాదు కదా అనిపించేలా ఒంటరిగా ఆలోచిస్తూ, నిద్రపట్టకపోయినా నిద్ర నటిస్తూ, కంటిపై చెయ్యివేసుకుని దీర్ఘంగా ఆలోచిస్తుందా అనికూడా తెలియకుండా మౌనంగా పడుకున్నాను నేను. ఎదురుగా నిన్నటిదాకా మాతో నవ్వుతూ పలకరిస్తున్న అమ్మ నేడు గోడపై నిర్జీవంగా.... నా పని నేను చేసాను ఇక మీ జీవితాలు మీ ఇష్టం అనిపించేలా ... అందరినీ వదిలేసి తన బాధ్యతలు తీరిపోయాయన్నంత ధీమాతో కనిపిస్తోంది.

ఎలా లాగనీ జీవితాన్ని? ఎలాగోలాగ లాగటం సమస్యకాదు. తిండికి, బట్టకు, ఉండటానికి లోటనికాదు. కన్నపిల్లలు, కట్టుకున్నవాడు లేరని కాదు. అన్నదమ్ములు ఆదరించరని కాదు. అక్కచెల్లెలు పలకరించరనికాదు. అమ్మ చూపినంత స్వచ్ఛమయిన ఆత్మీయత చూపే వారి ఇక ఉండరని. తాను అమ్మగా తన స్థానాన్ని అర్థం చేసుకునేంతగా ఎవ్వరూ చెప్పేవారుండరని.... ఇందరున్నా తాను పడుతున్నమానసిక ఆవేదనను తెలుసుకుని ఓదార్చేవారుండరని మాత్రమే....

ఎవరెవరో వస్తున్నారు. కొందరు ప్రేమతో పలకరిస్తే... మరికొందరు తప్పనిసరిగా పలకరించి వెళుతున్నారు. తప్పదు. ఇపుడు ఇక మిగిలేది ఇలాంటి ప్రవర్తనలే... అమ్మద్వారా మాకేమి వచ్చిందోనని ఆరా తీసేవారే... ఒకవేళ ఏదయినా గొడవలాంటిది జరిగితే అదంతా విని ఇంటింటికి మోసుకెళ్ళి, కొన్నాళ్ళు కాలక్షేపం చేద్దామనుకునేవారే... అంతా కలిపి నిజమైన నాటకాన్ని చూపిస్తున్నారు.

ఇంతలో"అమ్మా.. ఈ కాఫీ తాగమ్మా.." అంటూ తన చిన్న చేతులతో తట్టి పలకరిస్తున్న నా కూతురు స్పర్శ ద్వారా ఏదో ఊరట. ఇక నువ్వలా ఉండిపోతే తగదు లే... నీకు పిల్లలున్నారు వారి బాధ్యత నీ మీదుంది అంటూ అమ్మ హెచ్చరిస్తున్నట్లే ఉంది.

"ఇకలే ప్రతిమా.... అలా ఎన్నిరోజులని తిండి నిద్రలేకుండా అలా ఉంటావు. తెలియనిదేముంది? దాదాపు మూడేళ్ళనుండి అత్తయ్యగారు జబ్బుతో మంచాన పడి ఏమాత్రం సుఖపడ్డారో నీకు తెలుసుగా...నిజమే... బాధగానే ఉంటుంది కానీ.. తప్పదు... అందరూ

ఎప్పుడో ఒకపుడు పోయినా మిగిలిన వాళ్ళు వాళ్ళకోసం బాధపడకపోతే ఇక రక్తసంబంధాలకు అర్థం ఏముంటుందని? అలాగని పిల్లల్ని కంగారు పెట్టేలా ఉంటే వాళ్ళు నిన్ను చూసి బాధపడటం తప్ప ఏం చెయ్యగలరు? లే.. లేచి కాస్త ఎంగిలిపడు.. లేమ్మా..'' అంది వదిన బాధ్యతగా..

''అమ్మా.... అక్కడ వేణ్ణీళ్ళున్నాయి... నువ్వు తీసుకో.. నాకేం పర్వాలేదు చన్నీళ్ళయినా...'' అంటున్న కొడుకును చూసి నా పరిస్థితిని ఎలా మార్చాలా అని ఎంతగా ఆలోచిస్తున్నాడా అనిపించక మానదు...

''బామ్మా....'' అంటూ చంటిగాడి ఏడుపు.... ఉలిక్కిపడి లేచాను.. ఎదురుగా వరసకు మనవలిద్దరూ ఒకే వస్తువుకోసం తీవ్రమైన పోరాటం చేస్తున్నారు.

''బామ్మా... నువ్వే చెప్పు.. ఇది మానాన్న కొన్న బొమ్మకదూ.'' అంటున్నాడు బాబి

''అదేం లేదు.. మా పెదనాన్న నాకోసం తెచ్చారు'' అంటుంది చిట్టి,,

నాకు నవ్వొచ్చింది బాబిగాడి నాన్న అయినా చిట్టి పెదనాన్న అయినా ఒక్కరే.. అయినా ఒకే మనిషిని రెండు రూపాల్లో తలచుకుంటూ ఈ బొమ్మ నాదంటే నాదని వాదులాడుకోవడంలో, ఇంత చిన్నతనంలోనే నాది అనే భావం పెంచుకుంటున్న పిల్లల్ని ఏమీ అనలేక ఇద్దరినీ దగ్గరకు తీసుకున్నాను.. మీరు నావాళ్ళనే భావంతో...

''బామ్మా... మరి నేనేమో చాలా బొమ్మలతో ఆడుకుంటే... మా ఇంటికి వచ్చి అవన్నీ పాడు చేసేస్తుంది చిట్టి అందుకే దాన్ని మా ఇంటికి రానివ్వాలంటేనే నాకు చెడ్డ చిరాకు...'' అన్నాడు చిరాగ్గా ముఖం పెట్టి బాబి.

''ఏం లేదు బామ్మా.. అన్నీ అబద్దాలే... '' అని చిట్టి మొదలుపెట్టేసరికి నేను కోపంతో ''అబ్బ.!! ఊరుకోండిరా నీ చెల్లెలే కదరా...!! చిన్నది ఏదయినా తప్పు చేస్తే నువ్వే సరిదిద్దాలి. చక్కగా ఇద్దరూ కలిసి ఉండాలి'' అన్నాను పెద్దమనిషి తరహాలో....

ఇక్కడ చెప్పాల్సిన విషయం ఒకటుంది. నిండా నలభై ఏళ్ళుకూడా లేకుండానే నేను బామ్మనవడం నాకెంతో కొత్తగా ఆనందంగా ఉంది. అన్నయ్య మనవలు నా మనవలుగా అలా పిలవడం నాకు మళ్ళీ మళ్ళీ అలా పిలిపించుకోవాలని ఉంది. పిల్లలు అలా పిలుస్తూంటే నా బాధ్యత మరింతగా పెరిగినట్లుగా ఉంది. ఎందుకో నాకు మొదటినుండి పిల్లలతో కాలక్షేపం అంటే తగని సరదా... వాళ్ళతో కాస్సేపు మాట్లాడినా, మొక్కలలో కాస్సేపు కూర్చున్నా, నాకెంతో రిలీఫ్‌గా ఉంటుంది.

ఇంతలో ఏదో పనిమీద కాబోలు పక్కింటి అమ్మాయి పిలుపు.. ''ఆంటీ.. '' అంటూ అదీ నన్నే అని తెలుసుకున్న తర్వాత మెల్లగా వెళ్ళాను... ఏంటా అనుకుంటూ...

''ఆంటీ... ఒక్కసారి త్వరగా రారా... మా అమ్మకు కడుపులో నొప్పి విపరీతంగా ఉందట. నాకేదో భయంగా ఉందాంటి....'' అంది కంగారుగా...

నేను వెంటనే మా వదిన వైపు చూసాను. అసలు ఆ అమ్మాయి నాకంటే మా వదినకే ఎక్కువ పరిచయం. ఎందుకంటే అది మా అన్నయ్య ఇల్లు కావడంతో... అయినా వదిన ఏమీ ఎరగనట్లు లోనికి వెళ్ళిపోయింది.. నేనెందుకో అలా వెళ్ళలేకపోయాను. ''పదమ్మా.. '' అంటూ బయలుదేరేంతలో... ''ఇదిగో ప్రతిమా... అత్తయ్య పోయి మూడురోజులు కాలేదు... మైల.. అలా మరో ఇంటికి వెళ్ళకూడదు..'' అన్న మరో వదిన మాటలు వినిపించినా... నేనెందుకో ఆ మాటలకు పెద్దగా విలువ ఇవ్వలేదు... నాకు తోచినట్లుగా నే వెళ్ళిపోయాను.... అక్కడ ఆవిడ పేరు కామాక్షి కాబోలు... అప్పటికే ఎవరో వచ్చి ''కామాక్షీ... ఎలా ఉందమ్మా'' అంటూ పలకరిస్తున్నారు. నేనూ వాళ్ళతోపాటే ఆమె పక్కనే చేరాను... వెంటనే డాక్టరుకు ఫోను చేసాము... అక్కడున్న ఒక జనరల్ ఫిజిషియన్ రావడం, ''ఇలా ఎప్పటినుంచీ వస్తోంది.. అలా వస్తున్నప్పుడు ఎలాంటి టాబ్లెట్స్ వాడేవారు ఎంత డోసేజ్ వాడేవారు? '' లాంటి రొటీన్ ప్రశ్నలు వేసారు. అతనేదో టాబ్లెట్స్ రాసివ్వడం, ఇందుకు కూడా తగ్గకపోతే బెటర్ హాస్పటల్‌లో చేర్పండి అని ఉచిత సలహా ఒకటి పడేసి ఫీజు రెండువందలు తీసుకుని తానొచ్చిన పని అయినట్లు వెళ్ళిపోవడం జరిగింది.

వాళ్ళు అంటే వారి అమ్మాయి ఉష కూడా ఎంతో కంగారుగా ఆమెని హాస్పటల్‌లో చేర్చారు. నాకు తెలిసి అక్కడ అంతగా మెడికేషన్ జరగదు. అయినా ఆ మాట అని వాళ్ళనెందుకు మనం బాధపెట్టాలనే ఉద్దేశ్యంతో .. దాదాపు మా వయసున్న కామాక్షిని ఒకసారి పలకరించి నేను సెలవుతీసుకున్నాను.

"ప్రతిమా...! ఏమయిందే..?" అడిగింది అక్కయ్య...

"ఏదో కడుపులో నొప్పిట... పాపం ఎంతో బాధపడుతోంది..."అన్నాను మామూలుగా.

"అపెండిసైటిస్ ఏమో..." అంది అక్క మళ్ళీ...

"ఏమో... టెస్టులు అవీ చేస్తున్నారు. అక్కడ వసుంధర, గీతాంటి వాళ్ళందరూ ఉన్నారులే... వాళ్ళు చూసుకుంటారు... అందుకే వచ్చేసా... మరీ ఎక్కువమంది ఉంటే తనకేం జరిగిందో అని తానే కంగారు పడుతుంది అన్నాను... " అంతలో ఎక్కడినుంచీ వచ్చిందో మా వదిన "ఇదిగో ప్రతిమా... నువ్వు అలా వెళ్ళకూడదు.. ఈ హడావిడిలో గమనించలేదేమో కానీ, ఆ వసుంధర నిన్ను గమనిస్తే... తల్లిపోయి రెండ్రోజులు కాకుండా మైలతో అందరిల్లూ తిరుగుతోందని ప్రచారం చేస్తుంది. లేకుంటే నేను వెళ్ళలేకనా? " అంది.

"అదేంటి వదినా వాళ్ళ అమ్మాయేగా మనల్ని పిల్చింది..." అన్నాను ఆశ్చర్యంగా...

"సరేలే... ఉష చిన్నపిల్ల... తనకేం తెలుసు... ఇవతల నేను చెబుతున్నా వినకుండా నువ్వే వెళ్ళావు..." అంది తన మాట వినలేదన్న కోపం ధ్వనించే స్వరంతో... వదిన...

నేను ఆ మాటలేవీ పట్టించుకోకుండా మంచంపై నడుము వాల్చాను... ఇంతలో మళ్ళీ "ఆంటీ... " అంటూ తలుపు చప్పుడు... వెళ్ళొద్దన్నా నేను వెళ్ళాను... అదీ ఇంత రాత్రివేళ.. అనుకుంటూ... తలుపు తీసాను.

"ఆంటీ నాకు ఏదో భయంగా ఉందాంటీ... రాత్రిపూట అమ్మతో ఒక్కదాన్ని ఉండలేకపోతున్నాను.. నాతోపాటూ మీరు కూడా హాస్పటల్‌లో ఉంటే... " అంటూ ఆగింది

వెంటనే మా వదిన కల్పించుకుని "చూడమ్మా... మేము మైలలో ఉన్నాము.. రాకూడదు " అంది ఖచ్చితంగా...

నాకెందుకో కాస్త బాధ అనిపించింది. పాపం..! చిన్నపిల్ల... అనిపించింది.. నా ఆలోచనను గమనించిందేమో " ఆంటీ... కాదనకండి... వసుంధర.. గీతాంటీలు కూడా రాలేమన్నారు" అంది దీనంగా... ఆమాటతో నా గుండె కలచివేసింది... నేనింకేమీ ఆలోచించకుండా పదమ్మా... అన్నాను... బయలుదేరుతూ....

"ఇదిగో ప్రతిమా... మీ అన్నయ్య కోప్పడతారు మరి.. " అంది కాస్త గట్టిగా వదిన.

"వదినా... ఊరుకో.. పాపం..... ఎవ్వరూ లేరంటోంది... ఈ సమయంలో ఇవి అవసరమా...? " అంటూ ఆ అమ్మాయి వెంట బయలుదేరాను...

నొప్పి తాలూకు రిపోర్ట్సు వచ్చాయి.. వెంటనే కాకున్న ఎప్పటికైనా ఆపరేషన్ చేయాలన్నది వారి విషయం. అది విన్న నేను "ఏమ్మా ఉషా... మీ మామయ్య ఎవరో ఈ ఊరిలో ఉన్నారన్నావు.. మరి వాళ్ళకేదయినా తెలిపావా?" అడిగాను...

"లేదాంటీ.. వాళ్ళకు మాకు అసలు మాటల్లేవు..." అంది విచారంగా

"మాటల్లేకుంటే మాత్రం ఇలాంటి సమయంలో కూడా రాకుండా ఉంటారా? ముందు నువ్వైతే ఫోను చెయ్యి" అని ఫోను తీసాను నెంబరు చెప్పు అంటూ...

"వద్దాంటీ.. ఇందాకే చేసాను.. వీలయితే రేపు వస్తామని చెప్పారు." అంది కాస్తంత దిగులు నిండిన స్వరంతో. పరిస్థితి అర్థమయిన నేను పెద్దగా మాటలు పెంచడం ఇష్టం లేక "సరేలేమ్మా... నేను ఉన్నాను కదా...!! అన్నాను భుజం చుట్టూ చెయ్యి వేస్తూ...

రాత్రంతా నేనెంత ధైర్యం చెప్పినా ఆ అమ్మాయి హాయిగా నిద్రలేకపోయింది. నాకు మాత్రం ఒక పక్క ఆలోచన, ఆవేదన, రెండూ కలగలసినట్టి తెలియని భావమేదో పట్టిలాగుతోంది. రాత్రంతా నిద్రపోకుండా పడుతున్న ఉష ఆవేదన నాకెంతో బాధ కలిగించింది. ప్చ్ ...! ఏం జీవితాలో... అనిపించింది. రాత్రి చాలా సేపయిందేమో.. అక్కడున్న మంచంపై అలా వాలగానే .. నాకు, ఉషకు కూడా నిద్రపట్టేసింది. సరిగా రెండు గంటల ప్రాంతంలో "అమ్మా... అమ్మా.. " అంటున్న ఉష గొంతు వినబడి ఉలిక్కిపడి నిద్రలేచాను. అక్కడున్న పరిస్థితిని చూసి నాకు కాస్త కంగారు కలిగి చుట్టూ డాక్టర్స్ నర్స్‌లు అందరూ చేరివుండటంతో అయోమయంగా లేచి నిలబడ్డాను. ఆ అమ్మాయికి ఆసరాగా వచ్చి అలా నిద్రపోతున్నందుకు నాలోనేనే సిగ్గుపడ్డాను. కాస్త ముందుకు కదిలి .....

"సర్... ఏమయింది సర్... అని అడిగాను... అంతే వాళ్ళు చెప్పిన మాటతో నాకు ఒక్కసారిగా కళ్ళు తిరిగినట్లయింది... "షీ ఈజ్ ఇన్ కొలాప్సింగ్ స్టేజ్" అరె.... ఇదేంటి ఇంతలో... నిన్నటిదాకా ఆపరేషన్ చేస్తే బతుకుతుందని చెప్పారే.... అదేంటి ఇలా మళ్ళీ వేరే మాట.. అదే మాట నేను అడిగేసాను ఉండబట్టలేక...

"మేడమ్... మీరు ఆమెకు ఏమవుతారు? అని అడిగాడు.... నా దూకుడు చూసి చాలా దగ్గర అనుకున్నాడేమో

"ఏమీ అవను సార్... కాకుంటే మాకు నైబర్స్..." అన్నాను... మెల్లగా..

"ఓహో.... అయితే ఇలా రండి.." అంటూ తన రూములోకి తీసుకెళ్ళి "కూర్చోండి." అన్నాడు డాక్టర్. నేను సందిగ్ధంగా కూర్చున్నాను. ఏం చెబుతాడో ఏమో అనుకుంటూ...

"మేడమ్... షీ ఈజ్ ఇన్ క్రిటికల్ కండిషన్... ఇదే విషయాన్ని రాత్రి ఆ అమ్మాయి వాళ్ళకు చెప్పాను... ఆమె కొడుకులతో మాట్లాడాను కానీ..." అంటూ ఆగాడు.

" కానీ ఏంటి సర్... చెప్పండి..!" అన్నాను ధైర్యంగా...

"వాళ్ళు పెద్దగా ఆమెపై ఇంట్రస్ట్ చూపటంలేదు..." అన్నాడు డాక్టర్ అక్కడున్న నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ...

విషయం కాస్త అర్థం అయ్యీ అవ్వని నేను "అంటే ఆమెకు ఆపరేషన్‌కు ఒప్పుకోవడం లేదా?" అన్నాను కాస్త వివరంగా...

"అంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆమెకు మెడికల్‌గా ఏమీ చెయ్యకండి... మా దగ్గర అంత స్తోమత లేదని అన్నారు.. " మెల్లగా చెప్పాడు డాక్టర్.

"మరి ఆమె...?"

"చెప్పలేము.. ఈ రాత్రి గడిస్తేగాని ఏ విషయాన్ని అంచనా వెయ్యలేము" అనేలోగానే... 'డాక్టర్..' అంటూ పెద్దగా అరుపు వినిపించింది.... దాంతో నేనూ ఆ అరుపు వచ్చిన గదిలోకి పరుగుతీశాను. ఏది జరగకూడదనుకున్నానో అదే జరిగిపోయింది... కామాక్షమ్మ చనిపోయింది. "ఆంటీ... అమ్మపోయిదాంటీ... " అంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆ పిల్లను ఎలా ఓదార్చాలో నాకు అర్థంకాలేదు. అమ్మ పోయి వారం రోజులు కావడంతో నాకూ అమ్మ గుర్తొచ్చి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. విషయం ఎలా చేరిందో ఏమో.. వాళ్ళ వాళ్ళందరూ ఒక్కరొక్కరూ రావడం మొదలు పెట్టారు. నా కెందుకో నేను అక్కడుండటం అనవసరం అనిపించింది. మెల్లగా వాళ్ళతో మాట్లాడుతున్నట్లే మాట్లాడుతూ బయటపడ్డాను... భారమైన గుండెతో...

ఇంటికి రాగానే.. ఒక్కసారిగా మూకమ్మడిగా నాపై దాడి జరిపారు... "అసలెందుకు వెళ్ళావు...? నీకేమి అవసరం? అమ్మపోయి వారంకాకుండానే నువ్వెళ్ళి మరొకళ్ళకు సాయం చేస్తావా? నీకసలు బాధవుందా? ఎవరైనా ఏమనుకుంటారు? కూతురయి అసలు ఏమాత్రం లేదని ఆడిబోసుకోరా? ఇంతా చేసి ఆమెను కాపాడగలిగావా? పోనే పోయింది. ఆవిడ మామూలుగానే జబ్బు మనిషి. నేనెంత చెబుతున్నా నా మాటకు గౌరవం ఇచ్చావా... అంతలా పెత్తనాలు చేస్తున్నావు... అందుకే నీ మొగుడు నిన్ను నిత్యం తంతూ వుంటాడు అంది" అక్కసుతో వదిన... ఇన్ని మాటలు పడినా ఆ మాటను పడలేక "వదినా నా జీవితం నా ఇష్టం... నేను ఎపుడైనా నీ ఇంటికి వచ్చి

నా మొగుడు కొడుతున్నాడనో, తిడుతున్నాడనో నీకు చెప్పి బాధపడ్డానా? ఎందుకు అనవసరంగా నోరు పారేసుకుంటావు? ఆ అమ్మాయి ఎంతో కష్టంతో వస్తే మనంచేసే సహాయం అంతమాత్రం కూడా లేకుంటే ఏం బావుంటుంది?" అంటూ అక్కడినుంచీ లోపలికి వెళ్ళిపోయాను...

ఆ తర్వాత తలో ఒకరు తలో రీతిలో తిట్టుకున్నారు. వదిలేసా... నాకు మంచి అని తోస్తే నేను చేయడం, అందరి నోట్లో పడటం నాకు కొత్తకాదు. మనసంతా ఏదో భారంగా ఒంటరిగా అనిపించింది..

అందరూ భోంచేసి ఒక వారగా పడుకున్నాము. అంతలో ఒకటే తలుపు చప్పుడు .... మళ్ళీ వాళ్ళే అయి ఉంటారు.... "అమ్మా ప్రతిమా... నీకోసమే అయివుంటుంది. కామాక్షమ్మ పోయిందిగా... ఏడవటానికి తోడూకావాలేమో" అంది హేళనగా వదిన. ఆమాటలు విన్న నాకు ఎంతో బాధ కలిగి నేను ఉన్న చోటునుండీ కదలలేదు... తప్పనిసరిగా వదిన వెళ్ళి తలుపు తీసింది... తలుపు తెరిచీ తెరవడంతోటే "మీ ఇంట్లో ప్రతిమ ఎవరు?" అని అడిగారు. అది విన్న నేను ముందుకు వెళ్ళి నేనే అన్నట్లుగా నిలబడ్డాను. "మీరేనా ప్రతిమంటే...? " అంటూ "అయినా మీ అమ్మగారు పోయి వారం కూడా కాలేదు... మీరెందుకు మా అమ్మను చూడటానికి వచ్చారు? ఎందుకంటే చనిపోయినవారింటి నుండీ ఎవరైనా వస్తే అవతల వాళ్ళుకూడా చనిపోతారట.. మీరెందుకు వచ్చారు? ఏమి మేములేమా? మా చెల్లెలు పిలిస్తే అదేదో చిన్న పిల్ల... దానికేం తెలుసు? తను పిలిస్తే మీరు వచ్చేయడమేనా" అని అడుగుతుంటే నాకు నోటమాటరాలేదు... ఒక్క నిమిషం ఆశ్చర్యపోయాను... ఇలా కూడా మనుషులు ఉంటారా..? అంటూ అయినా బయటపడకుండా.....

"మరి మీరెందుకు రాలేదు? "

"అని అడిగే హక్కు మీకెక్కడిది" అంటూ దాదాపు అరిచినంత పని చేసాడు. నాకేం మాట్లాడాలో తోచలేదు...

"అయితే మీ అమ్మను నేను చంపానా? " అన్నాను.

"అందుకు ఆలోచన ఎందుకు? " మళ్ళీ అరిచాడు...

"మరి డాక్టర్ అలా అనలేదే... 24గంటల్లో ఆపరేషన్ చేయాల్సిన అపెండిసైటిస్ ఆపరేషన్ అసలు నా దగ్గర డబ్బులేదు..., అని మీరు చెప్పడం తోటేనని నాకు చెప్పారే.." అన్నాను నేనూ అంత పెద్దగొంతుతోనే....

దాంతో తట్టుకోలేని వాళ్ళూ ఏవేవో మాటలు అంటున్నారు... నన్ను శాపనార్థాలు పెడుతున్నారు.. నాకేమీ తోచడంలేదు. ఒక పక్క వదిన, మరో పక్క వాళ్ళు నన్ను ఆ రోజంతా తిట్టడమే ధ్యేయంగా పెట్టుకున్నారు.

ఏంటి జీవితం...? ఎందుకీ ఆలోచనలు? ఈ గమ్యస్థానం ఎక్కడిది? భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలను ఒకే క్షణంలో ముద్ద చేసి నేను కలుపుకున్నా నాకు ఒంటరితనం బావుంది. నాతోపాటు నా ఆలోచనలు అనంతంగా తేలిపోతున్నాయి. ఒకరు ఒకచోట. మరొకరు మరోచోట, అనేది మనం నిర్ణయించడమే... ఈ అనంతకాలప్రవాహంలో ఎవరికి ఎవరు లేకున్నా ఆవేదనే... అందరికీ అందరూ ఉన్నా అనుమానమే... మనసులు కలవని ఎందరు ఎదురుగా ఉన్నా ఎవ్వరు లేనట్లే.. ఒకరికి సాయమొకరికి ద్రోహం అయితే సాయం ఎందుకు.. ద్రోహమే చేస్తుంటే బావుంటుందేమో!...

ఇది మా తరం.... మాజీవితం...? సంపాదన యుగం........? రాబోయేది కరువు యుగం... ఏది ఎలా వున్నా... మానవత్వం కోల్పోతున్న ఈ మానవులు వున్నంత కాలం... ఏ యుగమైనా మనల్ని ఆదుకునేది ఏముంటుంది? అనిపించింది...

రాబోయే జీవితాన్ని తలుచుకుంటూ.... బామ్మా..... అంటూ ముద్దు ముద్దుగా దగ్గరకు చేరుతున్న నా మనవల్ని దగ్గరకు తీసుకున్నా ఇక రాబోయే రోజులు తలుచుకుంటూ... వారికి ఇక ఇంతటి ఆదరణ దొరుకుతుందా అనే సందేహం కలిగిందేమో నన్ను గట్టిగా పట్టుకుని నా ఒడిలోకి చేరారు ఆత్మీయంగా...

జీవితం పట్ల భయం భయంగా ఉన్న నేను... గోడపై చిరునవ్వులొలకపోస్తున్న అమ్మను తలుచుకున్నాను... ధారగా వస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ......

# ఓ కావ్య కథ

- లత కందికొండ



"అమ్మా! తమ్ముడు నన్ను గెటవుట్ అంటున్నాడు." ఐదేళ్ళ కావ్య పదినెలల కార్తీక్ గురించి కంప్లైంట్ చేసింది.

"వాడికి మాట్లాడటం రాదు కదమ్మా! నిన్ను గెటవుట్ అని ఎలా అన్నాడు? అయినా నువ్వు ఏం చేస్తేవాడలా అన్నాడు?" కూతురిని అడిగింది మాధురి, అసలు సంగతి ఏంటో కనుక్కుందామని.

"నేనేం చెయ్యలేదు. వాడు నా బార్బీ బొమ్మ తీసుకున్నాడు అది ఇవ్వమని అడిగితే ఏయ్ అని గట్టిగా scream చేసాడు. అలా అంటే గెటవుట్ అనే అర్థం" కోపంగా చెప్పింది కావ్య.

"అవునా! నేను వాడిని కేకలేస్తాలే. ఏరా! అక్కని అలా అంటావా? హన్నా! తప్పు కదూ? " అంది

మాధురి మాటలు వాడికి ఏం అర్థమయేయోగానీ, తల్లిని చూసి నవ్వుతూ కేరింతలు కొట్టాడు కార్తీక్.

బుగ్గలు సొట్ట పడేలా నవ్వుతున్న కొడుకుని చూసి ఎత్తుకుని ముద్దుపెట్టుకోకుండా ఉండలేకపోయింది మాధురి.

అదిగో! ఐ నో అమ్మా, నీకు తమ్ముడంటేనే ఇష్టం. వాడిని కేకలేస్తానని చెప్పి వాడు రాంగ్ చేసినా వాడిని ముద్దుపెట్టుకుంటున్నావు." చేతిలో ఉన్న బొమ్మని విసిరి కొట్టి ఏడుస్తూ తన గదిలోకి వెళ్ళి తలుపు గట్టిగా చప్పుడయ్యేలాగ వేసింది కావ్య.

"ఏమైంది? ఎందుకు ఏడుస్తోంది? " ఆఫీస్ రూమ్‌లోంచి బయటికి వచ్చాడు సురేష్.

"ఆ... కొత్తగా ఏముంది? రోజూ ఉండే భాగవతమే. నేను వాడిని ముద్దుపెట్టుకున్నానట.. మీ ముద్దుల కూతురు అలిగి గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది. "

"నా ముద్దుల కూతురంటావేం? నువ్వే దాన్ని బాగా గారం చేసి అలా తయారుచేసావు."

"నన్నంటారేం! మీరు మాత్రం తక్కువా? అది అడిగినవన్నీ కొని అది ఆడింది ఆట పాడింది పాట అన్నట్లుగా నెత్తికెక్కించుకోలేదూ? " మాటకి మాట ఇచ్చుకుంది మాధురి.

ఈ పాట ఆ ఇంట్లో రోజూ వినిపిస్తూనే ఉంటుంది.

బోస్టన్‌లో పుట్టి పెరిగిన బేబీ కావ్య గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది గానీ ఇక్కడ కొంచమైనా చెప్పక తప్పదు. తల్లితండ్రుల ప్రేమకి ఏకైక వారసురాలిగా పుట్టిన కావ్య అతి గారాబంగా పెరిగి ఐదేళ్ళు తనకి తిరుగు లేనట్లు ఏకచత్రాధిపత్యాన్ని ఏలింది. రెండేళ్ళకే మాటలు వచ్చేసి ముద్దు ముద్దుగా చిలకపలుకులు పలికే కావ్యని చూసి అందరూ ఇష్టపడేవారు. బొద్దుగా, ముద్దుగా, అందంగా

ఉండే కావ్యనీ, అది మాట్లాడే మాటలనీ విని అందరూ ఆశ్చర్యపోయేవారు. ఆరిందాలాగా ఎవరో చెప్పి అనిపించినట్లుండేవి దాని కబుర్లు ఒక్కోసారి.

రెండేళ్ళ తర్వాత ప్లే స్కూల్‌లో వేస్తే స్కూల్‌కి వెళ్ళి వచ్చిన మొదటిరోజే కావ్యకి ఎన్ని సందేహాలంటే - అమ్మా, జెమీ కళ్ళు అలా నీలంగా ఎందుకున్నాయి? ఎడిసన్, కేథీ, జోర్డన్ ఇంకా మా క్లాస్‌లో చాలా మంది అంత తెల్లగా ఎందుకున్నారు? నా స్కిన్ ఇలాగ బ్రౌన్‌గా ఎందుకుంది వాళ్ళలాగా కాకుండా? నేను కూడా నటాషా లాగా blonde చేయించుకుంటే ఎలాగుంటుంది? You know what ? అమ్మా! మేడిసన్ ఎంత బ్లాక్‌గా ఉంటుందో తెలుసా? కానీ ఎన్ని జడలు వేసుకొచ్చిందో తెలుసా? ఐ థింక్ 20 ...కాదు...కాదు 40 జడలు వేసుకొచ్చింది. ఇంకా వాటికి ఎన్ని కలర్‌ఫుల్ క్లిప్స్ పెట్టిందనుకున్నావు. It's really funny అమ్మా - అంటూ నాన్‌స్టాప్‌గా మాట్లాడే కూతురి డౌట్స్ తీర్చడానికి మాధురి తలప్రాణం తోకకి వచ్చేది.

నాలుగో ఏట ఒకసారి కార్లో సీట్‌బెల్ట్ సరిగ్గా పెట్టుకోలేదని తండ్రి కేకలేసేసరికి, "అమ్మా ఇప్పుడు నువ్వు వాల్‌మార్ట్‌లో ఏదో రిటర్న్ ఇవ్వడానికి వెళుతున్నావుగా నాన్నని కూడా అక్కడ రిటర్న్ చేసేయ్. ఎక్స్ఛేంజ్‌లో కొత్తనాన్నని తెచ్చుకుందాం. నన్ను ఊరికే కేకలేసి నా మీద అరుస్తున్నారు. ఈ బాడ్ నాన్న నాకు వద్దు" అంది తల్లితో.

కూతురి మాటలకి మాధురి నవ్వుతోంటే

"మరీ అంత చీప్‌గా వాల్‌మార్ట్‌లో రిటర్న్ ఇమ్మని అంటుందేంటే? ఏ బనానా రిపబ్లిక్ ఆర్ అర్మానిలో అనుంటే కాస్త క్రెడిబిలిటీ ఐనా ఉండేది కదా? " అన్నాడు సురేష్

"ఇద్దరికిద్దరూ సరిపోయేరు. నడవండి ఐతే. విక్టోరియా సీక్రెట్‌లో తీసుకుంటారేమో కనుక్కుంటాను" అంది నవ్వు ఆపుకుంటూ మాధురి.

"ఓ! మై గాడ్! నీకు తగ్గ కూతురే అది" అని సురేష్ గుడ్లు తేలేస్తోంటే... "భలే... భలే.... " మంచిపనైంది అని చప్పట్లు కొట్టింది కావ్య, దానికేదో అర్థమైనట్లే.

తనకి తమ్ముడు పుడుతున్నాడన్న సంగతి తెలియగానే కావ్య ఎంత సంబరపడిందో! కానీ తమ్ముడు పుట్టాక వాడు ఎంతసేపూ అమ్మని అంటిపెట్టుకుని ఉండటం, అమ్మా, నాన్నా వాడిని అస్తమానం ఎత్తుకుని ముద్దు చెయ్యడం... కావ్యకి అసలంటే... అస్సలు... ఏమాత్రం నచ్చలేదు. అలా అని తమ్ముడంటే ఇష్టం లేకా పోలేదు.

తమ్ముడు కార్తీక్ అంటే కావ్యకి ప్రాణం కానీ.... అందరికీ మాత్రం తన తరువాతే తమ్ముడంటే ఇష్టం ఉండాలి అని నొక్కి వక్కాణించి మరీ చెపుతుంది. దానికి రీజనింగ్ కూడా ఇస్తుంది. ఏమనంటే నాకు ఫైవ్ ఇయర్స్ వాడికి జీరో ఇయర్స్ అంటూ.... ఆ జీరోని ఎంత స్ట్రెస్ చేసి చెపుతుందంటే వాడికి ఈ భూమి మీద ఇంకా ఎంట్రీయే లేదు. నా ముందు వాడు నథింగ్ అన్నట్లు చెపుతుంది. అలా అని పోనీ అదే మాట మీద ఉంటుందా అంటే.. కార్తీక్ తల్లికాళ్ళు పట్టుకుని నిలబడి ఎత్తుకోమని మారాం చేస్తుంటే "కార్తీక్ నీకు పదినెలలు వచ్చేసాయి. నడవడం కూడా వచ్చేసింది. ఇంకా అమ్మని ఎత్తుకోమంటావేమిటి? అమ్మ పాపం చూడు ఎంత టైర్డ్‌గా ఉందో! కదమ్మా! " అని ప్లేటు ఫిరాయించి వాడిమీద పెత్తచలాయిస్తుంది. కానీ ఐదేళ్ళ కావ్యని మాత్రం అది అడిగినప్పుడల్లా ఎత్తుకోవాల్సిందే అది వేరే విషయం. అలా ఎందుకని అడిగే ధైర్యం, ఆ తర్వాత అది పెట్టే పేచీ భరించే ఓపికా ఆ ఇంట్లో ఎవ్వరికీ లేవు. ఎందుకంటే, స్వంత కొడుకునే కావ్య చూడనప్పుడు దొంగచాటుగా ముద్దుపెట్టుకోవడం చూసిందంటే.... ఇక ప్రళయమే. 'నేను పుట్టాక నన్నెవరూ ముద్దుపెట్టు కోనేలేదు. నన్ను మీరెప్పుడు హగ్ చేసుకోనేలేదు' అని ఏడుపు లంకించుంటుంది. కానీ కార్తీక్ ఎప్పుడైనా ఏడిస్తే 'నిన్ను attick ఎక్కించేస్తాన'నీ, లేకపోతే 'కాప్‌ని పిలుస్తాన'నీ తమ్ముడిని భయపెడుతూనే ఉంటుంది. ఇంక 'అక్క నీకంటే చాలా పెద్దది తెలుసా? అక్క మాట వినాలి No Whining అని చెప్పానా' అని తన పెద్దరికం చూపిస్తుంది.

పిల్లలకి అదీ పైవాళ్ళకి అసూయ ఉంటుందని మాధురి విందిగానీ ఆ జె ఫాక్టర్ మరీ ఇంతలా ఉంటుందనుకోలేదు. వాడికి ఒక ఫోటో తీద్దామన్నా, వీడియో తీద్దామన్నా, తీయనీయకుండా అడ్డంగా నిలుచుంటుంది. 'తమ్ముడు పెద్దయ్యేక అక్కకి అన్ని ఫోటోలు తీసారు, నాకు ఫోటోలే తీయలేదా అని అడిగితే ఏం చెప్పాలమ్మా' అంటే తడుముకోకుండా కెమేరా పాడైపోయిందని చెప్పాలనేది. అంతేకాదు. ఆ ఇంట్లో ఉన్న ప్రతీ వస్తువూ తనదేనని పేచీ. బొమ్మలూ, ఉయ్యాల, బౌన్సర్, క్రిబ్, కార్ సీట్, స్ట్రోలర్... ఒకటేమిటి... చివరికి వాడు పడుకునే పిల్లో, బెడ్ కూడా తనదేనని పేచీ. తన వస్తువులు ప్రతి ఒక్కటి తల్లితండ్రులు తమ్ముడికి వాడుతూంటే దాన్ని డైజెస్ట్ చేసుకోవడం - కాస్త - కాదు చాలా కష్టంగానే తోచేది కావ్యకి. అలాగని పోనీ తమ్ముడికి అన్నీ కొత్తవి కొనమంటావా అని అడిగితే... అది చూసిన చూపుకే నిజంగా ఏవరుంటేనా అనిపించక మానదు. దాని దృష్టిలో అంతకంటే మహాపరాధం ఇంకొకటి లేనట్లే గొడవ చేస్తుంది. 'మరి తమ్ముడికి అవన్నీ ఎలా వస్తాయి' అంటే 'మరి తమ్ముడు నాతో మంచిగా ఉంటే నేను వాడిని షేర్ చేసుకోనిచ్చేదాన్ని' అంటుంది. 'మంచిగా ఉండకుండా ఏంచేసాడమ్మా' అంటే, 'నా బొమ్మలన్నీ లాక్కుంటాడూ. నే చెప్పిన మాట వినడు. నన్ను అక్కా అనమంటే అనడు' అంటుంది. 'అక్కా అనడం అప్పుడే వాడికి రాదమ్మా, ఆ వయస్సులో నువ్వు కూడా అక్కా అనలేదు తెలుసా' అని తల్లి అంటే... 'నాకు అక్కలేదు కాబట్టి నేను అనలేదు. వాడికి నేను అక్కని ఉన్నాగానీ వాడు నన్ను కొంచెం కూడా కేర్ చెయ్యడంలేదు తెలుసా? ' అని లాజిక్ మాట్లాడుతుంది.

ఇంక ఐదేళ్ళకి ప్రీకె లో చేరిన కావ్య కబుర్ల తీరే మారిపోయింది.

ఒకరోజు తండ్రి మీద చాలా కోపం వచ్చి - 'అమ్మా! నాన్న ఎప్పుడు చూసినా తమ్ముడినే ఎత్తుకుని నన్ను అసలు కేర్ చేయడంలేదు. నువ్వు కూడా మా క్లాసులో డెరిక్ వాళ్ళమ్మలాగ వేరే నాన్నని చేసుకో. తమ్ముడిని నాన్నతో పంపేసి, కావాలంటే వీకెండ్స్‌కి తెచ్చుకుందాం' అన్న కావ్య మాటలకి మాధురి నిర్ఘాంతపోయి తెరిచిన నోరు మూయకుండా చూస్తోంటే.... సురేష్. 'ఇదేదో బాగానే ఉందే! నాకూ కాస్త ఛేంజ్ ఉంటుంది, నీ సంగతేమో కానీ, వీళ్ళ టీచర్ లారా చాలా అందంగా ఉంటుంది కదూ! పెళ్ళి అయిందో లేదో కాస్త కనుక్కోకూడదూ? వర్క్ అవుట్ అవుతుందేమో చూద్దాం' అని అన్నాడు.

మాధురి సురేష్‌ని నమిలి మింగేసేలా చూస్తూ 'అది వినలేదు కాబట్టి సరిపోయింది. విని ఉంటే రేపు స్కూల్‌కి వెళ్ళాక వాళ్ళ టీచర్‌ని అడిగినా అడిగేది' అంది...

"అమ్మా! తమ్ముడూ పడిపోయాడు... బ్లడ్ వస్తోంది" అన్న కావ్య కేకల్తో వంట చేస్తున్న మాధురి పరుగెత్తుకొచ్చింది. మెట్ల దగ్గిర గుక్కపెట్టి ఏడుస్తున్న కార్తీక్‌ని ఎత్తుకుంది. తల మీద బొప్పి కట్టింది. పెదవి చిట్లి రక్తం వస్తోంది. భయంతో సురేష్‌ని కేకేసింది రమ్మని.

"ఏం చేసావు వాడిని? నువ్వే తోసేసావా ఆ పిచ్చి బొమ్మకోసం.... రోజు రోజుకీ నీ అల్లరి మరీ ఎక్కువైపోతుంది" అంటూ కూతురుని ఒక్కటేసాడు సురేష్

కొత్తగా కొన్న సిండ్రిల్లా బొమ్మని పట్టుకుని భయంతో బెదిరిపోతూ తండ్రి చేతిలో ఉన్న కార్తీక్ నే చూస్తున్న కావ్య "నేనేమీ చెయ్యలేదు డాడీ, వాడే సెల్ఫ్ పడిపోయాడు" అంటూ గట్టిగా ఏడవడం మొదలుపెట్టింది. తమ్ముడికి రక్తం వస్తోందన్న భయం ఒకవైపు, ఎప్పుడూ కొట్టని నాన్న తనని కొట్టేడన్న బాధ మరొక వైపు కావ్యని ఏడుపు ఆపకుండా చేసేయ్.

తలకి దెబ్బ తగిలిందేమో నన్న భయంతో ఎందుకైనా మంచిదని ఎమర్జన్సీ పరుగెత్తేరు, ఇంటర్నల్ డామేజ్ ఏదైనా అయిందేమో అన్న అనుమానంతో.

వెనకసీట్‌లో కూర్చున్న కావ్య ఏడుస్తూనే ఉంది, "అమ్మా, తమ్మూని నేను నిజంగా పడెయలేదమ్మా. వాడికి బాగా బ్లడ్ వచ్చిందా? షాట్స్ ఇస్తారా? డాక్టర్ ఆఫీస్‌లోనే ఉంచేస్తారా?" వెక్కిళ్ళ మధ్య అంటూ ఏడుపు ఆపడంలేదు.

"వాడిని పడేసి నువ్వు ఏడుస్తావెందుకు.. ఏడుపు ఆపు ముందు" అని మళ్ళీ కసిరాడు సురేష్.

డాక్టర్ చూసి దెబ్బలేం తగల్లేదనీ, భయపడనవసరం లేదనీ చెప్పాక ఇంటికి తిరిగి వచ్చారు. కానీ ఆ రాత్రంతా కావ్య వెక్కిళ్ళ మధ్య కలవరింతలూ, పలవరింతలు..

"అమ్మా, తమ్ముని నిజంగా నేను పడెయ్యలేదమ్మా! వాడిని డాక్టర్ ఆఫీస్‌లో ఉంచెయ్యవద్దు. నాకు తమ్ముా కావాలి, కావాలంటే నా బొమ్మలన్నీ వాడికి ఇచ్చేస్తాను. నువ్వూ, నాన్నా కూడా వాడినే ఎత్తుకుని ముద్దు పెట్టుకోండి, నన్ను అసలు ఎత్తుకోమని అడగను. " అంటూ అన్నం కూడా తినకుండా పడుకున్న కావ్య ఆ రాత్రంతా నిద్రలో ఏవేవో మాట్లాడుతూనే ఉంది.

"అదేం వాడిని పడేసి ఉండదు. సాయంత్రం నుంచీ ఏం తినను కూడా లేదు పిచ్చిపిల్ల, ఎలా కలవరిస్తోందో చూడండి. దానిని కొట్టడానికి మీకు చేతులెలా వచ్చాయసలు?" అంటూ సురేష్‌ని కసురుకుంది మాధురి.

మర్నాడు ప్రొద్దున్న -

"కార్తీక్, నీకు బూబూ వచ్చిందా అమ్మా? తగ్గిపోయింది కదా! నీకు ఇంక షాట్స్ కూడా ఏం ఇవ్వరు. అక్క మాటలు వినాలి మరీ. అక్క బొమ్మలు లాక్కోకూడదు తెలిసిందా? అమ్మా నాన్నని ఎత్తుకోమని విసిగించకూడదు. నీకు ఏదైనా కావలసి వస్తే నన్ను అడగాలి. సరేనా? ఏదీ తారంగం, తారంగం చెప్పు కన్నమ్మా" ఎప్పుడు లేచిందో కావ్య కార్తీక్ ప్రక్కన క్రిబ్‌లో పడుకుని వాడితో ముచ్చటలాడుతోంది.

"అన్నట్లు కార్తీక్! ఈ రోజు సాయంత్రం అమ్మా, నాన్నతోపాటు నువ్వు కూడా అక్క స్కూల్‌కి వస్తున్నావు తెలుసా? ఎందుకంటే అక్క ఈ రోజు గ్రాడ్యుయేట్ అవుతుంది. ఈ రోజుతో అక్క graduate అయిపోయి సమ్మర్ హాలిడేస్ ఇచ్చేస్తారు. మనం చక్కగా ఆడుకోవచ్చు కానీ నా గ్రాడ్యుయేషన్ పార్టీలో నువ్వు అల్లరి చేస్తే నీకు టైం అవుట్ ఇస్తాను తెలుసా! ఎందుకంటే అక్కకి ఫైవ్ ఇయర్స్ అంటే నీ కంటే చాలా పెద్దది అన్నమాట. అందుకని అక్క మాట వినాలి" సుప్రభాతంతోపాటు సూక్తిముక్తావళి కూడా మొదలైంది.

"అర్ధమైందా, నీ కూతురి గురించి" అన్నట్లుగా మాధురివైపు కనుసైగ చేస్తూ మంచం దిగి 'ఎప్పుడు లేచేవురా నా క్యూట్ పై' అంటూ క్రిబ్ దగ్గిర కెళ్ళి కావ్యని ఎత్తుకోబోతోంటే 'అమ్మా, నన్ను ముట్టుకోవద్దని మీ సురేష్‌కి చెప్పు. He is very bad నన్నుకొట్టారు. ఈ రోజు నా గ్రాడ్యుయేషన్ పార్టీలో డెరిక్ వాళ్ళమ్మ నడుగు, మనం కూడా ఇంకో కొత్త నాన్నని తెచ్చుకుందాం... నన్ను ముట్టుకోవద్దు. నాతో మాట్లాడవద్దు ఫో' అంటూ సురేష్‌ని విసిరి కొట్టింది.

కావ్య మాటలకి ప్రక్కనే ఉన్న మాధురి పగలబడి నవ్వుతూంటే "ఊరికే నవ్వడమేనా, ఈ రోజు సాయంత్రమైనా వాళ్ళ లారా టీచర్ గురించి ఎంక్వైరీ చేసేదేదైనా ఉందా?" అంటున్న సురేష్‌ని చూసి..." మీకు చాలా ఎక్కువైంది. నేను కూడా నిజంగానే డెరిక్ వాళ్ళ అమ్మని కన్సల్ట్ చెయ్యాలేమో " అంది మాధురి

ఇవేమీ తమకి పట్టనట్లు పిల్లలిద్దరూ క్రిబ్‌లో ఆడుకుంటున్నారు.

# వెండి కుంకుమ భరిణ

- స్వాతి శ్రీపాద



నెలరోజుల తరువాత తీరిక దొరికింది జాహ్నవికి. శ్రీధర్ ఆఫీస్‌కి వెళ్ళాక తీరిగ్గా ప్రెజెంటేషన్ల సూట్‌కేస్ తెచ్చి, ఒక డైరీ పెన్ తెచ్చుకున్నాక, ఒక్కొక్క గిఫ్ట్ విప్పడం ప్రారంభించింది. చిన్న గోల్డ్‌కలర్ బ్యాగ్‌లో ఉంది కుంకుమ భరిణ.

చూడటానికి బాగున్నా కొత్తమెరుపు ఏ కోశానా లేదు. దుక్కలా బరువుగా ఉంది. అక్కడికీ అమ్మ అననే అంది --ఎందుకే ఆ పాతది అని కానీ ఎందుకో అది వదలబుద్ధికాక తెచ్చుకుంది.

అరచేతినిండుగా గుండ్రటి నగిషీలు చెక్కిన ఆకారం--కింద చిన్న స్టాండ్‌లా మట్టు--మూత మీద ఎనామిల్ రంగులతో నెమలి--దాని మెడలో మువ్వలు.....మూత తెరిచింది జాహ్నవి.

చిత్రం! లోపల సంగంలోనే గోడలా వెండి రేకు.

దాన్ని భద్రంగా తుడిచి కుంకుమ నింపుకుందామనే ఉద్దేశ్యంతో టూత్ పవుడర్‌తో పాలిష్ చెయ్యడం మొదలుపెట్టింది.

నింపాదిగా టీవీ చూస్తూ అలవోకగా రుద్దుతోంది.

లోపల అడుగు కాస్త బలంగా రుద్దిందంతే!

హఠాత్తుగా వేలిని గీరుతూ మూత తెరచుకుంది. అదీ అడుగున రేకులో సగభాగమే.

ఆశ్చర్యపోతూ భరిణలోపలికి చూసింది.

మరింత ఆశ్చర్యం కలిగిస్తూ లోపల మడతలు పెట్టిన చిన్నకాగితం.

ఉలిపిరి కాగితం లాగుంది మడతలు విప్పేసరికి అరపేజీ అంత తేలింది.

సన్నటి అక్షరాలు...ముత్యాలు పరచినట్టుగా ఒద్దికగా కనిపించే చేతివ్రాత.

చదవకుండా ఉండటం ఆమె తరం కాలేదు.

అభినవ్, చిక్కడ్‌పల్లి,
హైదరాబాదు
మార్చ్ 1965

ప్రియాతి ప్రియమైన రేవతీ,

ఈ మలిసంధ్య వేళ మల్లెల గుభాళింపులో మధురోహలను కలగలపి వ్రాస్తున్నానీలేఖ. తెల్లారితే మరో ఇంటిదీపానివై తరలిపోతావు. మన మనసులు ఒకటైనా మనం కలిసి బ్రతకటానికి సమాజం ఒప్పుకోదు. అలాగని అందరినీ కాదనుకుని మనలేం కద. కులం జీవితం పంచుకుందుకు పనికిరాదు. నిన్ను నేను పోషించుకోగలని, అంతేనా కళ్ళల్లో పెట్టుకుని దేవతలా చూసుకోగలను కానీ మీ అమ్మ నాన్నను వారి ప్రేమను తెచ్చివ్వలేనుగా........

రేపటినుండీ నువ్వు కనపడవంటే మనసు ఎంత చేదుగా ఉందో తెలుసా..? చేదు దోసకాయలా కటికి చేదుగా....

ఇద్దరం కలిసి చదువుకున్నాం, ఒక్కరోజూ ఇలాంటి రోజొకటి వస్తుందని అనుకోలేదు. రేవతీ ఏం చెప్పాలనుకుంటున్నానో మనసు దాటి బయటకు రావడం లేదు. సినిమాల్లోలా నువ్వు లేకపోతే బ్రతకలేనని దేవదాసునైపోతానని చెప్పను కానీ నూవ్వు లేని లోటు మరో మనిషి తీర్చలేనిది. ఆ వెలితి మరోలా పూడ్చలేనిది.

రేవతీ,

ఈ మనసు తొలిచే జ్ఞాపకాలతో ఇక్కడ ఉండలేను. అందుకే ఏ అనంత తీరాలకో తరలిపోదామని. భయపడకు జీవితం ముగించేంత పిరికివాణ్ణి కాదు.. ఎక్కడ ఉన్నా నువ్వు పిల్లాపాపల్తో చిరునవ్వుల పొదరిల్లులా కళకళ్ళాడాలని అభిలషిస్తూ

అభినవ్

ఉత్తరం వెనకాల రేవతి అడ్రస్

అదీ చిక్కడపల్లి ఏరియానే...

కాస్సేపు స్థబ్దంగా కూర్చుండిపోయింది జాహ్నవి.

ఎంత మార్ధవంగా ఉందతని భావన.

మరింక గిఫ్టు సంగతి వదిలేసి సూట్‌కేస్ మంచం క్రిందకు నెట్టి ఆలోచనలో పడింది.

ఏదేమయినా అడ్రస్ తెలుసుగనక ఆవిడ ఉత్తరం ఆవిడకి అందచెయ్యడం ధర్మం.

చకచకా తయారయి బ్యాగ్ అందుకుంది.

....................

అతి కష్టం మీద ఆశా సైకియాట్రి నర్సింగ్ హోమ్ కనుక్కోగలిగింది జాహ్నవి.

చిక్కడ్‌పల్లి ఇల్లు చూస్తూనే సంబరపడిపోయి ఎంతో ఎక్జయిటయిపోయింది. తీరా లోపలికి వెళ్ళాక తెలిసింది. రేవతి అక్కడలేదని..... ఆవిడ అన్నయ్య మనవడి భార్య, నలభై దాటివుంటుంది, సాదరంగా ఆహ్వానించి చల్లటి నిమ్మరసం తాగాక చెప్పింది ఆవిడని నర్సింగ్ హోమ్‌లో ఉంచిన సంగతి.

మాటల్లో తెలిసినది ఏమిటంటే ఇంట్లో అందరికీ ఆవిడంటే వల్లమాలిన అభిమానం. ఆవిడ జీవితం విషాదమయినా ఆ ఇంటికావిడ దేవత.

సరిగ్గా తెల్లారితే పెళ్ళి అనగా పెళ్ళికొడుకు యాక్సిడెంట్‌లో మరణించడం, ప్రేమించిన వ్యక్తి జాడలేకుండా పోవడం ఈ విషాదం నించీ తేరుకోకమునుపే తల్లి తండ్రి ఒక్కగానొక్క అన్నగారు భద్రాచలం వెళ్ళి పడవ మునకలో దూరమవడం.........

ఆస్తిపాస్తులున్నా అన్నగారి పిల్లల కోసం వాళ్ళే జీవితంగా బ్రతికిందావిడ... అందుకే ఇంటిల్లపాదికీ ఆవిడ దేవత.

రెండేళ్ళుగా మనస్తిమ్మితం కోల్పోయారు.... అయినా ఎవరికీ ఆవిడనలా పంపడం ఇష్టం లేదు కానీ ఆవిడ సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని చేసారాపని.

ఆవిడ దగ్గర సెలవుతీసుకున్నా ఇంటికి వెళ్ళబుద్ధికాలేదు జాహ్నవికి.

అందుకే కష్టమయినా నర్సింగ్ హోం వెతుక్కుంటూ వెళ్ళింది.

ఏదో ఊహించుకుంది గానీ నిజమే... ఎంత సౌకర్యంగా ఉంచారావిడని.. ఏ.సీ గది.. ఆవిడ కోసమే ఒక నర్స్..

మౌనంగా కుంకుమ భరిణ అందించింది జాహ్నవి.

దాన్ని చూస్తూనే ఆవిడ కళ్ళు నక్షత్రాల్లా మిలమిలలాడాయి.

"నాకు తెలుసు...అభినవ్ రాడని... ఉత్తరం నీతో పంపాడా... ఈ ఉత్తరాల్లో విషయాలేం కొత్తవికాదు. చూడమ్మాయి అతనికి చెప్పు. ఏ ఉత్తరమైనా అతనొచ్చే చదవాలని---నా దృష్టి సరిగా లేదు మరి. అతనొచ్చే వరకూ ఇలాగే ఉంటానని చెప్పు"

"ఇదే వరస.... పాపం ఆవిడననుకోలేం. 1940లో పుట్టిందావిడ--ఎవరైనా వందేళ్ళు దాటాక ఎలావుంటారు మరి!"

నర్సుమాటలు జాహ్నవి మనసు కలచి వేసాయి.



# శ్రీవాణి గారి కథ

పొత్తూరి విజయలక్ష్మి

బస్టాప్‌లో నిలబడ్డారు పద్మ, సావిత్రి. వాళ్ళిద్దరూ ఒక గవర్నమెంట్ అండర్ టేకింగ్ సంస్థలో పనిచేస్తున్నారు. వాళ్ళ కంపెనీ బస్ రావాలి. ఎదురు చూస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

పద్మ హఠాత్తుగా మాటలు ఆపేసింది.

"ఆ వస్తుంది శ్రీవాణిగారు కదూ!" అంది

"ఎక్కడ?" అడిగింది సావిత్రి.

"అదుగో నడుచుకుంటూ వస్తున్నారు." చెప్పింది పద్మ.

"ఛ. శ్రీవాణిగారు నడుస్తూ ఎందుకొస్తారు? కార్లో వస్తారుగానీ! ఎవర్ని చూసి ఎవరనుకున్నా రో మీరు." అంది సావిత్రి.

"కాదు సావిత్రిగారూ అరుగో ఆవిడే" అంది పద్మ.

అంతలోనే దగ్గరకు వచ్చేసింది శ్రీవాణి.

బాగా దగ్గరకి వచ్చాక "నమస్తే మేడం" అంది పద్మ చేతులు జోడించి.

నవ్వుతూ ప్రతి నమస్కారం చేసి వెళ్ళిపోయింది శ్రీవాణి.

"అదేవిటలా ఉంది ఆవిడ?" అంది పద్మ.

"నిజమే. ఏమిటంత పేదగా ఉంది?` అంది సావిత్రి.

ఆశ్చర్యంగా ఆవిడ వెళ్ళిన వైపే చూస్తు ఉండిపోయారిద్దరూ. బస్ వచ్చి హారన్ కొట్టేసరికి ఉలిక్కిపడి బస్ ఎక్కారు.

బస్సులోనూ ఆవిడ గురించే మాట్లాడుకున్నారు.

శ్రీవాణిగారు చాలా మంచి వ్యక్తి. వృత్తి రీత్యా లాయరు. ఆవిడ భర్త రంగశాయిగారు ఇంజినీరింగ్ అయ్యాక డబుల్ పి.హెచ్.డీ చేశారు. అమెరికా వెళ్ళి పదిహేనేళ్ళుండి తిరిగి వచ్చి స్వంతంగా ఇండస్ట్రీ పెట్టుకున్నారు. వాళ్ళకి పిల్లలు లేరు.

శ్రీవాణిగారు తను కంపెనీలో లీగల్ వ్యవహారాలు చూస్తారు. సంఘసేవ చేస్తారు.

పద్మ వాళ్ళ కంపెనీలో మహిళాదినోత్సవం సందర్భంగా శ్రీవాణిని పిలిచారు. ఆవిడ వచ్చారు. మంచి ఒడ్డూ పొడుగూ చూడచక్కని రూపం. మెళ్ళో రెండు పేటల మంగళ సూత్రాల గొలుసు నల్లపూసలు. చేతులనిండుగా బంగారు గాజులు రవ్వల దిద్దులు సింపుల్‌గా ఉన్న కంచి పట్టు చీర వీటన్నింటినీ మించిన చిరునవ్వు ఆ రూపం చూసి ముగ్ధులైన వారు ఆవిడ ఉపన్యాసం విని మరింత పరవశించారు.

"ప్రస్తుతసమాజంలో ఎంతమంది స్త్రీలు డిప్రెషన్‌తో బాధపడుతున్నారు. అటువంటి వారు డాక్టర్ల చుట్టూ తిరక్కుండా ఉన్నంతలో ఆనందాన్ని వెతుక్కోవాలి. రోజులో కొంత సమయం ఇతరుల గురించి ఆలోచించండి. వారు మన బంధువుల్లో, మిత్రులో కానవసరంలేదు. కంటి ఎదురుగా కనిపించే వారిని తీసుకోండి. వారికష్టం మీ కష్టంగా భావించి వారికి సహాయం చెయ్యండి.

"ఆ సహాయం వేలో లక్షలో కానవసరంలేదు. మనకే మాత్రం నష్టం కలిగించకుండానే మనకెంతో మనశ్శాంతిని కలిగించే సాధనాలు ఎన్నో ఉన్నాయి.

"ఉదాహరణకి ఆ మధ్య నాకు ఒక అమ్మాయి కనిపించింది. పాతబట్టలకు స్టీలు సామానులు అమ్మడం ఆ అమ్మాయి వృత్తి. చేతిలో నెలల పసిబిడ్డవున్నాడు. వాడికి ఆ అమ్మాయి ఒక నైలాన్ చొక్కా తొడిగింది.  ఎండమండి పోతోంది. గుక్కలు పెట్టి ఏడుస్తున్నాడు. నాకు జాలివేసింది. ఆ అమ్మాయిని రమ్మన్నాను.

"బట్టలు వేయండి అమ్మగారు అంది రాగానే. బట్టలు కాదులే నువ్వు అలా కూర్చో అని చెప్పి మిగిలిన అన్నం ఇంత మజ్జిగ పోసి తినమని చెప్పాను. ఆ అమ్మాయి అన్నం తినేలోగా ఇంట్లో వున్న పాత పంచె చింపి మిషను మీద నాలుగు జుబ్బాలు కుట్టాను. నైలాన్ చొక్కా విప్పి మెత్తని నూలు చొక్కా తొడిగేసరికి ఆ పసివాడి ఆనందం వర్ణనాతీతం. వాడిని చూసి వాడి తల్లి మురిపెం వర్ణనాతీతం. వాళ్ళిద్దరినీ చూస్తుంటే నాకు పట్టరాని ఆనందం కలిగింది.

ఇటువంటి ఆనందం అప్పుడప్పుడు అనుభవిస్తూ వుంటే డిప్రెషన్ దగ్గరకు రాదు" అంటూ ఆవిడ ఉపన్యసిస్తుంటే కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. ఫంక్షన్ అయ్యాక చాలామంది ఆవిడ ఆటోగ్రాఫ్ తీసుకున్నారు. వారిలో పద్మా, సావిత్రీ కూడా ఉన్నారు.

అటువంటి మనిషి ఇవ్వాళ వేలుముడి, పాతబడిపోయిన చీరె, మెళ్ళో మామూలు నల్లపూసల దండ, చేతికి మట్టిగాజులు మూసివాయనం ముత్తైదువులావుంది. ఇంతలోనే ఏమైంది?

లంచ్ టైమ్‌కి మళ్ళీ అదే టాపిక్. వాళ్ళకి కొంచెం దూరంలో కూర్చుని వున్న సుజాత వాళ్ళ మాటలు విని గభాల్న లేచి వీళ్ళ దగ్గరికి వచ్చింది. ఆవిడది వేరే డిపార్ట్‌మెంట్. ముఖపరిచయం వుంది అంతే!

"ఎక్స్‌క్యూజ్‌మి ఎవరిగురించి మీరు మాట్లాడుకుంటున్నది?" కుతూహలంగా అడిగింది.

"క్రిందటి సంవత్సరం మార్చి నెల్లో విమెన్స్‌డేకి మన మీటింగ్‌కి వచ్చారు కదా శ్రీవాణిగారు ఆవిడ గురించి" చెప్పింది పద్మ.

"ఒక్క నిమిషం" అంటూ వెళ్ళి తన బాక్స్ తెచ్చుకుని వీళ్ళ దగ్గరకూర్చుంది సుజాత. "ఇప్పుడు చెప్పండి ఏమైంది?" అని అడిగింది. చెప్పింది సావిత్రి.

" ఆవేళ ఫంక్షన్‌లో చూశారా ఎంత గ్రేస్‌ఫుల్‌గా ఉన్నారో. ఆ తర్వాత ఒకసారి టీ.వీలో చర్చా కార్యక్రమంలో కనిపించారు. ఎప్పుడు చూసినా మహాలక్ష్మిలా ఉండే ఆవిడ ఇవ్వాళ చాలా పేదగా కనిపించారు." అంది

వంకరగా నవ్వింది సుజాత.

"ఆవిడ మాకు బంధువు అవుతుంది. మా వారికి వేలువిడిచిన మేనత్త కూతురు.

"వాళ్ళు అదోరకం మనుషులు. ఇక్కడ ఉద్యోగాలు వదులుకుని అమెరికా పోయారు. అక్కడ కాలు నిలవక మళ్ళీ తిరిగొచ్చారు. ఉద్యోగాల్లో చేరవచ్చుకదా. వద్దు మేమే పదిమందికి ఉద్యోగాలిస్తాం అని చర్లపల్లిలో  ఒక ఇండస్ట్రీ పెట్టారు.

"పిల్లలు లేరు. ఎవరినైనా పెంచుకోండి అంటే వినలేదు. దేవుడే మాకు పిల్లలు లేకుండా చేసినప్పుడు మళ్ళీ ఈ పెంపకాలూ లంపటాలూ ఎందుకు? మా ఫేక్టరీలో పనిచేసే వాళ్ళంతా మా పిల్లలే అంటారు.

"వంద సంపాదిస్తా అందులో తొంభై తొమ్మిది ఖర్చు పెట్టేదాకా తోచదు. దర్జాలకూ, ఖర్చులకూ ఏం తక్కువలేదు. హళ్ళికి హళ్ళి సున్నకు సున్నా. రేపనేది ఉందనే జాగర్త లేదు తెలివితక్కువో , అతి తెలివో తెలియదు. ఎవరితోనూ కలవరు. వాళ్ళ లోకం వాళ్ళదే మరేం ఎదురు దెబ్బ తగిలిందో ఏమో ఏసంగతీ మా దాకా రాలేదు" అంటూ మాటలూ భోజనం ఒకేసారి ముగించి లేచి వెళ్ళిపోయింది సుజాత. ఆదరా బాదరా చేయికడుక్కుని సెల్ తీసి భర్తకి ఈ సమాచారం అందించింది.

భార్య చెప్పింది విని ఆనందపడ్డాడు సూర్యం. మా బాగా అయింది. తిక్క కుదిరింది అనుకున్నాడు అతనంత ఆనందించడానికి కారణం ఉంది.

ఎప్పుడో ఏడేళ్ళ క్రిందట సూర్యానికి ఏదో ప్రాణావసరం వస్తే వెళ్ళి రంగశాయిగారిని సాయం అడిగాడు. ఆయన యాభైవేలు అప్పిచ్చి ఆదుకున్నాడు. అంతవరకూ బాగానే ఉంది. ఆయన దేవుడూ అని పొగిడారు. ఆ తర్వాత వాళ్ళు కొంచెం కుదుట పడ్డాక బాకీ తీర్చమనేసరికి గతుక్కుమన్నాడు సూర్య.

తమలాగా ఆయన కూడా ఆ బాకీ విషయం మర్చిపోయాడని వాళ్ళనుకున్నారు. ఇదుగో ఇస్తాం అదుగో ఇస్తాం అని కొన్నాళ్ళు కాలయాపన చేశారు. ఇలా వాయిదాలు వేస్తే కొన్నాళ్ళకి విసుగేసి ఆయనే అడగడం మానేస్తాడులే అనుకున్నారు.

కానీ రంగశాయిగారు ఘటికుడూ "నువ్వు మనిషివా? పశువ్వా! కడుపుకి అన్నం తింటున్నావా గడ్డితింటునావా?" అని తిట్టి గోళ్ళూడగొట్టి మరీ వసూలు చేశాడు. చెప్పొద్దూ సూర్యానికి చాలా కష్టం కలిగింది. "ఆ రంగశాయిగారికేం మాయరోగం పిల్లా? పాపా? కట్టుకుపోతాడా? అయినవారిని అవసరంలో ఆదుకుంటే ఆ డబ్బు అణాపైసలతో వసూలు చెయ్యాలా?" అని అడిగినవాడికి అడగనివాడికి చెప్పుకుని తన అక్కసు తీర్చుకున్నాడు.

ఇప్పుడు ఆ రంగశాయిగారికి ఏదో నష్టం వచ్చిందనీ ఆయన భార్య అతిపేదగా కాలినడకన నడుస్తోందనీ భార్య ద్వారా తెలుసుకునేసరికి చెప్పరానంత సంబరం వేసింది. ఆ ఆనందం తనతోటి వాళ్ళతో పంచుకోవాలనిపించింది.

వెంటనే ఫోన్లు చేసి నలుగురైదుగురు బంధువులకి చెప్పేశాడు. ఆనోటా ఆనోటా పడి చాలా దూరం పాకిపోయింది ఈ వార్త.

చాలామందికి చర్చనీయాంశంగా మారింది.

"అంతేనమ్మా! ఆ మధ్య మా వాడిని వాళ్ళ దగ్గరికి పంపాం. ఏదో పేద్ద స్వంత ఫేక్టరీ ఉందని గొప్ప చెప్పుకుంటారు కదా! అయినవాళ్ళు. చుట్టాల పిల్లాడికి ఉద్యోగం ఇప్పించకపోతారా అని ఆశపడి వాడు వెళ్ళనంటున్నా బలవంతాపెట్టి పంపించాం. వాడు బంగారంలాంటి కుర్రాడు. ఏదో పరీక్షలకి ముందు జ్వరం వచ్చి పదోతరగతి తప్పాడు గానీ కలెక్టరో గవర్నరో కావలసిన తెలివితేటలున్నాయి వాడికి. అటువంటి కుర్రాడిని తీసుకెళ్ళి లారీలోంచి సరుకుదింపించే ఉద్యోగం ఇచ్చారుట. వాడికసలే డస్ట్ అలెర్జీ. ఇంకేం చేస్తాడావుద్యోగం! దానికి తోడు జీతమూ తక్కువే. వెయ్యి రూపాయలిస్తామన్నారుట. ఈ రోజుల్లో అడుక్కునే వాడూ కూడా అంతకంటే ఎక్కువే సంపాదిస్తున్నాడు. వాడికి పౌరుషం వచ్చి మానేసి చక్కా వచ్చాడు. అయిన వాళ్ళ పిల్లాడుకదా వాళ్ళ దగ్గరుంచుకుని వ్యాపారంలోని మెళుకువలు అన్నీ నేర్పి వాటాదారుగా చేసుకోకూడదూ! రేపు వాళ్ళనంతరం వాడే అందిపుచ్చుకుంటాడు. ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేకపోయింది వాళ్ళకి. ఇప్పుడు బాగానే అయింది. " అంది ఒక ఇల్లాలు.

"నిజమే వదినా. మా అమ్మాయి పెళ్ళి కుదరగానే వెళ్ళి చెప్పాం. పెళ్ళికి రాలేం. ఢిల్లీ వెళుతున్నాం. అంటూ రెండొందలో మూడొందలో ఖరీదు చేసే ఓ ముష్టి చీరె, ఓ లక్కపిడతంత వెండి కుంకం భరిణె ఇచ్చిందావిడ. ఓ అయిదొందలు ఇచ్చి అల్లుడికివ్వండి అంది. ఏం కట్టుకు పోతారా? పదివేలో పదిహేనువేలో చేతుల్లో పెట్టి ఖర్చులకుంచండి అనకూడదూ!! పోన్లే పిసినారి బుద్ధులు అనుకున్నాం మా బాధ ఏమిటీ అంటే, ఎవరి ద్వారానో మాకు తెలిసింది. ఆ తర్వాత పదిరోజులకే వాళ్ళ ఫేక్టరీలో పనిచేసే అమ్మాయిని, అక్కడే పనిచేసే అబ్బాయికిచ్చి పెళ్ళి చేశారుట. సంసారానికి సరిపడా స్టీలు సామాన్లు, మంచం పరుపూ కొనిచ్చారుట. ఎంత హీనపక్షంగా చూసినా భోజనాలతో కలిసి ఇరవైవేల దాకా అయిందిట. అయినవారికి ఆకుల్లో కానివారికి కంచాల్లో అంటే ఇదే" అంది మరో ఇల్లాలు.

మరో చోట మరో చర్చ జరుగుతుంది.

"ఈ రంగశాయిగారిదంతా తలతిక్క వ్యవహారం. ఓసారి వాళ్ళింట్లో ఏదో శుభకార్యం అని పిలిచారు. బంధువులకి భోజనంతో బాటు పేదలకి అన్నదానం కూడా ఏర్పాటు చేశారుట. బంధువులకేమో పులిహోరా పుర్ణాలూ పరమాన్నం పెట్టిపంపించి పేదలకి మాత్రం పూరీ కుర్మా, పలావూ, జాంగ్రీలూ ఐస్క్రీములూనట. పైగా అదేవిటంటే పేదలకి అవన్నీ ఎవరు పెడతారు? అని వితండవాదనట. ఆయనకి తాళం వేస్తూ ఆవిడొకత్తె దొందూ దొందే" అన్నాడా పెద్దమనిషి.

"ముక్కే కూరగా ఉంటే ఎన్నిదానాలైనా చెయ్యచ్చు. ఏముంది? లంక మేత గోదావరి ఈతా అన్నట్లూ ఆ ఫేక్టరీ. ఓ స్వంత ఇల్లు అంతే. బాంక్ బాలెన్సేం ఉండదు. ఉంటే మొగుడూ పెళ్ళాలకి తోచదు. ఏమిటో గాలివాటం వ్యవహారం. తెలివితక్కువతనంగా ఏదో చేసేఉంటాడు. అందుకే తనకి స్వంత తెలివి తేటలు లేకపోతే మరొకర్ని సలహా అడిగే అలవాటైనా ఉండాలి. నేనెనోసార్లు చెప్పాను. వింటేనా! " అన్నాడు ఇంకో మేధావి.

ఈ సంగతి తెలిసి నిజంగా బాధపడినవాడు శేఖరం. అతనికీ రంగశాయిగారికీ బంధుత్వం ఉంది. నాలుగయిదుసార్లు రంగశాయిగారు శేఖరానికి సహాయ చేశారు.

ఫోన్ చేసి ఏమైందో కనుక్కుందాం అనుకున్నాడు. కానీ ఆ పని చెయ్యడానికి జంకు కలిగింది. రంగశాయిగారికి ఇంకొంత బాకీ తీర్చాలి. తన దగ్గర లేదు. తీరా ఇప్పుడు ఫోన్ చేసి ఆరా తీస్తే ఆయనగానీ "సోమశేఖరం నాకూ ఇబ్బందిగా ఉంది నా బాకీ తీర్చు" అన్నాడంటే తమ చిక్కుల్లో పుడతాడు. కాబట్టి తెలిసినా తెలియనట్లు ఊరుకుంటే ఉత్తమం.

అదీగాక ఆయన తనకొక్కడికే కాదు చాలామందికి సాయ చేశాడు. ఎవరో ఒకరు ఆయన్ని ఆదుకోక పోరు ఊరుకున్నాడు.

మొత్తానికి రంగశాయి, శ్రీవాణిగార్ల గురించి ఆ వేళ చాలామందే మాట్లాడుకున్నారు.

సుజాత ప్రతిరోజూ పనిగట్టుకుని పద్మ సావిత్రిలను వెతికిపట్టుకుని" ఏమైంది ఇవ్వాళ మా శ్రీవాణి కనిపించిందా" అని అడుగుతుంది.

"ఇవ్వాళ కూడా కనిపించారు. అదే అవతారం. పాపం నడవలేక ఆయాస పడుతున్నారు." అని చెపుతున్నారు సావిత్రీ, పద్మ. ఆ వార్తని యధాశక్తి బంధువులకు చేరవేసి ఆనందపడుతుంది సుజాత.

సూర్యం ఒకసారి వాళ్ళ ఫేక్టరీకి ఫోన్ చేశాడు. సార్ లేరు. ఎక్కడికో వెళ్ళారు. రావడానికి చాల్రోజులు పడుతుంది అని ముక్తసరిగా సమాధానం చెప్పారు. వివరాలడిగితే మాకేం తెలియవు అన్నారు.

ఇంటికి చేస్తే మీరు డయల్ చేసిన నెంబరుతో ప్రస్తుతం ఏ నెంబరూ పనిచేయడంలేదు అని సమాధానం వచ్చింది.

ఇంకేం వుంది ఫోను కూడా పీకేసుకుపోయుంటారు. ఏదో పెద్ద దెబ్బే తగిలింది. ఆయన మొహం చాటేశాడు. ఆ విషయమే సుజాతతో చెప్పాడు.

"కనీసం ఆవిడ ఉద్యోగం వున్నా బావుండేది. ఇటువంటి ఆపత్సమయంలో ఆదుకునేది. తీరి కూర్చుని ఉద్యోగం వదిలేసింది. తాదూరకంతలేదు మెడకో గంగడోలు అన్నట్లు ప్రజాసేవ సింగినాదం అంటూ చేతిచమురు వదిలించుకోవడం స్వంత వ్యాపారం వ్యాపారం అనగానే సరా! అన్నీ సమర్ధించుకునే తెలివితేటలు ఉండొద్దూ. మనకు వ్యాపారాలు చేతకాకనే ఉద్యోగాలు చేస్తున్నామా? ఇప్పుడు పాపం రోడ్డున పడినట్లు అయింది పని" అంది సుజాత

ఇద్దరూ వాళ్ళ విషయమే మాట్లాడుకున్నారు.

ఆయన ఫేక్టరీలో దొరకని విషయం వాళ్ళ ఇంటి ఫోను పీకేసిన విషయ కూడా నలుగురితో చెప్పి ఆనందించింది సుజాత. ఈ కారణం వల్ల బంధువుల్లో సుజాత చాలా ముఖ్యమైన వ్యక్తి అయిపోయింది. తెల్లవారిలేస్తే ఎవరో ఒకరు ఫోన్ చేసి " ఏమిటి సుజాతా? ఏమైందిట రంగశాయిగారి సంగతి? ఏమైనా కొత్త వివరాలు తెలిశాయా? " అని అడగడం.

వాళ్ళని నిరాశపరచడం ఎందుకని ఉన్నవీ లేనివీ కనిపించి చెప్పటం.. అదో కాలక్షేపంగా మారింది సుజాతకి.

రానాను ఉత్కంఠ పెరిగిపోయింది సుజాతకి. ఎలాగైనా శ్రీవాణిని కలిసి పూర్తి వివరాలు రాబట్టీ అవన్నీ బంధువులకి చెప్పాలనే తహ తహ.

ఆ పని ఎలా చెయ్యాలా అని ఆలోచించి మంచి ప్లాను వేసుకుంది.

ఒకరోజు పొద్దున్నే లేచి ఆటో చేసుకుని ఆరుకిలోమీటర్లు ప్రయాణించి సావిత్రీ, పద్మ వాళ్ళు బస్సెక్కే స్టాప్‌కి వెళ్ళింది.

ఎవరికీ అనుమానం రాకూడదని బాగా ముందుగానే వెళ్ళి అక్కడే పచార్లు చేస్తూ గడిపింది. నిర్ణీత సమయానికి వచ్చారు పద్మ, సావిత్రి.

సుజాతను చూసి "ఇదేమిటండీ మీరిక్కడ?" అని అడిగారు ఆశ్చర్యంగా.

"నిన్న ఈ ఏరియాలో ఫ్రెండింట్లో ఫంక్షను జరిగింది. రాత్రి బాగా ఆలస్యం అయింది. అందుకని ఇక్కడే ఉండిపోయాను ఇక్కడే బస్సెక్కుదామని వచ్చాను" అంది గోడకట్టినట్టు అబద్ధం చెపుతూ

"మా శ్రీవాణి వచ్చేసిందా?" అంది యధాలాపంగా అడిగినట్లు.

"ఇంకా రాలేదండీ! రావాలి. ఒక్కోరోజు ఆవిడ ముందొస్తారు. ఒక్కోరోజు మన బస్ ముందు వస్తుంది" అంది సావిత్రి.

"దేవుడా! దేవుడా ఇవ్వాళ ఆవిడ ముందు రావాలి" అనుకుంది సుజాత. ఆవిడ కోరిక ఫలించింది.

"అరుగో శ్రీవాణిగారు." అంది పద్మ.

పద్మ, సావిత్రి ద్వారా ఎంత విని వున్నా శ్రీవాణిని చూసి గతుక్కుమంది సుజాత. నలిగిన చీర, బోసిగా ఉన్న చెవులు. మెళ్ళో ఓ పసుపుతాడు. చేతికి రెండేసి మట్టి గాజులు. మనిషి బాగా నలిగిపోయింది. కొంచె ఆయాసపడుతోంది.

సుజాత ఆశ్చర్యావస్థనుంచి బయటపడకముందే దగ్గరకొచ్చిన శ్రీవాణి పలకరించింది.

"సుజాతా! నువ్వేమిటి ఇక్కడున్నావ్?" అంది ఆగిపోయి.

"నేనేదో పనుండి వచ్చానులే గానీ అక్కయ్యా నువ్వేమిటి ఇలా అయిపోయావ్? ఆరోగ్యం బాగా లేదా?" అంది సుజాత.

"బాగానే ఉన్నాను సుజాతా. మరి నేను వెళతాను. నాకు ఆలస్యం అవుతుంది" అంది శ్రీవాణి.

దొరికినట్లే దొరికి జారుకుంటున్న శ్రీవాణిని చూసి సుజాతకి చిరాకువేసింది. ఆ మాత్రం తెలివితేటలు నాకూ వున్నాయి. ఈ అవకాశం జారవిడుచుకుంటానా అనుకుని

"పద అక్కయ్యా! నేనూ వస్తాను" అంది.

"బస్సు వచ్చేస్తుందేమోనండీ." గుర్తుచేసింది పద్మ.

"నేను ఆటోలో వస్తానులెండి. చాలారోజుల తర్వాత కనిపించింది. మా అక్కయ్య. కాస్త కష్ట సుఖాలు మాట్లాడుకుంటాం" అనేసి శ్రీవాణితో బయలుదేరింది సుజాత.

"ఏమిటి విశేషాలు సుజాతా? బావా పిల్లలూ బావున్నారా?" ఆదరంగా అడిగింది శ్రీవాణి.

"ఆ! అందరం బాగానే ఉన్నాం అక్కయ్యా. నువ్వు చెప్పు ఏమిటి విశేషాలు? " అడిగింది సుజాత.

"మామూలు కబుర్లకేం గానీ సుజాతా ఈ మధ్య మేమంతా కలిసి ఒక మంచి పని చేశాం. కర్నాటకా బోర్డర్‌లో ఒక పల్లెటూళ్ళో పాపం ఎల్లమ్మ ఆచారానికి బలైపోయిన ఒక అమ్మాయిని ఆ చెరనుంచీ తప్పించి చేతిపనుల్లో శిక్షణ ఇప్పించాం. చీరల మీద వర్క్ చేసి రోజుకి ఓ వందరూపాయలు దాకా సంపాదించుకుంటుంది. తల్లి తనాన్ని అనుభవించాలని ఆశపడుతోంది. బిడ్డను పెంచుకుంటానని చెప్పింది. తల్లీ తండ్రీ ఎయిడ్స్ వ్యాధితో మరణించగా అనాధగా మారిన ఒక అయిదేళ్ళ పాపని తీసుకుని ఈ అమ్మాయికి అప్పగించాం. బిడ్డకోసం తపిస్తున్న తల్లికి బిడ్డ దొరికింది. అనాధ పాపకు తల్లి దొరికింది. వాళ్ళని చూస్తుంటే మా కెంతో తృప్తిగా అనిపించింది. ఇటువంటి అనుభవాలు జీవితంలో ఎంతో తృప్తినిస్తాయి సుజాతా!" అంది శ్రీవాణి.

సుజాతకి విసుగేసింది. ఈ స్వంత డబ్బా చాల్లే తల్లీ అని మనసులో అనుకుని పైకి మాత్రం " ఆ మధ్య నీకోసం ఇంటికి ఫోన్ చేస్తే, ఆ నెంబరుతో ఏ ఫోనూ లేదు పొమ్మన్నారు. ఫాక్టరీకి చేస్తే బావగారు లేరు. ఎక్కడికి వెళ్ళారు? మీ ఫోనేమయింది?" అంది ఆరాగా.

"మాకు అమెరికన్ కంపెనీ నుంచీ మంచి ఆర్డర్ వచ్చింది సుజాతా! లాభాలు ఎలాగూ వస్తాయనుకో మరో పదిమందికి ఉద్యోగాలు ఇవ్వగలమని ఆనందంగా ఉంది. బావగారు ఆ పనిమీదే అమెరికా వెళ్ళారు. ఇంకో నెలాగి వస్తారు. ఇక ఫోనంటావా? పాతది తీసేసి ఈ మధ్య రిలయన్స్ ఫోన్ తీసుకున్నాం" అంది శ్రీవాణి.

గతుక్కుమంది సుజాత. "అలాగా చాలా సంతోషం. సరేగానీ అక్కయ్యా నువ్వేమిటి కాలినడకన వెళుతున్నావు. కారేమైంది? నగలన్నీ తీసేశావేం?" ఓర్పు నశించి పోయి నేరుగా పాయింట్లోకి వచ్చేసింది.

"అదా! ఈ మధ్య ఆరోగ్యం కాస్త పాడైంది సుజాతా! మెనోపాజ్ టైం కదా. నడుం నొప్పి దానికి తోడు ఉండుండి ఎడంకాలు గుంజడం. ఎవరో కేరళ వైద్యంతో తగ్గుతుందంటే ప్రయత్నించి చూద్దాం అని మొదలుపెట్టాను. పంచకర్మ చికిత్స. అయిదారువారాలు. బాగానే ఉంది. తైలమర్ధనాలు కదా. కాలి మట్టెలతో సహా అన్నీ తీసేయమంటారు. అక్కడికెళ్ళి తియ్యాలి కదా అని ఇంటి దగ్గరే తీసేస్తున్నాను. ఆ వైద్యానికి తోడు కాస్త వాకింగ్ కూడా ఉంటే ఈ ఒళ్ళు తగ్గుతుందని నడిచే వెళుతున్నాను. అన్నట్లు చెప్పడం మర్చిపోయాను. మా పెద్ద చెల్లెలు రాధ కూతురికి పురుడు వచ్చింది. ఒక్కతే ఉంది. కాస్త సాయంగా ఉండవే అక్కయ్యా అంది. అన్నీ కలిసొస్తాయి ఇక్కడికి ఆ సెంటరుకూడా దగ్గర. ఎలాగూ బావగారు ఊళ్ళో లేరు. ఇక్కడే ఉండి ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాను. ఇదవగానే ఇంటికి వెళతాను" అంటూ విషయం చెప్పేసి "నేనిటు వెళ్ళాలి. అనుకోకుండా నిన్ను కలుసుకోవడం ఆనందంగా ఉంది. వీలు చూసుకుని మా ఇంటికి రా!" అని సందులోకి తిరిగింది శ్రీవాణి.

చేష్టలుడిగిన సుజాత మెల్లిగా వాస్తవంలోకి వచ్చింది. టైం అయిపోతుంది. బస్సుపట్టుకోవాలి. ఉరుకులు పరుగుల మీద బస్టాండుకి వెళ్ళింది. కానీ అప్పటికే బస్సులు వెళ్ళిపోయాయి. ఇంక ఆటోనే గతి.

అంతదూరం ఎవరూ రామన్నారు. రిటర్న్ ఫెయిర్ ఇమ్మన్నారు. కాసేపు అటూ ఇటూ పరుగులు పెట్టి గత్యంతరం లేక రెండొందలు తగలేసి ఆటో ఎక్కింది. ఆఫీసుకి వెళ్ళేసరికి గేటు మూసేశారు ఫార్మాలిటీస్ ముగించుకుని లోపలికి వెళ్ళేసరికి దాదాపు లంచ్ టైం కావస్తోంది. బాస్ కుక్క చీవాట్లు పెట్టాడు.

వికలమైపోయిన మనస్సుతో లంచ్ బాక్స తీసుకుని హాల్లోకి వెళ్ళింది అక్కడ ఎదురుగా సావిత్రి, పద్మ.

"ఏమైందిట శ్రీవాణిగారికి?" అని అడిగారు ముక్తకంఠంతో

"నా శార్ధం అయింది. నా పిండాకూడయింది" విసురుగా చెప్పి కుర్చీలో కూలబడి అదృష్టవంతుల్ని చెడగొట్టేవాళ్ళు లేరు. దరిద్రుల్ని బాగుచేసేవాళ్ళూ లేరు. అనుకుంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది సుజాత.

## అమృతవర్షిణి

- పాండ్రంకి సుబ్రమణి

**ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్లోని** వ్యావహారిక నియంత్రణా నియమాల్ని పూర్తి చేసుకుని, నిర్ధారించిన సుంకాల్ని వివిధ సర్కారు వారి ఖాతాల్లోకి జమకట్టి, జర్మన్ ఇంపోర్టెడ్ కారుని అధికార పూర్వకంగా హస్తగతం చేసుకున్నాడు రామభద్రం. యుక్త వయసులో ఉన్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లే కాక - కొందరు సీనియర్ ఆఫీసర్లు కూడా ఆ కారు ఒంపుసొంపుల్నుండి చూపులు మరల్చుకోలేక, కదల్లేక అవస్థపడటం చూపుల కొన నుండి గమనించిన రామభద్రం ఓ సన్నటి చిరునవ్వు చిలకరించాడు. కారు ప్యాకింగ్‌ని కుదురుగా ఊడదీసి

నిల్చున్న ఇద్దరు సిబ్బందికి రెండు నూరు రూపాయల నోట్లు అందించి, కారు బాడీలోకి తొంగిచూశాడు. దృఢమయిన సోలీడ్ ఆకారాన మిసిమిసి సింగారం ఒలికిస్తూ నిల్చున్న ఓ అపురూప లోహ స్వరూపం! నవ్యతతో తొణికిసలాడే ఓ అద్భుత యంత్ర నిర్మాణం! నవీన సేఫ్టీ బెల్టులతో పసందయిన మృదువైన సీట్లు అతని చూపుని ఆకట్టుకునాయి. రిమోట్ కంట్రోలర్ నొక్కి సెంట్రల్ లాక్ సిస్టమ్‌ని విడదీసి గుర్రపు నిగాళాన్ని తడిమినట్లు హెడ్‌లైట్లని, విండ్‌స్క్రీన్ గ్లాసుని ఓసారి స్పృశించి, డ్రైవింగ్ సీట్లోకి హుషారుగా దూకాడు. కారు కీని జొప్పించి, సర్రున రోడ్డుపైకి పోనిచ్చాడు.

కొత్తకారు ముఖమల్ వలువపై జాలువారుతున్న మెర్క్యూరీ బిందువులా సజావుగా సాగిపోతుంది. కొన్ని నిమిషాలకి వాయువేగానికి సమానంగా అంతవరకూ అక్కడెక్కడో నక్కి దాక్కున ఆలోచనలు వలయాలుగా మారి అతణ్ణి చుట్టుముట్టాయి. పొలోమని పెనవేసుకున్నాయి. వాస్తవానికతడు రవంత హతాశుడయ్యాడు. అంతరంగంలో అంతెత్తున లేచిన ఆక్రోశాన్ని గమనించి - తనలోకి తను ఓసారి చూసుకుని - గతాన్ని తలచుకుని. ..

వాస్తవానికా జర్మను కారు అతడికి మొదటిది కాదు. మూడవ వాహనం. మొదటిది చిన్నసైజు మారుతి. రెండవది టాటాసుమో. ఆది నుండీ అతడికొక అబ్‌సెషన్. రకరకాల కార్ల సందడి. పలుదిశల ప్రతిఫలించే రంగుల మెరుపులు - జ్వలించే కలలు అతనికి ఎనలేని థ్రిల్‌నిస్తుంది. ఈసారి మాత్రం భార్య కోరిక మేర ఓ వ్యాపార మిత్రుడి సహకారంతో జర్మనీ నుండి సీసపు రంగు కారుని దిగుమతి చేయించాడు. కారు కంపెనీవాళ్ళ బ్రాంచి ముంబాయిలో ఉంది. ఆ బ్రాంచి వాళ్ళ ద్వారా లావాదేవీలు జరిపించి, కారుని విశాఖ రేవులోకి చేర్పించాడు. అప్పుడతని మనసు - అతనికి తెలియకుండానే - పాత డొక్కు కారు నుండి హఠాత్తుగా ఊడిపడ్డ చక్రంలా వేరుపడి గతకాలపు లోయలోకి దిగబడిపోయింది. నలువైపులా జ్ఞాపకాలు దీపికలు ఫెళ్ళున వెలిగాయి. మరి కాసేపటికి అవి దివిటీల్లా మారి పాత రోజుల్లోకి తొంగిచూడమని ఆదేశించాయి. రామభద్రం కారు వేగాన్ని తగ్గించి బరువుగా నిట్టూర్చాడు. కణతల్లోని రక్తనాళాలు పొంగాయి. విన్నూత్న శిఖరాగ్రపు మలుపుల్ని అధిగమించడం మాట అటుంచి కారుని తోలే ప్రసక్తి ప్రక్కనుంచి - తనెన్నడైనా అనుకున్నాడా కనీసం కారు ముందు నిల్చోగలడని! జీవన చక్రభ్రమణంలో ఎన్ని పల్టీలు, మరెన్ని ఒడిదుడుకులుల్ని ఎదుర్కొని - ఈనాడు ఇలా ఇక్కడకు చేరుకోగలిగాడు.

***

అర్థాంతరంగా చదువు నిలిపి, అంధకార గతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నప్పుడు - బోరా తెగకు చెందిన ఓ తురక వ్యాపారస్తుడు తొలకరి చినుకులా ఎదురయి దిగుమతి ఎగుమతి సంస్థలో డెస్క్ క్లర్క్‌కి అసిస్టెంట్‌గా ఉంటావా అని అడిగాడు. కాదనడం అటుంచి - ఆలోచించడానికే ఆస్కారం లేనప్పుడు తన నోటి పలుకుకి విలువెక్కడిది? చిన్ననాటి నుండే రంగుల వలయాల్లో పీలికలుగా పెంచుకున్న వన్నె చిన్నెల కలల్ని ఓ మూల మూటగట్టి, సాహిబుగారి సహాయంతో పాస్‌పోర్ట్ సంపాదించుకుని, అతని వెంట దుబాయ్ వెళ్ళిపోయాడు. జీవితానికావల చేరుకున్నాడు. నావ లేని త్రోవలో పయనించడానికి పూనుకున్నాడు. అంతే - ఆ సుదూరతా, అనంత దిగంతాల్లోని విస్తరత, నలువైపులా వైచిత్రిని సంతరించుకున్న ఆ కొత్త వాతావరణమూ తన బాధల గాయాలకు లోతైన శమములందిచ్చాయి. అటుపైన కొన్నాళ్ళు - కాదు - కొన్నేళ్ళ వరకూ తను స్వదేశ తీరాల వేపు చూపెత్తి చూడలేదు. ముందు చూపుని సమకూర్చుకుని ఉద్యోగంలోని ఎగుడు దిగుళ్ళ రాపిడిని తట్టుకుంటూ పని తీరులోని మెలుకువల్ని దీక్షతో నేర్చుకుంటూ కాళ్ళ క్రింద నేలను స్పర్శించడమే మర్చిపోయాడు తను.

ఆ విధంగా ఆరేళ్ళ ఆ హడావిడి వాతావరణంలో నింపాదిగా ఓసారి తలెత్తి చూసేటప్పటికి కాలం దొర్లిపోయిన వైనం తెలిసొచ్చింది. జ్ఞానోదయం కోసం పరితపించే వ్యధిత జీవాత్మలా సముద్రపుటొడ్డున ఓ రోజు ఒంటరిగా కూర్చుని తర్జ భర్జనలు చేస్తుండగా తెలిసొచ్చింది - తన బ్యాంకు సేవింగు బ్యాలెన్స్ ఊహాకందనంతగా ఉబ్బిందని. అప్పుడు తనకి మొదటిసారిగా ఉన్నూరు బలంగా గుర్తుకు వచ్చింది. ఆకాశవీధిలో కదిలిపోయే వెండి మబ్బుల్లా బంధువులు, రక్త సంబంధీకులు కనుసన్నల్లో మెదిలారు.

తలచుకున్నప్పుడు గుండె ఎగిసిపడింది - శ్వాసెడు గాలి, గుక్కెడు నీరు, పట్టెడన్నం తన స్వంత దేశంలో కరువైపోయాయికదా! తనపైన తనకే నమ్మకం చాలక, మళ్ళా ఎక్కడ మనసు మారుతుందోనని, మరునాడే తన నిర్ణయాన్ని తెలియచేసి, సాహిబుగారికి నమస్కారాలందజేసి తోటి సిబ్బందికి ధన్యవాదాలర్పించి, ఖాతాలన్నీ సరిచేసుకుని తిన్నగా ముంబాయి చేరాడు.

అద్దమరేయి ఆరాటపడే మనసు అర్ధాంతరంగా అటువంటి పనులే చేయిస్తుంది మరి! ముంబాయిలో మరొకమారు మరొక ఇంపోర్టు ఎక్స్‌పోర్టు కంపెనీలో డస్క్ క్లర్క్‌గా చేరాడు. పలు కార్మిక చట్టాల్లోని అంశాలను నియమాలను ఆకళింపు చేసుకుని, స్వానుభవాన్ని సోపానంగా మలచుకుని, తన మేనమామ ఊరైన భీముని పట్నంలో స్వంతంగా ఎగుమతి దిగుమతి సంస్థను స్థాపించాడు. పెట్టుబడి ముఖం చూడకుండా, కాలయాపన అవుతుందన్న దిగులు గురించి తలపోయకుండా - ఉద్యోగాల్ని వర్షాకాలపు శిబిరంగా మార్చుకునే దూరప్రాంతాల సిబ్బందిని రప్పించకుండా - స్థానిక సిబ్బందికి - తెలుగు మాధ్యమంలో పట్టభద్రులైన వారికి సహితం తగురీతిన తర్ఫీదునిచ్చి, క్రమబద్ధమైన పద్ధతుల్లో సంస్థ మేనేజ్‌మెంట్ ని ఉన్నత ప్రమాణాల కొలతబద్దతో పటిష్టం చేసి, వాతావరణంలో మౌలిక విలువల్ని విస్తృతపరచి, దృఢ మార్గాన - అంచెలంచెలుగా అంతర్జాతీయ స్థాయిలో వ్యాపార సంబంధాలు నెలకొల్పాడు. నేడు ఈ స్థితికి చేరుకున్నాడు.

***

అప్పుడు హఠాత్తుగా - అసంకల్పితంగా ఏమయ్యిందో అతనికే తెలియదు. ఆలోచనా తరంగాల నురగల నుండి తుళ్ళిపడి తేరుకుంటూ ఉన్నపాటున బ్రేక్ వేశాడు రామభద్రం. నడిరోడ్డున కారునాపి, తలను బయటకు చాచి 'కావేరీ! కావేరీ' అని గట్టిగా అరిచాడు. చీర చెంగుని ఒంటిమీదుగా తలపైకి తీసుకుని, ఎదురెండలో రోడ్డు ప్రక్కనుండి వెళుతున్న ఆమె ఆగి, మరింత ప్రక్కకు ఒరిగి తిరిగి చూసింది. ఆమె ఎంత నిదానంగా నిబ్బరంగా తిరిగి చూసిందంటే, కావేరీ ప్రశాంత ప్రసన్న వదనం అతడి కనుసన్నల్లోకి వచ్చి ఓ సౌమ్యశుభ్ర తేజస్సులా నిల్చుంది. కాని ఆమె కావేరీ కాదు. పద్దెనిమిదేళ్ళ క్రితం నాటి కావేరీ ఇంకా అప్పటి బిగుయవ్వనంతో, ఊగే వయ్యారపు నడుముతో నడుస్తుందనుకోవడం అవాస్తవికం. "సారీ! ఐయామ్ రియల్లీ సారీ! వెనుక నుంచి చూస్తే మా బంధువులమ్మాయిలా కనిపించారు. ఒడ్డూ పొడుగూ మీలాగే ఉంటుందామె. గట్టిగా పిలిచి షాక్ ఇచ్చినట్లున్నాను. ఏమీ అనుకోకండి - ప్లీజ్" అని తనను తను తిట్టుకుంటూ కారుని పోనిచ్చాడు. మరి కాసేపటికి అతడి జ్ఞాపకాల గుర్రాలు గత కాలపు మట్టి పొరల్ని తొలుచుకుంటూ ఆలోచనా డెక్కల చప్పుళ్ళను మరో దిశవేపు తీసుకుపోయాయి. ఇటీవలకాలం నుంచీ తన మానసిక స్థితి ఇలానే తయారవుతుంది. తలక్రిందులవుతూంది. కేవలం బుద్ధి స్థిరత కోల్పోవడం కాదు. హృదయం అనవతరం ఊగిసలాడుతూ - పట్టాల పట్టు తప్పి - గ్రహాంతర సీమల వేపు రెక్కలు తెగిన పక్షిలా ఉండలు చుట్టుకుంటూ పల్టీలు కొడుతూంది. స్వాధీనం తప్పిపోతూంది. ఒకదానిని చూసి మరొకటి అనుకోవడం భ్రమ అవుతుందంటారు. ఎదురుగా ఏమీ లేనప్పుడు - అక్కడేదో ఉందనుకోవడం విభ్రమం అంటారు. మరి తన అస్తవ్యస్త మనోచిత్రణ ఏకోవకు చెందినదో! ఈ విషయాన్ని విశ్లేషించడం మాట అటుంచి - ఊహించడానికే జంకుగా ఉంది రామభద్రానికి. బాగా అవలోకించి చూస్తే పైకి అమాయకంగా రసరూప గంధస్పర్శల కతీతంగా గోచరించే అంతరాత్మను పగటిపూట అడవి మూలన మాగన్నుగ నిద్రించే సింహంతో పోల్చవచ్చంటాడు గోర్కి. అరమోడ్పు కళ్ళతో పగలంతా పొదల మాటున నక్కి దాగి ఉంటుంది. సెలయేటికి ప్రక్కన పొంచి ఉంటుంది. మునిమాపు వేళ ముంచుకొచ్చినప్పుడు - అడివంతా సద్దుమణిగినప్పుడు మృగరాజు జూలు విదిలిస్తూ, చీకటి సహితం వణికిపోయేలా గాండ్రిస్తూ లేస్తుంది. ఈ గాండ్రింపుకి ఏ మాత్రమూ ఎదురు చూడని జంతు సముదాయం - ఆ చిక్కటి చీకటిలో చెల్లాచెదురయి పరుగెత్తాయి. రామభద్రం అంతరంగపు అట్టడుగున అటువంటి కల్లోలమే కొన్నాళ్ళుగా చెలరేగుతూంది. గతకాలపు జ్ఞాపకాలు సైకత మేఘాలై మాటిమాటికీ ముప్పిరిగొంటున్నాయి.

***

పరపతి లేక, సరైన సిఫార్సు దొరక్క స్వంత ఊళ్ళోని జూనియర్ కాలేజీలో సీటు లభించక విజయనగరంలో ఓ విద్యా సంస్థ

ట్రస్టువారి కాలేజీలో పలువురి కాళ్ళావేళ్ళాబడి సీటు సంపాదించగలిగాడు. గుప్పిట నున్న కటాబొటి ద్రవ్యాన్ని మనసున - కనుసన్నన పదే పదే లెక్కించుకుంటూ దానిమ్మతోట మెరకవీధిలో పావురాల గూడు వంటి చిన్నటి గదిలో రవంత వెలుగుని ప్రోదిచేసుకుంటూ మట్టిగోడ వేపు అసహాయంగా ఒరిగాడు. పూటకూళ్ళ పద్మావతి అమ్మగారి వద్ద ఖాతాదారుగా చేరలేక - చేసేది లేక చేతుల్ని కాల్చుకునేందుకు సిద్ధపడుతూ గది మూల ఓ చిన్నటి పొయ్యి పిక్కిలి అమర్చుకున్నాడు.

తమ ప్రాంతం నలుమూలలా ఎండలు సెగల పొగలై మంటల్ని రేపాయి. ఉన్న మట్టిలోని తడిని తుడిచిపెట్టేసింది - అనావృష్టి. నారు తడపడానికి అటువేపు ప్రవహించే కాలువ లేక, సాగునీరు అందక - చినుకు పడితే చాలు తలెత్తుకు బ్రతికేయాలని ఆరాటపడ్డ మొలకలు మెలికలు తిరిగి కదలడం మానుకున్నాయి. పేరంటానికి వచ్చినట్లే వచ్చి మూతులు ముడుచుకున్న ముత్తయిదువుల్లా ఊరి మీద మేఘాలు మరెటువైపో జారుకున్నాయి. అటువంటి ఇరుకైన ఆర్థిక పరిస్థితుల వల్ల పొయ్యి పొక్కిలి వెలగనంటూ మాటమాటికీ మారాం చేసేది. చల్లారిపోయిన ఆశలా, మందగించిన మనిషి మనుగడలా బూడిద మాత్రం మిగిలి, కనురెప్పల నడుమ, పడక చివర్లలో చోటు చేసుకునేది. అలాంటప్పుడు తనేమి చేసేవాడు - తనబోటి వారందరూ చేసేదే తను కూడా చేసేవాడు. అరటిపండు మింగి, ఉదరాన్ని నీటిధారతో నింపుకుని తొణికిన స్వర్గాన్ని ఊహల రెక్కల ద్వారా మోసుకుంటూ నిద్రపోయాడు.

ఆవిధంగా అతికష్టంగా అతి గుప్తంగా మిగులు చేసుకున్న ద్రవ్యాన్ని చినిగిన పేపరు ముక్కల్లా పదిలపర్చుకుని కాలేజీ ఫీజుగా సమర్పించుకునేవాడు. అవన్నీ తలుచుకుంటే - ఇప్పుడిప్పుడే తన కళ్ళముందు ప్రత్యక్షమైనట్లు ఒకలోతైన అనుభూతి కలుగుతుందతనికి. అంతే కాదు - ఒక విషయం తలుచుకుంటే విపరీతమైన ఆశ్చర్యం కలుగుతుందతడికి. ఏమి బాపుకుందామని తను అన్ని కష్టాలకు లోనయి చదువు కొనసాగించడానికి ప్రయత్నించాడు? మంటల్లాంటి కష్టాల మధ్య ఈ కాలపు చదువుకున్న సార్థకతేమిటి? రోజులు బండరాళ్ళయి ఛాతిపై దొర్లుతున్న గడ్డు సమయం - శప్తగతం అది.

అటువంటి పరిస్థితుల్లో తను ఒకనాడు అనుకోకుండా కావేరిని చూశాడు. అంతవరకూ ఆమె అదే వీధిలో తన మట్టిగోడల గదికి పక్కనే ఉంటుందన్న వైనం తన దృష్టి కేంద్రానికి అందనే లేదు. తలంటుపోసుకుని, నిగనిగలాడే పొడవాటి జుట్టు చివరన వదులు ముడివేసి, మోకాళ్ళు తాకేంతవరకూ వ్రేలాడదీసి నుదుట చందనపు రేఖల్ని పూసుకుని, వాళ్ళింటి విశాలమైన ఆవరణలో తులసికోట చుట్టూ ప్రదక్షిణం చేస్తున్న కావేరిని ఆనాడే మొదటిసారిగా చూశాడు. పొడవుగా, నిండుగా, చక్కటి ఎరుపు రంగు ఆకారంతో తులసికోట ముందు కళ్ళు మూసుకుని నిల్చున్న ఆమె రూపాన్ని చూసి కొన్ని క్షణాలు చూపులు మరల్చుకోలేకపోయాడు. సభ్యత అడ్డువచ్చి ప్రక్కకు ముఖం తిప్పుకోవాలని ప్రయత్నించినా - చూపులు మాత్రం స్వరున ప్రాకే తీగెల్లా ఆమె నిండు విగ్రహాన్ని చుట్టేశాయి. ఆ క్షణాన ఆమె అపురూప లావణ్యం చూసి చీకటి గుహ నుండి బయటపడి వెలుగువెల్లువలోకి వచ్చినట్లనిపించిందతనికి. చేతిని చాచి, దూరాన కదిలే వెండి మబ్బుని సుతారంగా తాకినట్లు ఓ మృదుభావన మనసు ఓరన రాగమై - శ్రీరాగమై పాడింది. అటువంటి యవ్వన స్త్రీ ఓసారి - ఓ అనురాగ దృష్టి సారిస్తే చాలు - జీవిత సౌందర్యానికి నిండు నిర్వచనం నిటారుగా నిలుస్తుంది.

ఆ రోజు కాలేజీ లేదు. అలాగని తనెప్పుడూ చేతులు ముడుచుకుని కూర్చోడు. ఆది నుండే ఎప్పటి పాఠం అప్పుడు టైం టేబుల్ ప్రకారం అధ్యయనంచేయడం అతనికి అలవాటు. అంచేత ఆ పూట పోర్షను చదవడం పూర్తిచేసి గుర్తుంచుకునేలా నోట్సు వ్రాసుకుని, ఇక చేసేదేమిటో పాలుపోక చాప పర్చుకుని రెండు చేతుల్నీ విశ్రాంతిగా ఛాతిపైన పరుచుకుని ఇంటి పై కప్పు వేపు కన్నార్పకుండా చూస్తూ పడుకున్నాడు. అలా అనిర్వచనీయమైన హాయిని అనుభవిస్తున్నప్పుడు అతడికి తెలియకుండానే గొంతుక పోక నుండి రాగమూ గానమూ సెలయేటి మలుపులై అంతర్వాహిణిలా ప్రవహిస్తాయి. అదొక విచిత్రమైన ఆనవాయితీ. అదేవిధంగా తను "శోభిల్లు సప్తస్వర సుందరుల..." అన్న కీర్తనను జగన్మోహిని రాగాన అందుకున్నాడు. కీర్తనను పాడి పరమానందంతో తనలో తానే మైమరచి కొసమెరుపు వంటి గమకాలతో రాగాస్థాయిని తగ్గించబోతున్నాడు. అప్పుడు గది గుమ్మనుండి తన సంగీత స్రవంతికి ఆనకట్ట వేస్తూ సన్నటి ఓ గొంతు, మీటిన వీణ తంతిలా వినిపించింది. - "ఏవండీ!" అంటూ. పంచెను సర్దుకుంటూ లేచి నిల్చుని

తొంగిచూశాడు. కళ్ళు ఫెళ్ళున మెరిశాయి. నింగి నుండి ధవళకాంతి గుమ్మాన తొంగిచూస్తున్నట్లనిపించింది. పళ్ళేన్ని చేతపట్టుకుని పట్టుచీరను ఒంటినిండుగా కప్పుకుని కావేరి నిల్చుని ఉంది. పిక్చర్ - పెర్‌ఫెక్ట్ అంటారు - అటువంటి రూపాన్ని చూసేనేమో!

"నమస్కారం!" అంటూ ఎదురు వెళ్ళాడు.

సన్నటి చిరునవ్వు చిందిస్తూ ప్రతి నమస్కారం చేసి, తనని తను పరిచయం చేసుకుంది.

"నా పేరు కావేరి. ప్రక్కింట్లోనే ఉంటున్నాను. మొన్నొక రోజు మబ్బు కమ్మినట్లు నా మనసు ఏదోలా ఉన్నప్పుడు - వరప్రసాదంలా మీరు పాడిన దీక్షితులు వారి 'కమలాంబ భజరే' కళ్యాణి రాగంలో విన్న తరువాత నా మనసు హాయిగా దూదిపింజలా తేలిపోయిందనుకోండి. థేంక్యు. బాగా పాడతారు మీరు. మీ గురువుగారి పేరు...." అని అర్థోక్తిగా ఆగిందామె.

"థాంక్సు. మా గురువుగారు మా అమ్మగారే! ఆమె గారి సంగీత స్వర సాన్నిధ్యమే నాకు గురుకులం. ఆమె స్వరసామ్రాజ్యంలో అమృతవర్షిణి ఆయువుపట్టు" అలా అంటున్నప్పుడే తనలో ఆలోచనలు వలయాలుగా చుట్టుకొనసాగాయి. సహజ - కావేరికి మరో పేరు. త్రిపురనేని వారు తమ పద్యంలో ప్రస్తావించిన నది పేరు. కావేరి తలపంకించి రవంతసేపు మౌనం వహించింది. "చక్కటి స్వరజ్ఞానం - చక్కటి కంఠస్వరం. భగవత్ప్రసాదం" అంటూ చేతిలో పళ్ళేన్ని ముందుకు చాచింది. ఆమె అలా నిల్చున్న ఆ కొద్దిపాటి సమయంలో తన గది నిండా పరిమళ ద్రవ్యాలు సువాసనలుగా మారి వ్యాపించాయి. మనసునీ తనువునీ పరివేష్టించాయి. పళ్ళేన్ని అందుకుని లోయలోకి తొంగిచూస్తున్నట్లు దానిలోకి చూపులు సారించి చూశాడు. చలిమిడి ఉండలు, పెసలూ, బొబ్బర్లూ, పోపుల్లా పేర్చి ఉనాయి. పళ్ళెం కోపులో పూతరేకులు పేర్చి ఉన్నాయి. వాటి మధ్య పెద్దటి బెల్లం ముక్క తొంగి చూస్తూంది. అవన్నీ తన కోసమే గావాలి! ప్రతిరోజూ ఇంత సుందరంగా - ఇంత హాయిగా గడిచిపోతే ఎంత బాగుణ్ణు. కాని జీవిత ధ్యేయమే వేరు కదా - దాని ప్రయాణమే గతుకులమయం కదా! పళ్ళేన్ని లోపలకు తీసుకు వెళ్ళి పదార్థాల్ని లోపల గిన్నెల్లో ఉంచి, ఖాళీ పళ్ళేన్ని తెచ్చిచ్చాడు.

"ఊరు చెప్పలేదు" ఆమె వ్యాఖ్యానం చేసింది.

"అవును. అడిగారు కదూ! మాది గజపతి నగరం."

"అలాగా! ఆ ఊళ్ళో మా పెద్దమ్మ ఉంది కుమారస్వామి గుడి వీధిలో" ఈ లోపల తను జీరో రేంజిలోకి వచ్చి ఆమె నిండు రూపాన్ని ఓసారి తనివితీరా చూడగలిగాడు.

"వచ్చే శుక్రవారం మా ఇంట్లో సత్యన్నారాయణ పూజ. వచ్చి రెండు చక్కటి కీర్తనలు పాడి వెళ్ళండి. అమృత వర్షిణి మరిచిపోకండీ."

"నాకు లయశుద్ధిగా పాడటం రాదండీ!"

"అదిగో! మళ్ళీ అదే మొహమాటం. మీ గాత్రవాహికలో సరస్వతీ దేవి ఆసీనురాలై ఉంది. దాచుకోకండీ. మరీ చెప్పించుకోకండి" అని మెత్తగా ఎత్తిపొడిచి బయటకు కదిలిందామె. తను బ్బుర్రూపాడు. అంతటి నిండు వ్యక్తిత్వం ముందు కాదనడం - లేదని వాదించడం తనకే కాదు. మరెవరికీ సాధ్యం కాదేమో!

శుక్రవారం వరకూ తనువు ఉగ్గబట్టలేకపోయింది. మనసు పరిపరి విధాల పరుగెత్తి కావేరి సాన్నిధ్యం కోసం తహ తహలాడసాగింది. అగ్గికి అజ్యం పోస్తున్నట్లు అలా ఆరంభమైన తహ తహ ఇక తగ్గలేదు. పండగ పబ్బాలని పూజా పునస్కారాలని క్రమేపీ ఆమె స్నేహపు జల్లులోని చల్లదనాన్ని చవిచూడనారంభించాడు. ఆపైన ఆసన్నమయే ప్రతి పర్వదినాన ఆమె పిలుపుకోసం ఎదురుచూడటం ఆనవాయితీగా మారింది. ఎప్పుడైనా పిలుపుగాని రవంత ఆలస్యమైతే వెంపర్లాడిపోయేవాడు. తామసం భరించలేకపోయేవాడు. అలుక వహించి బుంగమూతితో గదిలో కదలకుండా కూర్చుంటే ఆమె వెతుక్కుంటూ వచ్చి ఆరిందా పిల్లను చూసి తల్లి జాలిగా నవ్వినట్లు చల్లగా నవ్వి జుట్టులోకి చేతులు పోనిచ్చి నిమిరేది. ఆ చేతివేళ్ళు స్పర్శలో ఎంతటి అనురాగం ధారగా ప్రవహించేదని! ఒక స్త్రీ సాహచర్యంలో అంతటి భద్రతా భావం - కొండవాగులాంటి స్వచ్ఛదనం తానెప్పుడూ - ఎక్కడా అనుభవించలేదు. ఒకరోజు అనుకోని

విధంగా ఓ గడ్డు పరిస్థితి అనుకోని విధంగా రావడమేమిటి - రావాల్సిన మార్గానే విద్యుతాఘాతంలా ఎదురైంది. కాలేజీ ఫీజు కట్టాల్సిన గడువు దాటబోపోతుంది. ఫీజు గాని కట్టకపోతే పరీక్షలకు కూర్చునే ప్రసక్తే ఉండదు. ఈ విషయంలో కాలేజీ మేనేజిమెంటు కమిటీ నిక్కచ్చిగా ఉంటుందని తను మునుపే విన్నాడు. ఇది చాలదన్నట్లు - జ్వరానికి జలుబు తోడైనట్లు పెనాల్టీలు కూడా కట్టాల్సి వస్తుంది. ఒకనాటి స్కూలుమేటు - ఒకతను - తన వద్ద కొంత మిగులు ఉందని - సాయంత్రం వచ్చి సొమ్ము తీసుకెళ్ళమని సూచించాడు. ఆ చిన్నటి పలుకు తన నెత్తిపై నుంచి కొండంత బరువుని దింపేసింది. మనసు తేలికపడింది. - ఆకాశం నిర్మలంగా కనిపించింది. దీపాలు పెట్టే వేళకు ముందే తను మిత్రుడి రూముకి వెళ్ళాడు. అతను రూములో లేడు. అర్జంటుగా పనిపైన వెళుతున్నానని కబురందిచ్చి వెళ్ళినవాడు రాత్రి తొమ్మిది దాటిన తరువాత గాని దర్శనమివ్వలేదు. ఈలోగా తన పరిస్థితి నకారాత్మకంగా మారింది. కొన్నిగంటల తరబడి కడుపులో ఏమీ లేదేమో - అలసటా ఆరాటమూ తీవ్రదశకు చేరుకుని తీక్షణమైన తలనొప్పిని తెప్పించాయి.

"సారీ! అంటూ మిత్రుడందిచ్చిన దస్కాన్ని నిర్వికారంగా అందిపుచ్చుకుని - ధన్యవాదాలివ్వాలన్న ధ్యాసే మరచి జిడ్డోడుతున్న ముఖంతో గది చేరుకుని చేదతో బావినీళ్ళు తోడుకుని, నెత్తిపైన కుండపోతగా పోసుకుని, మొన్న పూజనాడు కావేరి ఇచ్చి పంపిన రెండు అరటిపళ్ళను తిని, నీళ్ళు తాగి కళ్ళు మూసుక్కి పడుకున్నాడు. రోజంతా నరాల బిగింపు విపరీతంగా అనుభవించడం వల్ల గావాలి తలనొప్పి మరింత తీవ్రంగా తయారయింది. ఒళ్ళంతా ఎవరో దుడ్డుకర్రతో బాదినట్లుంది. గదిలో నుదుట రాసుకునేందుకు తైలం ఏదీ లేదు. ఎలాగుంటుంది - కొనుక్కుంటేనే కదా! కణతలు పగిలిపోయేలా వణుకుతున్నాయి. పోరాడి పోరాడి - తోకముడుచుకున్న తోడేలు లాగ, తానుగా నొప్పి మరలిపోతుందన్న మొండి నమ్మకంతో పళ్ళు గిట్టకరుచుకుని - ఇక ఓపలేక మూల్గనారంభించాడు తను. అప్పుడు - అటువంటి నిశీధి సమయంలో ఒంటరిగా దవళకాంతిగా అశ్వనీ దేవతలా ప్రవేశించింది కావేరి "రోజంతా కనిపించలేదు. ఏమయింది?" అంటూ కణతల్ని రెండు చేతుల్తోనూ గట్టిగా అదుముకుని ఆ రోజు తను ఎలా మానసిక ఒత్తిడికి గురైందీ - తదితర విషయాలూ వివరించి చెప్పాడు "ఇంతటి కొద్దిపాటి మొత్తం కోసం ఇంతటి యమయాతనా? అంటే - నా ఉనికి మరిచి, నన్ను పరాయి దానిలాగే జమకట్టేసారన్నమాట" అని నొచ్చుకుంటూ లేచి వెళ్ళి ఇంట్లోంచి పొగలు కక్కే కాఫీ తెచ్చి, నాలుగు రస్కులు తినిపించి, తలగడ ఎత్తుగా పెట్టి, దానికి జేరబడజేసి కాలిపోతున్న నుదిటిపై సొంఠి గంధపు పట్టుని దట్టంగా విస్తారంగా పేర్చింది. నడినెత్తిపైన చురుక్కుమనిపించే ఏదో తైలం రుద్దింది. మెడ చుట్టూ నొప్పితో వణుకుతున్న నరాలపై మరికొంత తైలం వేసి వ్రేళ్ళ మొనలతో మృదువుగా మర్దన చేసింది. ఆమె స్పర్శ నుండి ప్రవహించిన మృదుస్వాంతన ప్రభావానికి వివశుడై సుషుప్తిలోకి జారిపోయాడు.

ప్రొద్దు పొడవడానికి మొదటి జాము. పల్చటి చీకటి తెరలగుండా కళ్ళు చిలికించి చూశాడు. ఆకాశంలోని గుప్పెడు వెలుతురూ కిటికీ వరకూ రాలేక, రెక్కలు విదల్చుకోవడానికి ఆరాటపడుతున్నది. నిశ్శబ్దం నిట్టూరుస్తూ గాలి వీస్తున్నప్పుడు మల్లెల సువాసనలు ముఖానికి మత్తుగా తగిలాయి. ఎవరో తన సమీపాన ఉచ్చ్వాస నిశ్వాసాలు బరువుగా విడవడం స్పష్టంగా తెలుస్తూంది. ఉలికిపాటుతో లేచి కూర్చుని కోడిగుడ్డు దీపం వెలిగించాడు. అదే చాపపైన, కావేరి ఆదమరచి నిద్రపోతూంది. కళ్ళు పెద్దవి చేసుకుని చూశాడు. చీరె తొలిగి ఉంది. పూర్తిగా తొలిగి ఉంది. మరి రాత్రంతా ఆమె తనతోటే జాగరణ చేస్తూ గడిపిందన్నమాట! రవికె హుక్కులను విదిలిస్తూ ఆమె ఎత్తయిన వక్షోజాల తూగు ఉవ్వెత్తున లేచి పడుతూంది. కొట్టుకుంటున్న గుండెను అదుముకుంటూ ప్రాణమున్న ప్రతిమను చూసినట్లు నమ్మలేకుండా కళ్ళు మరింత పెద్దవి చేసుకుని చూసి, మరుక్షణమే ముఖాన్ని మరో ప్రక్కకి తిప్పుకున్నాడు. ఉగ్గబట్టడం తనవల్ల వీలుకావడంలేదు. అంతవరకూ కష్టాల తుంపరలో పడి నలుగుతూ, వడగండ్ల సమస్యల్లో పడి పొర్లుతూ అణుచుకున్న ఆశలు ఒక్కసారిగా జ్వాలలై చెలరేగాయి. నిగ్రహించుకోవాలని మరింతగా ప్రయత్నించాడు. జీవితంలో వెలుగురేఖ చూపించిన దేవత ఆమె. ఆకలి తీర్చిన అన్నపూర్ణ. తాకవచ్చా? తాకి దగ్గరకు చేరవచ్చా? ఉదయ వాయువుల్లా వ్యాపించిన ఆ వినిర్మల పునీత వికాసమయి ఆలోచనలు ఎక్కువసేపు నిలవలేదు. గోడ వారన ఆసరాగా నిల్పిన పీట జారిపడ్డట్లు చెల్లాచెదురైంది. ఆ తరువాత తనకేమయిందో తనకే తెలియదు. ఆమె శరీరంతో తన శరీరం ఏకమయింది. ఆనందం పాలపొంగులా కురిసింది.

కొంచెం కొంచెం తను ఆచూకీ తీసి కావేరీ పుట్టుపూర్వోత్తరాల గురించి కొంత తెలుసుకున్నాడు. ఆమె పూర్వీకులు కంచి పెద్దాలయానికి చెందినవారు. కావేరి మాత్రం తిరువనంతపురంలో పద్మనాభస్వామి ఆలయం వీధిన పుట్టి పెరిగింది. ఆమె యవ్వనం - మొగ్గపువ్వయి వికసించిన దగ్గర్నుంచి ఆమె పార్వతీ పురంలోని ఓ భూకామందు వెలయాలు. విటుడు ఒరియా బ్రాహ్మణుడు. ఒకనాడు ఎమ్ఎల్ఏ గా పదవీ నిర్వాకం చేసి, రాజకీయరంగంలో ఒక వెలుగు వెలిగినవాడు. నెలకొక్కసారో - రెండుసార్లో - బుద్ధిపుట్టినప్పుడల్లా విజయనగరం వచ్చి కావేరి పడకగదిని పావనం చేస్తాడు. గతి తప్పకుండా ప్రతినెలా డబ్బూ దస్కంతోపాటు పప్పు ధాన్యాలు కావేరి ఇంటికి చేరతాయి. చిరకాలం సహచరిగ - ప్రాప్త మనోహరిగ కావేరి మనసిచ్చి మెసలుతుంటుంది. విటుడు గుర్రపు బడ్డీలో మంది మార్బలంతో వచ్చి దిగినప్పుడు వీధి వీధి అంతా నిశ్శబ్దంలోకి జారుకుంటుంది. అతడా వీధి నుండి నిష్క్రమించే వరకూ నలువైపులా నిర్మానుష్యంగా ఉండాల్సిందే. అంతటి శుభ్ర తేజస్సు వంటి సొగసు ఆ వృద్ధ రసికుడొక్కడికే స్వంతమా! అమానుష హస్తగతమా! మనసునిండా అసూయా ఉక్రోశమూ కలగా పులగమై జ్వాలల్లా లేచాయి. బంగారు బిందె వంటి కావేరి నిండు యవ్వనం - తడికల్లా ముడతలు పడ్డ ఆ వృద్ధ బ్రాహ్మణ విటుడికి హస్తగతమా! మనసునిండా అసూయా ఉక్రోశమూ కలగా పులగమై జ్వాలల్లా లేచాయి. తను భరించలేక కంపించిపోయాడు.

'చేతినిండా తీరిక గనుక కావేరి కళావైభవాలకు ప్రాణం పోస్తూ ముగ్గులు వేస్తూ ఎల్లప్పుడూ సౌమ్య శుభ్ర తెలికాంతులతో తొణికిసలాడుతూ కనిపిస్తోంది. ఉదయం చూసినా - మిట్టమధ్యాహ్నం వెళ్ళి పలకరించినా - ఆమె తాజాగా అప్పుడప్పుడే తలంటు స్నానం చేసి వచ్చినట్లు కనిపిస్తుంది. ఇరుగు పొరుగు పిల్లలకు స్కూలు పాఠాల హోంవర్క్ చేసి పెడుతుంది. అభిరుచి ఉన్న అమ్మాయిలకు నృత్యకళ నేర్పుతుంది. దైవభక్తి మెండు కాబట్టి కావేరి ప్రతిరోజూ తప్పనిసరిగా మువ్వల గోపాలస్వామి గుడి దర్శనం చేసుకుని వస్తుంటుంది. తను గాని ఎదురైతే చేతిలో కొబ్బరిముక్క పెట్టి, ఎవరూ లేనప్పుడు నుదుట బొట్టు పెట్టి ప్రేమగా చూసి వెళ్ళిపోయేది. జంకుని దూరంగానెట్టి ఆ నడి మార్గాన ఎన్నడైనా ఆమె కళ్ళల్లోకి లోతుగా చూస్తే, సెలయేరు వంటి స్వచ్ఛమైన దయాభావం నిలువెల్లా తాకుతుంది. ఏది ఎలా ఉన్నా - తుదకు తను ఇంగితం ఉపయోగించి తేల్చుకున్నదేమంటే - కావేరి ఒక మోతుబరి భూకామందు స్వంతస్త్రీ. పార్వతీపుర ప్రముఖ రాజకీయ దండ నాయకుడి ప్రియమైన వెలయాలు, అటువంటి పెద్దింటి లావణ్యవతితో సహవాసం తగదు - ససేమిరా తగదు. ఇంకా చెప్పాలంటే - పెట్రోలు బంకు ప్రక్క మంటను రేపి చలికాచుకోవడం వంటి.

అంతే! తను తిరిగి చూడలేదు. ఊరు బాగా సద్దుమణిగిన తరువాత పెట్టె బేడా సర్దుకుని ఒకరోజు ఆ వీధి నుండి, ఆ ఊరి నుండీ, ఆమె జీవితం నుండి శాశ్వతంగా తప్పుకున్నాడు.

***

ఇదిగో - ఇప్పుడు మళ్ళీ పలు సంవత్సరాల ఎడబాటు తరువాత అతడి ఆలోచనలు, ఉవ్వెతున లేచి చేతులు చాచే సముద్ర తరంగాల్లా కావేరిని వెతుకుతున్నాయి - వెంటాడుతున్నాయి. పైపైన చూస్తే దుఃఖంలోఎంతటి మార్దవం గోచరిస్తుంది. మరి అట్టడుగున ఎంతటి శోకం - మరెంతటి భారం! ఆమె జ్ఞాపకం - ఆమె సౌమ్య శాంత స్వరూపం - చల్లని చూపులు అనవరతం గుండె కవాటాలను కదిలిస్తూనే ఉన్నాయి. సూక్ష్మమైన తీక్షణమైన ఓ విధమైన  అపరాధభావం హృదయాన్ని అదుముతూ జలపాతంలా దూకుతూనే ఉంది. కొత్తకారుని ఇంటి ముందాపి, కిందకి దిగి, కీని కూడా తీయకుండా అనాసక్తంగా ఓసారి ఆకాశంలోకి తేరిపార చూసి ఉన్నపళంగా రెండు చేతుల్నీ పైకెత్తి గుండె పగిలేలా ఆక్రందన చేయాలనిపించింది. కానీ అతడలా చేయలేకపోయాడు. సర్వప్రాణ సారమూ అతడిలో పూర్తిగా ఇంకిపోయినట్లుంది. జీవించడానికే కాదు - ఏడ్వడానికి కూడా శక్తి కావాలి కదా!

నడవమ్మట ఎదురొచ్చిన ఇద్దరు కూతుళ్ళ తలలపైనా చేతుల్నించి, మార్దవంగా ఓ సారి వాళ్ళ కళ్ళల్లోకి చూసి భార్యకు కారు కీ అందుకొనమని సైగజేసి మేడ మెట్టెక్కాడు రామభద్రం. భర్త వాలకం చూసి పద్మాక్షి మనసు రవంత కీడు శంకించింది. వేగిరపడింది.

పరుగు వంటి నడకతో భర్తను వెన్నంటి, రెండు చేతుల్ని భర్త భుజాలపై ఉంచి అనునయంగా అంది "ఏమైంది! మరీ డల్‌గా కనిపిస్తున్నారు. కొత్త కారు బాగాలేదా?" అతను నవ్వుతెచ్చుకునేందుకు ప్రయత్నిస్తూ "మరేం లేదు. ఎండలు" అన్నాడు. ఆమె విస్తుపోయినట్లు చూసి "ఏ.సి. కారు కదా!" అంది. అతడి మనసు అతడిలో ఉంటేకదా - ఏ.సి.ని ఆపరేట్ చేయకుండానే డ్రైవ్ చేసుకుంటూ వచ్చేశాడు.

"అవుననుకో. కాని మరమ్మత్తులు లేని రోడ్లు ఇచ్చే కుదుపుల్లోంచి తప్పించుకోలేము కదా!"

"మీరు హైవే గుండానే కదూ వచ్చారు?" ఇదెక్కడి క్రాస్ ఎగ్జామ్ - అని అడగాలనిపించిందతడికి. కాని ఆపుకున్నాడు - భార్య మృదుస్వభావం మనసున మెదిలి భార్య చెంపల్ని ఓసారి నిమిరి, పనిమనిషి వచ్చి అందిచ్చిన పళ్ళరసం గ్లాసు అందుకుని, గది లోపలకు వెళ్ళి, దానిని ఓ గుటకలో మింగి, పడకపై వాలాడు. ఈ శరీరంలోని సగభాగం - మనసులోని మరో భాగం - అంతెందుకు - తన జీవితంలోని సగభాగం కావేరికి చెందుతుందని వీళ్ళకెలా నచ్చజెప్పడం!

ప్రొద్దుట కాఫీ కప్పుతో భర్త స్టడీ రూములోకి ప్రవేశించిన పద్మ రవంత విస్తుపోతూ అప్రయత్నంగా రెండడుగులు వెనక్కి వేసింది. భర్త అప్పటికే స్నానం కానిచ్చి, దైవప్రార్థన ముగించి, దుస్తులు కూడా మార్చుకుని ఏదో పత్రాలను వెలికి తీసి చూస్తున్నాడు. ముఖాన ఆశ్చర్యాన్ని ప్రకటించనివ్వకుండా "ఒంట్లో ఎలాగుంది? రాత్రి రెండూ మూడుసార్లు వచ్చి చూశాను. ఆదమరచి నిద్రపోతున్నారు. మళ్ళీ విశాఖపట్నానికి ప్రయాణమా? " అని అడిగింది.

"ఫైన్! వెళ్ళేది విశాఖపట్నం కాదు. విజయనగరం" అని బదులిచ్చి భార్య తటపటాయిస్తుందని గ్రహించి " మా పెద్ద మామయ్యగారి కూతురిని చూసిరావడానికి వెళుతున్నాను. అర్జంటుగా రమ్మనమని రెండ్రోజుల క్రితమే కబురందింది. కొత్తకారుని తెచ్చుకోవడానికి ఆగిపోయాను" అని మరొక మాటకు తావివ్వకుండా చకచకా మేడమెట్లు దిగాడు. తళతళలాడుతున్న కొత్త కారు ప్రక్క నిల్చున్న డ్రైవరు సెల్యూట్ చేశాడు. రామభద్రం బుర్రూపుతూ సెల్యూట్‌ని అందుకుని కొత్త కారు ప్రక్క నిల్చున్న డ్రైవరు సెల్యూట్ చేశాడు. రామభద్రం బుర్రూపుతూ సెల్యూట్‌ని అందుకుని కొత్త కారు వేపు చూపుకూడా మళ్ళించకుండా మరికొంత దూరం నడిచి సుమో జీపు ఎక్కి కూర్చున్నాడు. మనసు ఎక్కడో ఉన్నప్పుడు, చూపులు కూడా మరెక్కడో ఉంటాయి కదా! బాల్కనీలో తండ్రి చూపు కోసం ఆతృతతో వేచి ఉన్న కూతుళ్ళ వేపు కూడా అతడికి ధ్యాస మళ్ళలేదు. గంభీరత ఉట్టిపడే ముఖంతో కీని తిప్పి, గేర్లు మార్చి సుమో జీపుని ఏకధాటిన పోనిచ్చాడు. అలా డ్రైవ్ చేస్తున్నవాడల్లా ఒకసారి మాత్రం మార్గమధ్యంలో మంచుగడ్డలు పోసుకున్న నిమ్మరసం తాగి రవంత సేపు ఆగాడు. అంతే ఆ తరువాత అతడి ఆలోచనా - బండి ఆగలేదు.

అదేమిటో తెలియదు - కావేరి రూపం మనసున మెదిలినప్పుడల్లా కనుసన్నల్లో తడి పేరుకుపోతుంది. మితిమీరిన మనోవేగంతో తను ఆరాటపడిపోతున్నాడూ గాని, ఇంతకీ కావేరీ ఉందా? ఉంటే - అదే ఊళ్ళో అదే వీధిలో ఉందా? ఆ ఉద్విగ్న తలపుతో జివ్వుమన్న నరాల బిగింపును సడలించేందుకు రామభద్రం తలను గట్టిగా విదిలించాడు. ఏది ఏమైనా తను స్వయంగా వెళ్ళిరావాల్సిందే! బలంగా గేర్ మార్చి మూడో దశ చేర్చి ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని తాకనీయకుండా బండిని మలుపు తిప్పి ఊరి పొలిమేర వేపు జీపుని వేగంగా పోనిచ్చాడు. ఆకారణంగా తనపైన తనకే కలిగిన కోపంతో దవడలు గిట్టకరుచుకుని, అదే హృదయావేగంతో మెరక వీధిలోకి ప్రవేశించి కావేరి వాళ్ళ ఇంటి ముందు బండి ఆపాడు. చెల్లా చెదురైన జుత్తుని చేతివ్రేళ్ళతో వెనక్కి తీసుకుని, ముఖాన్న అలుముకున్న చెమట చుక్కల్ని వ్రేళ్ళ మొనలతో విదిలించుకుని, కొన్ని క్షణాల పాటు స్టీరింగు ముందు అలాగే కూర్చుండిపోయాడు. మెల్లగా దిగి రెండడుగులు వేసి అదోవిధమైన జంకు పుట్టుకొచ్చి ఉన్నపాటున ఆగిపోయాడు. అదేమిటి - ఆవరణంతా అంత నిశ్శబ్దంగా ఉంది. ఇంటిని ఎల్లవేళలా కలకలలాడించే ముత్తయిదువుల పట్టుచీరెల రెపరెపలేవి? కనుబొమల సైగలతో - అభినయ విన్యాసాలతో కదిలాడే అమ్మాయిల అలికిడేది? జావళి రాగాలు వినపించవేం? నడిచి వెళ్ళి ఊపిరి బిగబట్టి, నమ్మకానికి జీవం పోస్తూన్న పూలచెట్ల వేపు పరీక్షగా చూస్తూ తలుపు తట్టాడు . ఎవరో ముత్తయిదువు తలుపుని ఓరగా తీసి "ఎవరదీ?" అని అడిగింది. రామభద్రానికి పలుకు పీడలేదు. కెరటం వంటి గతం

గుమ్మం వరకూ వచ్చి అతణ్ణి నిశ్శబ్దంగా ఈడ్చుకుంది. ఆమె ఏమనుకుందో - తలుపుని అలాగే చాచి కదిలి వెళ్ళింది. ఇక బదులు కోసం ఎదురు చూడకుండా అతడు తలుపు తోసుకుంటూ ద్వారబంధం దాటి లోపలకు వెళ్ళాడు. లోగిలి అంతా స్త్రీ సముదాయంతో సందడిగా ఉంది. రీలు నుండి తెగి ఊడిపడ్డ ఫిల్మ్ ముక్కలా, అతడి మెదడు కెమేరా నుండి ఆనాటి దృశ్యం కళ్ళ ముందు సాక్షాత్కరించింది. కళ్ళు తడిసాయి. అదేదో పేరంటానికి గుమికూడినట్లున్నారు ఆ వీధి స్త్రీ సముదాయం. అందరి నుదుటా గంధపు రేఖలు - కుంకుమ బొట్టూ మెరుస్తున్నాయి. అతలో ఎక్కణ్ణించో "రామూ" అన్న అరుపు విని ఎగిసిపడ్డ మనసుతో అటు చూశాడు. పళ్ళెం నిండా ఏవో ప్రసాదాలు, పదార్థాలూ నింపుకుని నదీ ప్రవాహంలా దూసుకువస్తూంది కావేరి. అతడు కళ్ళు పెద్దవి చేసి చూశాడు. ముఖంలో అప్పటి పాలు నేవళం లేదు గాని - అదే రాజసం - అదే నిండురూపం! "అవును నేను! రామభద్రాన్ని" దుఃఖజిత నేత్రాలు వర్షపు మడుగులయ్యాయి.

"ఎన్నాళ్ళకు నేను జ్ఞాపకం వచ్చాను రామూ!"

"నేననుకున్నాను. అనుకుంటూనే ఉన్నాను. మన కలయిక తప్పకుండా జరుగుతుందని. ఆలస్యమయింది అంతే - నన్ను క్షమించు కావేరీ!" ఆలోపల అక్కడ పేర్కొన్న ఉద్వేగపూరిత వాతావరణాన్ని గుర్తించి గావాలి అక్కడ గుమికూడి కూర్చున్న ప్రౌఢ స్త్రీలు, ఓణీలు వేసుకున్న అమ్మాయిలూ దుస్తులు సరిచేసుకుంటూ, చూపుల్ని గోడవాటంగా జరుపుకుని చల్లగా జారుకున్నారు.

"రామూ! రామూ! మీ గురించి అడపాదడపా పత్రికల్లో వార్తలు వస్తుంటాయి. మొన్నక రోజు వ్యాపార ప్రతినిధుల బృందానికి న్యాయకత్వం వహించి, వివిధ దేశాలు తిరిగొచ్చి భారత్ టీ.వీ. ఛానల్‌లో మీతో జరిపిన ఇష్టాగోష్ఠి విన్నాను. మనసు పొంగిపోయిందనుకో! కాని ఒక్కనాడూ కూడా ఉత్తరం వ్రాయడానికి సాహసించలేకపోయాను." ఆమె మరింత దగ్గరగా వచ్చి చలిమిడి చిదిమి అతని నోట్లో ఉంచింది. రామభద్రానికి కన్నీరు పెల్లుబికింది. అసంకల్పితంగా అతడు ఆమె ముందు మోకాళ్ళ పై ఒరిగాడు.

"చెప్పు కావేరీ! మనఃపూర్వకంగా అడుగుతున్నాను. నేను నీకోసం ఏం చేయాలి?" ఆమె నవ్వుతూ పళ్ళేన్ని ప్రక్కనుంచి అతడికెదురుగా తను కూడా మోకాళ్ళపై కూర్చుంది.

"ఏమైనా చేస్తావా రామూ?"

ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ తలూపాడతను. ఆమె కళ్ళ నుండి కన్నీటి చుక్కలు బొటబొటా రాలుతున్నాయి. ఆమె తుడుచుకోవడానికి ప్రయత్నించలేదు.

"నా తుదిదినం నీ చూపుల ముందు - నీ చేతులపైగా జరిగిపోవాలి" అప్పుడు రామభద్రం ఎందుకో అటు గోడ వేపు తలతిప్పి చూశాడు. పట్నాయక్ గారి ఫోటో నుదుట తిలకం దిద్ది ఉంది. దానిచుట్టూ గంధపుమాల వ్రేలాడుతూంది. ఎప్పుడు చనిపోయాడో! "అలాగే - నీ కోరిక నెరవేరుతుంది. మొదట నేను చెప్పినట్లు చెయ్యి. ఎందుకు - ఎక్కడ - ఎలా అన్న ప్రశ్నల్ని వేయకూడదు. పెట్టె బేడా సర్దుకో - ఇప్పుడే - ఈ క్షణానే!" ఆమె మరు పలుకలేదు. అన్నేళ్ళూ ఆమె ఒక్కమాట కోసమే ఎదురు చూస్తూ గడిపినట్లు లేచి, లోపలికి వెళ్ళి నాలుగు సూట్ కేసులను గుడ్డలతో నింపుకుని, మరొక చిన్న బ్రీఫ్ కేసులో కొన్ని పత్రాలను ఉంచుకుని లోగిలిలోకి వచ్చింది.

"గమనించారా రామూ! మీ రాక వల్ల మా ఊరువాడే కాదు - ఆకాశం కూడా చలించినట్లుంది. తుంపర పడుతూంది. సరేగానీ నన్నెక్కడ ఉంచుతారు?"

"మా ఇంట్లో!"

ఆ సూటైన జవాబు విని మొదట గాభరాగా చూసి ఆ తర్వాత విస్మయంతో కనురెప్పలాడించి వెనక్కి రెండడుగులు వేసింది. కాసేపు మౌనం వహించి తరువాత ఏమనుకుందో ఏమో - వడిగా నడిచి వచ్చి అతడి చెంపల్ని ముద్దుపెట్టుకుంటూ అంది "థాంక్యూ. కాని మీ ఇంట్లో ఉండను. ఉండకూడదు. గుండెపైన కుంపటిలా మారడం నాకు సుతారమూ ఇష్టం ఉండదు. మరెక్కడైనా ఉంటాను."

"మరెక్కడో ఎందుకు? మా పెద్దమామయ్య కూతురివి కదా - మా గెస్ట్‌హౌసులోనే ఉంటావు. మా చూపులోనే ఉంటావు. ఇక మాట్లాడకు. ఆమె పెదవుల్లో వీడీ వీడని విధంగా ఓ చిర్నవ్వుని వెదజల్లి - ఇక తను చేసేదేమీ లేదన్నట్లు మౌనంగా వెళ్ళి పొరుగింటావిణ్ణి పిలిచి "అయ్యగారి మనుషులెవరైనా వస్తే అప్పగించండి, ఇక నాకోసం ఏదీ పంపించబోకండని చెప్పండి" అని తాళం చెవుల్ని అప్పగించి, చేతిలోని తాళం కప్పను చూస్తూ - సంశయాత్మకంగా కనురెప్పల్ని ఆడిస్తూ ఆగిపోయింది. ఇంకేదో అడగడానికి ఆమె తటపటాయిస్తున్నట్లు గ్రహించాడు రామభద్రం.

"అనుమానం ఇంకా తీరలేదా - లేక ఇంకేదైనా ముఖ్యమైన సామాగ్రిని మర్చిపోయావా?" ఆమె అవునన్నట్లు బుర్రూపింది. సావకాశంగా తెచ్చుకోమన్నట్లు సంజ్ఞ చేశాడతను.

"ఇక్కడ కాదు. మీ ప్రాణమూ నా ప్రాణమూ కలసిన ఓ స్వరూపం సింహాచలం హాస్టల్‌లో ఉంది" అతను అర్థరహితంగా చూశాడు.

"మీవాడు. మీ వంశాకురం. వాడికి చిన్నప్పటి నుంచి బంతాట పిచ్చి. మొన్న జూనియర్ కాలేజీ నుండీ హాస్టల్ నుండీ ఒకేసారి బర్తరఫ్ చేసి పంపించారు. ఊరి పెద్దల తోడ్పాటుతో - మా ఊరి ఎమ్ ఎల్ ఎ సిఫార్సుతో కాలేజీ మేనేజ్‌మెంటుని ఒప్పించి మళ్ళీ చేర్పించి వచ్చాను."

ఓ క్షణం అతడి తనువంతా పులకించింది. "బంతాట పిచ్చికి కాలేజీ నుండి బర్త్ రఫ్ అవడానికీ మధ్య ఏమి సంబంధం?" "బంతాటలో పీలే అంతటి గొప్ప ఆటగాడు కావాలని వాడిదో పెద్ద ఉద్యమం. తాలూకా లెవల్‌లో సెలక్టయి డిస్ట్రిక్టు లెవల్‌లో ఎలిమినేట్ చేశారు. అది భరించలేక ఉడుకుమోతనంతో ఊగిపోయి ఇద్దరు సెలక్టర్లను చితకబాది ఓ రాత్రంతా స్టేషనులో కూర్చున్నాడు. "

"ఐయాం సారి! రియల్లీ సారీ!" ఎందుకన్నట్లు ప్రశ్నార్థకంగా చూసింది కావేరి.

"సారీ చెప్పింది నీకు కాదు. మగదక్షత లేక ఆకతాయిగా పెరిగిన అబ్బాయికి. హాస్టల్ బందిఖానాలో అనాధగా పెరుగుతున్నందుకు. మనం మొదట సింహాచలం తిన్నగా వెళ్ళి వాణ్ణి అందుకుందాం. ఇంతకీ వాడిపేరు చెప్పనేలేదు లక్ష్మీ నరసింహం" అని బదులిచ్చి బెరుకుగా చూసింది. గువ్వలా బెదిరిపోయినట్లు ఆమె కళ్ళే చెపుతున్నాయి.

"మీ మాటల్లో మీ ధైర్యంలో నిజాయితీ కనిపిస్తుంది. కాని పర్యవసానాల గురించి ఆలోచించారా?"

"స్టేషన్‌లో కేసు నమోదు అయిన విషయమేగా! నెవర్ మైండ్ కుర్రవయసు. ఆ దశన అందరికీ పరిస్థితి అలానే ఉంటుంది. "

"నేను చెప్పేది ఆ పర్యవాసం గురించి కాదు. నా గురించి తెలిసికుంటారనీ కాదు. నేను ముఖ్యంగా మాట్లాడేది - వాడికీ మీకూ మధ్య ఉన్న సంబంధం ఫెళ్ళున తేలిపోవడానికి. తెలిసి పులినోట్లో తలపెట్టడం అంటే ఇదే!" ఆమె కనుసన్నలలో పొరాడిన భయ వీచికలు ఉద్విగ్న తరంగాలయి అతణ్ణి తాకాయి.

ఆ పైన అతడు ఒక్క క్షణం కూడా జాప్యం చేయలేదు. బిగుసుకున్న దవళ్ళ నడుమ కొండంతటి పట్టుదలను అణుచుకుంటూ - షర్టునీ బనియన్ని విప్పి నేలపై పడేడు. మెడలోని బంగారు గొలుసునీ, చేతి గడియారాన్ని ఆమె చేతుల్లోకి గిరాటు వేసి విసవిసా నడుచుకుంటూ గడపదాటి ఆరుబయటకు వచ్చాడు. తుంపరగా సన్నటి జల్లుగా ఆరంభమైన వాన ఇప్పుడు కుండపోతగా కురుస్తోంది. నిటారుగా నిల్చుని, రెండు చేతుల్నీ నడ్డిపై ఉంచుకుని ఆకాశంలోకి తలెత్తి చూశాడు. కండలు తిరిగి కోటి రామ్మూర్తి విజయనగర వస్తాదుల్లా బయలుదేరిన మేఘాలు ఒకటి నొకటి ఢీకొంటూ ఉరుముతున్నాయి. మెరుపులు నిప్పుతీగెల్లా ఆకాడాన అలుముకుంటున్నాయి. అక్కడొకటి, ఇక్కడొకటి పెనుమ్రాలు ఫెళఫెళమని విరిగి ఒరిగిపోతున్నాయి. రామభద్రం మాత్రం - ఒక్కడూ అలా ఆరుబయట నిటారుగా నిల్చుని ఆకాశంలోకి చూస్తూ నిల్చున్నాడు. అదరకుండా బెదరకుండా రామభద్రం అలా సజావుగా తనవేపు సాగనంపిన ఆ నిశ్చల నిగూఢ సంకేతాన్ని కావేరి మౌన నివేదనతో ఇప్పుడామె ముఖాన సన్నటి నవ్వు రేఖా మాత్రంగా, ప్లాటినమ్ తీగెలా మెరిసి విప్పారింది.

# రెండు శతాబ్దాల మధ్య

మంథా భానుమతి

**"లతా! లేచెళ్ళి పంపు కట్టేయ్."** వంటింట్లోంచి అత్తగారు ఆర్డరేసింది.. కత్తిపీట ముందు కూర్చుని వంకాయలు తరుగుతున్న దాన్ని ఒక్క ఉదుట్న లేచాను. ఏది కట్టేయాలి?

"వదినా! దీన్నే పంపంటారు." ఒక జడ వెనక్కి, సగం అల్లుకుంటున్న రెండో జడ ముందుకి వేసుకుని లక్ష్మి వచ్చి నల్లా బంద్ చేసి వచ్చింది. కొత్త ఇల్లు, మనుషులు అనుకుంటే భాష కూడా కొత్తగానే ఉంది. లక్ష్మి మా ఆఖరాడ పడుచు. మా ఆయన శ్రీనివాస్ కంటే పెద్దవాళ్ళైన నలుగురాడ పడుచులూ పెళ్ళిళ్ళై అత్తగారిళ్ళల్లో ఉన్నారు. పెళ్ళిలో అంత మందిని చూసి మొహం వేళ్ళాడేసుకుని కూర్చున్నాను. తర్వాత ఆల్బం చూసి వాళ్ళ పేర్లూ..పిల్లలవీ, దగ్గర బంధువులవీ బట్టీ కొట్టేసాను.

ఇంట్లో మాత్రం మేమిద్దరం, అత్తమామలు, లక్ష్మి ఉంటాం. లక్ష్మి థర్డ్ ఫారం చదువుతోంది. నాకంటే ఏడేళ్ళు చిన్న. తన జడ తనే వేసుకుంటుంది. ఎప్పుడూ నన్ను కళ్ళింతలు చేసుకుని చూస్తుంటుంది.

లక్ష్మి నే కట్ట మనచ్చుగా పంపు..నేను లేచి మరీ కట్టాలా? "పెళ్ళికాని ఆడపడుచు ఇంట్లో ఉంటే కష్టాలు రెట్టింపవుతాయే! జాగ్రత్త." పెళ్ళవగానే పిన్ని అన్నమాటలు గుర్తుకొచ్చాయి. వచ్చినప్పట్నుంచీ చూస్తున్నా కదా..అన్నాలు తిన్న కంచాలన్నీ నేనే కడగాలి. పగలు పోనీ స్కూల్ అనుకుంటే రాత్రి కూడా రాణీ గారు ఎక్కడివక్కడ వదిలేసి లేచ్చక్కాపోతుంది. "సాయంత్రం వరకూ చేశాను, ఇంక నావల్లకాదమ్మా!" అత్తగారు తులసి కోట దగ్గర కూర్చుని వత్తులు చేసుకుంటుంది. ఇంక నేనే ఇల్లు తుడవడం, వంటిల్లు, గదులు సర్దడం.

"అబ్బ ఈ జడ అస్సలు లొంగట్లేదు. పెళ్ళికి ముందు అమ్మ వేసేది." వచ్చిన మర్నాడు మొత్తుకున్నాను.

"మరీ ఇంత పెద్దజడైతే ఎట్లాగోయ్? కష్టమే.." శ్రీనివాస్ నాజడ మెడ చుట్టూ తిప్పుకుని అన్నారు.

"లతా! ఇలారా..జడేస్తాను." అత్తగారి పిలుపు. ఉలిక్కి పడ్డాను. వినిపించలేదుకదా! అబ్బే..ఆవిడెక్కడో పెరట్లో అరుగు మీద ఉంది.

కొబ్బరి నూనె రాసి జుట్టు పాయలుగావిడదీసి జడ కుచ్చులు పెట్టి జడ వేసింది. "నాకెప్పుడూ వెయ్యవేమ్మా?" లక్ష్మి కుళ్ళుమోత్తనం.

"రెండల్లికలు కూడా రావు..నీకెందుకే?"

"నువ్వేం నవ్వక్కర్లేదులే..బుద్ధి మంతుల జడ భుజాలు దాటదుట." నాజడకేసే చూస్తూ వెళ్ళిపోయింది లక్ష్మి.

పగలంతా ఒక్క నిముషం కూడా ఇంట్లో ఉండదు. స్కూల్నించి వచ్చాక కూడా స్నేహితురాళ్ళు, లైబ్రరీ అంటూ వెళ్ళిపోతుంది. ఇంట్లో ఉంటే పనిచెయ్యాలికదా!

అవునూ..పెళ్ళికాకముందు నేను ఇంటి పని చేశానా?

"అమ్మా..! నేనూ లతా సినిమా కెళ్ళొస్తాం." శ్రీనివాస్ బైటికి వెళ్తూ అన్నారు.. నాలుగడుగులు వెనకాల నేనూ..ఇద్దరం వెళ్ళిపోయాం.

వంటింట్లో వేపడం వేయిస్తున్న అత్తగారు వచ్చి తలుపేసుకుంది. ముందు గదిలో చదువుకుంటున్న లక్ష్మి కిటికీలోంచి చూస్తోంది.

ప్రతీదానికీ ఆవిడగారి అనుమతి..నాకు చిరాగ్గా ఉంది. లక్ష్మి అంతే..తనని తీసుకెళ్ళట్లేదని కాబోలు.. కళ్ళార్పకుండా కనిపించినంత మేర చూస్తూనే ఉంది.. చదువు అంటూ ఇంట్లో ఇక్కడిపుల్ల అక్కడ పెట్టదు కదా! ఇంక సినిమాలెందుకు?

సినిమా నించి వస్తూనే కళ్ళుతిరిగి పడిపోయాను. శ్రీనివాస్ పట్టుకుని సోఫాలో పడుకో పెట్టారు. ఆ సమయంలో మూడో ఝాము నిద్దరలో ఉండే మామగారు అలికిడి విని బైటికి వచ్చారు.

"ఇదిగో! చూడు అమ్మాయి పడిపోయింది. అర్ధరాత్రి వరకూ ఈ షికార్లేమిట్రా?" వాళ్ళావిడ్ని పిలుస్తూనే మాకు చీవాట్లు. వేవిళ్ళు అయితే మాత్రం ఇంట్లోనే పడుండాలా? మట మట లాడుతూనే కళ్ళు మూసుకున్నాను.

"కాస్త మజ్జిగ అన్నం తిందువుగాని లేమ్మా!" అత్తగారు లేపి కూర్చోబెట్టి తినిపించింది. నామీద అయ్యుండదులే ప్రేమ. వంశోద్ధారకుడు పుట్టాబోతున్నాడుగా!

****

"ఏయ్! నా రికార్డంతా పిచ్చిగీతలు గీసేశావా? చచ్చి మూడుగంటలు కష్టపడి వేసుకున్నా..వెధవానీ." లక్ష్మి దెబ్బ వెయ్యడం నాకు వినిపిస్తూనే ఉంది. ఆరేళ్ళ సంజయ్ ఏడుస్తూ బాత్రూం లో శిరిపాపకి నీళ్ళుపోస్తున్న నాదగ్గరికి వచ్చాడు.

ఒళ్ళు మండిపోయింది. పిల్ల కంట్లోకి సబ్బు వెళ్ళి గగ్గోలు పెడుతున్నా పట్టించుకోకుండా, గబగబా నీళ్ళు పోసేసి హాల్లోకి వెళ్ళాను.

"ఏం? అంత ముఖ్యమైనవైతే జాగ్రత్తగా పెట్టుకోవచ్చుగా! వాణ్ణెందుకు కొడతావు?"

"పైనే పెట్టుకున్నా. స్టూలు లాక్కొచ్చి తీసి తగలేశాడు. కష్టపడి వాణ్ణి చదివించి ఒకటో క్లాస్‌లో చేర్పించినప్పుడు ఏం మాట్లాడ లేదు. ఇప్పుడు వాణ్ణి వెనకేసుకొస్తున్నావా?"

తనేకదా డిగ్రీ చదువుతున్నా అని గొప్ప లక్ష్మికి.. చదివిస్తే నేనూ చదివేదాన్ని.

"చప్పుడే తప్ప పెద్ద దెబ్బేం తగల్లేదమ్మా!" అత్తగారు కూతురుతో. కాకపోతే నన్నెందుకు సపోర్ట్ చేస్తుంది? అయినా రోజురోజుకీ దీని ఆగడాలు ఎక్కువైపోయాయి. శ్రీనివాస్ తెప్పించిన పత్రికల్లోని సీరియల్స్ అన్నీ ముందే అది చదివేస్తుంది.

"నీకు మధ్యాన్నం కానీ తీరదుగా!" అంటుంది పైగా. నా మొగుడు తెప్పించినవి నేనేగా చదవాలి ముందు. అంతా అన్యాయం.

ప్రతీ పండక్కీ అందరాడపడుచులూ సిద్ధం. పెద్ద పండగకైతే అందరు అల్లుళ్ళూ, మనవలూ..అందరూ కట్టకట్టుకుని వచ్చేస్తారు. చేస్తూంటే అంతులేని పని ఉంటూనే ఉంటుంది, ఎంత వాళ్ళు సాయం చేసినా. అందుకే పిల్లల్ని తీసుకుని పుట్టింటికి చెక్కేస్తాను. తప్పా? ఇరవయ్యో శతాబ్దంలో కోడలికి ఆ మాత్రం స్వతంత్రం ఉండొద్దూ?

ఆకాశ మంత పందిరీ, భూదేవంత అరుగూ వేసినట్లుగా అవుతోంది సంజయ్ పెళ్ళి. వళ్ళంతా కళ్ళుచేసుకుని చూస్తున్నాను. క్రిందటేడే పెళ్ళయాక అమెరికా వెళ్ళిన శిరీష అల్లుడితో సహా వచ్చింది. సంజయ్ కూడా అమెరికానే.. అడిగేదేముందీ..అందరూ ఇంజనీరింగులూ, యమ్మెస్ లూ కదా! కోడలు అరవింద పోలీస్ ఆఫీసర్ గారి అమ్మాయి. సంజయ్ క్లాస్ మేట్‌ట. పిల్ల బానే ఉంటుంది కానీ వాడికంటే ఓనెల పెద్దో చిన్నో.. మాకు నచ్చినా నచ్చకపోయినా తప్పదు.

స్టేట్ బాంక్ లో జి.యం గా రిటైరయిన శ్రీనివాస్ నోరు మెదపకుండా "ఓ.కే మై బాయ్" అనేశారు. నేనెందుకు మాట తేలాలీ?

అత్తగారూ మామగారూ పోయాక పాత ఇల్లు పడగొట్టి ఆధునిక సదుపాయాలతో కట్టుకున్నాం. ఇల్లూ పొలాలూ మాకే ఇచ్చారు కానీ, ఆవిడగారి బంగారమంతా కూతుళ్ళకే. "మీకిచ్చిన దాంట్లో వందోవంతు కూడా ఉండదు. ఆడపిల్లలకి అమ్మ నగలు కావాలని ఉంటుంది కదా?" మామగారి సమర్ధింపు. నేను మాత్రం ఆడపిల్లని కానా?

సంజయ్ పెళ్ళికి మా ఆడపడుచులందరూ వచ్చారు. లక్ష్మీ, వాళ్ళాయనా ఇద్దరూ బాంకాఫీసర్లు. తనకి ఇద్దరు పిల్లలు. ఇంకా కాలేజీల్లో చదువుతున్నారు. పెద్దాడపడుచుల పిల్లలందరికీ పెళ్ళిళ్ళయాయి. శిరి, సంజయ్ ల పెళ్ళిళ్ళల్లో అంతా వాళ్ళే అయి తిరిగారు. ఇప్పుడిప్పుడే వాళ్ళందరూ మంచివాళ్ళే అనిపిస్తోంది. లక్ష్మి ఎవర్తోనో అంటుంటే విన్నాను, "నేను చిన్నప్పుడు మా వదిన్ని ఎంతో ఆరాధించేదాన్ని. కళ్ళార్పకుండా చూస్తుంటే విడ విసుక్కునేది కూడా." నిజమా? నాకు తెలీనే లేదే!

"అమ్మా! పురోహితుడు గారు పిలుస్తున్నారు, స్టేజ్ మీదికి రా!" శిరి పిలుస్తుంటే గబగబా పెళ్ళికూతురికి పెట్టాల్సిన నగలు తీసుకుని వెళ్ళాను. "శిరితో సమానంగా నగలు కొనల్సిందే" అన్నారు శ్రీనివాస్. తప్పుతుందా? ఈ కాలం పిల్లలు బోసి మెడల్తో తిరుగుతూంటారు. ఇంక నగలెందుకూ?

వియ్యపురాలు నవ్వుతూ పలకరించింది. నవ్వదుమరీ! కానీ కట్నం లేకుండా అల్లుడు దొరికాడు కదా! ఏ మాట కామాటే..నగలన్నీ వేశాక అరవింద మహలక్ష్మిలా మెరిసిపోతోంది. వాళ్ళుకూడా బానే పెట్టారు. పాపం కష్టమే..మెడ తిప్పలేకపోతోంది. అయినా శిరి అంత బాగుండదు..శిరీ, సంజయ్ వాళ్ళకి వాళ్ళేసాటి.

"సంజయ్! ఇలా వచ్చి ఈ ట్రాష్ బైట పడేయ్." అరవింద ఆర్డరేసినట్టుగా అరిచింది. ఇంటి దగ్గర ఇక్కడిపుల్ల తీసి అక్కడ పెట్టని సంజయ్ పిల్లిలా వచ్చి చెత్తబుట్ట తీసుకెళ్ళి ఖాళీచేసి తెచ్చాడు. ఏంటో..నువ్వు నువ్వంటూ పేర్లు పెట్టి పిలవడాలూ! ఒక సారి ఎవర్తోనో "శ్రీనివాస్ ఇలా అన్నారు" అంటే మా అత్తగారు పెద్ద పాఠం చెప్పింది. "భర్త పేరు ఉచ్చరించకూడదమ్మా!" అంటూ.

అమెరికా లో కాలిఫోర్నియాలో సంజయ్ ఇల్లు కొనుక్కున్నాడంటే చూడ్డానికి వచ్చాం. పెళ్ళై ఐదేళ్ళైనా ఇంకా పిల్లల్లేరు. ముప్ఫయ్యేళ్ళు దాటిపోయాయి ఇద్దరికీ. మేం వచ్చినప్పట్నుంచీ చూస్తున్నాం కదా! తెల్లారకుండా చెరో కారూ వేసుకుని వెళ్ళిపోతారు. మళ్ళీ చీకటి పడ్డాకే రాడం. వచ్చినప్పట్నుంచీ చెరో కంప్యూటర్ దగ్గరా కూర్చుంటారు. అంత ఆఫీసుపనిట. ఇవెక్కడి ఆఫీసులో..ఓ వేళా పాళా లేదు.

వాళ్ళు ఆఫీసుకెళ్ళినప్పట్నుంచీ నాకు ఇంట్లో పనితో సరిపోతుంది. వచ్చినరోజు అందరం కలిసి భోంచేశాం. కోడలి మర్యాదలు చూసి మురిసిపోయారు మామగారు. "అంత పెద్ద ఆఫీసరు కూతురైనా కొంచెం కూడా గర్వం లేదు" అంటూ. ఎందుకుంటుందీ..సంజయ్ లాంటి మొగుడు దొరకడం మాటలా! రోజు " ఆంటీ, ఆంకుల్" అంటూ కూడా తిరిగి అన్నీ చూపించింది. అంతే..తర్వాతనించీ మేమిద్దరం ఒకరికొకరం అన్నట్లుంది.

ఆఫీసునించి రాగానే ఠంచన్గా వాళ్ళ అమ్మకి ఫోను చెయ్యడం మానదు. రోజు జరిగిందంతా గంటలు నిమిషాలతో రిపోర్ట్ వెళ్ళిపోతుంది. శనివారం పొద్దున్నయితే ఛాట్ లూ వెబ్ కాం లూ..రెండేసి గంటలు ముచ్చట్లు. నాతో మాట్లాడ్డానికి ఏ విషయాలూ దొరకవు.

"ఏంటో! కోడలు పిల్ల ముభావంగా ఉంటుంది..తన స్వభావమే అంతనుకుంటాను." పెళ్ళైన కొత్తలో మా అత్తగారు పెద్దకూతుర్తో అన్న మాటలు ఇప్పుడు కొరడా దెబ్బలా తగిలాయి.

శ్రీనివాస్కి ఒక లాప్ టాప్ పడేశారు. ఇంక ప్రపంచం లో ఉన్న న్యూస్ పేపర్లన్నీ అధ్యయనం చేస్తుంటారు అదే పనిగా. నేనే వంటింట్లో సతమతమయ్యేది. ముందర ఈ మూడంతస్థుల మెట్లు ఎక్కీ దిగీ నా మోకాళ్ళు కుయ్యో మొర్రో అంటున్నాయి. టౌన్ హౌస్ ట, ఒక గది లోంచి, ఇంకో గదిలోకి వెళ్ళాలంటే మెట్లు. కొనేటప్పుడు వీళ్ళు తల్లిదండ్రుల గురించి ఆలోచించరా?

శిరి ఫోన్ చేసి రెండు రోజులైపోయింది. వదిన గార్ని చూసైనా నేర్చుకోవద్దూ! ఇదే దేశం కదాని ఒకసారి చూసి వద్దామంటే ఆరేడు గంటలు ఏరోప్లేన్ లోనే ప్రయాణం. వాళ్ళు తూర్పున వీళ్ళు పడమర్న. చక్కగా అన్నా చెల్లెళ్ళు రెండు మూణ్ణెళ్ళ కోసారైనా కలవడాని కుండదు. నాకైతే ఐదుగురాడాపడుచులు కనక వాళ్ళు వచ్చి పడితే విసుగ్గా ఉండేది. ఇప్పుడొక్కగా నొక్క చెల్లెలు.. ఆప్యాయంగానే ఉంటారిద్దరూ..నయమే!

శిరి దగ్గరకెళ్తే అదేమైనా కాస్త చేతిలో పనందుకుంటుందేమో! ఇక్కడంతా ఎత్తుభారం అయిపోతోంది. రాత్రయేసరికి కాళ్ళూ చేతులూ లాగేస్తున్నాయి. ఇంటిడుమంది బట్టలూ ఎంత మెషిన్‌లో వేసినా మడతలు పెట్టేప్పటికి భుజాలు పీకేస్తున్నాయి. వదిలేస్తే ఆదివారం చేసుకుంటారేమో! శ్రీనివాస్ ఊరుకోరుకదా! వెళ్ళి బట్టలన్నీ మెషిన్‌లో వేసి ఉతికి పోగులు పెట్టేస్తారు...ఖాళీగా కూర్చునేం చెయ్యాలని. మడతలు పెట్టడం రాదు. ఏంచేస్తాం? నాకు తప్పుతుందా!

"ఆంటీ! శిరి ఫోన్." కోడలు ఇందాకటి నుంచీ మాట్లాడుతోంది దాంతోనా! గంట నించీ హస్కు కొడుతూంటే వాళ్ళమ్మేవో అనుకున్నా. బావుంది..ఇదేమో శిరీ అనీ, అదేమో అర్విందా అనీ..బొడ్డుకోసి పేర్లు పెట్టినట్లుగా పిలుచుకుంటారు. వదినా అని పిలుస్తే నామోషీ కాబోలు. శిరికి గట్టిగా చెప్పాలి ఈసారి కనిపించినప్పుడు. అసలు కోడలు మమ్మల్ని కూడా "ఆంటీ, అంకుల్" అంటూ పిలుపులేంటో! ఇప్పుడు పనిమనుషులు పాలవాళ్ళు కూడా అదే పిలుపు..తేడా ఏముందీ?

"ఊరుకోమ్మా! ఇప్పుడు వదినా, మరదలూ అంటూ ఎవరూ పిలుచుకోడంలేదు. మేం ఫ్రెండ్స్ లాగే ఉంటాం. నువ్వు ఇలాంటి సిల్లీ వన్నీ పట్టించుకోకు." నేనేదో చెబుదామనుకుంటే శిరే గంట నించీ నాకు క్లాస్ పీకుతోంది. దానింటికి వచ్చి నాలుగు రోజులైంది.

"అదేంటే! కమ్మటి అనుబంధాలు పిలుపుల తోనేగా వచ్చేది..అట్లా అంటావేంటి?"

"నువ్వు అత్తయ్యలతో ఎంత అనుబంధంగా ఉన్నావో నాకు తెలీదామ్మా! వాళ్ళు ఇంటికి వస్తున్నారంటే నీ బి.పి రైజ్ అయిపోయేది. అలాంటి బంధం మాకొద్దు. వాళ్ళ పిల్లల పెళ్ళిళ్ళల్లో నువ్వు ఎప్పుడైనా మనస్ఫూర్తి గా పాల్గొన్నావా? ఇప్పుడిప్పుడు మీరు వంటరిగా అయిపోయారు కనుక వాళ్ళతో బాగా ఉంటున్నావు." కందిరీగల తుట్టలో చెయ్యి పెట్టినట్లయిపోయింది నాపని. కొన్నాళ్ళికి ఈ వరుస పిలుపులన్నీ విన మరుగైపోతాయేమో! ఇంక దాని మాటలు వినలేక వంటింట్లోకి పారిపోయాను.

అరవిందే నయం..తన కాఫీ తను కలుపుకుని అబ్బాయికీ, మాకూ కూడా ఇచ్చేది. అప్పుడప్పుడు సెలవు రోజుల్లో వంటకూడా చేసేది. ఇదసలు వంటింట్లోకి అడుగు పెట్టడమే మానేసింది. కూతురు కదాని ఏవో నొప్పులూ బాధలూ చెప్పుకోబోతే "వాకింగ్ చెయ్యి, యోగా చెయ్యి, రాందేవ్‌జీది సిడి ఉంది, చూసి ప్రాణాయామం చెయ్యి..బలంగా అవుతావు" అంటూ లెక్చర్లు దంచుతుంది. ఇద్దరికీ సమానంగా ఆస్తీ ,నగలూ ఇచ్చాంగా.. అలాగే దర్జాగా పనులు చేయించుకుంటున్నారు.

"విజ్జూ! ఇటురా..ఈ కంప్యూటర్ కేదో అయింది..కొంచెం చూడు.." ఎవర్నో కాదు..మొగుడ్నే అలా పిలుస్తోంది. ఈ ఇరవయ్యొకటో శతాబ్దంలో కోడలికి చెప్పాలేం.. కూతుర్ని తిట్టాలేం!

# అన్వేషణ

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

పైన గదుల్లో పిల్లలందర్నీ పడుకోబెట్టి, ఆడవాళ్ళు నలుగురూ హాల్లో కూర్చుని హాయిగా గోరింటాకు పెట్టుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. కింద బేస్‌మెంట్లో కాసేపు బిలియర్డ్స్ ఆడి సోఫాల్లో కూర్చున్నారు మగవాళ్ళు యాజి, కిషోరు, మురళి, పార్థు. అందరూ ముప్ఫైకి అటున్నవాళ్ళే. వీకెండు పార్టీలతో విసుగెత్తిపోయి, ఈ మధ్యన కొత్తగా ఈ కాలక్షేపం మొదలెట్టారు. శనివారం రాత్రి చక్కగా ఎవరింట్లోనో కలవడం, పిల్లల్ని పడుకోబెట్టేసి, తీరికగా అర్థరాత్రి దాటేవరకూ పైన ఆడాళ్ళూ, కింద మగాళ్ళూ కబుర్లు చెప్పుకోవడం, ఆనక పడుకోవడం. మర్నాడు కలిసి వండుకు తినడం, సాయంత్రానికి తిరిగి గూళ్ళకి చేరడం.

ఆ శనివారం కూడా అలాగే కలిసారు. యాజి అందరి గ్లాసుల్లోనూ అప్పుడే తీసిన నారింజ రసం పోస్తున్నాడు.

"ఈ ప్రోహిబిషను బాలేదురా యాజీ, నువ్వు తాగవు సరే, మాకెందుకీ బలవంతపు బ్రాహ్మణార్థం ?" అన్నాడు కిషోరు.

"నేను తాగను, నా యింట్లో ఎవర్నీ తాగనివ్వను, అదొక నియమం, అంతే.." నవ్వుతూ చెప్పాడు యాజి.

"ఒరేయ్, యేకంగా వందేళ్ళూ బతికేద్దావనే ఆశ. ఇల్లా జాగ్రత్తలు తీసుకుని, తీసుకుని, ఉన్నపళాన టపాకట్టేస్తారు చెప్పాపెట్టకుండా, ఎన్ని కథలు వినలేదూ?" అన్నాడు మురళి.

"అవును, ఎందుకు పుడతామో, ఎందుకు పుటుక్కుమంటామో, మీనింగ్ లెస్ " అన్నాడు పార్థు ఆలోచిస్తూ.

"మనకి అర్థంకాని వాటన్నిటికీ అర్థం లేదనుకోవడం చాలా తప్పు" అన్నాడు యాజి.

"సరేరా, అయితే సూటిగా అడుగుతాను చెప్పు, పుట్టకముందు మనం ఎవరం, పోయాకా మనం యేమవుతాం?" అన్నాడు మురళి.

"పుడతాం, పోతాం, అంతవరకూ తెలుసు, కనిపిస్తుంది కాబట్టి" అన్నాడు కిషోరు.

"పుట్టడానికిముందు మనం వేరే యెక్కడో చనిపోతాం, చనిపోయిన తరవాత మనం ఇంకెక్కడో పుడతాం, అని భగవద్గీత చెప్పింది" అన్నాడు యాజి.

"వేరే ఎవరో చెప్పడం కాదు, నీకు అనుభవంలో వున్న విషయం చెప్పు. నువ్వు చూసావా? పుట్టకముందు చనిపోవడాన్నీ, చనిపోయాకా పుట్టడాన్నీ?" రెట్టించాడు పార్థు.

"ఇది కేవలం శరీరానికి సంబంధించింది కాదు, ఈ శరీరంలోవున్న జీవునికి సంబంధించింది, శరీరం మన తోడుగా రాదు, కానీ ఆత్మ వస్తుంది, అది ఏ శరీరాన్నయినా ధరించగలదు" అన్నాడు యాజి సాలోచనగా.

"నువ్వు చూసావా ఆత్మని?" అడిగాడు పార్థు.

"లేదు" అన్నాడు యాజి.

"మరి చూడని దాన్ని ఎలా నమ్ముతావు?" అడిగాడు కిషోరు.

"నమ్మకం ఎప్పుడూ గుడ్డిదే, నమ్మినవాడికి రాయే దేవుడౌతాడు" అన్నాడు నవ్వుతూ యాజి.

"సరేరా, ఇలా పైపైన ఎంతసేపన్నా మాట్లాడుకోవచ్చు. నీ జీవితంలో నీకు ఇటువంటి అనుభవం అయ్యిందా, ఎవరిదేనా ఆత్మని చూసావా? కనీసం ఫీలయ్యావా?" సూటిగా అడిగాడు మురళి.

"చెబుతాను, కానీ ఒక్క షరతు మీద" అన్నాడు యాజి.

"చెప్పుబాబూ, ఏవిటా కండిషను?" అన్నాడు కిషోరు.

"ఇది నాకూ మా అమ్మకీ మాత్రమే తెలిసిన విషయం, ఈ రోజు ప్రస్తావన వచ్చింది కాబట్టి చెబుతున్నాను, ఈ విషయం మన నలుగురికీ తప్ప ఇంకెవ్వరికీ తెలియకూడదు, సరేనా?" అన్నాడు యాజి.

"ఎందుకురా ప్రతీదాన్నీ అంత డ్రమటైజ్ చేస్తావు, సరే, ఎవరికీ చెప్పంలే, మొదలెట్టు" అన్నాడు పార్థు.

ఒక్క నిముషం అంతా నిశ్శబ్దం. అందరూ యాజి వైపు చూస్తున్నారు ఆతృతగా. యాజి కళ్ళు ఎక్కడో పైకి చూస్తున్నాయి. అతని మనసు దశాబ్దం దాటిన అనుభవాన్ని మళ్ళీ గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. సీలింగు లైటు కాంతిపడి అతని మొహం వింతగా మెరుస్తోంది, అతనిప్పుడు ఖచ్చితంగా వాళ్ళ మధ్యన లేడు. చెప్పడం మొదలెట్టాడు.

***

నేను డిగ్రీ మొదటి సంవత్సరంలో వున్నాను. కాలేజీ ఎగ్గొట్టేవాణ్ణికాదు సాధారణంగా. కానీ ఆరోజు టీ.వీలో క్రికెట్ మాచ్ వుందని కాలేజీకెళ్ళలేదు. మామూలుగా అయితే అమ్మ కోప్పడేదే, కానీ ఆరోజు అమ్మే కొంచెం డల్ గా వుంది. ఆరోజు తాతగారి ఆబ్దీకం. ఆ యేడాది రెండో మావయ్య వంతు. వాళ్ళకేదో కుదరక, మఠంలో పొత్తర్లిచ్చేస్తామని చెప్పారు. అందుకని అమ్మ బాధపడింది. పొద్దున్న పదౌతోంది. నాకు, నాన్నగారికి అన్నం పెట్టేసింది. నాన్నగారు ఆఫీసుకెళిపోయారు. నేను క్రికెట్చూస్తూ, అన్నం తినేసాను. పన్నెండవుతున్నా అమ్మ అన్నం తినలేదు.

"అమ్మా, నువ్వు తినలేదేవిటే ఇంకా?" అడిగాన్నేను.

" ఆకలి లేదురా, తింటాలే తరవాత" అమ్మ సమాధానం.

బయట ఎండ అదిరిపోతోంది. ఆఫీసుకెళ్ళే ప్రాణులన్నీ వెళ్ళిపోయాయి. కాలనీ అంతా ఎంతో నిశ్శబ్దంగా వుంది. నేను, అమ్మా హాల్ లో కూర్చున్నాం. అమ్మ చేతిలో ఏదో పుస్తకం వుంది, కానీ, అమ్మ అది చదవట్లేదని నాకు తెలుస్తూనేవుంది. ఇంతలో తెందుల్కర్ అవుటయ్యాడు. ఒక్కసారి నేనూ డల్ అయిపోయాను. ఇంతలో గేటు చప్పుడయ్యింది. బైటికి చూసాను కిటికీలోంచి. గేటుకవతల ఎవరో ముసలాయన వున్నట్టు తోచింది. వెంటనే బైటికొచ్చి చూసాను. కాలిపోతున్న ఎండలో కరిగిపోతున్న మంచులింగంలా వున్నారాయన. తెల్లటి మనిషి, ఎత్తైన విగ్రహం, విశాలమైన నుదురు, వెనక్కి దువ్వేసి పిలక కట్టిన నాలుగు వెంట్రుకలు, కుంకం బొట్టు, బూడిది గుమ్మిడి నూగులా మాసిన గెడ్డం, చెవులకి పోగులు, నలిగిపోయిన పల్చటి గ్లాస్కో బట్టలు, ఉత్తరీయం, చేతిలో చిన్న జనపనార సంచీ, ఇదీ ఆయన రూపం.

"ఎవరు కావాలండీ?" అన్నాన్నేను.

"అమ్మని ఒకమాటు పిలు బాబూ" అన్నారు.

ఒక పక్క క్రికెట్ అయిపోతోంది, మధ్యలో ఈయన గొడవేవిట్రాబాబూ, ఏదో డబ్బులు కావాలి గావాల్ను అనుకుంటూ, అనుమానంగానే అమ్మని పిలిచాను. అమ్మకూడా బైటికొచ్చింది.

"అమ్మా, నాపేరు కృష్ణశాస్త్రి. జనగామ మా స్వస్థలం. పిల్ల పెళ్ళి విషయమై నిన్న హైదరాబాదు వచ్చాను. ఈ రోజు ఉదయం ఇక్కడికి దగ్గరలో ఒక పెద్దవారింట వేదపఠనం చెయ్యవలసి వచ్చింది. వారు భోజనం పెట్టలేదు. దక్షిణ, స్వయంపాకం ఇచ్చారు. పెద్దవాణ్ణి కదా, క్షుద్బాధ ఇబ్బంది పెడుతోంది. నోరెండిపోతోంది, కాస్త ఎంగిలిపడితేనే గానీ కదల్లేని పరిస్థితి. బస్సు స్టాండు కెళ్ళే ఓపిక కూడా

లేదు. మీ గుమ్మానికి పచ్చటి మావిడితోరణం చూసాను, గేటుకిరుపక్కలా వున్న వీధి అరుగు చూసాను, పక్కనే కుండీలో పడివున్న వాడిపోయిన మందారాలూ, మంకెనలూ చూసాను. కాస్త పూజ, నియమం వున్న ఇల్లులా అనిపించింది, అందుకే ధైర్యంగా గేటు తట్టాను. మీకభ్యంతరం లేకపోతే నాకు కాస్త భోజనం పెట్టండి, లేదా నన్ను వండుకోమన్నా సరే. ప్రాణం అల్లార్చుకుపోతోంది అమ్మడూ" అన్నారు.

అప్పుడు గమనించాము ఆయన ఇంకా ఎండలోనే వున్న సంగతి. వెంతనే గేటు తీసి ఆయనని లోపలికి తీసుకొచ్చి కూర్చోబెట్టాము. నేను ఫ్రిజ్ లోంచి తీసి చల్లటి మంచినీళ్ళిచ్చాను. కుళాయినీళ్ళు తాగుతానన్నారు, ఇచ్చాను. అమ్మ వంట ప్రయత్నాలు మొదలెడుతోంది.

ఆయన నీళ్ళుతాగి ఒక్కసారి కళ్ళు మూసుకుని కుదుటపడి "రామచంద్రపాహీ" అనుకుంటూ, "అమ్మా, నాకోసం ప్రత్యేకం ఏమీ వంట ప్రయత్నాలు చెయ్యద్దు, ఏది వుంటే అది పెట్టండి, నేను మరొక్కమారు చెంబుడు నీళ్ళుపోసుకుని మడికట్టుకుంటాను" అన్నారు.

ప్రతీరోజూ రెండుమూడు రకాలుండే మాయింట్లో ఆరోజు పప్పు తప్ప మరేమీలేదు. మేము తినగా నలుగురికి మిగులుతుంది మాయింట్లో ఏపూటైనా. అలాంటిది పరీక్షగా ఆరోజు ఒకమనిషికి సరిపోయే అన్నం, పప్పూ మాత్రమే మిగిలాయి. మర్నాడు ఆదివారం సంతకాబట్టి ఇంట్లో కూరలు కూడా అయిపోయాయి. అమ్మ నాకు డబ్బులిచ్చి చప్పున బంగాళదుంపలు తెమ్మని పంపింది షావుకారు కొట్టుకి. నేను మూడో నిముషంలో ఇంట్లో వున్నాను. ఆయన స్నానంచేసి బయటకొచ్చేసరికి, చారు, బంగాళదుంపల వేపుడు సిద్ధంగా వున్నాయి. ఇంట్లో చేసిన నెయ్యీ, పెరుగూ వుండనే వున్నాయి.

ఆయన పీటవేసుకున్నారు. నేను మంచినీళ్ళు పెట్టాను. అమ్మ వడ్డించింది. ఆయన తృప్తిగా భోజనం చేసారు. గడ్డపెరుగు మారు వడ్డించమన్నారు. పరిషం పట్టి లేచారు. చెయ్యికడుక్కుని హాల్లోకి వచ్చి కూర్చున్నారు. సంచీలోంచి ఒక కాగితం తీసారు.

"అమ్మా, చాలా తృప్తిగా వుందమ్మా. మీ వంశం వెయ్యేళ్ళు వర్థిల్లాలి. ఇదిగో లగ్న పత్రిక. ఈరోజు మీరో ప్రాణం కాపాడారు, ఒక కుటుంబాన్ని నిలబెట్టారు. నేను జనగామ వెళ్ళగానే మీకు శుభలేఖ వేస్తాను. తప్పకుండా వివాహానికి నువ్వూ, అల్లుడూ, పిల్లలూ అందరూ రావాలి.."అంటూ ఆశీర్వచనం మంత్రం చదివారు. ముందు అమ్మా, తరువాత నేనూ ఆయన కాళ్ళకి దణ్ణం పెట్టాము. మనసారా ఆశీర్వదించారు. మా ఎడ్రసు అడిగి తీసుకున్నారు. నేను కాగితం మీద రాసిస్తే భద్రంగా సంచీలో పెట్టుకున్నారు. కాస్త ఎండ తగ్గాకా వెళ్ళమంది అమ్మ.

"లేదమ్మా, మళ్ళా వేళదాటిపోతే మా జనగామ బస్సు అందదు. వెళ్ళొస్తా అమ్మడూ, ఉంటా సోంబాబూ..బాగా చదువుకో" అంటూ నవ్వుతూ గేటు దాటారు. నాకూ అమ్మకీ చెప్పలేని ఆనందం. ఒక చక్కటి అనుభూతి. మరో పావుగంట గడిచిపోయింది.

"అమ్మా, నువ్వింకా తిననేలేదు?" అడిగాన్నేను.

"లేదురా, కడుపునిండిపోయింది, వేదపండితుడికి కడుపునిండా అన్నంపెట్టే భాగ్యం కలిగింది ఇవ్వాళ" అంది అమ్మ సంతోషంగా.

నాకొక్కసారి ఏదో స్ఫురించింది. "అమ్మా, తాతగారు నిన్నేవని పిలిచేవారూ?" అడిగాను.

"అమ్మడూ అనేవార్రా" అంది అమ్మ ఏదో ఆలోచిస్తూ.

"మరి నన్ను?" అడిగాన్నేను.

"అన్నని రాంబాబూ, నిన్ను సోంబాబూ అనేవారు" అంది అమ్మ పరధ్యానంగా.

అంతే....ఒఖ్ఖసారి ఇద్దరికీ విషయం బోధపడింది. అమ్మ కుర్చీలో కూర్చుండిపోయింది. ఏదో అద్భుతం జరిగినట్టు వెలిగిపోతున్నాయి అమ్మ కళ్ళు. నేను వెంఠనే చెప్పులు వేసుకుని మొగదాకా పరిగెత్తాను. అక్కడా యిక్కడా చూసాను.  ఆయన కనపడలేదు.

తిరిగొచ్చేసరికి అమ్మ చిన్న పళ్ళెంలో, మిగిలిన వేపుడు వేసుకుని తింటోంది.

"ఏమిటే అమ్మా" అని అడిగితే,

"తాతగారి ప్రసాదం తింటున్నానా" అంది తృప్తిగా.

***

కథ చెప్పడం ఆపాడు యాజి. బొమ్మల్లా కూర్చున్నారు కిషోరూ, మురళీ, పార్థు. తేరుకోవడానికి ఒక నిముషం పట్టింది వాళ్ళకి.

"అయితే ఆవచ్చినాయన మీ తాతగారంటావా?" అడిగాడు మురళి.

"నాకలాగే అనిపించింది" అన్నాడు యాజి ప్రశాంతంగా.

" ఐ మీన్, ఇట్ కెన్ బి ప్యూర్ కోఇన్సిడెన్స్ ఆల్సో" అన్నాడు కిషోరు.

"కావచ్చు" అన్నాడు యాజి చిన్నగా నవ్వుతూ.

"ఎంతకాకతాళీయమైతే మాత్రం, పేర్లతో సహా మరీ అంత కరెక్టుగా ఎలా చెప్పగలిగారు ఆయన? పోనీ  ఆయన వేసిన పెళ్ళికార్డ్ యేవైనా వచ్చిందా తరువాత?" అడిగాడు మురళి.

నవ్వుతూ, లేదన్నట్టు తలూపాడు యాజి.

సమయం అర్థరాత్రి దాటింది. ఇండియానించి ఫోనొచ్చింది. మాట్లాడి వచ్చాడు యాజి. వచ్చి నవ్వుతూ కూర్చున్నాడు.

"ఏవిటి విషయం" అందరూ ఒకేసారి అడిగారు.

"ఇవాళ మా తాతగారి ఆబ్దీకంట. అమ్మ పెద్దమావయ్యావాళ్ళింటికెళ్ళొచ్చింది. ఆ విశేషాలే చెబుతోంది.‘ అన్నాడు యాజి.

అవాక్కయ్యారు మిత్రబృందం !!

అట్లాంటా లో సాఫ్ట్వేర్ రంగంలో పనిచేస్తున్న శ్రీనివాస ఫణికుమార్ గారు చక్కటి గాయకుడు, సాహిత్యాభిలాషి, కథా రచయిత.



# ఆశీర్వచనం

- అరుణ నిష్టల

బెంగుళూర్ ఎక్స్‌ప్రెస్ ఒకటో నెంబరు ఫ్లాట్‌ఫాం అనేసరికి నవ్వుతూ "కొంత నయం, బ్రిడ్జ్ ఎక్కక్కరలేదు" సూట్‌కేస్ చేయి మారుస్తూ అనసూయమ్మతో అన్నాడు సూర్యం.

"ఆ! ఏం ప్రయాణాలో! ఎంత ఏ.సీ. అయినా ఒళ్ళు హూనం అయిపోతుంది. బాధపడలేవని వచ్చాను గానీ..." ఇంతలో కాలు తడబడి పడబోయింది. మడమ బెణికిన దానికి "అమ్మో" అన్న గావుకేక వేసింది.

ఆవిడకి అణువంత బాధ కలిగినా ప్రపంచమంతా తెలియాలనుకుంటుంది. ప్రక్కనే ఉన్న రమ అత్తగారి చేయి పట్టుకుని ఆపి కాలు మడమ అరచేత్తో రుద్దుతూ "కాస్సేపు కూర్చుంటారా? ఇంకా టైముంది నెమ్మదిగా ఎక్కవచ్చు" అంది.

"ఆ! ఏం కూర్చోడంలే! ఒకటే కూర్చోడం బెంగుళూరు దాకా!"

నిరసనగా కోడలి చేయి తోసేస్తూ అంది ఆవిడ. మనస్సు చివుక్కుమంది రమకి. ముప్పై ఏళ్ళనుంచీ ఇది అలవాటే అయినా అదేమిటో అదే మొదటిసారి అన్నట్లు బాధపడుతుంది. "ఛ! ఛ! పట్టించుకోకూడదు. అది వాళ్ళ మనస్తత్వపు తీరు! అది అంతే! ". అనుకుంది.

సీటు చూసి లోయర్ బెర్త్ క్రింద సామాను సర్ది గొలుసు తాళం వేసి తల్లికిచ్చాడు సూర్యం. "అన్నయ్య అమెరికా నుంచి వచ్చాకా వెంటనే రా" అన్నాడు.

"మరీ పిసరు గదులు కట్టించార్రా! ఇల్లు కాలు బారచాపితే అటు గోడ తగిలేట్టు! అన్నయ్య ఇల్లంతది కాకపోయినా కాస్త పెద్దగా ఉండద్దూ? ఇద్దరు మగపిల్లలు! కోడళ్ళు వస్తారు" కోడలు ముఖం పరీక్షగా చూస్తూ అంది. తలదించుకుంది రమ.

"వాళ్ళు కూడా ఆ ఇంట్లోనేనా అమ్మా! మంచి ఉద్యోగాలు వచ్చి పెద్ద ఇళ్ళు కట్టుకునేట్టు నువ్వు ఆశీర్వదించు" నవ్వుతూ అన్నాడు సూర్యం.

"నిన్ను అంటున్నారిద్దరూ! మరీ పెద్ద ఉద్యోగాలు కావుట వాళ్ళవి? నిజమే? పేద్ద ఇంజినీరు చదివించామంటారు?"

నిందో నిష్ఠూరమో లేదా మనవల పట్ల ఆదుర్దాయో తెలియదు కొత్తవాళ్ళకి. ఆవిడ మాడ్యులేషన్ అలాంటిది.

అది అలవాటయిన కొడుకు కోడలు ముఖంలో బాధావీచిక వీచినా ఆరాగా చూస్తోంది.

"ఇందులో అబద్ధం ఏముంది. మంచి ఉద్యోగాలు దొరికేదాకా అనుభవం కోసం చేస్తునారు. టైమ్ కలిసిరావాలి కదా?" అన్నాడు సూర్యం.

"అది సరేలేరా? ఇపుడా ఇల్లుకి తొందరపడకపోతేనేం? పిల్లలిద్దరికీ మంచి ఉద్యోగాలు కావద్దూ?"

"టైమ్ అవుతోంది. ట్రైన్ కదిలితే దిగడం కష్టం. " రమ లేస్తూ అత్తగారి వైపు తిరిగి "ఆరోగ్యం జాగ్రత్తండి. వేళకు మందులు వేసుకోండి"

"నా ఆరోగ్యానికేం? నిక్షేపంలా ఉన్నాను. అడుగడుక్కీ డ్రింకులూ పళ్ళు పాలూ... ఏమీ లోటులేదు" వీలున్నపుడు పెద్దకొడుకు వైభవం వల్లించడం ఆవిడకు అలవాటు. అందులో మీ ఇంట్లో నాకంత సౌకర్యం చేయగలరా? అనే ఛాలెంజ్ తప్పక ఉంటుంది.

"వస్తానమ్మా" సూర్యం లేచాడు.

"ఒరే! సూర్యం! అన్నానని ఇదవకండి! నిజం కరక్కాయలా ఉంటుంది. మీరు చెట్టు కింద అయినా ఉండి ఆ ఇల్లు అమ్మేసి పిల్లలిద్దరికీ మంచి ఉద్యోగాలు వేయించండి. డబ్బిస్తే ఈ ప్రపంచంలో జరగనిదేమిటి? పిల్లల జీవితాలు ముఖ్యం! మీ జీవితాలు ఆఖరు

దశలోకి వచ్చాయి."

"అలాగే" బాధను పళ్ళబిగువున నొక్కిపట్టి "జాగ్రత్త వెళ్ళాకా ఆఫీసుకి ఫోన్ చేయి" అన్నాడు సూర్యం.

గ్రుమని కళ్ళనీళ్ళు తిరిగి టప్‌టప్ మంటూ చీరమీద పడ్డాయి రమకి. వెనక్కి తిరిగి గబుక్కున రుమాలుతో వత్తుకుని బయటకి నడచింది.

ఆ సందర్భంలో ఆ దృశ్యం సర్వసామాన్యమే! అయినా ఇక్కడి పరిస్థితి వేరు. తల్లి...కుటుంబపు పెద్ద... గృహప్రవేశానికి పిలిచి పట్టుచీర పెట్టి పంపిస్తూంటే అనవలసిన మాటలేనా అవి?

'గ్రాసం నీది కాకపోయినా వాసం నీదుండాలని' అంటారే అలాంటిది! ఇక రిటైర్ అవబోతున్న సమయంలో చిన్న ఇల్లు ఉండాలనుకోవడం తప్పా? రమ మనస్సు నలిగిపోయింది.

రైలు దిగి కిటికీ దగ్గరగా వచ్చారు. అనసూయమ్మ రైల్వే అటెండర్ తెచ్చిన తలగడ దుప్పటి చూసుకుంటోంది, వీళ్ళని చూడాలనుకోవడం లేదు. మనస్సుల మధ్య గోడల్లా కిటికీకి బిగించిన అద్దాలు.

ఎవరి ఆలోచనలు, బాధలు, బెంగలు, కలలతో నిమిత్తంలేని రైలు నెమ్మదిగా కదిలింది.

'మీరు చెట్టుకింద ఉండండి. ఇల్లు అమ్మేయండి'... అత్తగారి మాటలు సుత్తి దెబ్బల్లా మెదడులో మార్మ్రోగుతున్నాయి. ఆవిడని తృప్తిపరచాలనీ సంతోషంగా ఉంచాలని ఎన్ని చేసినా నిరసనగా ఏదో ఒకటి పుటుక్కున అంటే గానీ ఆమెకి తోచదా? వీళ్ళు బాధపడతారేమో అనిపించదా? ఇంతకీ సూర్యం తన భర్త చేసిన అపరాధం ఏమిటి అంటే తను పుట్టిన నెలలోపున మామగారికి తీవ్రమయిన జబ్బు చేసింది. పర్యవసనాలు ఆలోచించని అవసరంలేని ఎవరో వెంటనే బిడ్డ పుట్టిన వేళా విశేషం అన్నారు.

మధ్య తరగతి కుటుంబీకులను అలాంటి టెర్మినల్ వ్యాధులు ఆర్థికంగా మానసికంగా మరింత దిగజారుస్తాయి. ఆ కుటుంబానికి అలాగే జరిగింది. వైద్యానికి ఆస్తులు బంగారం అమ్ముకున్నారు. నానా అవస్థ పడ్డారు. ఆఖరుకి ఇంత ఖర్చుపెట్టినా మనిషి దక్కలేదు. మిగిలిన అర ఎకరం భూమితో ఆదాయంతో ఏం తిన్నారో ఏం పెరిగారో ఏం చదువుకున్నారో ఆ కుటుంబానికే తెలుసు. కష్టాలూ జీవితం వేరు వేరు కాదు. ఈ ప్రకృతిలో జీవి బ్రతికి ఉండాలంటే ఎన్నో అవరోధాలను ఎదుర్కోవలసి వస్తుంది. అది ఆరోగ్యానికి గానీ పరిస్థితులు వికటించిగానీ ఏదవనీ..... దేశకాల పరిస్థితులు కనుగుణంగా ఒకే కష్టం వేరు వేరు విధాలుగా జీవి అనుభవించవచ్చు. అదే వయసులో ఇద్దరు చిన్నపిల్లల తల్లి వితంతువు అయితే ఆ మధ్య తరగతి స్త్రీ అమెరికాలో అయితే ఆ రోజుల్లో ఇంట్లో కూర్చుని ఏడవకుండా చదువున్నా లేకపోయినా ఏదో పని చేసుకుని తన కుటుంబాన్ని పోషించుకునేది. ప్రపంచ యుద్ధంలో జర్మనిలో మగవాళ్ళంతా చాలామంది గాయపడీ, చాలామంది మరణించినపుడూ అక్కడి స్త్రీలేకదా మగవారి బరువైన పనులను ఫ్యాక్టరీలలో తలకు మించిన బాధ్యత వేసుకుని భరించి రాటుదేలి సర్వస్వతంత్రులు అయ్యారు!

అదే ఆఫ్రికా అడవులవనీ, ఇండియా కొండజాతి అవనీ మళ్ళీ పెళ్ళి చేసుకుని జీవితం మొదలుపెడతారు. ఇవల్యూషన్‌లో జీవితాన్ని ముందస్తుగా శాసించేది సమాజం. కూడూ గుడ్డా పెట్టకపోయినా మనిషెలా ఉండాలో నిక్కచ్చిగా చెప్పి అలా ప్రవర్తించకపోతే శిక్షించే సమాజం మనది. ఇక్కడి సంస్కృతి, ఆచారాలూ మనిషి జీవితంలో వ్యక్తిగత బాధలకు నిమిత్తం లేకుండా రాజ్యం చేస్తాయి.

చదువులేక సరైన డబ్బులేక స్త్రీ బయటకు వచ్చి పనిచేయటానికి వీలులేని కుటుంబ మర్యాద కొంత, పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే చాకచక్యం పరిణితి లోపించి కొంత, మగదక్షత లేక ఇబ్బందులు పడింది అత్తగారి కుటుంబం. అయితే కాలం మారింది. జీవితం మారింది. పెద్దకొడుకు శంకరం చదువుకుని అందగాడు కావటాన పెద్దింటి వాళ్ళ సంబంధం తెచ్చిపెట్టింది. మంచి ఉద్యోగం వేయించిన మామగారు, డబ్బూ పిల్లలు భార్య వైభవం అమిరాయి అతడికి. బావగారి టూర్లు తోటికోడలు పుట్టింటి ప్రయాణాలు పిల్లల్నీ చూసేందుకు నా అన్న మనిషి కావాలి కనుక తల్లిని తమతో తీసుకుపోయారు. కానీ కాలం గడిచినా సూర్యం పట్ల ఆవిడ వైఖరిలో ఎటువంటి మార్పూరాలేదు. "వాడి నష్టజాతకం వలన తన సౌభాగ్యం తుడుచుకుపోయింది' అదే ఆవిడ ఆలోచన.

సూర్యం చదివిన గ్రాడ్యుయేషన్‌కి తగిన ఉద్యోగం మధ్యతరగతి టీచర్ తను, పడుతూ లేస్తూ చీటీలు కడుతూ ఆదా చేసిన సొమ్ముతో కట్టిన ఇల్లు.... ఆవిడన్న ఆ మాట శూలపు పోటులా రమని బాధిస్తూనే ఉంది ఎంత మరచిపోదామన్నా!

వార్ధక్యం వస్తున్నకొద్దీ కరుణ, ప్రేమ, సహనం మనిషి మనసులో బీజం వేసుకుని పెద్దదవుతుందంటారు! కానీ... రమకి వెంటనే క్రిష్ణత్తయ్య జ్ఞాపకం వచ్చింది. అంత బాధలోనూ మనసు మల్లెల సౌరభంలో తేలియాడినట్లయి తేలికయింది.

"రమా" సూర్యం రమ చేతిని - తనచేతిలోకి తీసుకున్నాడు. ఆ పిలుపులో ఓదార్పు! ఆ స్పర్శలో ఆత్మీయత... వెంటనే సూర్యం కళ్ళలోకి చూసింది. 'బాధపడకు' అన్నట్లు అతడి కళ్ళలో నీటితెర. 'ఎంత చక్కని మనో సౌందర్యం అతడిది! ' అనుకుంటూ చూసింది. అదే మరెవరైనా అయితే మొత్తం స్త్రీ జాతినే ద్వేషించి ఉండేవారేమో! తల్లిపూజనీయురాలు కనుక ఆమె మీద కోపం వన్నెలు మార్చుకుని ఎలాంటి కర్కశ రూపమయినా దాల్చవచ్చు అలాంటి పరిస్థితులుంటే... కానీ సూర్యం పెరుగుతూ ప్రతిక్షణాన్ని ఉన్నదున్నట్లు స్వీకరిస్తూ విశ్లేషించుకుంటూ జీవితాన్ని ఒక వరప్రసాదంలా భావించినట్టే ఆ ప్రశాంతత అతడి ముఖంలో.

ఆటో ఎక్కి బయలుదేరారు ఇంటికి.

✵ ✵ ✵

ఇంటికి వచ్చేసరికి పిల్లలు ఏవో సంగీతపు కేసెట్లు చూసుకుంటున్నారు కొడుకు రాజేష్ పెట్టిన శివకుమార్ శర్మగారి సంతూర్ వాయిద్యం... వెల్లల సువాసన, అలంకరణకు కట్టిన పూలదండలు, మామిడి తోరణాలు, ఎక్కడి సామాను అక్కడే ఇంకా సర్దుకోలేదు... ఇల్లు... సొంత ఇల్లు... ఎంత మధురమైన స్వప్నం..... ఇదే సమయంలో క్రిష్ణత్తయ్య ఉంటేనా?... మనసు పాత జ్ఞాపకాలలోకి పరుగెడుతోంది. అందరికీ టీ కలిపి ఇచ్చి ముందుగదిలో బల్ల మీద ఆల్బమ్ తెరిచింది. దానితోపాటు ఎన్నో మధురానుభూతులు ఎన్నెన్నో జ్ఞాపకాలు.... అన్నీ కళ్ళముందర నేనంటే నేనని పోటీపడుతూ తిరగసాగాయి రమకి........

మధ్య పేజీలలో తెల్లటి పంచెలో లక్షవత్తుల నోము చేస్తున్న క్రిష్ణత్తయ్య. తను చిన్నప్పుడు సరిగా పలకలేక "కిత్తత్తయ్య" అనేది. తన తల్లి మేనత్త ఆవిడ... ఆవిడ అసలుపేరు కృష్ణవేణి. నడుముదాకా ఉండే నల్లటి వంకీల తలకట్టట ఆవిడిది చిన్నపుడు. దాదాపు తొంభై ఏళ్ళ క్రితం ఆవిడని బండిలో పంపించి పక్కనున్న ఊళ్ళో థర్డ్‌ఫాం వరకూ చదివించారు. ఆరోజుల్లో అది విడ్డూరమైన సంగతి పన్నెండవ ఏట పెళ్ళి చేసి పంపిన ఆవిడ పదిహేనవ ఏటనే పుట్టింటికి పసుపు కుంకుమ కోల్పోయి చేరింది.

నలుగురు అన్నదమ్ముల మధ్య అల్లారుముద్దుగా పెరిగిన ఆ పిల్లను అలా చూడాల్సి రావడం తల్లితండ్రులకు కడుపు కోత, వారి ప్రేమలో పెరుగుతున్న ఆ యవ్వనవతి జీవితం తనకి వేసిన శిక్షకి కృంగి కృశించిపోయి, పచ్చని సంసారాలవైపు ఈర్ష్య అసూయలతో కటువు మాటలతో గాయపరచిగానీ, తనకు తాను మానసికంగా హింసించుకుని 'అయ్యోనాదీ ఒక జీవితమే' అన్న సెల్ఫ్‌పిటీలో మునిగి జీవితాన్ని వ్యర్థం చేసుకోలేదు.

రామాయణ భారత భాగవతాలు ఆవిడ కంఠంలో ప్రాణం పోసుకుని నిలిచిపోయాయి. తనకు సంక్రమించిన ఆస్తిలో వచ్చే రాబడిలో ఇంత అని గుడిలో రాజరాజేశ్వరి అమ్మవారికి కేటాయించింది. ఎక్కడ ఎవరికి ఏ సహాయం కావాల్సి వచ్చినా ఆవిడ ఆదుకునేది. "మనిషే దేవుడు, అవసరం వచ్చినపుడు మనిషికి సాయం చేయడమే దైవ పూజ" అనేదావిడ.

ఏడాదికి ఒకసారి జరిగే ప్రక్క గ్రామంలో తిరణాలకు వెళ్ళి దైవదర్శనం చేసుకుని, అక్కడ ఆడపిల్లలకి గాజులు, మరీ చిన్నపిల్లలకి బొమ్మలపెట్టెలు, ఆటబొమ్మలు, మగపిల్లలకు బంతులు, ఎవరింట్లో అట్లకాడ విరిగిపోయినది, ఎవరికి సరియైన పోపుగరిటలేనిదీ, ఎవరింట్లో చారుకి తగరపు గిన్నెల్లేవో గుర్తుంచుకుని కొని తెచ్చి అందరికీ ఇచ్చేది. ఎప్పుడూ మల్లెపూవులాంటి బట్టలలో నిరంతరం 'శివోహం' అంటూ జపించేది ఆవిడ.

ఎపుడూ ఒక పొల్లుమాట వచ్చేది కాదు ఆవిడ నోట్లోంచి. ఆవిడకి కోపం వచ్చిన సందర్భాలు చాలా అరుదు. పెళ్ళిళ్ళలో సలహా సందడీ ఆవిడదే! బాలింతరాళ్ళకి నోటికి రుచించేలా కమ్మని పదార్థాలు చేసి ఇచ్చి వచ్చేది ఊళ్ళో ఎవ్వరైనా సరే! ఎవరికి ఒంట్లో

బాగులేకపోయినా ఆవిడకి వేరే పిలుపు అఖ్ఖర్లేదు. ఒకవేళ ఆవిడ ఏ శ్రీశైలం యాత్రకో ఏ పెళ్ళికో ఊరువిడిచి వెళితే "అయ్యో! పిల్లాడికి చచ్చే జ్వరం! సమయానికి క్రిష్ణత్తయ్యగారు కూడా లేరు" అని ఇల్లాళ్ళు బెంగపెట్టుకునేవారు. ఆమె చేతి వంట తింటే వెంటనే లేచి ఆరోగ్యంగా తిరుగలేని వాళ్ళ నమ్మకం. ఎంత శ్రద్ధగా వడ్డించేదో అతిధులకు. తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది.

ఏ సబ్బులూ ఏ పౌడర్లూ ఏ క్రీములూ లేకుండానే ఇంటి పక్కనున్న చెరువులో బట్టలు శుభ్రంగా రుద్దుకుని స్నానం చేసి మడిగా బిందెడు నీళ్ళు తెచ్చుకునే ఆవిడ పసిమిఛాయతో ముఖం వెలుగుతూ కళ్ళలో ప్రేమ కరుణ ఉట్టిపడుతూ ఉండేవి. ఆవిడ మాట్లాడుతూంటే సంగీతం వింటున్నట్లు మధురంగా ఉండేది.

ఏ పెళ్ళో ఒడుగో అయినపుడు తన బాల్యంలో నరిశిపూడి వెళ్ళి వస్తూంటే వంగి కాళ్ళకి నమస్కారం చేస్తే "బాగా పెద్ద పెద్ద చదువులు చదివి ఆయురారోగ్యాలతో అష్టయిశ్వర్యాలతో భగవంతుడి కృపతో పచ్చగా ఉండాలి' అంటూ రెండు చేతులూ తల మీద నుంచి మనసారా నిండుగా దీవించేది. ఆవిడ దీవెన, చిన్నవాళ్ళయితే ముందుపలికే మాటలతో బాగా చదువుకోవాలనీ, యువకులు అయితే మంచి ఉద్యోగం రావాలనీ, పెళ్ళీడు ఆడపిల్లలయితే శీఘ్రమే కళ్యాణం జరగాలనీ, కొత్తదంపతులయితే సత్సంతానం కలగాలనీ దీవించేది. వాక్సుద్ధిగల ఆవిడ దీవెన పొందేవాళ్ళు అదృష్టవంతులే అనేవారందరూ!

అంతదూరంలో ఆ పల్లెటూళ్ళో ఆవిడ క్షేమంగా ఉందన్న తలంపే ఎంతో శక్తినిచ్చేది కానీ, భగవంతుడి పిలుపు... ఆవిడ మరిలేదు. ఎంతో అపురూపమైన ఆవిడ జ్ఞాపకాల సంపద అందరికీ పంచి వెళ్ళిపోయింది. తల్లీతండ్రిలేని తమ్ముడి పిల్లలను ఎంతో ప్రేమగా పెంచింది. ఆమెకు ఎంతో అలవాటయిన పెద్ద శేషపిన్ని ఒకసారి సోది చెప్పేవారితో అడిగించింది క్రిష్ణత్తయ్య చనిపోయాక కొండజాతి స్త్రీలు ఆత్మలతో మాట్లాడగలరట. 'శివుడి తోటలో పూలు కోసుకుంటున్నాను. నన్ను పిలవకండి' అని చెప్పిందిట ఆవిడ' ఎంతో ప్రేమగా పెంచిన పెద్ద శేషపిన్నినే అలా అంటే... బ్రతికున్నన్నాళ్ళే అన్నమాట ఈ ఆప్యాయతలూ, ప్రేమలూ, అభిమానాలూను, మరి ఈ కాస్త జీవితంలో ఇంతింత ద్వేషాలు ఎందుకో? '

కొడుకు సూర్యం కుటుంబం పట్ల అత్తగారి ప్రవర్తనలో మరి మార్పురాదా? కన్న కడుపుకే అంత తేడా ఉంటే!? నెల్లాళ్ళు ఉండమని బ్రతిమాలితే ఎండలు పడవని మూడో రోజునే ప్రయాణమయిందావిడ. నీడ నిచ్చే గొడుగే వెనకడుగు వేస్తూ మొట్టికాయలు కొడుతూంటే.... ఆశీర్వదించవలసిన నోరే శపిస్తూంటే.... సంతానం ఏం చేయగలదు?

నిట్టూర్చింది రమ ఆల్బమ్ మూసివేస్తూ. బావగారి దగ్గరున్నంత డబ్బు వైభోగం తమ వద్ద ఉండకపోవచ్చును. ఆ డబ్బు కొనుక్కోలేని ప్రేమాభిమానాలు ఈ ఇంట నిండుగా ఉన్నా తిరస్కరించి... అవమానించి వెళ్ళిపోయే అత్తగారు తన మనసు గాయపరచినపుడల్లా క్రిష్ణత్తయ్య జ్ఞాపకం వస్తుంది. ఆవిడైతే ఆ సమయంలో ఏం చేసి ఉండేది? ఎలా ప్రవర్తించి ఉండేది? ఏం మాట్లాడి ఉండేది? అని ఆలోచన వస్తుందామెకు.

"రమా" భర్త పిలుపు విని వెనక్కి చూసింది. చీకటి పడేందుకు సిద్ధంగా ఉంది ఆకాశం.

"ఇంకో మాట వదినకి ఎస్.టి.డి చేసి చెప్తాను. నిన్న వదిన ఇంట్లో లేదుకదా? పని అమ్మాయి ఎత్తింది ఫోన్" అన్నాడు.

సమయానికి ఫోన్ పనిచేయటంలేదు.

అదే సమయంలో లచ్చమ్మ గేటు తీసుకుని వస్తోంది. నిన్న తను పెట్టిన కొత్త చీర కట్టుకుని రమ కేసి ముసి ముసి నవ్వులు నవ్వుతూ వస్తోంది. అందతా తను కొత్తచీర కట్టుకున్న సంతోషం.

వస్తూనే "అమ్మా! బయట దీపాలు పెట్టండి. నచ్చత్రాల్లా ఎంతో బాగుంటాయి" అంది.

గృహప్రవేశానికి పిల్లలు చిన్న చిన్న బల్బులు తోరణాలలా వేలాడదీసారు. కొన్ని మొక్కల మీదనుంచి వేసారు. లచ్చమ్మ అడిగింది కదాని ప్లగ్ పెట్టింది.

లచ్చమ్మ ఇరవై ఏళ్ళుగా పనిచేస్తోంది. అద్దె ఇళ్ళు మారినప్పుడు దూరమైనా వచ్చేది. అన్నాళ్ళుగా వాళ్ళ మధ్య చక్కని అభిమానం తెలియకుండానే అల్లుకుంది. లచ్చమ్మ ఇంట్లో మనిషిలాగే మసలుతుంది.

"మంచిపనిచేసారమ్మా! ఇంక నిబ్బరంగా ఉండచ్చు మీరూ అయ్యానూ! ఇల్లు సిన్నదేగానీ సుట్టూ మొక్కలూ అయి ఎంతందంగా ఉందో!" ముచ్చటగా చెంపకు చేయి ఆనించుకుని వెలుగుతూ ఆరుతున్న దీపాలనూ గుమ్మాలకి కట్టిన పూలమాలలూ తోరణాలూ చూస్తూ అంది లచ్చమ్మ.

గుమ్మంలో మెట్లమీద కూర్చుంటూ "పచ్చగా పిల్లలతో పదికాలాలపాటు ఆయిగా ఉండాలమ్మా మీరు" నిండు మనస్సుతో నవ్వుతూ అంటున్న లచ్చమ్మ మాటకు రమ లచ్చమ్మ వైపు చూసింది.

ఈమాటేగా తను అత్తగారి నుంచి దీవెనగా ఆశించింది! లచ్చమ్మ ఎవరో పరాయిదేం కాదు! తనని సొంత మనిషిలా ఆప్యాయంగా చూస్తుంది. తన అత్తగారి వయసే! పెద్దది! ఆ ఆశీర్వచనం నిండుగా గుండెలోతుల్లోంచి అమాయకంగా నిష్కల్మషంగా నిస్వార్థంగా పలికినది! ఆ ఆశీస్సు తనకు చాలదూ?

వంగి తన పాదాలకు నమస్కరిస్తున్న రమను చూసి "అదేంటమ్మా" ఆశ్చర్యంగా అడిగింది లచ్చమ్మ.

"ఏం లచ్చమ్మా? నువ్వు మా మనిషికావా? పెద్దదానివి! "చిరునవ్వుతో అంటున్న రమ లచ్చమ్మను చూస్తుండిపోయింది. నమస్కరిస్తే ఆశీర్వదించాలి అంటారు. అలాంటిది ఎదుటి వారి మన్నన ఆశించకుండానే దీవించే పెద్ద మనసు ఈమెది.

అత్తగారికి బట్టలు పెట్టి తనూ తన భర్త నమస్కరిస్తూంటే "ఒరే సూర్యం! రేపు నేను బయలుదేరుతున్నట్లు ఒదినకు ఫోను చేసావా?" అడిగిందావిడ ఆ సమయంలో ఆ పెద్దావిడ దీవెన అన్నంటికంటా ముఖ్యమైనదనీ, ఎపుడూ పాజిటివ్ ఆలోచనగా వెలువడే ఆ దీవెనకోసం ఎదురుచూస్తుంటే...... మనిషిని నొప్పించడానికి పదునైన ఆయుధాలే వాడనక్కరలేదు. చిన్న పొల్లుమాట చాలు మనసు పాతాళంలో కృంగిపోయినందుకు... ఛ ఛ! ఇదేమిటిలా గతమంతా తవ్వుకుంటూ ఆలోచిస్తున్నాను? "ఇపుడే ఆశీర్వదించిన లచ్చమ్మ ఆశీస్సు మనసునిండా నిండనీ!" అనుకుంది. అయినా ప్రతీక్షణమొక మిరకిల్ కాదా? ఈ జీవితంలో! 'అయామ్ ఎలైవ్' అన్న పాటలో చెప్పినట్లుగా వర్తమానం అతి ముఖ్యమైనది! అదే మనిషికి పెద్ద దీవెన! ఈ జీవితమే అద్భుతమైన దీవెన!

"రేపు సెలవు పెట్టారామ్మా" అనడిగింది లచ్చమ్మ. "లేదు లచ్చమ్మా! కొత్తగా స్కూళ్ళు తెరుస్తున్నారుగా వెళ్ళాలి" అంది.

"నిన్న మొన్న పనికి అలిసిపోయావమ్మా! రేపొకరోజు సెలవుపెట్టి ఎల్లుండి పనిలోకి పోతే సరి"

తనగురించి, తన ఆరోగ్యం గురించి ఆలోచించే లచ్చమ్మ ఆ క్షణంలో క్రిష్ణత్తయ్యలా కనిపించింది రమకు.

***

# మౌన శంఖం

- ఎమ్మెస్వీ గంగరాజు

**సుమారు నాలుగు** సంవత్సరాల తర్వాత మా ఊరు చేరుకోబోతున్నాను. అమ్మా నాన్నగారితో ఐతే అడపాతడపా ఫోనులో మాట్లాడుతూనే ఉన్నాను. అయితే, ఇంతకాలం నేను మాట్లాడటానికి వీలు కలగని మరో ఆత్మీయుణ్ణి కొన్ని గంటల వ్యవధిలో చూడబోతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. అతడి తలంపు ఒక అద్భుతమైన అనుభూతి నాకు. అతడి అసలు పేరేమిటో, ఎక్కణ్ణుంచి వచ్చాడో ఎవ్వరికీ తెలియదు. శంఖం పూరిస్తాడు కాబట్టి అందరూ "శంఖుడు" అంటారు. నాంచారమ్మ పాకలో బస. భోజనం కూడా అక్కడే! సంపాదించిన నాడు అంతా ఆమెకిస్తాడు. లేనినాడు లేదు. "ఎందుకు తేలేదు?" అని ఆమె నిలదియ్యదు. ఆమెకి పిల్లలు లేని లోటు అతడు తీరిస్తే. అతడికి తల్లి లేని లోటు ఆమె వలన తీరుతోంది. ఏ జన్మలో బంధమో ఆ ఇద్దరిదీ!

అతడి గొంతైతే మూగపోయింది కానీ గొంతులోంచి వచ్చి బుగ్గల నిండా నిండి శంఖంలో దూరి, నాదంగా "భం...భం"మ్మంటూ వచ్చే గాలి మా ఊళ్ళో అందరికీ ప్రీతికరమూ, శుభప్రదమూ! ఎవరింట్లో ఏ శుభకార్యం జరిగినా "భం..భం..."మ్మంటూ దిక్కులు దద్దరిల్లే ఉండే ఆ శంఖారావం వినబడవలసిందే! ఊళ్ళో ఏ ఉత్సవం జరిగినా, ఏ ఊరేగింపు కదిలినా ఆ శంఖారావానిదే పెద్ద పీట!! శుచిగా స్నానం చేసి పొత్తి పంచె కట్టుకుని నుదుటి మీద పొడవుగా నిలువు తిలకం దిద్దుకుని అతడు శంఖం పూరించుతూంటే నాకు భాగవతంలోని "విలయోద్ధూతాభ్ర నిర్ఘాత రేఖా కాఠిన్యము పాంచజన్యము...." పద్యం గుర్తుకొచ్చేది. బుగ్గల నిండా గాలి నింపుకుని మధ్య మధ్య బుగ్గలలో చిన్న కదలకిలలోనే ఉఛ్వాస నిశ్వాసాలు తీసుకుంటూ శంఖారావాన్ని ఆపకుండా తెరలు తెరలుగా కొనసాగిస్తుంటే పిల్లలే కాదు, పెద్దలు కూడా ఇంతింత కళ్ళు చేసుకుని చూస్తూ ఉండిపోయేవారు. తెల్లటి శంఖం! దాని మీద రెండో మూడో గవ్వలు అద్ది ఉండేవి. దాని అంచుకో రంధ్రం! ఆ రంధ్రంలో ఒక సన్నని తాడూ, దాని కొసలకి ఊలూ కుచ్చులూ! అదో అద్భుతమయిన వస్తువులా కనిపించేది నాకు.

మా ఊరు పల్లెకు పెద్దదీ, పట్టణానికి చిన్నదీ! ఒకవైపు నాగళ్ళూ, గడ్డపారలూ, ఎడ్ల బళ్ళూ, మరో వైపు ట్రాక్టర్లూ, ఇతర ఆధునిక వ్యవసాయ యంత్రాలూ, పనిముట్లూ వినియోగింపబడడం! అభివృద్ధి చెందుతున్న ఓ మూడో ప్రపంచ దేశం యొక్క ఆర్థిక వ్యవస్థలా ఉండేది మా ఊరి జీవన విధానం. కామందులూ సంపన్న కుటుంబాలతో పాటు, అధికంగా కూలీ నాలీ చేసుకునే బడుగు వర్గ ప్రజలూ ఉండేవారు. మంచి చదువులు చదువుకుని అభ్యుదయ భావాలు కలిగే దేశం నాలుగు చెరగులా పాకి మంచి ఉద్యోగాల్లో ఉన్నవారి ఇళ్ళతో పాటు పాతకాలం కట్టుబాట్లు అంటి పెట్టుకునే ఛాందస కుటుంబాలూ లేక పోలేదు. ఈ రెండు రకాల వారికీ వారధిలా ఉండేవాడు శంఖుడు.

శంఖం పూరించడమొక్కటే అతడి పనికాదు. ఆ పని అప్పుడప్పుడు మాత్రమే పడేది. ఓ ఖాకీపేంటూ, బుష్ కోటూ వేసుకుని ఊరికి ఉపకారిలా ఎవరికేం సాయంకావలసినా చేస్తుండేవాడు. "ఇంత ఇవ్వండి" అనేవాడు కాదు. ఎవరేం ఇచ్చినా సంతోషంగా స్వీకరించేవాడు.

పంచాయితీ కుళాయిల్లోంచి నీరు వృధాగా పోతూంటే చటుక్కున వెళ్ళి కుళాయి కట్టేసేవాడు. బుర్ర లేని కుళాయైతే ఓ వెదురు ముక్క తెచ్చి దానిలో దిగ్గొట్టి వృధాగా పోయే నీటినాపేవాడు. ఒక్కోసారి బారెడు పొద్దెక్కినా వీధి దీపాలు వెలుగుతూనే ఉండేవి. అప్పుడు పరుగున పంచాయితీ గుమస్తా ఇంటికెళ్ళి, అతడి చేత ఆఫీసు తెరిపించి దీపాలార్పించేవాడు. రోడ్డు మీద పడి ఉన్న అరటి తొక్కల్నీ, ఇతర చెత్తనీ తీసి చెత్త కుండీలలో వేసేవాడు. రోడ్డు మధ్యలో పిల్లలు నడిచిపోతూంటే, పక్కగా నడవమని మందలించేవాడు సైగలతోనే.

అతణ్ణి ఆటపట్టించటానికి కావాలనే కొందరు ఆకతాయి పిల్లలు అతడు చూస్తూండగా రోడ్డు మీద చిత్తుకాగితాలూ, అరటి తొక్కలూ వేస్తే ఆ పిల్లల్ని అదిలించి వాటిని తీసేసేవాడు. పిల్లలు నవ్వుకుంటూ వెళ్ళిపోయేవారు. వాళ్ళతో ఇతడూ శృతి కలిపేవాడు. ఎప్పుడూ ఊరి ప్రజల శ్రేయస్సునే కాంక్షించే వ్యక్తి శంఖుడు! ఊర్లో ఎటువంటి అన్యాయం, అక్రమం జరిగినా సహించే మనస్తత్వంకాదతనిది. లేబరు కాలనీలో త్రాగుబోతులు తప్ప తాగి భార్యల్నీ, పిల్లల్నీ కొడుతూంటే వాళ్ళతో పోట్లాడి విడిపించేవాడు. అలా విడిపించడంలో ఒకటో రెండో దెబ్బలు ఇతడి మీదా పడేవి. అయినా లక్ష్య పెట్టేవాడుకాదు. ఏడుస్తున్న పిల్లల్ని శంఖారావంతో ఆకట్టుకుని ఊరడించేవాడు. ఈ అతి మంచితనం వలన కొందరు అతణ్ణి ఓ పిచ్చివాడిగా జమ కట్టేసేవారు. నేను మాత్రం అతనిలో ఓ మంచి మనిషినీ, మహానుభావుణ్ణీ చూసేవాణ్ణి. అందుకే నా హైస్కూల్ చదువైపోయాక పట్టు పట్టి రెండు సంవత్సరాలు నేను కష్టపడి, అతణ్ణీ కష్టపెట్టి కొంత చదువు నేర్పాను. కాస్త పెద్ద అక్షరాలతో ఉన్న బొమ్మల భాగవతం, మహాభారతం, రామాయణం, పంచతంత్రం... మొదలగు పుస్తకాలు కొని ఇవ్వడమే కాకుండా అతడు చదివేలా చేశాను ఖాళీగా ఉనప్పుడు శంఖం పూరించడానికి ఇంటికి పిలిచేవాణ్ణి. ఉత్తినే పిలేస్తే భోజనానికి రాడు కనుక శంఖం పూరించడానికి అనేది ఒక విష మాత్రమే! ఆ విషయం అతడికీ తెలుసు. కొంతసేపు శంఖం పూరించాక కాస్త తోట పనిచేసేవాడు. ఏదైనా పని అతడి చేత చేయించుకుంటేనే భోజనానికి ఒప్పుకునేవాడు. తను కొంత తిని అమ్మకోసం అన్నట్టు సంజ్ఞ చేసి, పొట్లాం కట్టుకుని తీసుకెళ్ళేవాడు అమ్మ కాని అమ్మ లాంటి అమ్మ దగ్గరకి.

"ఆ శంఖం నాకు ఇస్తావా?" అని నవ్వుతూ నేనంటే ఆ శంఖారావం ఊరి ప్రజకి అవుసరం కనక తను ఉన్నంతకాలం తన వద్దనే ఉంచుకుంటానని తను చనిపోయాక నాకే చెందేటట్టు చేస్తానని సైగ చేసేవాడు.

"నాకక్కరలేదు నీ దగ్గరే ఉండనీ" అని మందలించేవాణ్ణి.

నా బీ.టెక్. అయ్యాక యం.యస్. చెయ్యడానికి అమెరికా వెళుతూ "మరో నాలుగైదేళ్ళ వరకూ రాలేను". అని చెప్పినప్పుడు నా చేతులు పట్టుకుని విలపించాడు. తర్వాత, కళ్ళు తుడుచుకుని కుడి చెయ్యి నిటారుగా చాచి ఇంత వాడివై రావాలని నిండుగా దీవించాడు. "ఒకసారి శంఖం పూరించవూ?" అంటే ఆనందంగా శంఖం పూరించి ఆ శంఖారావంతో స్టేషను వరకూ అనుసరించాడు. అతడు ఆపకుండా కొన్ని గంటలు శంఖం పూరించగలడు. మా చిన్నతనంలో ఓసారి టౌనుకి సర్కస్ వస్తే కుర్ర కార్లమంతా ఇళ్ళల్లో పేచీలు పెట్టి ఒప్పించుకుని సర్కస్ చూడడానికి బస్సులో టౌనుకి బయలుదేరాం. మాకు పెద్ద దిక్కుగా శంఖుణ్ణి పంపారు పెద్దలు. బస్ కండక్టర్‌తో పందెం కట్టి బస్సు మా ఊరు నుండి టౌనుచేరేవరకూ ఆపకుండా శంఖం పూరించాడు శంఖుడు. నేను ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసుకుని అతడినే చూస్తూ కూర్చున్నాను. మధ్యలో అతడి ఊపిరి ఆగిపోతుందేమోనని భయపడ్డాను కూడా! పందెంలో ఓడిపోవడం వలన కండక్టర్ ఇతడి దగ్గర టిక్కెట్టు డబ్బులు తీసుకోలేదు. పందెంలో ఇతడు గెలిచినందుకు మేమంతా చప్పట్లూ కేరింతలూ కొడుతూ బస్సు దిగాం. శంఖుడు పొంగిపోయాడు!

ఊరు చేరబోతూ ఊహల్లో విహరిస్తున్న నేను రైలు స్టేషన్ సమీపించడంతో వాస్తవంలోకొచ్చాను.

"అమ్మా నాన్నగారూ బావున్నారా?" టాక్సీ స్టేషన్ నుండి బయలుదేరుతూండగా అడిగాను నన్ను రిసీవ్ చేసుకోడానికొచ్చిన మా గుమస్తాని.

"బావున్నారు, చినబాబూ." అన్నాడు ముందు సీట్లోంచి తల వెనక్కి తిప్పి.

అతడిలో మార్పేమి లేదు. అంటే, ఈ నాలుగు సంవత్సరాల కాలం స్వల్ప వ్యవధేనన్నమాట! భౌతికంగా మనుషులలోనూ, ఊళ్ళోనూ పెనుమార్పులేవీ సంభవించి ఉండవు.

మా ఊరి దారి పట్టింది కారు. కనుచూపు మేరలో కొచ్చాం. దూరంగా ఊరు కనిపిస్తోంది. కానీ, ఏదో వెలితిగా తోచింది నాకు. కొంత సేపు మధనపడ్డాక లోపం గుర్తించాను. ఊరినానుకుని రోడ్డు పక్కన విస్తరించి ఉండే రావి చెట్టూ కనిపించడం లేదు. ఆ మాటే అడిగాను గుమస్తాని.

"క్రిందటి సంవత్సరం గాలివానకి కూకటి వేళ్ళతో కూలిపోయింది, చినబాబూ." అన్నాడతడు.

నా మనసు కలుక్కుమంది. చిన్నతనంలో ఆ చెట్టు క్రిందనే ఆడుకునేవాళ్ళం.

"ఇంకా ఊరి విశేషాలేమిటి?" మామూలుగా అడిగాను.

"విశేషాలంటే.." అని కొంతసేపు నసిగి "మీతో చదువుకున్నాడు కదండీ--ప్రభాకరం బాబు..." అని ఆగేడు.

ప్రభాకరం నాయుడుగారబ్బాయి. నాతో ఇంటర్ వరకూ చదివాడు. తర్వాత, చదువు మానేసి వ్యవసాయం, మిల్లూ చూసుకుంటూ ఉండిపోయాడు.

"ఏమైంది ప్రభాకరానికి?" ఆతృతగా పైకి అన్నాను కాని అతడు ఏ ఏక్సిడెంటులోనో చనిపోయి ఉంటాడని నిర్ధారణ చేసుకున్నాను గుమస్తా సందేహించడం చూసి.

"అతడికేమీ అవ్వలేదండీ". అన్న గుమస్తా మాటలకి తేలిక పడింది మనసు.

"మరి?" అన్నాను అతడి సందేహం అర్ధంకాక.

"మునసబుగారి భార్య... మీరెరుగుదురు కదా!"

"అవును. రెండో భార్య కూడా చనిపోయాక మూడో పెళ్ళి చేసుకున్నారు నేను అమెరికాకి బయలుదేరిన సంవత్సరమే." అన్నాను ఆనాటి పెళ్ళి గుర్తుచేసుకుంటూ.

"ఆమెని లేవదీసుకుని వెళ్ళిపోయాడండీ ప్రభాకరం!" అతడి మాటలు విని నిర్ఘాంతపోయాను.

ఆశ్చర్యంతో నాకు నోట మాట రాలేదు. "అదేమిటి? ఆవిణ్ణి వీడు లేవదీసుకు పోవడమేమిటి?" అన్నాను కాస్సేపటికి తేరుకుని.

"కాలం ఎంత దారుణంగా ఉందో చూడండి! అయినా, మునసబుగారు కూడా ఈ ముసలి తనంలో పడుచుపిల్లని చేసుకోవడమేమిటి చెప్పండి? ఆమె వయసులో ఉన్నది. ప్రభాకరందీ మిసమిసలాడే వయసాయె! ఎంతకాలం నుండీ సాగుతోందో ఈ వ్యవహారం?! ఓ రాత్రికి రాత్రి ఉడాయించేశారిద్దరూ. ఇప్పటిదాకా పికరు లేదు. మిల్లు డబ్బు లక్షకి పైగా ఇతడూ, బంగారం పాతిక తులాలకి తక్కువ కాకుండా ఆమే -- తీసుకుని వెళ్ళిపోయారని వినికిడి." అని నిట్టూర్చాడు గుమస్తా.

నేను ఆలోచనల్లో పడిపోయాను. వేరొకరి భార్యను -- వరసలోనూ, వయసులోనూ పెద్దదైన స్త్రీని నా స్నేహితుడు లేపుకుని వెళ్ళిపోవటం సిగ్గుతో తలవంచుకునేలా చేసింది. కొంతసేపు మౌనం వహించాక ఇక ఆ ప్రస్తావన కొనసాగించడం ఇష్టం లేక, "మన శంఖుడేం చేస్తున్నాడు? అతణ్ణీ తీసుకుని రాలేకపోయారా?" అన్నాను. నాకు తెలుసు ఈ దుశ్చర్యని శంఖుడు గుర్తించి ఉంటాడు.

"ఇంకెక్కడి శంఖుడు? నాన్నగారు ఆ విషయం ఫోనులో మీకింతవరకూ చెప్పలేదూ?" అన్నాడతడు నావైపు ఆశ్చర్యంగా చూస్తూ.

నా మీద పిడుగుపడ్డట్టైంది.

"ఏమైంది శంఖుడికి?" నా గొంతు వణికింది. ఏదో భయంకరమైన దుర్వార్త వినవలసి వస్తుందేమోనని గుండె వేగంగా కొట్టుకుంది.

"మీరు గుండె దిటవు చేసుకోవాలి," అన్నాడు ఏదో భరించరాని వార్త చెప్పడానికి నాందిగా. ఊపిరి బిగపట్టుకుని అతణ్ణి చూస్తూ ఉండిపోయాను.

"శంఖుడు రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు!" - అతడి మాటలకి క్షణకాలం నా గుండె ఆగినట్టనిపించింది.

అప్రయత్నంగా కంట నీరు చిమ్మింది. తుడుచుకోవడానికిప్రయత్నం చెయ్యలేకపోయాను. గుమస్తా నన్ను ఓదార్చి కొంతసేపు మౌనంగా ఉండిపోయాడు. మా ఊరి పొలిమేరల్లోకి వచ్చేశాం.

"ఎందుకా పని చేశాడు?" నాలో నేనే అనుకున్నట్టుగా అన్నాను. మనసంతా కకావికలమైపోయింది!

"ఆ మధ్య మన ఊళ్ళో వరుసగా నలుగురు ఒకే ఒక్క రోజు వ్యవధిలో చనిపోయారు. శంఖుడే చేతబడి చేసి చంపించేస్తున్నాడని ప్రభాకరం అందరినీ నమ్మించాడు. ఊళ్ళోవాళ్ళు శంఖుణ్ణి పట్టుకుని ముందర పళ్ళు నాలుగూ విరగ్గొట్టి అశుద్ధం కక్కేరు. అప్పటికీ కొందరు చెపుతూనే ఉన్నారు -- "మూగవాడేం మంత్రాలు చదువుతాడు? వద్దు" అని. సమయానికి నాన్నగారు హైదరాబాదు కాంపులో ఉండిపోవడం వలన ప్రభాకరం, మునసబుగారి మాటే చెల్లుబాటైంది. ఆ అవమానం భరించలేక ఆ రాత్రే చనిపోయాడు పాపం!" దీర్ఘంగా నిట్టూర్చాడు గుమస్తా.

"ఎంతటి అమానుషం?" బాధగా మూలిగింది మనసు.

"ప్రభాకరం చూపించిన ఋజువులేమిటి?" అన్నాను కళ్ళు తుడుచుకుని. ఊరు సమీపించింది. జరిగిన అమానుష చర్యకి సిగ్గుతో తల దించుకున్నట్టుంది ఊరు. "ఈ దుశ్చర్యకు నేనెందుకు సాక్షీభూతమవడం?" అనుకుంది కాబోలు! ముందుగానే కూకటి వేళ్ళతో కూలిపోయి తనువు చాలించింది రావి చెట్టు!!

"శంఖుడు వారం రోజులు వరసగా దేవాలయం మండపం మీద ఎడతెరిపి లేకుండా శంఖం పూరిస్తూ కూర్చోడమే కారణమని జనాన్ని నమ్మించాడు ప్రభాకరం. అలా ఎందుకు పూరిస్తూ కూర్చుంటూన్నాడో శంఖుడు కూడా వివరించలేకపోయాడు." గ్రామ ప్రజల తరుపున సంజాయిషీ చెపుతున్నట్టుగా అన్నాడు గుమస్తా.

ఇల్లు సమీపించడంతో కారాగింది.

ఆ సాయంత్రం...

చిన్న చినుకులతో ప్రారంభమైన వర్షం నేను నాంచారమ్మ ఇల్లు చేరేసరికి ఉధృతమైంది. అరుగు మీదే శంఖుడి బొక్కి ట్రంకు పెట్టెకి చారబడి కూర్చున్న నాంచారమ్మ నన్ను చూసి గుర్తుపట్టి గొల్లుమంది. "నా బిడ్డని సంపేశారు బాబూ..." గుండెలు బాదుకుంటూ విలపిస్తున్న ఆమెను సముదాయించడం కష్టమైంది. మౌనంగా ఆమెకెదురుగా కూర్చున్నాను.

కొంతసేపయ్యాక, "ఆడి గురుతుగా ఇది నీకాడే ఉండనీ, బాబూ." అంటూ పెట్టె మూత తెరిచి శంఖాన్ని తీసి ఇచ్చింది. "నేను చనిపోయాక నీకే చెందేటట్టు చేస్తాను." శంఖుడి మాటలు గుర్తుకొచ్చాయి. దానిని అపురూపంగా చూస్తూ అందుకున్నాను.

శంఖంలోంచి ఉండలా చుట్టి ఉన్న కాయితం పడింది. ఆత్రంగా విప్పి చూశాను. అది పెద్ద అక్షరాలతో శంఖుడు నాకు రాసిన ఉత్తరం!

"చినబాబూ,

ప్రభాకరం బాబునీ, మునసబుగారి భార్యనీ దేవాలయం పక్కన చూశాను. మరోసారి కూడా వారిద్దరూ దేవాలయం వైపు వెళ్ళడం చూసి అడ్డుపడి మందలించాను. అందరికీ చెపుతానని బెదిరించాను. ఊళ్ళో వాళ్ళకి చెపితే నాయుడుగారిదీ, మునసబుగారిదీ పరువుపోతుందని ఆ ప్రయత్నం విరమించుకున్నాను. వారిద్దరి కలయికకూ దేవాలయమే అనువైన చోటని గ్రహించి, శంఖం పూరిస్తూ రోజూ అక్కడే కాపు కాశాను. వాళ్ళకి అడ్డుగా ఉన్నానని ప్రభాకరం బాబు కక్ష కట్టి కుట్ర చేశాడు. నేను వెళ్ళిపోతున్నాను. శంఖాన్ని నీదగ్గరే ఉంచుకో. శంఖానికి వెల కడుతున్నాననుకోకు. అమ్మని అప్పుడప్పుడూ వచ్చి కనిపెడుతూ ఉండు.

నీ

శంఖుడు."

ఉత్తరం చదవడం పూర్తైంది. కళ్ళవెంట నీరు కారుతూనే ఉంది. బయట ఆకాశం రోదిస్తూనే ఉంది. కళ్ళు తుడుచుకుని శంఖాన్ని పరికించాను.

భీషణమైన రవంతో--

మంచిని అభినందించే శంఖం!!

శాశ్వతంగా మౌనం వహించింది!

మరి శంఖారావం మా ఊళ్ళో వినిపించదు.

ఇక శంఖం అలంకారప్రాయమే!

దానిని పూరించడానికి శంఖుడు రాడు!

అతడికి వారసుడు లేడు!!

అపకారికి నెపమెన్నక ఉపకారం చేయమన్నాడు శతకకారుడు!

ఉపకారికి నేర్పుగా అపకారం చేసి చూపాడో ఘాతకుడు నేడు!!

స్వార్థసమాజపు దాష్టీకానికి ఒక అమాయక ప్రాణి బలైపోయింది.

శంఖుడి ఉత్తరాన్ని మడత పెట్టి జేబులో భద్రపరచుకున్నాను. అతడి అమాయకత్వాన్నీ, మంచితనాన్నీ ఊరి పెద్దలకు చెప్పి వారి కళ్ళు తెరిపించాలి. ఊళ్ళో జరగబోయే అనర్థానికి అడ్డుగా ఇలిచినందుకు అతడికి లభించిన ప్రతిఫలాన్ని తలచుకుని ఊరి ప్రజలు సిగ్గుపడాలి. అతడి మంచితనానికి ఊరంతా జేజేలు పలకాలి. అతడు లేని లోటుని అందరూ గుర్తించాలి. అందరి హృదయాలలో అతడో అపురూపమయిన వ్యక్తిగా నిలిచిపోవాలి! ఓ మిత్రుడిగా అతడికి నేను చేయవలసిన అంతిమ సంస్కారమిదే!!

వాన వెలిసింది. నాంచారమ్మని ఓదార్చి, మళ్ళీ వస్తానని చెప్పి బయటపడ్డాను. 'గాథా సప్తశతి'లోని ప్రాకృత పదాలు గుర్తుకొచ్చాయి--

"సు అణో జం దేం అలంకరేఇ

తం వి అ కరేఇ పవసంతో

గామాస ణ్ణుమ్మాలి ఆ

మహా పడట్ఠాణసారిచ్ఛమ్..."

(సుజనుడూ ఊళ్ళో ఉంటే ఊరు నిండుగా ఉంటుంది. అతను లేనునాడు ఊరంతా బోసిపోతుంది. ఆ వెలితిని పూరించడం చాలా కష్టం. ఎలాగంటే, గ్రామ సమీపంలో ఉన్న పెద్ద వృక్షమేదైనా కూలిపోతే దాని స్థానంలో ఎన్ని మొక్కలు మొలిచినా వృక్షం లేని లోటు ఎలా తీరుతుంది? )

# నీలమ్మ

– బి.సుజాత

పొద్దున్నే ఆరింటికి ఠంగున బెల్లు మోగడంతో తిట్టుకుంటూ బద్ధకంగా లేచి తలుపు తీశాను. ఎదురుగా పనిమనిషి లక్ష్మితోపాటుగా మరో స్త్రీ నిలుచుని ఉంది. లక్ష్మి లోపలికి వచ్చే ప్రయత్నం చేయకుండా,

"ఇదేనమ్మా నే చెప్పినకద, ఇంకో మనిషిని తోలుకొస్తనని.." అంది.

ఆ మనిషి కేసి చూసిన నాకు నీరసం ముంచుకొచ్చింది. చూడ్డానికే క్షామ దేవతలా ఉంది. సన్నగా పాలిపోయి, కళ్ళలో ప్రాణాలు పెట్టుకుని ఉంది.

లక్ష్మి వాళ్ళాయనకి వాళ్ళ ఊర్లోనే ఏదో పని దొరకడంతో ఇక్కడినుంచి వెళ్ళిపోతున్నారు. అందుకే తన స్థానంలో వేరే పనిమనిషిని కుదిర్చే బాధ్యత తీసుకుని ఆ అమ్మాయిని తీసుకొచ్చింది.

లక్ష్మికి కృతజ్ఞత చెప్పాలో, ఇలాంటి దాన్ని తీసుకొచ్చినందుకు కోపగించుకోవాలో అర్థంకాక, కాసేపలాగే నిలబడ్డాను.

"మరేంటి, ఇవాల్టినుంచే చేస్తుందా పని?" అన్నాను.

అవునన్నట్టు తలూపింది లక్ష్మి.

"లోపకికి రా" అన్నాను ఇంత ఓపిక లేని మనిషి ఇంటి పనెలా చేస్తుందా అని సందేహిస్తూనే!

లక్ష్మి వెళ్ళిపోయింది.

"ఇహ మళ్ళీ ఈ పిల్లకి మొత్తం చెప్పాలి. తోమిన గిన్నెలు ఎక్కడ పెట్టాలి, ఇల్లు ఎలా తుడవాలి, బాత్‌రూములెలా కడగాలీ.. అబ్బ.." విసుగొచ్చింది. లోపలికొచ్చాక ట్యూబ్‌లైటు వెలుగులో ఆ మనిషిని చూసి విస్తుపోయాను.

"ఇంతందమైనవాళ్ళుంటారా ఆడవాళ్ళలో.." అనిపించింది.

సరైన పోషణ చేస్తే మాసిన ఒంటి రంగు పచ్చని పసిమిగా మారుతుందేమో అనిపించేలా ఉంది.

బారెడు జడ! చక్కని ముక్కు. కళ్ళెత్తి చూస్తే చాలు "అమ్మో ఎంత పెద్ద కళ్ళో" అని ముత్యాల ముగ్గులో శ్రీధర్ అన్నట్టు అనాలనిపించేలా ఉంది.

"నీ పేరేంటి?" అన్నాను. గిన్నెలు సింకులోంచి తీసుకోమని సైగ చేస్తూ!

"నీలమ్మ, దొరసానీ" అంది. దొరసానీ అంది నన్నునుకుంటా.

"అమ్మా అని పిలువు, దొరసానీ అనొద్దు" అన్నాను. నావైపొకసారి కళ్ళెత్తి చూసి, సరేనన్నట్టు తలూపింది. భయమేసింది అంత పెద్ద సోగ కళ్ళు చూస్తుంటే!

నేను కాఫీ కలుపుకుని నీలమ్మకు టీ పెట్టిచ్చాను. ఇవ్వడమే తడువు కింద కూచుని గబగబా ఊదుకుంటూ తాగేసి, ఐదు నిమిషాలపాటు అలా కూర్చుండిపోయింది.

"ఏంటలా కూచున్నావు?" అనడిగాను అర్థం కాక.

"చెక్కరొచ్చినట్టయిందమ్మా" అంది.

ఓహో, ఇహ దీన్ని కూచోబెట్టి నేను సేవలు చెయ్యాలి కాబోలు. సడే! బాగుంది సంబడం, ఇది నాకంటే సుకుమారిలా ఉంది.

మనసులోనే విసుక్కుంటూ గిన్నెలు ఎక్కడపెట్టాలో చెప్పి, స్నానానికెళ్ళిపోయాను.

టీ ఇచ్చిన బలంతో కాబోలు, తిరిగి వచ్చేసరికి అంట్లన్నీ తళతళలాడేట్టు తోమి సర్దిపెట్టింది. వంటింటి గట్టంతా ఎన్నడూ లేనంత శుభ్రంగా ఉంది.

రాత్రి మిగిలిన చపాతీలు, కూర, పెరుగు పట్టుకెళ్ళడానికి ప్లాస్టిక్ డబ్బాలు ఇచ్చాను. ఇల్లు చిమ్మి తుడిచాక, కొంచెం సంకోచిస్తూనే "అమ్మా, కొన్ని రొట్టెలు తిందునా?" అంది.

"ఇంటి కెళ్ళాక తినొచ్చుగా" అన్నాను.

తలొంచుకుని "రెండు దినాల సంది, తిండి లేదమ్మా. రాత్తిరి మా ఆయన పావుకిలో గింజలు తెస్తే పిల్లలకు గంజి కాసిపోసినా!" అంది.

దిమ్మెరపోయాను. గొంతులో ఏదో అడ్డం పడ్డట్టయింది.

"నీకు పెళ్ళయిందా...?" అన్నాను ఆశ్చర్యంగా!

"ఔ అమ్మా! నలుగురు బిడ్డలు" అంది.

"నలుగురా..." నోరు తెరిచాను, నీలమ్మ ఫ్లాట్ స్టమక్ వంక కొంచెం ఈర్ష్యగా చూస్తూ!

"అప్పుడే ఆపేశావేం మరి? చాలా నలుగురు? అందునా నలుగురూ బిడ్డలే (ఆడపిల్లలు) అంటున్నావు?" అన్నాను కొంచెం కోపంగా.

నీలమ్మ నవ్వింది. "కొడుకుండాలగదా అంటడమ్మా మా ఆయన" అంది.

నాకింకేమనాలో తోచలేదు. మిగిలిన నాలుగు రొట్టెల్లో రెండు తిని, మిగతావి డబ్బాలో పెట్టుకుంది.

"అవీ తినెయ్యరాదూ" అన్నాను.

"పిల్లలమ్మా, ఎగబడతరు, ఆకలుంటుంది గదమ్మా! రెండు దినాల సంది ఏమీ తినకపోతిని, అందుకు దిన్నా గానీ లేకుంటే వాళ్ళకే తీస్కపోతుండే" అంది.

నలుగురు పిల్లలు! ఇరవై రెండేళ్ళ నీలమ్మకి. నాకైతే ఆ వయసుకు పెళ్ళి కూడా కాలేదు.

ఫ్రిజ్‌లోంచి బ్రెడ్ పాకెట్ తీసిచ్చాను. బుట్టలో మూడు అరటి పళ్ళుంటే అవీ ఇచ్చాను. పిల్లల్ని తలుచుకుని సంతోషపడిపోతూ తీసుకుంది దణ్ణాలు పెడుతూ.

బాత్‌రూములు తళతళలాడేట్టు కడిగి ఆ పూటకు సెలవు తీసుకుని వెళ్ళిపోబోతూ ఉండగా వెనక్కి పిలిచి వందరూపాయలిచ్చాను.

"ఆరుగురున్న ఇంటికి పావుకిలో బియ్యం తెచ్చాడంటే, ఏం తినాలని? పోయి బియ్యం తెచ్చి అన్నం తినండి అందరూ" అన్నాను.

"మనిషెవరో భీ తెలీకుండా పైసలిస్తున్నవు దొరసానీ" అంది వంద నోటుని పెన్నిధిలాగా గుండెకి ఆనించి పట్టుకుంటూ.

"సర్లే, వెళ్ళు" అన్నాను తలుపు మూస్తూ.

❧ ❧ ❧

నీలమ్మ మొగుడికి మహబూబ్ నగర్ పక్కన ఏదో ఊర్లో రెండెకరాల భూమి ఉంది. నీళ్ళు లేక, వర్షాలు లేక పాడుబెట్టి కడుపు పట్టుకుని నగరం చేరారు. మొగుడు రాళ్ళు కొడతాడు. నీలమ్మకి నలుగురు పిల్లలేకాక, ఇప్పుడు మూడో నెల కూడా! ఆఖరి పిల్లకి ఏడాదిన్నర వయసు. సాయంత్రమయ్యేసరికి ఒళ్ళు పులిసేలా రాళ్ళు కొడతాడేమో, అందులో సగం డబ్బులకి తాగేసి, మిగిలిన కాసిని డబ్బులతో వచ్చినన్ని బియ్యం పట్టుకొస్తాడు మొగుడు. నీలమ్మకి తనుకూడా పని చెయ్యకపోతే రోజులు గడవవని అర్థం అయింది. ఏడేళ్ళ

పెద్ద పిల్లకి మిగిలిన పిల్లల్ని అప్పగించి పని వెదుక్కోవడం మొదలు పెట్టింది. అంతలో లక్ష్మి వెళ్ళిపోవాల్సి రావడంతో లక్ష్మికి నీలమ్మ దొరికింది. అలా నీలమ్మ మా ఇంటికి చేరింది.

వారం గడిచేసరికి నీలమ్మ కొంచెం తేరుకుంది. అడపా దడపా కడుపులో తిండి పడటంతో కళ్ళలోకి కళ వచ్చింది. ఇంట్లో రాత్రివో, పొద్దునవో అన్నమో, రొట్టెలో ఏవి మిగిలినా సరే "పిల్లలమ్మా, నన్ను చూడగానే ఉరికొస్తరు తల్లీ, తిననీకేమీ తేలేదని ఎట్ల జెప్తమల్ల" అంటూ తను టీ మాత్రం తాగి పిల్లలకు పట్టుకెళుతుంది. మా పాప తీసేసిన బట్టలు తన చిన్న కూతురికి ఇచ్చిన రోజు నీలమ్మ సంతోషం చూడాలి.

"ఎంత మంచి గున్నె అమ్మా, ఇసుంటి బట్టలేనాడైనా కడతమా మేము" అని మురిసిపోయింది.

ఉన్నవి రెండే రెండు చీరలు, అందులో ఒకటీ పమిట కొంగు దగ్గర పేలికలుగా వేలాడుతూ ఉంటుంది. దాన్ని తిప్పి బొడ్లో దోపి కనపడకుండా దాచుకుంటుంది నీలమ్మ. నేనూ చీరలు ఎక్కువగా కట్టను నా దగ్గరా పాత చీరలు లేవు. మంచి చీర ఒకటి తీసి ఇచ్చాను. అది చూసి దిమ్మెరపోయింది. "ఇది నేనెట్ల కడత?" అంది.

"ఏం" అన్నాను విసుగ్గా.

"ఇంత కొత్త చీర..." అంది. చీర నిండా వర్కూ, జరీ!

నిజమే, అది నేనే రోజూ కట్టే చీర కాదు.

బయటికెళ్ళినపుడు చీర కొనాలనుకున్నాను.

ఆ తర్వాత రెండురోజులకు అమీర్ పేట వెళ్ళడానికి బయలుదేరుతుంటే, "నేనూ రానామ్మా? పాపను పట్టుకుంటా" అంది సంకోచంగానే.

"నీ పిల్లలో?" అన్నాను.

"ఇయాల మా ఆయన ఇంట్లోనే ఉన్నాడమ్మా, చూసుకుంటడు" అంది.

సరే, రమ్మన్నాను.

కారు వెనకసీట్లో ఒదిగి కూచుంది.

దార్లో ఎర్రగడ్డ దగ్గర అంతా హడావిడిగా ఉంది, ఆ రోజు సంత కాబోలు. ఒక పెద్ద డేరాలో చీరలు గుట్టలు పోసి అమ్ముతున్నారు. ఇక్కడైతే నీలమ్మకి నచ్చే డిజైన్లు కూడా ఉంటాయనిపించింది.

కారు దిగమన్నాను, నేను దిగుతూ! దిగి పాపను ఎత్తుకుని నావెనకే వచ్చింది.

రెండు చీరలు తీసి "చూడు, నీకు బాగుంటాయేమో" అన్నాను ఆశ్చర్యపోతుందని ఊహిస్తూ!

నేను నీలమ్మ వైపు చూసేసరికి నీలమ్మ చూపు మరో వైపు ఉంది.

ఉలికి పడి నా వేపు చూసి... "నాకా, వొద్దమ్మా వొద్దొద్దు" అంది.

"నా చీరలేమో కట్టవు. ఇవేమో వద్దంటావు? ఏం చేద్దాం మరి" అన్నాను.

ఒక్క క్షణం ఆగి వేలితో మరో వేపు చూపిస్తూ... "అక్కడ చూడమ్మా" అంది. అటు వేపు చూసాను. గుట్టలు గుట్టలుగా గౌన్లు పోసి అమ్ముతున్నారు.

"అయితే...?" అన్నాను.

"పెద్ద పిల్లలిద్దరికీ సొక్కాలు లేవమ్మా! మా యక్క ఎవరియ్యో రెండు బనీన్లిస్తే అయ్యేసుకుని తిరుగుతున్నరు. రెండు గౌన్లిప్పియ్యి దొరసానీ" అంది.

ఒక్క క్షణం ఆశ్చర్యమేసింది. తన ఒంటిమీద సరైన బట్టలేదు, అయినా పిల్లలకు బట్టలు కావాలని అడుగుతోంది. నీలమ్మ పిల్లలకు తలా ఒక గౌను తీసుకుని, నీలమ్మకు రెండు చీరలు తీసుకున్నాను.

"జీతంలో కట్ చేసుకో అమ్మా, మస్తు బట్టలైనై" అంది మొహమాటంగా.

"సర్లే పద" అన్నాను కారు దగ్గరికి నడుస్తూ!

మా అత్తగారు వచ్చినపుడు నీలమ్మని చూసి తెగ ముచ్చట పడిపోయారు.

"ఎంత బాగుందే కుందనపు బొమ్మలాగా! ఆ రంగూ అదీనూ, కాస్త పోషణ చేస్తే మనవాళ్ళెందుకూ పనికిరారు" అన్నారు. ఆవిడ చీరలు వాషింగ్ మెషీన్లో వెయ్యను కాబట్టి వాటిని జాగ్రత్తగా ఉతికి గంజి పెట్టి ఆరేసేది నీలమ్మ.

నీలమ్మ రానాను ఇంట్లో మనిషిలాగా మసులుతోంది. మా ఫ్లోర్‌లోనే ఉండే బాచిలర్లు పని మనిషి కోసం చూస్తున్నారని తెలిసి నీలమ్మని పంపాను. ఒక్క పూట వస్తే చాలు వాళ్ళకి. జీతం బాగానే ముడుతుండడంతో ఆమె సంతోషానికి అంతులేదు. మరిన్ని ఇళ్ళు ఒప్పుకోవడానికి ఇంటి దగ్గర పిల్లలు తనకోసం ఎదురుచూస్తుంటారనే కారణంతో నీలమ్మ అంగీకరించలేదు.

"ఎన్నాళ్ళు లేమ్మా, నాలుగు దినాలు కష్టపడితే మాకు నీళ్ళొస్తాయి. అప్పుడు పోయి బూవి చేసుకుంట ఆడనే పడుంటాం" అనేది.

"అమ్మో, అయితే మీ భూమికి నీళ్ళొస్తే నాకు డేంజరన్నమాట" అన్నానేను నవ్వుతూ.

"శ, కాదమ్మా, ఊరికనే అంటున్న గానీ మాకు నీల్లెప్పుడు రావాల! బోరేయించుకునేదానికి పైసలేయి?" అంది నిరాశగా.

రెండు రోజుల తర్వాత, పొద్దున్నే పనిచేస్తోంటే మొహం నలతగా కనపడి "ఏం, ఎందుకలా ఉన్నావు?" అనడిగాను.

"రాత్తిరి నుంచీ నెత్తురు పోతుందమ్మా" అంది దిగులుగా.

అదిరి పడ్డాను!

"అన్నట్టు నీకు మూడోనెల కదూ? మరి రాత్రినుంచీ రక్తం పోతుంటే డాక్టరు దగ్గరకెళ్ళవా? బుద్దుందా?" అన్నాను గట్టిగా.

"పైసల్లేవమ్మా! అయినా..." అని ఒక్క క్షణం ఆగి, కింద కూచుని మోకాళ్ళలో మొహం దాచుకుంది.

"ఇదుండదు దొరసానీ, ఇది పోతది, ఉండదు, బిడ్డ దక్కడు" అంది పొట్ట మీద చేయి పెట్టుకుని, అంత ఏడుపులోనూ కడుపులో ఉన్నది మొగపిల్లాడే అని నమ్మకం.

నిర్ఘాంత పోయాను.

"ముందు నువ్వు కాఫీ తాగు" అని కాఫీ కలిపిచ్చి నేను వెళ్ళి బట్టలు మార్చుకుని డబ్బు తీసుకుని బయటికొచ్చాను.

"పద" అని, నీలమ్మ ఏదో అంటున్నా వినిపించుకోకుండా పాపను ఎత్తుకుని ఆటో పిలిచాను.

డాక్టర్ లత పది నిమిషాల్లో ముగించింది.

"ఈ పిల్ల చాలా బలహీనంగా ఉంది. మళ్ళీ ఇపుడపుడే కడుపు రావడం అంత మంచిది కూడా కాదు" అంది మందులేవో రాస్తూ. నాకు మెరుపులా ఒక అయిడియా వచ్చింది.

"పోనీ లూపు వేస్తేనో?" అన్నాను.

లత నవ్వింది.

"మంచిదే, కానీ ఆవిడ భర్త ఒప్పుకుంటాడో లేదో అడుగు" అంది.

"ఆపరేషన్ అయితే అతగాడి సంతకం కావాలిగానీ, లూపుకెందుకూ, నీలమ్మని ఒప్పించగలిగితే చాలు" అన్నాను ఆశగా స్పృహలేని నీలమ్మని చూస్తూ.

లూపంటే ఏమిటో చెప్పి ఒప్పించే సరికి రెండు గంటలు పట్టింది మా ఇద్దరికీ ఆ తర్వాత.

"నీ ఆరోగ్యానికి, నీకున్న డబ్బులకి ఇంతమంది పిల్లల్నెలా కన్నావసలు?" గద్దించింది లత, డాక్టర్లా అధారిటీని చూపిస్తూ!

"ఎట్ల కన్నవంటే ఏమి జప్తా దొరసానీ, కనే ఓపిక లేకుండె, కానీ మొగుణ్ణి దగ్గరకు రావద్దంటే ఇంటడా? నాల్గు తన్ని పని చూసుకుంటడు" అంది పచ్చి నిజాన్ని నగ్నంగా ఆవిష్కరిస్తూ!

నేనూ, లతా ఒకరివైపు ఒకరం మౌనంగా చూసుకున్నాం.

"ఇలా గుడిసెల్లో ఉండే వలస బతుకుల్లో ఇంతమంది పిల్లలు ఎందుకుంటారో తెలుసా, ఇందుకే, అవి కాపురాలు కావు సగానికి సగం భర్తల అత్యాచారాల వల్ల పుట్టిన పిల్లలే" అంది లత ఇంగ్లీషులో. తలూపాను నేను.

మందులూ, పళ్ళూ కొని, ఇంటికి తీసుకొచ్చాను నీలమ్మని.

నీలమ్మ పిల్లల్ని తీసుకురమ్మని మా వాచ్‌మన్‌ని పంపాను.

సాయంత్రం నీలమ్మ మొగుడికి తెలిసి తీసుకెళ్ళడానికొచ్చాడు.

నీలమ్మ పరిస్థితి బాగాలేదని అతడికి రాత్రినుంచే తెలుసట. అందుకే పెద్దగా ఆశ్చర్యంగానీ, ఆందోళనగానీ వ్యక్తపరచలేదు. కాకపోతే డబ్బు నేను ఖర్చు పెట్టినందుకు సంతోషిస్తూ,

"మా రాణివి తల్లి, దవాఖానకి దీస్కపోయినవ్, నీ కాల్మొక్తా" అన్నాడు.

నీలమ్మ మళ్ళీ గర్భవతి కాకూడదని అతడితో ఎలా చెప్పాలో అర్థంకాలేదు.

"నీలమ్మకి ప్రాణం బాగలేదు నిరంజన్! మళ్ళీ కడుపొస్తే, మనిషి దక్కదని చెప్పింది డాక్టరమ్మ" అన్నాను.

తెల్లబోయాడు. "మరెట్ల దొరసానీ?" అన్నాడు. నాకు మండిపోయింది.

"ఇప్పటికే నల్గురు పిల్లలున్నారని డాక్టరమ్మకి తెలిసింది. ఇంకొక్కసారి గర్భవతైందా, నిన్ను పోలీసులకి అప్పగిస్తానంది. నీ పేరు, మీ మేస్త్రీ పేరు కూడా రాసుకుంది. కొంచెం జాగ్రత్తగా ఉండాలి మరి మీరు" అన్నాను సమయోచితంగా నోటివెంట వచ్చిన మాటలకి నేనే ఆశ్చర్యపోతూ!

ఈ మందు బాగానే పనిచేసింది.

"అట్లనే దొరసానీ, అట్లనే" అన్నాడు భయపడిపోతూ. పొద్దున్న మిగిలిన అన్నం, కూరలు, మరో వంద రూపాయలు చేతిలో పెట్టి అందరినీ ఇంటికి పంపాను. నాల్రోజుల వరకూ నీలమ్మని పనిలోకి రావద్దని చెప్పాను.

వారం తర్వాత నీలమ్మ యధావిధిగా పన్లోకిచ్చింది. నెలరోజుల తర్వాత నీలమ్మకి లూప్ వేయించాను. అప్పుడప్పుడు 'బిడ్డపాయెగదమ్మా' అని బాధపడుతూనే ఉంది.

"మూడు నెలలే కద నీలమ్మా, పుట్టిన బిడ్డ పోయినట్టు బాధపడతావేం?" అన్నాను విసుగ్గా ఒకరోజు దాని నస భరించలేక.

"పుడితే బిడ్డే అయ్యేది గదమ్మా!" అంది విచారంగా.

ఆమెను చూస్తుంటే పిల్లల్ని కనడం కోసమే పుట్టి, వాళ్ళని పెంచడం కోసమే బతుకుతోందనిపించేది నాకు.

అంత ప్రాణం పిల్లలంటే! నేనన్నా ఎప్పుడన్నా నా కూతుర్ని విసుక్కునేదాన్ని గానీ నలుగురు పిల్లలు ప్రాణాలు తినేస్తున్నా ఒక్కరోజు కూడా నీలమ్మ వాళ్ళను విసుక్కోగా గానీ, ఒక్క దెబ్బ వెయ్యగాగానీ చూడలేదు.

తమ ఇంట్లో పసిపిల్లను ఎత్తుకోవడానికి పెద్ద పిల్లను పంపమని మా ఎదురు ఫ్లాట్లో వాళ్ళు నీలమ్మని అడిగితే ససేమిరా అంది.

"చూడమ్మా, దానిదీ ఆడుకునే వయసు కదమ్మా! ఇంకోరి పిల్లను సాకమని ఎట్ల పంపిస్త జెప్పు" అని నిష్టూరపడింది.

దగ్గర్లో ఉన్న గవర్నమెంటు స్కూల్లో పెద్ద పిల్లలిద్దర్నీ చేరిపించింది. పుస్తకాలు నేను కొనిచ్చాను. మధ్యాహ్న భోజనం స్కూల్లోనే! నీలమ్మ సంతోషానికి అంతులేకుండా పోయింది.

"ఈ జన్మలో నా పిల్లలు ఇస్కూలికి పోవుడు నే చూస్తాననుకోలే తల్లీ" అంది నాకాళ్ళ దగ్గర రామ భక్త హనుమాన్‌లా కూచుని. కాపురం గాడిలో పడేసరికి నిరంజన్ మొత్తం కూలి డబ్బులతో తాగేసి చేతులూపుకుంటూ ఇంటికి రావడం మొదలు పెట్టాడు. అడపాదడపా నీలమ్మకి తన్నులు కూడా తప్పడం లేదు.

ఎందుకు నీలమ్మా భరిస్తున్నావు? నీకు, పిల్లలకు కూడా నువ్వే సంపాదిస్తున్నావు కదా, ఇక నీ మొగుడి పెత్తనమేంటి? పోలీసులకి చెప్తానని బెదిరించు" అన్నాను ఒక రోజు నీలమ్మ ఒంటి మీద తేలిన వాతల్ని చూస్తూ!

నీలమ్మ నవ్వింది.

"కొట్టనీ అమ్మా! మొగుడు గాక ఇంకెవరు కొడతారు? తాగిన మైకంలో కొడతడుగానీ నేనంటే పేణవేనమ్మా నిరంజన్‌కి! గాయన్ని పోలీసులకి పట్టిచ్చి నేనేం బావుకుంట? వాడొదిలేస్తే ఊర్ల ఉన్న ఆ రెండెకరాల క్కొర కూడా పోతది, బిడ్డలు అన్యాయమైపోతరు మల్ల" అంది.

ఆరోజు ఆదివారం. శనాదివారాలు కొంచెం ఆలస్యంగా వస్తుంది నీలమ్మ. ఎనిమిదింటికి గంతులు వేసుకుంటూ వచ్చింది. వస్తూనే నా కాళ్ళకు దణ్ణం పెట్టింది.

"ఏమిటేమిటి?" అన్నాను కంగారుగా.

"దొరసానీ, నా కష్టాలు తీరినై తల్లీ! దేవుడు లేడా మల్ల" అంది.

విషయమేమిటంటే నిరంజన్ అన్న తన పొలంలో బోరు వేస్తే దండిగా నీళ్ళు పడ్డాయి. ఇద్దరి పొలాలూ పక్కపక్కనే వీళ్ళ పొలానికి కూడా నీళ్ళిస్తాను రమ్మని అతడు కబురు పెట్టాడు.

"పోయి, అక్కడనే రెక్కల కష్టం చేసుకుంటం దొరసానీ! తల్లిలాగ చూసినవ్ అమ్మా, నీ రుణం తీర్చుకునేది ఎట్లనో తెలీకపాయె" అంది. ఒక పక్క సంతోష వేసినా, మరొక పక్క నీరసం వచ్చింది, నీలమ్మలాంటి నమ్మకమైన మనిషి వెళ్ళిపోతున్నందుకు. మరో రెండురోజుల్లో కుటుంబం అంతా బయలుదేరి వెళ్ళబోతూ నాకు చెప్పేందుకు వచ్చారు. నిరంజన్ కూడా దణ్ణం పెట్టాడు. నీలమ్మ మొహం సంతోషంతో కళకళ్ళాడిపోతోంది.

నీలమ్మకి రెండూ చీరలు, మావారి బట్టలు కొన్ని నిరంజన్‌కి ఇచ్చాను.

సంతోషంగా తీసుకుని సెలవు పుచ్చుకున్నారు.

***

రెండేళ్ళ తర్వాత ఒక రోజు జ్యోతి ఫోన్ చేసింది. జ్యోతి నా స్నేహితురాలు. ఒక టీవీ చానెల్లో పనిచేస్తోంది.

"ఇవాళ నిన్నొక అద్భుతమైన చోటికి తీసుకెళతాను. మధ్యాహ్నం వస్తున్నాను, రెడీగా ఉండు" అంది. వివరాలడిగితే వచ్చాక చెపుతానంది. మధ్యాహ్నం వచ్చాక చెప్పింది.

"నిన్న రిపోర్టింగ్‌కి వెళ్ళామే స్పెషల్ ఫీచర్ ప్రోగ్రాంకి. ఒక హోంకి వెళ్ళాం! అదేమిటో తెలుసా? అది ఆడపిల్లలకి మాత్రమే రక్షణ నిచ్చే ఒక అమ్మ ఒడి. అందరూ ఆడపిల్లలే! సీతాకోకచిలకల్లాగ. నీకు తప్పక చూపాలనిపించింది. లే, రెడీ అవు! పరిగెత్తు" అంది. విషయం ఆసక్తికరంగానే ఉండటంతో బయలుదేరాను.

అక్కడికెళ్ళాక ఒక విచిత్రమయిన అనుభూతికి లోనయ్యాను. అదొక బాలికల శరణాలయం. అక్కడున్న పిల్లలందరూ అనాధలు కాదు. కొంతమందికి తల్లిదండ్రులున్నా, వారు పిల్లల్ని, పెంచి చదువు చెప్పించలేని పరిస్థితుల్లో ఇక్కడ వదిలి వెళ్ళారు. వారి ఆలనా పాలనా, చదువూ (ప్రభుత్వపు స్కూళ్ళలో) అన్నీ శరణాలయమే చూసుకుంటుంది. దాతల విరాళాతో నడుస్తోంది. అన్నిటికంటే జ్యోతి

చెప్పిన విషయం నన్ను మరింత ఆశ్చర్యానికి గురి చేసి ఆ హోం పట్ల అప్పటికప్పుడు గౌరవాన్ని పెంచేసింది అక్కడున్న పిల్లల్లో కొంత మంది సెక్స్ వర్కర్ల పిల్లలు కూడా ఉన్నారట.

గతిలేని పరిస్థితుల్లో ఒళ్ళమ్ముకోవలసి వచ్చిన అభాగినులు వారి ఆడపిల్లలు చదువుకుని సక్రమమైన జీవితాన్ని గడపాలని, తమలాగా 'చెడి' పోకూడదని ఆశపడి ఈ హోంలో ఉంచారు. వాళ్ళు ఇక్కడ చదువుకుంటారు. పెద్దయ్యాక వారి ఇష్టమైన వృత్తిలోనో, ఉద్యోగంలోనో ప్రవేశిస్తారన్నమాట. పెద్దహాలు, వంటగది, శుభ్రంగా ఉన్న బాత్‌రూములు, శ్రద్ధగా పెంచుతున్న పూలమొక్కలు, విరగబూసిన గులాబీల, స్వచ్ఛత ఉట్టిపడే పిల్లల మొహాలు అన్నీ నన్ను విపరీతంగా ఆకట్టుకున్నాయి.

"మరి ఈ సెక్స్ వర్కర్ల్ పిల్లలు తల్లిని చూడాలంటే ఎలా? అన్నాను. ఇక వారి తండ్రుల గురించి అడగటం అనవసరమనిపించింది. అక్కడ వాలంటరీగా పని చేస్తోన్న సుధ అనే అమ్మాయి చెప్పింది. "నెలకొకసారో, రెండు సార్లో వాళ్ళే వస్తారండీ! పిల్లల ఖర్చులకు కావలసిన డబ్బు ఇస్తారు. కొంతమంది ఇవ్వలేరు. వాళ్ళను బలవంతం చేయము డబ్బుకోసం! పిల్లలతో కాసేపు గడిపి వెళ్ళిపోతారు. కానీ నిశ్చింతగా ఉంటారు పిల్లలగురించి" అంది. నిజమే అనిపించింది నాకు.

అంతలో మళ్ళీ సుధే అంది. "ఇవాళ కూడా ముగ్గురు సెక్స్ వర్కర్లు వాళ్ళ పిల్లల్ని చూడ్డానికి వచ్చారు చూస్తారా"

"ఒద్దొద్దు" కంగారుగా అన్నాను. ఆ పద్ధతిలో పొట్టపోసుకోవలసి వచ్చినందుకు వాళ్ళెంత కుమిలిపోతారో పాపం, పైగా వాళ్ళని ప్రత్యేకంగా 'చూసి' ఇబ్బంది పెట్టాలా?

వరండాలో నిలబడి మాట్లాడుతున్న మాకు వెనక చెట్లలోంచి పిల్లల కేరింతలు వినబడుతున్నాయి. అంతలో పరిగెడుతున్న కూతురి వెనకాలే నవ్వులతో పరుగెత్తుకొచ్చిన ఒక స్త్రీ నన్ను చూసి ఒక్క క్షణం దిమ్మెరపోయినట్టు ఆగిపోయింది. సుధ ఇంగ్లీషులో "ఈవిడ కూడా సెక్స్ వర్కరే" అంది.

మొదటి సెకనులో గుర్తుపట్టలేదు గానీ, గుర్తుపట్టిన మరుక్షణం చిత్తరువైపోయాను. నిర్ఘాంతపోయి గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాను.

నా ఎదురుగా నీలమ్మ!

నీలమ్మ ఇదివరకులా ఈసురోమంటూ లేదు.

తెల్లగా బలంగా ఠీవిగా ఉంది. బారెడు జడ ఇంకా బలిసి నల్లగా తాచులా నాట్యమాడుతోంది. నీలమ్మ మిసమిసలాడిపోతోంది.

"నీలమ్మా?" అన్నాను అస్పష్టంగా! నీలమ్మ ఒక్కసారిగా పరిగెత్తింది.

సుధ ఆశ్చర్యంగా చూస్తూ, "నీలవేణి తెలుసా మీకు?" అంది.

"నేను ఆమెతో మాట్లాడాలి" అన్నాను ఉద్వేగంగా!

❧ ❧ ❧

బుగ్గల మీద చారికలు గట్టిన నీట్టిన నీటిని తుడిచే ప్రయత్నం లేకుండా గోడకు చేరగిలి పడి కూచుంది నీలమ్మ!

హైదరాబాదు నుంచీ ఊరికి వెళ్ళగానే నిరంజన్ అన్న వాడికి బాగా సారా పోయించి కాయితాల వేలిముద్రలు వేయించుకుని పదివేలు చేతిలో పెట్టాడు. అన్న చేసిన మోసం అర్ధంకాకపోయినా చేతిలో ఉన్న డబ్బు మాత్రం నిరంజన్ని పిచ్చివాడిని చేసింది. అంత డబ్బు ఎన్ని రాళ్ళు కొడితే వస్తుంది?

డబ్బు తీసుకుని భార్యను నలుగురు ఆడపిల్లల్ని దిక్కులేని వాళ్ళుగా వదిలేసి పారిపోయాడు. భూమి పోయిందని నీలమ్మకు తెలిసేసరికి నిరంజన్ అన్న, వదిన "భూమి మాకు అమ్మాడు", "అంటూ కాయితాలు చూపారు. అవేమిటో, అందులో ఏముందో నీలమ్మకు తెలియదు.

నీలమ్మను ఆదుకునేవారెవరూ లేరు.

ఆకలికి ఏడ్చే నలుగురు ఆడపిల్లలు!

డబ్బుతో పరారీ అయిన మొగుడు.

రోజంతా కూలీ చేసినా తమ అందరి కడుపులూ నిండవని నీలమ్మ తెలుసుకుంది. అండలేనిదని తెలియగానే ఆకలి చూపులు ఆమెపై తీక్షణంగా ప్రసరించడం మొదలుపెట్టాయి. చెరువులో దూకి పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుందామని వెళ్ళింది.

తాను దూకడానికి సిద్ధమైనా, తన పిల్లల్ని నీళ్ళలో తొయ్యడానికి, పిల్లలకోసమే బతికే నీలమ్మ చేతులు ససేమిరా అన్నాయి. కాలే కడుపుతో, సొమ్మసిల్లిన పిల్లలతో, చేతిలో పైసాలేని స్థితిలో చెరువు గట్టున చెట్టుకింద కూచుని రోదిస్తున్న నీలమ్మని చూసి ఎవరూ జాలిపడలేదు. అంత తీరికెవరికుంది? ఎవరి బతుకులు వాళ్ళవి! ఎవరి కష్టాలు వారివి. ఆమెను దగ్గరికి తీస్తే నలుగురు పిల్లలతో సహా తీయాలి. అందుకే ఎవరూ ధైర్యం చేయలేకపోయారు.

అంతలో దేవతలా వచ్చింది దారినపోయే అక్క!

నీలమ్మని, ఆమె సౌందర్యాన్ని చూసి తెల్లబోయింది. తర్వాత కార్యరంగంలోకి దిగింది.

ముందు అందరి కడుపులూ నిండేలా అన్నం పెట్టించింది. పక్క ఊరిలో ఉన్న తన ఇంటికి తీసుకువెళ్ళింది.

రెండు రోజులపాటు నీలమ్మ మెదడుని శుభ్రంగా మాలీష్ చేసింది. ముందు ససేమిరా అన్న నీలమ్మ చుట్టుకుని పడుకున్న పిల్లల్ని చూసి ఆలోచనలో పడింది.

* * *

నీలమ్మ ఇక్కడే సిటీలో "అక్క" ఏర్పాటు చేసిన ఇంట్లో మరికొంతమందితో కలిసి ఉంటుంది. ఇద్దరు పిల్లలు ఈ హోంలో ఉన్నారు. పెద్ద పిల్లలు అన్న దగ్గర ఉన్నారు. నీలమ్మకి ఇప్పుడు డబ్బుకు కొరతలేదు కాబట్టి ఆమె అన్న ప్రేమగా చూస్తాడట! నలుగురు పిల్లలూ చదువుకుంటున్నారు.

నీలమ్మ పట్నంలో ఏమి చేసి డబ్బు సంపాదిస్తోందీ ఎవరూ అడగరు!

"తప్పేనమ్మా నేను చేసింది. కానీ చూస్తూ చూస్తూ పిల్లలని సంపలేకపోయాను దొరసానీ, ఏం జేసినా నా పిల్లలకోసమే దొరసానీ" నీలమ్మ కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది.

పిల్లలు! పిల్లలు!

ఇంత గొప్ప బంధమా పిల్లలు? ఈ బంధం ఆ తండ్రికి లేకపోయిందా?

"వెళదామా" అంటూ వచ్చింది జ్యోతి!

నీలమ్మ చేతిలో 500 రూపాయల నోటు పెట్టబోతే వద్దంది.

"ఇప్పుడు నిజంగానే పైసలున్నై దొరసానీ, లేనప్పుడు ఆదుకున్నవ్, అంతే చాలు" అంది.

* * *

నన్ను ఇంటి దగ్గర డ్రాప్ చేయమని చెప్పి జ్యోతి దార్లో ఆఫీసు దగ్గర దిగిపోయింది. కారు నెమ్మదిగా సాగిపోతుంటే నా మనసు మాత్రం నీలమ్మ చుట్టూనే తిరుగుతోంది.

పేగుబంధం అంటే ఇదేనా?

పిల్లలకోసం ... ఏమైనా చేయగలదా తల్లి?

ఏదో ఊరేగింపు అనుకుంటా, ట్రాఫిక్ జాం కావడంతో కారు ఆగింది.

బయటకు చూసాను దసరా వెళ్ళిన రోజులు కావడంతో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళుతున్నారు. ట్రాక్టర్ ఆగడంతో చుట్టుపక్కల జనం అంతా వచ్చి నమస్కారాలు పెట్టి సాష్టాంగాలు పడుతున్నారు. కొందరు తీన్‌మార్‌కి అనుగుణంగా నృత్యం చేస్తున్నారు.

భక్తి ఎక్కువైన వాళ్ళు ఆవేశంతో ఉద్రేకంతో కేకలు పెడుతున్నారు. అటువంటి వాతావరణంలో భక్తి ఆవేశిస్తుందేమో!

"అమ్మా, తల్లీ, నువ్వే తల్లివి! జగజ్జననివి! అమ్మవి, తల్లీ కాపాడు తల్లీ" కేకలు మిన్నుముట్టాయి.

ట్రాక్టరు నెమ్మదిగా సాగుతూ మా కారు పక్కకి వచ్చింది. పక్కకు చూసాను. ప్రశాంతంగా చిరునవ్వు నవ్వుతున్న జగజ్జనని ముఖంలో నీలమ్మ ముఖం తటాలున మెరిసింది.

అవును, నీలమ్మని మించిన జనని ఎవరు?

*** 

*సుజాత గారు పుట్టి, పెరిగింది, చదువుకుంది గుంటూరు జిల్లాలోని నరసరావు పేట. ప్రస్తుతం హైదరాబాదులో ఉంటున్నారు. కొన్ని రోజులు జర్నలిస్ట్‌గా పనిచేసారు. కథలు రాస్తుంటారు. తన మనసులోని భావాలను 'మనసులో మాట' బ్లాగ్‌లో పొందుపరుస్తుంటారు. వాస్తవిక అంశాలపై స్పందించి వాటిని హాస్యధోరణిలో చెప్పగల ప్రజ్ఞాశాలి, మంచి సాహిత్యాభిలాషి. సోషల్ సర్వీస్ కూడా చేస్తుంటారు.*

# సోది

- తాడికొండ కె. శివకుమార శర్మ

"అబ్బాయేడీ?" ఇంట్లోకి అడుగుపెడుతున్న వెంకటప్పయ్య దాదాపు అరచినట్లుగా అడిగాడు.

"ఏంటో విశేషం? మొహం అంత వెలిగిపోతోంది! మనవడు అమెరికా వెడుతున్నప్పుడు ఇరవయ్యేళ్ళ క్రితం చూశా అంత ఆనందాన్ని నీ మొహంలో. నోట మాట కూడా రావట్లేదేంటి?" నరసమ్మ అడిగింది మొగుణ్ణి.

"ఇందాక వస్తుంటే రామిరెడ్డిగారు లేరూ? ఆయన కనిపించి, బలవంతంగా కారులో కూర్చోబెట్టి ఇంటికి తీసుకెళ్ళాడు. ఎంత మరియాద చేశాడనీ?"

"ఇన్నాళ్ళూ నీ మొహం చూడని వాడికి ఇప్పుడు నువ్వెందుకు కావల్సొచ్చిందటా?"

"నువ్వెప్పుడూ ఇంతే. అవతలి వాళ్ళు మనసులో ఏదో పెట్టుకుని తప్పితే మనతో మాట్టాడరనుకుంటావు. వాళ్ళ నాన్న, నేను ఎంతైనా ఒకే ఊళ్ళో పుట్టి, ఒకే బళ్ళో చదివిన వాళ్ళం. నేను అయిదోక్లాసులో చదువు మానేసి వ్యవసాయం చేస్తే, ఆయన మాత్రం పట్టణానికెళ్ళి పదోక్లాసు దాకా చదివి వాళ్ళ నాన్న వ్యాపారం చూసుకున్నాడు."

"అందుకే ఈ ఊళ్ళో ముప్పాతిక ఆయన్దీ, మిగిలింది ఊళ్ళోవాళ్ళందరిదీను."

"అదే చెబుతున్నా. ఆయనేమన్నాడో తెలుసా? మన పొలాన్ని ఎకరానికి కోటి రూపాయలిచ్చి కొంటాట్ట!"

"ఇట్టాంటిదేదో ఉంటుందని ముందే అనుకున్నా. అమ్మను అని ఖచ్చితంగా చెప్పావా, లేదా?"

"అదేమిటే, అట్టా తీసిపారేస్తావ్? కోటి రూపాయలంటే సామాన్యమనుకున్నావేంటి? ఈ ఊళ్ళో పదేళ్ళ క్రితం వందెకరాలకు ఇచ్చారా ధర! అదికూడా ఎందుకు? ఇళ్ళేసుకోడానికి అప్పుడు నువ్వు నన్నెంత పోరలేదూ మన పొలంలో కూడా వ్యవసాయాన్ని ఆపేసి అందరిలా ఎపార్ట్‌మెంట్లు వేయించమని? ఏదో, మా నాయన పొలం అని నేను పట్టుక్కూర్చోవడం వల్ల ఇవాళ ఈరేటొచ్చింది."

"అమ్మి ఏం చేస్తావుటా, ఆ డబ్బుల్ని?"

ఆ ప్రశ్నతో వెంకటప్పయ్య మొహంలో ఆనందం మాయమయ్యింది. "అవునేవ్, నువ్వనేదాకా నాకు ఆ ప్రశ్నే తట్టలేదు!"

"ముసలయ్యా, ఊళ్ళో నీ ఇరవయ్యో వంతు వాటా కాస్తా ముప్పాతిక వంతుని తినెయ్యబోతోందయ్యా! ఒకప్పుడైతే ఈ రేటుకి పొలాన్నమ్మిన డబ్బుతో ఈ ఊరేం ఖర్మ, పక్క పట్టణాన్ని కూడా కొనేసి ఉండే వాడివి. ఇప్పుడు ఇళ్ళు అమ్ముదామంటే ఎవరూ గజానికి వెయ్యి రూపాయలు కూడా ఇవ్వడంలేదట నిన్న నీ కొడుకంటుంటే విన్లేదా?"

"వాళ్ళైనా ఎందుకు అమ్ముతున్నారనుకుంటున్నావ్? ఇప్పుడు బియ్యం కిలో ఎంతుందో తెలుసా? వెయ్యి రూపాయలు. దానెస్సాదియ్యా, క్రితం నెల ఆరొందలే పలికింది!"

"ఇదసలే తుఫాన్లొచ్చే సీజన్. ఒక్క తుఫాను చాలు - చేతికొస్తున్న పంట నాశమవడానికి. అదే జరిగితే వెయ్యేం ఖర్మ, పదివేలక్కూడా అమ్ముతారు. క్రితం ఏడాదిలాగా ఎవరికి పడితే వాళ్ళకి మాటివ్వమాక వడ్ల బస్తాలిస్తానని! మనకే ఎన్నుంటయ్యో తెలీదు."

"అదే చెప్పబోతున్నా. రామిరెడ్డి, పొలం తనకి అమ్మకపోతే ఫర్లేదన్నాడు గానీ, తనకి చెప్పకుండా మాత్రం ఎవరికీ వడ్లిస్తానని మాటివ్వద్దన్నాడు."

"ఇదెక్కడి చోద్యం? మన పొలంలో పండే వడ్లు మనకిష్టం వచ్చిన వాళ్ళకిస్తాం. ఆయనకెందుకటా మధ్యలో?"

" 'నీకు కావల్సొచ్చినప్పుడు ఎరువులూ, పురుగుల మందులూ ఇప్పించలేదా?' అన్నాడు"

"నే వద్దంటున్నా చంకలెగరేసుకుంటూ వెళ్ళావ్‌గా ఎంతైనా స్నేహితుడి కొడుకంటూ. ఏమిప్పించాడూ? ఆ ఎరువులు కలుపు మొక్కల్ని పెంచాయిగానీ పంటని పెంచాయా ఏం? ఆ పురుగుల మందులు సరేసరి. మనుషుల ప్రాణాలు తియడానికి తప్ప ఇంకెందుకు పనికివచ్చాయ్? ఆ మందు తాగేగా మా చెల్లెలి మొగుడు ప్రాణాల్తీసుకున్నాడు?"

"అది పదిహేనేళ్ళ క్రితం. అయినా ప్రభుత్వం లక్షరూపాయలిచ్చిందిగా."

"ఏంటయ్యా, తెలీనట్టు మాట్లాడుతావు? అందరూ తినగా దాని చేతికొచ్చిందెంత? ముష్టి పదివేల రూపాయలు."

"అప్పుడు అమ్మకుండా ఉండుంటే? ఇవ్వాళ్ళెట్టాఉండేదో చూడు!"

"సర్లే, పొలాన్ని అమ్మక చస్తారా మరి? వాళ్ళ అదృష్టం అది. ఆ స్థలంలో ఎపార్ట్‌మెంట్లు కట్టారు గనక నిలవడానికి చోటైనా దొరికింది. మొగుడు చస్తే గానీ దాని అదృష్టం కలిసి రాలేదు."

"ఏం కలిసొచ్చింది? ఇప్పుడు చూడు - తినడానికి తిండిలేదు, కొనుక్కోగలిగిన పరిస్థితిలో అసలే లేరు."

"సర్లే, అందరూ నీ అంత అదృష్టవంతులే ఉంటారా? సమయానికి మనవడు చేతికొచ్చి అమెరికా వెళ్ళాడు గనక మనం మాత్రం పొలం అమ్మనవసర్లేకుండా బయటపడ్డాం."

"విత్తనాలకి డబ్బుల్లేక పొలాన్ని తాకట్టుపెట్టుకొమ్మంటే సేటేవన్నాడప్పుడు? 'పొలానికి విలువేముందయ్యా, నీ దగ్గర తాకట్టు పెట్టుకుంటాను సరే, తర్వాత నువ్వు విడిపించుకోలేకపోతే కొనేవాడెవడున్నాడిప్పుడు? బంగారం ఉంటే పట్రా. అయినా, ఎందుకయ్యా, ఆపొలాన్ని పట్టుకు వేళ్ళాడతావ్? నువ్వు కూడా ఎపార్ట్‌మెంట్లకిచ్చి కాలుమీద కాలేసుక్కూర్చోక?' నాకు వయసొచ్చింది కానీ దాన్తస్సాదియ్యా, మతిమరుపే ఇంకా రాలా."

"ఆ బంగారాన్నంతటినీ ఏం చేసుకుంటాడో ఇప్పుడు? తులం బంగారానికి కిలో బియ్యమొస్తోందిట!"

అప్పుడే ఇంట్లోకి అడుగుపెడుతున్న సింహాద్రిని చూడగానే వెంకటప్పయ ఆప్యాయంగా అడిగాడు - "ఏరా, ఎక్కడికెళ్ళావ్ ఇంతసేపూ?"

సింహాద్రి మొహంలో చికాకు పొడచూపింది. "నిన్ను వెతుక్కుంటాను. ఈ వయసులో బయటికెడితే నీకేమయినా అయితే చూసేవాళ్ళెవరు?"

"ఏమిట్రోయ్, కొత్తగా మాట్లాడుతున్నావ్! నిన్నెళ్ళినట్టే ఇవ్వాళ్ళ కూడా ఈవినింగ్ వాక్‌కి వెళ్ళాను. కృష్ణుడు చెప్పలా, ఊర్కోనే ఇంటో కూచోక అలా తిరిగి రమ్మనమని? నువ్వేమో నన్ను చేలోకి రావద్దంటివి."

"రోజులసలే మంచివి కావు. నిన్న చౌదరి హెచ్చరించాడు కూడా. 'మీ నాన్నని తోడులేకుండా ఇల్లు కదల్నీమాకు. నీకు కూడా చుట్టూ నల్గురు తోడుండం మంచిది' అని. "

"ఎందుకట?"

"ఎందుకేమిటి? నిన్నెవడైనా ఎత్తుకుపోయి, వంద బస్తాల వడ్లిస్తే తప్ప విడిచిపెట్టమంటే నేనేం చెయ్యాల్ట?"

"నీ వాలకం చూస్తే వడ్లిచ్చి నను విడిపించుకునేలా లేవు."

"అందుకే, ముందు జాగ్రత్తగా చెబుతోంది. నలుగురిని మాట్టాడొచ్చాను. నాలుగు బస్తాల వడ్లిస్తే నిన్ను కనిపెట్టుకునుంటామన్నారు."

"ఒక్కొక్కళ్ళకీనా లేక నలుగురికీ కలిపా?"

"ఆ రోజులు కూడా వస్తాయేమోలే. ప్రస్తుతానికి మాత్రం ఒక్కొక్కళ్ళకీను."

"ఏడాదికి నాల్గుబస్తాల వడ్లేం చాల్తయ్‌రా ఒక కుటుంబానికి?"

"వాళ్ళ బాధ వాళ్ళు పడతార్లే, మనకెందుకు? వీళ్ళు కుదరదంటే ఇంకొందరు రెడీగా ఉంటారు."

"దొబ్బుడాయి కాకపోతే. చేతకాని ప్రభుత్వాలతో ఇదే బాధ. నెహ్రూగారయితే బియం, గోధుమలు అమెరికానించీ దిగుమతి చేసుకున్నారు - దేశంలో 1960 లలో ఆహార ధాన్యాలకు కరువు తీరి, మనదేశం తన కాళ్ళమీద తను నిలబడేవరకూ."

"ప్రభుత్వాలనేముంది? గత మూణ్ణెల్లల్లో ఇది నాలుగవ ప్రభుత్వం. ఎవళ్ళొచ్చినా పరిష్కారం ఇప్పుడిప్పుడే దొరకదట. నెహ్రూ రాజ్యం ఏలిన కాలం వేరు, ప్రస్తుత పరిస్థితులు వేరు. ఆయనప్పుడే కాదు - దాదాపు పదేళ్ళ క్రితం దాకా ప్రపంచంలో బియ్యం, గోధుమల్ని ఎగుమతి చేసే దేశాలుండేవి. ఇప్పుడు ఆహారధాన్యాలని పండించే ప్రతీ దేశంలోనూ క్షామమేనట. వర్షాలుంటేగా! అందుకని ఇప్పుడు డబ్బుకు విలువ లేకుండా పోయి, ఇచ్చి పుచ్చుకునే కాలం మళ్ళీ వచ్చింది. వీలయినప్పుడు పెట్రోలు అమ్మే దేశాలు పెట్రోలిచ్చి, మంచినీళ్ళూ, తిండీ కొనుక్కుంటున్నాయి. ఆహార ధ్యాన్యాలు పండించే దేశాల ప్రభుత్వాలు వాటి ఎగుమతుల్ని నిషేదించడంతో పెట్రోలు ఎందుకూ పనికిరాకుండా పోతోందట. ఒకప్పుడంటే ప్రభుత్వం కళ్ళు కప్పి పోలీసులకు లంచాలిచ్చీ చాటుగా ఎగుమతులు చేశారు. ఇప్పుడైతే, దొంగ రవాణాలు చేస్తూ పట్టుబడితే ప్రజలే ఆ వర్తకుల అంతుచూస్తున్నారు - కొన్ని చోట్లయితే పోలీసులూ, కోర్టులతో పనిలేకుండా అక్కడికక్కడే పాతేస్తున్నారట కూడాను."

"మీ నాన్న చెపుతున్నారు - ఇందాక ఆ రేమిరెడ్డి ఎకరానికి కోటి రూపాయలిచ్చి మన పొలం కొంటానన్నాట్ట."

"అంటాడంటావెందుకనడూ? ఒకప్పుడయితే ఒక్క దీపావళి ప్రాంతంలో వచ్చే తుఫాన్ల గూర్చి భయపడాల్సివచ్చేది. ఇప్పుడు తుఫాను రావడానికి కూడా సీజనంటూ లేకపోయె. ఎప్పుడొచ్చి పంటంతా ముంచేస్తుందో తెలీదు. అదే జరిగితే, అప్పుడు ఎకరానికి పదికోట్లు కూడా ఇస్తానంటాడు - అప్పుడు పదివేల రూపాయిలిస్తే గానీ కిలో బియ్యం కానీ కందిపప్పు కానీ దొరకవు గనక. వ్యవసాయం చెయ్యడానికి ఇప్పుడు రైతులేరీ? ఆత్మహత్యలు చేసుకోగా మిగిలిన వాళ్ళ పొట్టలు పట్టుకుని పట్టణాలకెళ్ళారు."

"అన్నట్టు చెప్పడం మరచిపోయా. ఇందాకా నారాయణ వచ్చెళ్ళాడు. ప్రభుత్వం కాలేజీల్లో వ్యవసాయం చెయ్యడం గూర్చి పాఠాలు చెప్పిస్తుందట."

సింహాద్రి పడీపడీ నవ్వాడు.

"ఎందుకురా అట్లా నవ్వుతావ్? నేనేం జోకేశానా?" కోపంగా అంది నర్సమ్మ.

"ఎవరిచేత చెప్పిస్తారమ్మా, పాఠాలు?"

"అదేమిట్రా, పాఠాలు చెప్పడానికి పంతుళ్ళే లేరా?"

"పంతుళ్ళకి పాఠాలు చెప్పడం వచ్చామో గానీ వ్యవసాయం చెయ్యడం ఏం తెలుసునమ్మా? మొన్న కృష్ణుడు చెప్పాడు ఫోన్లో. నా కొడుకుని చెప్పుకోవడం కాదుగానీ వాడు తెలివైన వాడమ్మా. నేను కూడా నీలాగే వాడితో ఈ మాటంటే వాడేమన్నాడో తెలుసా? 'క్రితం శతాబ్దంలో అయితే కంప్యూటర్ల గూర్చి ఏం తెలీని వాళ్ళ చేత కూడా ప్రైవేటు కాలేజీల్లో పాఠాలు చెప్పించి సర్టిఫికెట్లిప్పించారు కానీ, వ్యవసాయం అంటే చేసేది కానీ చెప్పేది కాదుకదా నాన్నా - అనుభవమ్మీద నేర్చుకోవలసింది కానీ!' అని. వాడన్నమాటలో ఎంత నిజంవుందీ! దాదాపు ముప్పై ఏళ్ళనుంచీ చేస్తున్నాను వ్యవసాయం - నాయన నాకప్పజెప్పినప్పటినుంచీ. ఆయనకీ, నాకు కలిపి వందేళ్ళ అనుభవం ఉంది. అది కాలేజీల్లో చదువుకున్నవాళ్ళకెట్లా అబ్బుతుంది?"

"అదేమిట్రా - కంప్యూటర్లు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు వచ్చిన తర్వాత అప్పుడే కూడా వ్యవసాయం చెయ్యచ్చునన్నారు. కదా!"

"అన్నీ అబద్ధాలు నాన్నా. చెప్పేవాడే గానీ చేసేవాడేడీ? డబ్బు మీద దురాశతో, అన్నిటికీ డబ్బే మూలమని రైతులకి పనికిరాని విత్తనాలు, కల్తీజేసి ఎరువులూ, పురుగుల మందులూ అంటగట్టారు. అవ్వి కలుపుల్ని పెంచడానికీ, పురుగుల్ని పుష్టిగా పెంచడానికి తోడ్పడ్డాయి. పొలాల్ని జలాశయాలుగా మార్చారు రొయ్యల్ని పెంచడానికి - అవ్వి అటు రొయ్యల్ని పెంచడానికి పనికి రాలేదు, ఇటు వరి పండించడానికి పనికిరాకుండా పోయాయి. వర్షాల్లేక, రైతుల ఆత్మహత్యలవల్లా, సేద్యం చేసే వాళ్ళు తక్కువవడం వల్ల, పురుగుల మందులు తయారుచేసే కంపెనీలు కొత్తగా వస్తున్న చీడలని నివారించే మందులని కనిపెట్టడం కోసం పరిశోధనలేవీ చెయ్యలేదు. వ్యవసాయం చేసే వాళ్ళు తగ్గిపోవడం వల్ల ఎరువుల కంపెనీలకి పెద్దగా లాభాలు రావట్లేదని వాటి ఉత్పత్తిని తగ్గించేశారు. ఇటు పెరుగుతున్న జనాభాకి ఉద్యోగాలని చూపించడం కోసం, డబ్బున్నవాళ్ళకి సుఖాల్ని పెంచడం కోసం పొలాల్లో మల్టీనేషనల్ కంపెనీల చేత పరిశ్రమల్ని పెట్టించి, తిండి పెట్టే రైతులకి గాక ఆ పరిశ్రమలకి నీళ్ళిచ్చారు. నీళ్ళకోసం బోరింగులు వెయ్యడానికి కూడా లేకుండా విద్యుత్తుసరఫరా అంతా ఆ కంపెనీలకే ఇచ్చారు. ఇదంతా నా తెలివికాదులే. కృష్ణుడు చెప్పాడు."

సింహాద్రి చెబుతూనే ఉన్నాడు.

"ఎట్లాంటి పంటకాలువలుండేవి? ఈ పరిశ్రమలన్నీ రసాయనాల కాలుష్యాన్ని స్వేచ్ఛగా నదుల్లోకి, పంటకాలువల్లోకీ వదలడం వల్ల ఇప్పుడవ్వి పెంటకాలువగా మారి పంటలకి అనువుగాకుండా పోయాయి. తాగడానికి నీళ్ళులేక సీసాల్లో కొనుక్కుని తాగుతున్నాం. చెట్లు, పొలాలు ఉండే ప్రాంతాల్ని ఒకేసారి పదికార్లు పట్టే రహదారులాక్రమించాయి - ఎగుమతులకీ, దిగుమతులకీ అనువుగా ఉండేందుకు. పండినప్పుడు వరిని విపరీతంగా ఎగుమతి చేశాం. కోకాకోలాలు, కంప్యూటర్లు - ఒకటేమిటి, ఎన్నని దిగుమతి చేసుకున్నాం?"

"అమెరికా ప్రభుత్వంటా, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో ధర పడిపోతుందని, గోధుమ పండించకుండా ఉండేందుకు అక్కడి రైతులకి డబ్బిస్తుందట. వింతేమిటంటే, ఆ రైతులు గోధుమలు పండించడం మానేసి కార్లని పెట్రోలుకు బదులుగా ఇథనాల్‌తో నడిపించడానికి మొక్కజొన్న పండించినా వాళ్ళకా ప్రభుత్వం డబ్బు ముట్టచెప్పుతూనే ఉందట. పైగా, గోధుమకు పట్టే ఒక రకమైన చీడకు తగిన పురుగుల మందులేవీ లేక. ఆ చీడ తాకిడికి నిలిచేలా హైబ్రీడ్ విత్తనాలు కనిపెట్టటానికి పరిశ్రమలేవీ ఆసక్తి చూపించకపోవడంతో ఆ రైతులుకూడా ఇదే లాభసాటి అని గోధుమలు పండించడం మానేశారట. మనం వరి పండించినప్పట్లాగే వాళ్ళు గోధుమ పండించినప్పుడు మారుపంట వేసేవారట గోధుమ అభివృద్ధికోసం. గోధుమ నుంచీ మొక్కజొన్నకు మారిన తర్వాత డబ్బు పంట అని మొక్కజొన్నకు మారుగా ఇంకేవీ వేసేవారుకాదట. ఇప్పుడా పొలాల్లో గోధుమ పంట పండాలంటే కనీసం అయిదేళ్ళు పడుతుందట. పైగా ఈ గ్లోబల్ వార్మింగ్‌తో అక్కడ టెంపరేచర్లు పెరిగి గోధుమకి అనువుగాకుండా పోతున్నయట"

"బియ్యం ఎగుమతి చేసే దేశాలు - వియత్నాం, తైవాన్, థాయిలాండ్ - వాటి ఎగుమతుల్ని నిషేధించాయ్. ఆస్ట్రేలియా ఒకప్పుడు బియ్యం ఎగుమతి చేసే దేశాల్లో ముఖ్యమైనదిట. వాళ్ళకి ఏళ్ళ తరబడీ వర్షాల్లేక క్షామం నెలకొని, వరిని పండించడమే మానేసి, ద్రాక్షని పండిస్తున్నారట - వాటికైతే తక్కువ నీళ్ళతో ఎక్కువ లాభాల్ని గడించవచ్చని. ఒకప్పుడు డబ్బుతో కొనలేనిది ఏదీ లేదని విర్రవీగాం. తులం బంగారం కన్నా గుప్పెడు బియ్యం ఖరీదు ఎక్కువ ఉండే రోజు వస్తుందని నేను కలలో కూడా ఎప్పుడూ ఊహించలేదు."

నర్సమ్మకర్థమయిందల్లా ఒక్కటే. "అయితే, మన దగ్గరనుంచీ ఈ పొలాల్ని ప్రభుత్వమో లేక మనఊరివాళ్ళో బలవంతంగా లాక్కుంటారేమోరా?" ఆదుర్దాగా అడిగింది.

"లాక్కోరు అమ్మా. వరి పండించడానికి భూములు కొరవడిన మాట నిజమే. కానీ, క్రితం దశాబ్దంలో పరిస్థితులు వ్యవసాయానికి అనుకూలంగా లేకపోవడం వల్ల, కొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే మరికొంతమంది దాన్ని వదిలేశారు. మనం వందెకరాల పొలాల్ని ఎకరం ఐదువేలు చొప్పున కొన్నాం గుర్తుందా? అది కూడా కృష్ణుడు డబ్బు పంపించడం వల్ల. 'ఎందుకురా పొలం?' అంటే వాడు., 'నీకు తెలియదు నాన్నా' అన్నాడు. రైతులు విత్తనాలకీ, ఎరువులకీ, బోరింగులు పెట్టించడానికీ పొలాల్ని సేటు దగ్గర తాకట్టు పెట్టి, వాటిని విడిపించుకోలేకపోతే, ఆ ఎండు భూములకి కనీసం ఎకరానికి ఐదువేలు ఇచ్చేవాడున్నాడని ఆనందంతో మనకమ్మాడు. మనం కూడా అక్కడ ఏ ఎపార్ట్‌మెంట్లో కట్టుంటే ఊరు సిమెంటుతో చేసిన అరణ్యంలా మారిపోయి ఇవ్వాళ మనం కూడా పిడికెడు మెతుకులకి కటకటల్లాడే వాళ్ళం."

"ఇంతకీ నేను చెప్పొచ్చిందేమిటంటే, ప్రభూత్వాలకి గానీ, ప్రజలకి గానీ పొలాలు కాదు కావలసింది. అనుభవం ఉన్న రైతులు. మన దగ్గర్నుంచీ భూములు లాక్కుంటే మనం వ్యవసాయం చెయ్యమని భీష్మించుక్కూర్చున్నామనుకో - ఎవరికీ నష్టం? ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకిచ్చిన దానికంటే వెయ్యింతలు మనకి ఇవ్వాళ విలువనిస్తున్నారు. మనల్నేం చేస్తారమ్మా? ఎవ్వరూ మనల్ని ముట్టుకోలేరు. మనకీ, మన పొలాలకీ ఎంతమంది కాపుకాస్తున్నారో నీకు తెలియదు. ఒకప్పుడు - ఎప్పుడో ఎందుకు - క్రితం ఏడాది దాకా - ఒకడి మీద దాడి తియ్యడానికి గూండాల్ని ఉపయోగించేవాళ్ళు. వాళ్ళు మాత్రం మనుషులు కాదా? వాళ్ళకి కావల్సిందీ పిడికెడు మెతుకులే. అందుకే, అడక్కుండానే మనక్కాపలా. అయినా మన జాగ్రత్తలో మనం ఉండడం కోసమనే ఇందాక నలుగురిని మాట్లాడానని చెప్పింది."

"ఇంకొకటి తెలుసా? బియ్యం రవాణాకి ఒక ఊళ్ళో రైతులు అడ్డుకుంటుంటే మన ప్రభుత్వం రక్షణదళాల్ని పంపించింది వాళ్ళ ప్రతిఘటనని ఎదుర్కోవడానికి. అక్కడికి చేరిన సిబ్బంది కాస్తా పార్టీ మార్చి ఆ రైతులకి ఆయుధ రక్షణ కలిపించేసరికి ప్రభుత్వం చేతులెత్తేసింది. ... రండి డాక్టరుగారూ. ఏంటిలా వచ్చారు? చాలా ఆశ్చర్యంగా ఉంది పట్నం నుంచీ మీరిట్లా పల్లెటూరు రావడం."

"ఈ చుట్టూపక్కల నాలుగైదు గ్రామాల్లో నా పేషెంట్లున్నారు. వాళ్ళనోసారి చూసి వద్దామని ఇలా బయలుదేరాను."

"డాక్టర్లు - అందునా పట్నంలో పేరుమోసిన పెద్ద కార్డియాలజిస్టు ఇట్లా పేషెంట్లని చూడ్డానికి వాళ్ళు పిలవకుండానే రావడమా? ఎంత ఆశ్చర్యంగా ఉంది!"

"అమ్మమ్మా అట్లా అనకండమ్మా. డాక్టర్లకి పేషెంట్లే దైవాలు. మాకు మెడికల్ కాలేజీలో మొదటి క్లాసులో చెప్పిన పాఠం అదే!"

"ఎంతైనా నలభయ్యేళ్ళుదాటినట్టుంది కదా ఆ పాఠం విని, ఈ మధ్యలో మర్చిపోయినట్టున్నారు!"

"అమ్మా, నువ్వూరుకో. ఏడాది క్రితం మీదగ్గరకు వస్తే మీరు అమెరికా వెడుతూ అప్పుడు మా నాన్నని చూడలేదు - మీరే ఆయన గుండెకి పెద్ద ఆపరేషన్ చేసినా కూడా. అప్పుడు డాక్టరు చలపతిరావు దగ్గరకి వెళితే ఆయన కేరళ నుంచీ తెప్పించిన ఏదో మూలిక ఇచ్చాడు. అది కొద్దిగా పనిచేసిందనుకోండి. కానీ, మీరు చూడలేదన్నదే అమ్మకి కోపం. చెప్పండి. మీరెలా ఉన్నారు?"

"ఏం చెప్పమంటారు? కావల్సిన మందులు దొరక్క, పేషెంట్లకి సేవ చెయ్యలేక ఎంత బాధపడుతున్నానో మీకు తెలియదు. ఇందాకా కేరళనించీ ఏదో మూలిక వాడూతున్నామన్నారే? అది గుండెనెప్పికి బ్రహ్మాండంగా పనిచేస్తుంది కానీ, కేరళలో తప్ప ఇంకెక్కడా దొరకదట. అందుకని, ఓ అగ్రరాజ్యం, 'మీకు మారణాయుధాల్ని ఇస్తాం, ఆ మూలికల్ని మాకు ఎగుమతి చెయ్య'మంటుందట. 'మారణాయుధాలు మాకెందుకు, ఆకలే పెద్ద మారణాయుధమయ్యింది, ఆహారపదార్థాలనిమ్మందంట మన ప్రభుత్వం. అయితే, 'గోధుమలనిస్తాం' అన్నారట వాళ్ళు.

'సరే'నందిట కేంద్రప్రభుత్వం. 'మీరంతా ఉత్తరభారతం వాళ్ళు, మీకు గోధుమలు కావాలిగానీ మాకెందుకవి? మాకు బియ్యమిస్తే మూలికలిస్తాం' అన్నారు కేరళీయులు. వాళ్ళకి బియ్యం ఎవరూ ఇవ్వట్లేదు. అందుకని ఇప్పుడా మూలికని కేరళని దాటి రానివ్వట్లేదు. పేరుకు నేను కార్డియాలజిస్టునే, కానీ మందులు లేకపోతే నేనేం చెయ్యను చెప్పండీ? రెండేళ్ళ క్రితం నాన్నగారికి సమయానికి ఆపరేషన్ చెయ్యగలగడం ఎంత ఆనందంగా ఉందో చెప్పలేను. చదివిన ఈ చదువు ఇంకొకళ్ళకి సహాయపడడానికే కదా!"

"అదేమిటండీ, ఏదో జన్యుశాస్త్రం ప్రకారం ప్రతీ మూలికలోని కీలకమైన పదార్థమేదో కనిపెట్టి ఇక ఆ మూలిక అవసరం లేకుండానే ఆ పదార్థాన్ని తయారు చేస్తామన్నారు కదా గత దశాబ్దంలో!"

"అంటారండీ, కానీ, పత్రికల్లో రాసే దానికి నిజానికీ ఎంతో కొంత - చాలా సార్లు ఎంతగానో - తేడా ఉంటుంది. అంతా తెలుసుకోండి, ఆహారం లేకుండానే మానవుడూ జీవించేటట్టు చెయ్యచ్చుగదా! మీరు కీలకమైనదేదో అదే మూల పదార్థంలో ఉంటుందని గ్రహించడంలేదింకా. ఉదాహరణకి, ఓ మూలిక గుండె దడ తగ్గిస్తుంది. అదే, దానిలోని కీలక పదార్థంతో చేసినది గుండె దడ తగ్గిస్తుంది కదా అని ఓ మందిస్తామా? అది బి.పి.ని పెంచుతుంది. బి.పి.ని తగ్గించడానికి మందిస్తే అది కాలేయాన్ని తినడం మొదలుపెడుతుంది. దాన్నాపడానికి ఇంకో మందిస్తే అది విరోచనాలకి దారి తీస్తుంది. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందని, ఇవన్నీ ఎవరితో చెప్పుకునేది చెప్పండి? పేషెంటుకి చెబితే నాకేమీ తెలియదని అనుకునే ప్రమాదం ఉంది. ఎంతైనా నా పొట్ట పోసుకోడానికి గుప్పెడు మెతుకులు కావాలి గదా!"

సింహాద్రి మొహం మీద చిన్న చిరునవ్వు చూసి డాక్టరు గాభరాగా మళ్ళీ తనే అన్నాడు - "అహహ. అలా తీసిపారేయకండి ఈ చిన్న రహస్యం మీతో మాత్రం చెబుతున్నాను. మరెవ్వరితోనూ అనకండేం? సైడ్ ఎఫెక్ట్స్ లేని మందులు కొన్ని నా దగ్గర భద్రంగా ఉన్నాయి. మీకెప్పుడు నా అవసరం వచ్చినా సందేహించకుండా - అర్థరాత్రయినా సరే అపరాత్రయినా సరే - ఒక్క ఫోన్ కాల్ కొట్టారంటే, రెక్కల మీద వచ్చి వాల్తాను. నాకు ప్రమాణం చేయండి, నన్నే పిలుస్తానని. లేకపోతే ఇక్కణ్ణించీ కదలను."

"అలాగే లెండి. ఈ మాత్రం దానికి ప్రమాణాల్దాకా ఎందుకు?"

"మీ మాటే నాకు పెద్ద హామీ. పెద్దవారు అలా అన్నారు. సరే సరే. మీరు కనీసం నెలకోసారైనా చెకప్ చేయించుకోవడం మంచిది. మీరు గత ఏడాదిలో అవేవీ చేయించుకున్నట్టు లేరు. ఈ వారం రండి. రేపు మా సెక్రెటరీ మీకు కాల్ చేసి అప్పాయింట్మెంటిస్తుంది. వస్తా."

"అదేమిట్రా, అంత పెద్ద పట్నం డాక్టరు ఈ పల్లెటూర్లో మన గుమ్మం తొక్కాడు?"

"చెప్పాడు కదమ్మా, ఏదైనా పట్టెడు మెతుకులకోసమేనని. అందరిళ్ళనీ చుట్టడానికి వచ్చాడు. ఈ గుండె జబ్బనేది తక్కున రమ్మంటే వచ్చేది కాదుగదా."

"రండి శాస్త్రులుగారూ. ఏమిటిలా విచ్చేశారు?"

"గుళ్ళో మీ పేర్న పూజ చేయించాను, మీకు ప్రసాదం ఇచ్చిపోదామని."

"అమ్మేమయినా చెప్పిందేమిటి, పూజ చేయించమని?"

"లేదండీ నేనే చేయించా. ఇదుగో తీసుకోండి. అబ్బాయిగారా?"

"అవునండీ, మా కృష్ణుడు. ఇరవయ్యేళ్ళ క్రితం అమెరికా వెళ్ళాడు. ఇక ఉండలేను నాన్నా అని తిరిగొచ్చాడు. మా ఆవిడకెంత సంతోషంగా ఉందో చెప్పలేను. మా అమ్మానాన్నలకైతే సరేసరి."

"ఎందుకు బాబూ నిక్షేపంగా అక్కడే ఉండక ఈ కరువుకాటకాల మధ్యలో వచ్చారు?"

"అన్ని దేశాలూ బియ్యం ఎగుమతులని నిషేదించడంతో అమెరికాలో బియ్యం దొరకట్లేదట. ఆ గోధుమలూ, సజ్జలూ తినలేక తిరిగొచ్చాడు."

"అబ్బాయి అమెరికన్ సిటిజెన్ కదా? మన ప్రభుత్వం ఎలా రానిచ్చింది?"

"విదేశీయులు మనదేశంలో స్థిరపడడానికి - వాళ్ళు ఇక్కడినుంచే వెళ్ళిన వాళ్ళైనా సరే - ప్రభుత్వం నిరాకరిస్తున్న విషయం నిజమే కానీ, వీడు అగ్రికల్చర్‌లో పి.హెచ్.డి చేసి, చాలా రిసెర్చి చేశాడు. ముఖ్యంగా, బియ్యం సాగులో ఉత్పత్తిని పెంచే విషయంలో. వాడు అగ్రికల్చాల్ బి.ఎస్.సి చేస్తుంటే, 'ఎందుకురా అది కూడేమయినా పెడుతుందా?' అన్నా. అదిప్పుడు నిజంగానే కూడు పెడుతుందట. వీడి రిసెర్చికి నోబుల్ ప్రైజు వచ్చినా రావచ్చునంటున్నారట. అందుకని, మన ప్రధానమంత్రి సిఫార్సుతో వీడు తిరిగొచ్చాడు."

"అసాధ్యుడే మరి తాతపోలిక, తండ్రిపోలిక ఎక్కడికి పోతాయ్? ఇదంతా ఆ లక్ష్మీదేవి చలవ."

"ఇంతకీ మీరు -"

"అదే అదే వస్తున్నా. మా ముత్తాతగారు క్రోడీకరించిన ఒక గ్రంథం మొన్నీమధ్యనే నాకు దొరికింది. అందులో ధాన్యలక్ష్మీ యాగం, ధాన్యలక్ష్మీ వ్రతం గూర్చిన వివరాలు చాలా ఉన్నాయి. మన గుడి ట్రస్టీలు రెడ్డిగారితో, చౌదరిగారితో చెప్పాను. తప్పకుండా చేయిద్దాం అన్నారు. అంతేకాక, అశ్వమేధయాగాన్ని దశరథుడు చేసినట్టుగానే ధాన్యాక్ష్మి యాగాన్ని, ఆ దేవి అనుగ్రహం పొందినవాళ్ళు పూనుకుని చేయిస్తే అందరికీ శుభం కలుగుతుందని కూడా సెలవిచ్చారు. ఆ దేవి అనుగ్రహం పొందినవాళ్ళు ఈ ఊళ్ళో మీరు తప్ప ఎవరున్నారు? అందుకని వారిద్దరూ తమ మాటగా మీకు విన్నవించమని కూడా చెప్పారు - మీ ఆధ్వర్యంలో ఈ యాగాన్ని నడిపించాలని."

పదేళ్ళ పాటు తారాజువ్వలా దూసుకుపోయిన ప్రపంచ స్టాక్ మార్కెట్లు నీరసంగా నేలకు రాలిన ఇరవయ్యేళ తర్వాత -

పదేళ్ళపాటు ఎగసిన రియల్ ఎస్టేట్ ఉత్తుంగ తరంగం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆహారధాన్యపు కొరతను ఢీకొని విచ్ఛిన్నమైన పదేళ్ళ తర్వాత -

అభివృద్ధి పేరుతో నగరాలనే కాక పట్టణాలనీ, గ్రామాలనీ కూడా అంగుళం కూడా వదలకుండా సిమెంటుతో నింపేశాక -

వేతనాల్ని ధాన్యంరూపంలో ఇస్తేనే కానీ పని చెయ్యమని కార్మికులు, ఉద్యోగుల్ సమ్మెలు చెయ్యడం వల్ల పరిశ్రమలు మూతపడ్డప్పుడు, ప్రభుత్వం స్తంభించినప్పుడు -

ప్రపంచ వ్యాప్తంగా ధాన్యం కొరత తీర్చాలని ప్రజలు చేసిన ఆందోళనకి సాయుధ దళాల తుపాకుల చేత జవాబులు చెప్పించి ప్రతి దేశంలోనూ వేలాది జులియన్ వాలా బాగ్‌లని ప్రభుత్వాలు తయారుచేసిన తరువాత -

ఎరువులు, విత్తనాలు, పురుగులా మందులు తయారు చేసే పరిశ్రమల యాజమాన్యం వారి ప్రాణాలను హామీ పెట్టల్లా కల్తీలేని పదార్ధాలని రైతులకు అందజెయ్యడం తమ విధి అని మనస్ఫూర్తిగా నమ్మినప్పుడు -

గ్రామ ప్రజలే సైనికులై, ధాన్యాన్ని కాపాడుకోవడంలో తమ వంతు గుర్తించినప్పుడు -

నక్సలైట్లూ, పోలీసులూ చేతులు కలిపి, ధాన్యాన్ని దొంగలనించే కాక ఎలుకల నించీ, పందికొక్కులనించీ కూడా కాపాడడానికి చేతులు కలిపిన తర్వాత -

ఊరూరా ధాన్యలక్ష్మికీ, మూషిక మర్దన వినాయకుడికీ గుళ్ళు వెలసిన తరువాత -

దాచిన కోట్లకి విలువలేకుండా పోయి, ' ఈసారి ధాన్యం సమృద్ధిగా పండితే దాన్ని, ఎలుకల, పందికొక్కుల బారిన పడకుండా ఉండేలా ధాన్యాగారాల్ని కట్టించా'లని రాజకీయనాయకులే కాక కాంట్రాక్టర్లు కూడా పూనుకున్నప్పుడు -

గ్రామప్రజలకి గ్రామమే ప్రపంచంగా మారి, రైతే రాజుని ప్రజలు తలవంచినప్పుడు -

ఆ రాజు ధనలక్ష్మిని బండిలకెత్తుకుని ఇంటికి వస్తున్నప్పుడు ఆవుల మెళ్ళల్లోని గంటల మోతలు ధాన్యలక్ష్మి గుడిలోని జేగంటల ధ్వనులనిపించాయి. ఆ రైతు మకుటంలేని మహారాజే అయ్యాడు.

అయితే, "భారతదేశం గ్రామాల్లో నివసిస్తుంది" అన్న మహాత్ముడి మాటలు నిజమని నిరూపించడానికి ఇంత క్షామం, సంక్షోభం కావాలా?